ఈనాడు
అనంతపురం
శుక్రవారం 5 జనవరి 2018 | 16 పేజీలు

నిఘా

పనులు చూస్కో.. పండగ చేస్కో!

రహదారులు భవనాల శాఖ.. అనంతపురం పరిధిలో కొన్ని పనుల విషయంలో అసలు టెండర్లు పిలవకుండానే.. పనులు జరిగిన తీరు వెలుగు చూసిన సంగతి తెలిసిందే. ఇవన్నీ రూ.5 లక్షల నుంచి రూ.10 లక్షల మధ్య ఉన్న పనులు కాగా.. ఇదే విధంగా పంచాయతీరాజ్ శాఖలో కూడా ఎలాగైనా పనులు తమకే దక్కుతాయనే ధీమాతో ముందుగానే పనులు చేసేస్తున్న చోద్యం బయటపడింది. ఏకంగా రూ.2.54 కోట్ల పనికి టెండరు తంతు ముగియకుండానే పనులు ఆరంభించడం విశేషం. నిన్న రభశ.. నేడు పంచాయతీరాజ్ శాఖ ఏదైతేనేం.. ప్రగతి మాటున జరుగుతున్న మాయలు అన్నీ ఇన్నీ కావు. ఈ నయా దందాపై 'ఈనాడు' పరిశీలన కథనం.

- టెండరు ఖరారు కాకనే రూ.2.5 కోట్ల పని
- ఎలాగైనా దక్కుతుందనే నమ్మకం..
- కొంత పని కూడా చేసేసిన వైనం..
- పంచాయతీరాజ్ శాఖలో ఇదో చోద్యం



నోముగడ్డ గంగమ్మదేవి వంక వద్ద మట్టి దారి వేసేశారిలా..



టెండరు దాఖలు కాకుండానే బ్రహ్మసముద్రం మండలంలోని కన్నేపల్లి నుంచి బుడిమేపల్లి వెళ్లేందుకు వేసిన మట్టిరోడ్డు

ఈనాడు-అనంతపురం, న్యూస్‌టుడే-కళ్యాణదుర్గం

సాధారణంగా ఏదైనా పనికి సంబంధిత శాఖ అధికారులు ముందుగా టెండరు పిలిస్తారు. టెండరు దాఖలు గడువు ముగిశాక సాంకేతిక బిడ్ తెరుస్తారు. అందులో పోటీపడిన గుత్తేదారులకు సాంకేతికంగా అర్హత ఉందా? లేదా అనేది తేలుస్తారు. ఆ తర్వాత వారికి సంబంధించిన ధరల బిడ్ (ప్రైజ్ బిడ్) తెరుస్తారు. ఇందులో అంచనా వ్యయం కంటే ఎవరు తక్కువ మొత్తానికి టెండరు దాఖలు చేస్తారో వారికి టెండరు ఖరారు చేసి పని అప్పగిస్తారు. ఆ తర్వాత గుత్తేదారు, సంబంధిత శాఖతో ఒప్పందం చేసుకున్నాక పనులు మొదలు పెట్టాలి. టెండర్ల ప్రక్రియలో ఇంత తంతు ఉంటుంది. కానీ పంచాయతీరాజ్‌శాఖ పరిధిలో ఓ పనికి సంబంధించి గుత్తేదారు.. టెండర్ల తంతు ఏమీ ముగియక ముందే దర్జాగా పనులు మొదలు పెట్టేశారు. తప్పకుండా ఆ పని తనకే వస్తుందనీ, నాయకుల ఆశీస్సులున్న తరుణంలో ఇక మిగతా 7లో

బాబు చెప్పారు..

జనవరి 4 2017... జన్మభూమి మా ఊరు కార్యక్రమంలో భాగంగా ముఖ్యమంత్రి చంద్రబాబు బుక్కపట్నం గ్రామసభలో పాల్గొన్నారు. అంతకు ముందుగా రాయలసీమలోనే రెండో అతిపెద్ద చెరువైన బుక్కపట్నం చెరువును చూశారు. చుక్క నీరు లేక వట్టిపోయిన కల్పతరువును చూసి.. ఈ ప్రాంత రైతన్నల వేదన విని చలించిపోయారు. ఎన్ని కష్టాలు ఎదురైనా బుక్కపట్నం చెరువును కృష్ణా జలాలతో నింపి.. నీటి కష్టాలు లేకుండా చేస్తానని హామీ ఇచ్చారు.




నీళ్లు తెచ్చారు!



గురువారానికి సరిగ్గా ఏడాది.. బుక్కపట్నం చెరువు సుజలాలతో కళకళలాడుతోంది. సమర్థ ప్రణాళికతో. కార్యాచరణతో ప్రభుత్వం హంద్రీనీవా జలాలను పుష్కలంగా దరి చేర్చింది. అధికారికంగా 3,173 ఎకరాలకు, అనధికారికంగా మరో 3 వేల ఎకరాలకు సాగునీరు అందనుంది. ఈ శుభ తరుణంలో రైతుల ఆనందానికి అవధులు లేవు. మొత్తంగా ఒక టీఎంసీ మేర నీరు చేరిందని అధికారులు ధ్రువీకరించగా.. బుక్కపట్నం, కొత్తచెరువు, పుట్టపర్తి మండలాల్లోని 40 గ్రామాల సాగునీటి అవసరాలు, 120 గ్రామాల దాహార్తి కష్టాలు తీరనున్నాయి.

- న్యూస్‌టుడే, బుక్కపట్నం



పక్కా... వసూల్!

వీళ్లు మారరంతే

తాడిపత్రిలో మళ్లీ 'గేట్' దోపిడీ

ఈనాడు, అనంతపురం

పురపాలిక పరిధిలో రహదారులపై విక్రయాలు చేసుకునే వారి నుంచి వసూలు చేసే రోజువారీ రుసుము (గేట్) విషయంలో అనేక పురపాలికల్లో అదనపు దోపిడీ సాగుతోంది. ఇతర పురపాలికల్లో రెండు, మూడు రూపాయల నుంచి ఐదు రూపాయల వరకు తేడా ఉండగా, తాడిపత్రి పురపాలికలో ఈ దోపిడీ అసలు కంటే ఐదారురెట్లు అధికంగా ఉంది. ఇక్కడ గంపలో విక్రయాలు చేసుకునే వారి నుంచి రూ.5 చొప్పున, తోపుడు బండ్లలో విక్రయాలు చేసుకునే వారి నుంచి రూ.5-8 చొప్పున రుసుము వసూలు చేయాలి. కానీ.. గుత్తేదారు తనకు నచ్చినట్లు... ఏకంగా రూ.30 చొప్పున బలవంతంగా వసూలు చేస్తున్నారు. రోడ్లపై వ్యాపారాలు చేసుకునే వారంతా పేదలే. వీరంతా ఏరోజుకారోజు పండ్లు, కూరగాయలు, వివిధ రకాల వస్తువులు విక్రయించి కుటుంబాలను పోషించుకుంటూ ఉంటారు. ఇటువంటి వారి విషయంలో కూడా గుత్తేదారు ఏమాత్రం కనికరం లేకుండా, నిబంధనల కంటే అధికంగా దోపిడీ పర్వం సాగిస్తున్నారు.

కొత్త ఏడాదని తగ్గించారట...

తాడిపత్రిలో గేట్ కింద వసూళ్లు చేస్తున్న రోజు వారీ ఫీజులు ఎంతో అధికంగా ఉన్నాయంటూ గత నెల 23న 'ఈనాడు'లో కథనం ప్రచురితమైంది. దీనిపై స్పందించిన వివిధ సంస్థలు, వామపక్షాలు తాడిపత్రిలో నిరసన కూడా చేపట్టాయి. దీంతో గుత్తేదారు కొంత వెనక్కి తగ్గారు. డిసెంబరు 25 నుంచి రూ.10 చొప్పునే వసూళ్లు ఆరంభించారు. అంతకు ముందు వరకు రూ.30 చొప్పున ఇచ్చే రశీదుల స్థానంలో రూ.5-10 మేర ముద్రించిన బిల్లులు ఇచ్చి, అంతే మొత్తం వసూలు చేశారు. రెండు రోజుల కిందటి వరకు ఇలాగే అసలు రుసుములే వసూలు చేశారు. తాజాగా మళ్లీ గుత్తేదారుడు తన పాత పద్ధతిలోకి వచ్చేశాడు. మళ్లీ రోజువారీ వ్యాపారుల నుంచి రూ.30 చొప్పున వసూలు చేయడం మొదలు పెట్టారు. 'ఇదేంటి ఈ మధ్య రూ.5-10 చొప్పునే తీసుకున్నారు కదా.. అని వ్యాపారులు అడిగితే, అది నూతన సంవత్సరం సందర్భంగా అలా కొద్ది రోజులు తగ్గించామని' వెటకారంగా సమాధానం చెబుతూ.. వ్యాపారుల నుంచి రూ.30 చొప్పున వసూలు చేస్తున్నారు. రూ.5 చొప్పున రుసుముకు ముద్రించిన రశీదులపై ఆ మొత్తం చెరిపేసి, మళ్లీ రూ.30 చొప్పున రబ్బరుస్టాంప్‌తో ముద్రించి మిగతా 7లో

దుఃఖసాగరం

ఉపాధ్యాయులూ...
చిన్నారులను నిందించకండి..
చిరుప్రాయాలను చిదిమేయకండి..
పది మందిలో అవమానించకండి..
ఆదరించండి.. చేరదీయండి.

అమ్మానాన్నా..
పిల్లల మాటలు ఆలకించండి..
ధైర్యాన్ని నూరిపోయండి..
సమయం కేటాయించండి..
మేమున్నామని భరోసా ఇవ్వండి.

ఓ విద్యార్థి ఇదీ నీ దారి
అడ్డంకులొస్తే అధిగమించు..
అవమానాలను సహించు..
కష్టాలను భరించు..
ఒత్తిడిని జయించు.. అనుకున్నది సాధించు.



అనంతపురం నగరానికి చెందిన తొమ్మిదో తరగతి విద్యార్థి జ్ఞానసాగర్(14) మృతి అందరినీ కలచివేసింది. చదువు ఒత్తిడి తట్టుకోలేక విద్యార్థి గురువారం ఆత్మహత్యకు పాల్పడ్డాడు.

వివరాలు ప్రధాన సంచికలో..

మనస్తాపంతో యువకుడి ఆత్మహత్య


ఆత్మహత్య చేసుకున్న సురేష్

లేపాక్షి, న్యూస్‌టుడే: లేపాక్షి మండలంలో గురువారం ఇద్దరు బలవన్మరణానికి పాల్పడ్డారు. స్థానికులు, పోలీసుల వివరాల మేరకు.. . మండల కేంద్రంలోని ఎస్సీకాలనీకి సురేష్(28) ఎమ్మార్పీ కార్యాలయంలో ఒప్పంద విధానంలో అటెండర్‌గా పనిచేస్తున్నాడు. ప్రతి చిన్న విషయాన్ని పెద్దదిగా ఆలోచిస్తూ మథనపడేవాడు. ఇటీవల ఇంట్లో నెలకొన్న సమస్యలపై మనస్తాపం చెంది గురువారం ఉదయం ఉరివేసుకున్నాడు. ఆయన భార్య అక్షయ ఫిర్యాదుమేరకు కేసు నమోదు చేసిన పోలీసులు మృతదేహాన్ని శవపరీక్షకు తరలించారు. ఎంఈవో నాగరాజునాయక్, ఎమ్మార్పీ సిబ్బంది, ఉపాధ్యాయులు తరలివచ్చి బాధిత కుటుంబీకులకు సానుభూతి తెలిపారు. అంత్యక్రియలకు ఎంఈవో రూ.5వేలు అందించారు.

చోళసముద్రంలో మహిళ...

మండలంలోని చోళసముద్రానికి చెందిన రుక్మిణి(45) కుటుంబకలహాలతో ఆత్మహత్య చేసుకుంది. ఆమె భర్త కృష్ణయ్య తాగుడుకు బానిసై ఇంట్లో తరచూ గొడవకు దిగేవాడు. మానుకోవాలని ఎన్నిమార్లు చెప్పినా వినకపోవడంతో గురువారం సాయంత్రం ఉరివేసుకుంది. కేసు నమోదు చేసి మృతదేహాన్ని శవపరీక్షకు పంపారు.

ముద్దాయికి జీవిత ఖైదు

కంబదూరు, న్యూస్‌టుడే : కూతురుపై అత్యాచారానికి పాల్పడిన తండ్రి రామాంజనేయులుకు గురువారం జిల్లా న్యాయమూర్తి శశిధర్‌రెడ్డి జీవిత ఖైదు, రూ.లక్ష జరిమానా విధిస్తూ తీర్పు వెల్లడించినట్లు డీఎస్పీ టీఎస్‌వెంకటరమణ, కంబదూరు ఎస్సై నరసింహుడు తెలిపారు. గురువారం వారు విలేకరులతో మాట్లాడారు. రామాంజనేయులు ముక్కుపచ్చలారని 14 ఏళ్ల తన కూతురుపై గత ఏడాది ఆగస్టు 6న అత్యాచారం చేశాడు. ఈ ఘటనపై డీఎస్పీ టీఎస్ వెంకటరమణ ఆధ్వర్యంలో పోలీసులు విచారణ చేసి నిందితుడిని జిల్లా కోర్టులో హాజరు పరిచారు. నేరం రుజువు కావడంతో ముద్దాయికి జీవిత ఖైదు, రూ. లక్ష జరిమానా విధిస్తూ జిల్లా న్యాయమూర్తి శశిధర్‌రెడ్డి గురువారం తీర్పు చెప్పారు. జరిమానా చెల్లించని పక్షంలో అదనంగా ఆరు నెలలు జైలు శిక్ష విధిస్తూ.. బాధితురాలు అయిన చిన్నారికి ప్రభుత్వం రూ.2 లక్షలు పరిహారం ఇవ్వాల్సిందని ఆదేశిస్తూ.. తీర్పు ఇచ్చినట్లు ఎస్ఐ, డీఎస్పీ తెలిపారు. ప్రభుత్వ అదనపు పీపీ బుడేన్‌సాబ్ బాధితురాలు పక్షాన వాదించారు.

కారు ఢీకొని వ్యక్తి మృతి

కర్నూలు నేరవిభాగం, న్యూస్‌టుడే : కర్నూలు మండలం కార్బైడ్ కర్మాగారం వద్ద 44వ నంబరు జాతీయ రహదారిపై బుధవారం రాత్రి జరిగిన రోడ్డు ప్రమాదంలో రామాంజనేయులు (48) అనే వ్యక్తి మృతి చెందారు. అనంతపురం జిల్లా ఉరవకొండ మండలం రాకెట్ల గ్రామానికి చెందిన రామాంజనేయులు కూలీ పని చేస్తూ జీవనం సాగించేవారు. ఇతనికి తల్లిదండ్రులతోపాటు భార్య ఓబులమ్మ ఉన్నారు. తన తండ్రి మారెప్ప కర్నూలు ప్రభుత్వ ఆసుపత్రిలో చికిత్స పొందుతుండగా చూసేందుకు వచ్చారు. తిరిగి బుధవారం రాత్రి స్వగ్రామానికి వెళ్తున్నట్లు తల్లిదండ్రులకు చెప్పి బయలుదేరారు. రాత్రి కార్బైడ్ ఫ్యాక్టరీ వద్ద కారు ఢీకొట్టగా తీవ్రంగా గాయపడ్డారు. కర్నూలు ఆసుపత్రిలో చేర్పించగా చికిత్స పొందుతూ గురువారం మృతి చెందారు. కర్నూలు గ్రామీణ పోలీసులు కేసు నమోదు చేశారు.

పోలీసుల అదుపులో గొర్రెల చోరీ నిందితులు

మిల్లుకాలనీ (గుంతకల్లు), న్యూస్‌టుడే: మండలంలోని వైటిచెరువు గ్రామంలో పెద్దన్నకు చెందిన గొర్రెలను చోరీచేసిన కేసులో ముగ్గురు నిందితులను గ్రామీణ పోలీసులు అదుపులోకి తీసుకొన్నారు. 10 గొర్రెలను వైటిచెరువు గ్రామానికి చెందిన గుత్తిలో హమాలీ పనిచేసే ముగ్గురు బలవంతంగా ఎత్తుకుపోయినట్లు పెద్దన్న గత నెల 20న పోలీసులకు ఫిర్యాదు చేశారు. పోలీసులు విచారణ చేసి నిందితులను గుర్తించారు. వారి నుంచి గురువారం 5 గొర్రెలను స్వాధీనం చేసుకొన్నట్లు పోలీసులు వివరించారు.

రహదారి ప్రమాదంలో ఒకరి మృతి

గుత్తి, న్యూస్‌టుడే: గుత్తిలోని మండల పరిషత్తు కార్యాలయం వద్ద పత్తికొండరోడ్డులో గురువారం సాయంత్రం జరిగిన రోడ్డు ప్రమాదంలో ఒకరు మృతి చెందగా మరో ముగ్గురు తీవ్రంగా గాయపడ్డారు. గుత్తి నుంచి గుత్తిఆర్.ఎస్.కు వెళుతున్న ఆటో జొన్నగిరి నుంచి గుత్తికి వస్తున్న ద్విచక్ర వాహనాన్ని ఢీకొంది. ఈ ప్రమాదంలో ఆటోలో వస్తున్న సుంకన్న, నాగప్ప, జొన్నగిరికి చెందిన రవి, భాస్కర్ అనేవ్యక్తులు తీవ్రంగా గాయపడ్డారు. పరిస్థితి విషమంగా ఉన్న సుంకన్నను అనంతపురం ఆసుపత్రికి తరలించారు. అక్కడి వైద్యులు కర్నూలు ఆసుపత్రికి తరలించాలని సూచించారు. బంధువులు అతన్ని తరలిస్తుండగా మార్గమధ్యంలో మరణించాడు. ఈ సంఘటనపై పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

బ్యాంకులో రూ.1.20 లక్షల చోరీ

గుత్తి, న్యూస్‌టుడే: గుత్తిలోని సిండికేట్ బ్యాంకులో గురువారం ఓ రైతుకు చెందిన రూ.1.20 లక్షలు చోరీకి గురయ్యాయి. మండలంలోని బాచుపల్లికి చెందిన సూరి అనేరైతు వేరుసెనగ కాయలు అమ్మగా సొమ్ము బ్యాంకులో జమ అయింది. ఆ సొమ్మును ఆయన బ్యాంకులో ఉపసంహరించుకుని సంచిలో ఉంచుకొని బయటకు వస్తుండగా గుర్తుతెలియని వ్యక్తులు సంచిని ఎత్తుకెళ్లారు. దీంతో రైతు లబోదిబోమంటూ పోలీసులను ఆశ్రయించి ఫిర్యాదు చేశాడు.

ఈ-బిల్లింగ్‌పై గందరగోళం

- మొరాయిస్తున్న యంత్రాలు
- మద్యం దుకాణాల్లో ఇష్టారాజ్యం

జిల్లాలో మద్యం దుకాణాలు: 246

'ఈ-బిల్లింగ్' అమలు: 136


దుకాణాల్లో 'ఈ-బిల్లింగ్' స్కానర్, కంప్యూటర్లు

అనంత నేరవార్తలు, న్యూస్‌టుడే: మద్యం విక్రయాల్లో ఎమ్మార్పీ ధరలను పక్కాగా అమలు చేయడానికి రాష్ట్ర ప్రభుత్వం 'ఈ-బిల్లింగ్' విధానానికి శ్రీకారం చుట్టింది. సాంకేతికతతో కూడిన ఈ విధానం బాలారిష్టాలు దాటడం లేదు. పరికరాలు తరచూ మొరాయించడంతో మద్యం వ్యాపారులకు తలనొప్పిగా మారింది. స్కాన్ చేయకుండా సీసాలను విక్రయిస్తే తిరిగి నిల్వలు తీసుకోవడం కష్టంగా మారింది. దీంతో అటు అధికారులు, ఇటు వ్యాపారులు ఇబ్బందులు పడుతున్నారు. మరోవైపు 'ఈ-బిల్లింగ్' అమలు కాకపోవడంతో కొన్నిచోట్ల ఎమ్మార్పీ ధరలకు మించి విక్రయాలు జరుపుతున్నారు. కల్తీ, పొరుగు రాష్ట్రం మద్యం విక్రయాలు జోరుగా సాగుతున్నాయి. అయితే ఇకపై పక్కాగా ఈ-బిల్లింగ్ అమలు చేయాల్సిందేనని ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. లేదంటే గోదాము నుంచి మద్యం తీసుకునే వీలుండదని స్పష్టం చేసింది.

పరికరాల సరఫరా ఇలా..

రాష్ట్రంలోని మద్యం దుకాణాలకు కంప్యూటర్లు, స్కానర్లు, సాఫ్ట్‌వేర్ సరఫరా చేసేలా ప్రభుత్వం ఓ సంస్థతో ఒప్పందం చేసుకుంది. ఆ సంస్థ నుంచి కంప్యూటర్లు ఇతర పరికరాలను మద్యం వ్యాపారులు అద్దెకు తీసుకుంటున్నారు. సంస్థకు నెలకు రూ.5 వేలు అద్దె చెల్లిస్తున్నారు. ఒక వేళ పరికరాలు కొనుగోలు చేస్తామంటే రూ.90 వేలుగా నిర్ణయించారు. రూ.90 వేలు చెల్లించి కంప్యూటర్, స్కానర్, సాఫ్ట్‌వేర్ కొనుగోలు చేసినా.. వాటి నిర్వహణ పేరుతో సంస్థకు నెలకు రూ.2 వేలు చెల్లించాలి. కంప్యూటర్‌కు అద్దె రూ.5 వేలుగా నిర్ణయించడంపై వ్యాపారులు వాపోతున్నారు. మరోవైపు గుత్తేదారు సంస్థ మద్యం దుకాణాలకు కంప్యూటర్లు పాతవి సరఫరా చేసింది. దీంతో సీపీయూలు మొరాయించడం, సర్వర్, నెట్‌వర్క్ వంటి సమస్యలతో జిల్లాలో అనేక మండలాల్లో పరికరాలు పని చేయడం లేదు. ఒప్పందం మేరకు సదరు సంస్థకు జిల్లా నుంచి నెలకు రూ.10.80 లక్షలు అద్దె రూపంలో చెల్లిస్తున్నారు. కంప్యూటర్, పరికరాలు దుకాణదారులే కొనుగోలు చేసేలా చర్యలు తీసుకుంటే ఖర్చు తగ్గుతుంది. సాఫ్ట్‌వేర్‌ను అబ్కారీ అధికారుల నేతృత్వంలో వేయిస్తే అద్దె చెల్లింపు, నిర్వహణ వ్యయం ఉండదని వ్యాపారులు చెబుతున్నారు.

నకిలీలకు అడ్డుకట్ట

ఈ-బిల్లింగ్‌తో దుకాణదారుడు రాష్ట్ర ప్రభుత్వ గోదాములోని మద్యం కాకుండా ఇతర మద్యాన్ని విక్రయించడానికి వీలుండదు. వ్యాపారులు గోదాముకు వెళ్లగానే పెట్టెలపై ఉన్న బార్ కోడ్‌ను స్కాన్ చేసి అందజేస్తారు. దీంతో ఏ బాటిల్‌ను ఏ దుకాణానికి ఇచ్చారో స్పష్టత ఉంటుంది. ఒక దుకాణానికి కేటాయించిన బాటిల్‌ను మరో దుకాణంలో విక్రయించకూడదు. అంతేకాకుండా పొరుగు రాష్ట్రాల మద్యం, కల్తీ మద్యం విక్రయాలు సాగకుండా నియంత్రించడానికి ఈ-బిల్లింగ్ వ్యవస్థ ఎంతో దోహదం చేస్తుంది.

అమలు చేయాల్సిందే

జిల్లాలో 246 మద్యం దుకాణాలు ఉన్నాయి. వీటిలో 216 దుకాణాల్లో కంప్యూటర్లు, స్కానర్‌లు ఏర్పాటు చేశారు. అధికారిక గణాంకాల మేరకు ఇందులో 136 మాత్రమే పని చేస్తున్నాయి. మరో 80 దుకాణాల్లో పరికరాలు పని చేయకపోవడం, సిగ్నల్ అందకపోవడం వంటి సమస్యలు తలెత్తుతున్నాయి. ఈ లెక్కన 136 దుకాణాల్లో మాత్రమే 'ఈ-బిల్లింగ్' అమలు చేస్తున్నారు. ఈ-బిల్లింగ్ చేయకపోతే గోదాములో సరకు నిల్వలు ఇకపై ఇవ్వరు. ఈ మేరకు రాష్ట్ర స్థాయి అధికారుల నుంచి జిల్లాకు ఆదేశాలు జారీ అయ్యాయి. మద్యం దుకాణదారుడు కనీసం 75 శాతం సరకును స్కాన్ చేసి విక్రయాలు సాగిస్తేనే వచ్చే నెలలో సరకు ఇస్తారు. లేకపోతే ఇవ్వొద్దని ఇప్పటికే ఆదేశాలు జారీ అయ్యాయి.

గుడ్డం రంగనాథస్వామి ఆలయంలో చోరీ


హుండీని పరిశీలిస్తున్న దేవాదాయశాఖ అధికారులు

హిందూపురంఅర్బన్, న్యూస్‌టుడే: గుడ్డం రంగనాథస్వామి దేవాలయంలోని లక్ష్మీ అమ్మవారి దేవాలయంలో గురువారం వేకువజామున చోరీ జరిగింది. ఆలయ కమిటీ అధ్యక్షుడు మోహన్‌కుమార్, ఈవో సుబ్రమణ్యం వివరాల మేరకు... రాత్రి 2 గంటల సమయంలో దుండగులు లోనికి ప్రవేశించి సీసీ కెమేరాలకు దుస్తులు కప్పి, తీగలు కత్తిరించారు. లక్ష్మీ అమ్మవారి హుండీతాళం పగులకొట్టి డబ్బు ఎత్తుకెళ్లారు. ప్రధాన ఆలయంలోకి వెళ్లి హుండీని పగులకొట్టేందుకు ప్రయత్నిస్తుండంగా కాపలాదారుడు గమనించి కేకలు వేసి డ్రమ్ బెల్ మోగించటంతో దొంగలు రాళ్లువిసిరి అక్కడి నుంచి ఉడాయించారు. వెంటనే 100కి సమాచారం ఇవ్వటంతో వన్‌టౌన్ పోలీసులు అక్కడి చేరుకున్నారు. గురువారం ఈవో వన్‌టౌన్ పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. జిల్లా దేవాదాయశాఖ అధికారి అక్కిరెడ్డి హుండీని పరిశీలించారు. అనంతరం ఆలయంలోని హుండీని తీసి లెక్కించగా రూ. 31,133 నగదు ఉన్నట్లు గుర్తించారు.

మత్తుపదార్థాల విక్రేతల అరెస్టు

గుత్తి, న్యూస్‌టుడే: గుత్తిలోని 44 నెంబర్ జాతీయ రహదారిలో ఉన్న టోల్ ప్లాజా వద్ద ఓ దాభాలో మత్తుపదార్థాలను విక్రయిస్తున్న పంజాబీలను గురువారం గుత్తి ఎక్సైజ్ పోలీసులు అరెస్టు చేశారు. పంజాబ్‌కు చెందిన అర్మిందర్ సింగ్, అతని తమ్ముడు గురుబ్రెడ్‌సింగ్‌లు మత్తుపదార్థాలను లారీడ్రైవర్లకు విక్రయించి సొమ్ము చేసుకుంటున్నారు. 200 గ్రాముల పదార్థాన్ని రూ.వెయ్యికి విక్రయిస్తున్నారు. సమాచారం తెలుసుకున్న సీఐ రాజశేఖరగౌడ్, ఎస్ఐలు ప్రసాదరావు, పృథ్వీరాజ్‌లతో కలిసి దాడులు నిర్వహించారు. ఈ సందర్భంగా అర్మిందర్‌సింగ్‌తోపాటు అతని తమ్ముడిని అరెస్టు చేశారు. వారి నుంచి రెండున్నర కిలోల మత్తు పదార్థాన్ని స్వాధీనం చేసుకున్నారు. నిందితులను కోర్టుకు హాజరు పరచగా న్యాయమూర్తి రిమాండ్‌కు ఆదేశించినట్లు సీఐ వివరించారు.


మత్తుపదార్థాల విక్రేతలతో ఎక్సైజ్ పోలీసులు

బేల్దారీ మృతి


భాస్కర్ మృతదేహం

అనంత నేరవార్తలు, న్యూస్‌టుడే: ద్విచక్ర వాహనం అదుపుతప్పి కింద పడటంతో జనశక్తినగర్‌కు చెందిన బేల్దారి భాస్కర్(35) మృతి చెందాడు. ట్రాఫిక్ పోలీసులు తెలిపిన వివరాల మేరకు జనశక్తినగర్‌కు చెందిన భాస్కర్ గురువారం తెల్లవారుజామున 2 గంటల సమయంలో ఇంటి నుంచి బయటికి వచ్చాడు. జాతీయ రహదారి బళ్లారి కూడలిలో ద్విచక్ర వాహనం అదుపుతప్పి కింద పడింది. దీంతో తలకు తీవ్రంగా గాయం కావడంతో భాస్కర్ అక్కడికక్కడే మృతి చెందాడు. స్థానికులు సమాచారం ఇవ్వడంతో పోలీసులు ఘటనా స్థలానికి చేరుకున్నారు. ద్విచక్ర వాహనంపై ఉన్న నంబరు ఆధారంగా మృతుడి వివరాలు సేకరించారు. జనశక్తినగర్‌లో భాస్కర్ కుటుంబ సభ్యులకు విషయాన్ని తెలియజేశారు. మృతదేహాన్ని శవపరీక్షల కోసం ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. ఆయనకు భార్య లక్ష్మీదేవి, పదేళ్ల కుమారుడు మోహన్‌కుమార్ ఉన్నారు. ట్రాఫిక్ పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

చికెన్ ధరలు

బ్రాయిలర్ -	కేజీ
కోడిమాంసం -	రూ. 160
కోడిమాంసం(స్కిన్‌లెస్) -	రూ.190
బోన్‌లెస్ -	రూ.320
హోల్‌సేల్ లైవ్ -	రూ 88
నాటుకోడి (లైవ్) -	రూ.320
నాటుకోడి మాంసం -	రూ.420
మటన్ ధరలు	
పొట్టేలు మాంసం -	కేజీ రూ.500
గొర్రె మాంసం -	కేజీ రూ.400
చేపలు ధరలు	
సాధారణ చేపలు	రూ.120
కట్ల రూహు చేపలు	రూ.130
బొంగ్డా చేపలు-	రూ.200
బోన్‌లెస్ చేపలు-	రూ.220
చిన్న టైగర్ రొయ్యలు-	రూ.240
పీతలు -	రూ.170
కోడిగుడ్లు	
డజను గుడ్లు(12) -	రూ.53
హోల్‌సేల్(100) -	రూ.410

మార్కెట్‌లో పట్టుగూళ్ల ధరలు

హిందూపురం, (న్యూస్‌టుడే):

రకము:	బైవోల్టిన్	క్రాస్‌బీడింగ్ (సిబి)
కనిష్ఠధర:	338.00	300.00
గరిష్ఠ ధర:	620.00	412.00
సగటు ధర:	546.00	340.00

తెరపై ఈనాడు

అనంతపురం

- గంగ... మరణశాసనం
- గౌరి.... జుమాంజి
- గాయత్రి.. అమేజాన్
- గౌతమి... మళ్లీరావా
- త్రివేణి... టైగర్ జిందాహై
- తరంగిణి... ఒక్క క్షణం
- తేజస్విని... సారథి
- శాంతి... హలో
- సుధ.. 2 కంట్రీస్
- స్వప్న... సర్వానిక్ రాయ్
- ఎస్వీ సినిమ్యాక్స్.. ఎంసీఏ
- నీలిమ... రాజాది గ్రేట్



పాతూరు విద్యుత్తు కార్యాలయంలో ఏటీపీ కేంద్రం

మరో నాలుగు ఏటీపీ కేంద్రాలు

అనంతపురం(విద్యుత్తు), న్యూస్‌టుడే: విద్యుత్తు వినియోగదారులు రోజులో ఎప్పుడైనా బిల్లులు చెల్లించే అవకాశాన్ని కల్పిస్తూ.. ఎస్పీడీసీఎల్ చర్యలు తీసుకుంటోంది. అనంత విద్యుత్తు సర్కిల్ పరిధిలో మరో నాలుగు విద్యుత్తు బిల్లుల చెల్లింపు కేంద్రాలను (ఏటీపీ కేంద్రాలు) ఏర్పాటు చేసేందుకు ఎస్పీడీసీఎల్ సీఎండీ ఎం.ఎం.నాయక్ నిర్ణయించారు. ఈ కేంద్రాలు 24 గంటలు పనిచేస్తాయి. గతంలో నగరంలోని మూడు ప్రాంతాల్లో కేంద్రాలను నెలకొల్పారు. తాజాగా హిందూపురంలో రెండు, ధర్మవరంలో రెండు ప్రారంభించేందుకు చర్యలు తీసుకుంటున్నట్లు ఎస్ఏఓ విజయభాస్కర్ తెలిపారు. ధర్మవరం పట్టణం, గ్రామీణ ప్రాంతాల్లో 63,034 విద్యుత్తు సర్వీసులు, హిందూపురం పట్టణం, గ్రామీణ ప్రాంతాల పరిధిలో 68,628 సర్వీసులున్నాయి. నెలసరి విద్యుత్తు బిల్లులను చెల్లించేందుకు వీలుగా ఆయా పట్టణాల్లో నిరంతరం పనిచేసే ఏటీపీ కేంద్రాలను అందుబాటులోకి తీసుకు వస్తున్నట్లు ఎస్ఏఓ తెలిపారు.

నచ్చిన సినిమాలే తీస్తా..!



◆ అనంతకు రావడం ఇదే తొలిసారి ◆ సినీ దర్శకనిర్మాత తమ్మారెడ్డి భరద్వాజ

కమలానగర్ (అనంతపురం), న్యూస్‌టుడే: చాలాసార్లు ఈ ప్రాంతం నుంచి వెళ్లాను. కానీ ప్రత్యేకించి అనంతకు రాలేదు. ఓసారి బెంగళూరుకు వెళ్తుంటే టిఫిన్ ఇక్కడ బాగుంటుందని చెప్పారు. వెంటనే ఆగి తిన్నాను. నగరానికి రావడం ఇదే తొలిసారి అని సినీ దర్శక నిర్మాత తమ్మారెడ్డి భరద్వాజ పేర్కొన్నారు. బళ్లారి రాఘవ సాంస్కృతిక ఉత్సవాల ముగింపు కార్యక్రమంలో పాల్గొనేందుకు అనంతపురం వచ్చిన ఆయన గురువారం 'న్యూస్‌టుడే'తో ముచ్చటించారు. ఆ విశేషాలు ఆయన మాటల్లోనే.

. సీమ ప్రజలు కల్మషం లేని వారు. ఆప్యాయంగా పలకరిస్తారు. అందరూ నేను ముక్కుసూటిగా వ్యవహరిస్తారని అంటుంటారు.. కానీ సీమలో నాలాంటి వారు ఎక్కువే ఉన్నారు. మా నాన్న, అన్నయ్య సినిమాల్లో ఉండటంతోనే పరిశ్రమలోకి వచ్చాను. లేదంటే చక్కగా ఉద్యోగం చేసుకునేవాణ్ని. అనుకోకుండా ఈ రంగంలోకి అడుగుపెట్టాను. నాకు నచ్చిన సినిమాలే తీస్తాను. ప్రజలు నా అభిప్రాయంతో ఏకీభవించక పోవడంతోనే ఎక్కువగా చూడటం లేదని అనుకుంటున్నాను. నేను తీసిన సినిమాలు ఏవీ తప్పు కాదని నా అభిప్రాయం. కూతురు తీశాను. ఇప్పుడు చూడండి పురుషులతో పాటు మహిళలకు సమాన హక్కులు వస్తున్నాయి. పోలీసుల సమస్యలపై తీసిన 'సంచలనం' తరువాత వారికి హక్కులు వస్తున్నాయి. నక్సల్స్ కూడా మనుషులే వారు జనజీవన స్రవంతిలో కలవాలనే కోణంలో తీసిన 'స్వర్ణక్క'. . నక్సల్స్ చేసే తప్పులను ఎత్తిచూపిన 'పోతే పోనీలే' వంటి సినిమాలు భవిష్యత్తును ఊహించి తీసినవే. కానీ ఇలాంటి కథలు జనాలకు నచ్చడం లేదు. మంచి కథ దొరికితే తప్పకుండా సినిమా తీస్తా. పనికిమాలినవి తీసి డబ్బులు పోగొట్టుకోలేను. సినీ పరిశ్రమ హైదరాబాద్‌కు వచ్చిన కొత్తలో అందరిని సమన్వయం చేస్తూ అందరి సమస్యలు పరిష్కరించేవాణ్ని. నాలుగేళ్లుగా వీటికి దూరంగా ఉంటున్నాను.

చిన్న సినిమాలకు భవిష్యత్తు

చిన్న సినిమాలకు సైతం చక్కని భవిష్యత్తు ఉంది. ఇటీవల వచ్చిన ఫిదా, శతమానంభవతి, అర్జున్‌రెడ్డి, పెళ్లిచూపులు ఇలాంటివన్నీ ఈ కోవకు చెందినవే. ఇందులో నటించిన హీరోలు సైతం ఎటువంటి సినీ నేపథ్యం లేని వారే కావడం విశేషం. చాలామంది సినీ నేపథ్యం ఉంటేనే నెగ్గుకు వస్తామనుకోవడం అబద్ధం. దీనికి దేవరకొండ విజయ్, నాని, శర్వానంద్, రాజ్‌తరుణ్ ఉదాహరణ. ఎంతో మంది మేటి హీరోలు, దర్శక, నిర్మాతలు తమ వారసులను పరిశ్రమలోకి తీసుకొచ్చినా అది ఫలించలేదు. జన్మతః ఎంతో కొంత ప్రతిభ ఉంటే తప్ప పరిశ్రమలో రాణించడం కష్టం. ప్రతిభ ఉంటేనే అభిమానులు ఆదరిస్తారు.

అభిమానం హద్దులు దాటొద్దు

నాకు ఎన్టీఆర్ అంటే ఎంతో అభిమానం. కానీ అది హద్దులు దాట కూడదు. ప్రస్తుత తరుణంలో అది విచ్చలవిడిగా తయారైంది. అభిమాన హీరోల కోసం ఆస్తులు అమ్ముకుని, కుటుంబాలను పట్టించుకోని వారు ఉన్నారు. ఇది చాలా చెడ్డ అలవాటు. మారకపోతే తరతరాలు నాశనమయ్యే ప్రమాదం ఉంది. ప్రజల్ని మేలుకొల్పే దిశగా సినిమాలు వస్తున్నా.. వాటిని చూసే స్థితిలో లేరు. సినిమాల వల్ల జనాలు చెడిపోవడం లేదు. సమాజంలో జరిగిన ఘటనల ఆధారంగానే సినిమా కథలు రాస్తున్నారు. అభూత కల్పనలు కాదు. మాకు తెలుసా టీవీల్లో, టిఫిన్ బాక్సుల్లో బాంబులు పెట్టి చంపాలని. ఇక్కడ జరిగిన ఘటనలతోనే తీస్తున్నాం. మా సినిమా వాళ్లకు బాంబులంటేనే తెలియదు. సీమలో మారుతున్న పరిస్థితులపై కూడా సినిమాలు వస్తాయి. కాకపోతే కాస్త సమయం పడుతుంది. రాష్ట్ర విభజన జరిగిన తరవాత సినీ పరిశ్రమ చాలా వరకు హైదరాబాద్‌కే పరిమితమైంది. రానున్న ఐదేళ్లలో ప్రభుత్వం కృషి చేస్తే విశాఖపట్నానికి వెళ్లే అవకాశాలు ఎక్కువగా ఉన్నాయి.

మానసిక, శారీరక దృఢత్వానికి క్రీడలు దోహదం

గుంతకల్లు ఆర్ఎస్ (గుంతకల్లు), న్యూస్‌టుడే : ఉద్యోగులు వారి విధులను సమర్థంగా నిర్వహించడానికి, మానసిక, శారీరక దృఢత్వానికి క్రీడలు ఉపయోగపడతాయని అదనపు రైల్వే డివిజనల్ మేనేజరు కె.ఆర్.కె. రాజు పేర్కొన్నారు. రైల్వే ఇన్‌స్టిట్యూట్ ఆధ్వర్యంలో ఇన్‌స్టిట్యూట్ ఆవరణలో తీర్చిదిద్దిన వేదికలో గురువారం సాయంత్రం రైల్వే విభాగాల వాలీబాల్ పోటీలు ప్రారంభం అయ్యాయి. ఈ పోటీలను ఆయన ప్రారంభించిన తరువాత ప్రసంగించారు. ఉద్యోగులు విధుల నిర్వహణలో ఒత్తిడికి గురవుతుంటారని, దీనినుంచి ఉపశమనం పొందడానికి క్రీడలు దోహదం చేస్తాయని తెలిపారు. రెండు రోజుల పాటు జరిగే క్రీడా పోటీల్లో రైల్వేకు చెందిన 11 విభాగాల జట్లు పాల్గొంటున్నాయి. క్రీడాకారులను ఆయన పరిచయం చేసుకొన్నారు. కార్యక్రమంలో డీజిల్ షెడ్డు సీనియర్ డి.ఎం.ఇ. ప్రసాద్, డి.ఎం.ఇ. రామకృష్ణ, ఇతర శాఖల అధికారులు ఇన్‌స్టిట్యూట్ కార్యదర్శి మేఘశ్యాం, సహాయ కార్యదర్శి ఇంతియాజ్ ఖాన్, రైల్వే మజ్దూర్ యూనియన్ కార్యదర్శి విజయకుమార్, ఇన్‌స్టిట్యూట్ కార్యవర్గ సభ్యులు పాల్గొన్నారు.



క్రీడాకారులను పరిచయం చేసుకొంటున్న ఎ.డి.ఆర్.ఎం.

కొలువుల పండగ

సహాయ ఆచార్యుల పోస్టుల భర్తీకి ప్రకటన

ఎస్కేయూ, జేఎన్‌టీయూ: ఉన్నత విద్యాలయాల్లో విద్యార్థులకు ఉన్నతమైన బోధన అందనుంది. ఒకే రోజు అనంతలోని రెండు విశ్వవిద్యాలయాలు సహాయ ఆచార్యుల పోస్టుల భర్తీకి ప్రకటనలు జారీ చేశాయి. అత్యున్నత డిగ్రీలు పూర్తి చేసి ఉద్యోగం కోసం వేచి ఉన్న నిరుద్యోగులకు ఇది శుభవార్తే. ఓవైపు నిరుద్యోగులకు ఉపాధి లభిస్తే.. ఇంకో వైపు యువతకు నాణ్యమైన బోధన అందనుంది. ఎస్కేయూ, జేఎన్‌టీయూలో పోస్టుల భర్తీకి గురువారం ప్రకటన జారీ చేశారు. రెండు విశ్వవిద్యాలయాల్లో 216 అధ్యాపక పోస్టులు భర్తీ చేయనున్నారు. ఎస్కేయూలో ఎనిమిదేళ్ల తర్వాత ఒకేసారి 83 సహాయ ఆచార్యుల పోస్టుల భర్తీకి ఉపకులపతి ఆదేశాల మేరకు రిజిస్ట్రార్ సుధాకర్‌బాబు ప్రకటన ఇచ్చారు. జేఎన్‌టీయూలో 2010లో ప్రకటన ఇచ్చారు. అప్పట్లో 32 పోస్టులు భర్తీ చేశారు. తాజాగా 89 సహాయ ఆచార్యులు, 8 సంయుక్త ఆచార్యుల భర్తీకి ప్రకటన ఇచ్చారు. శుక్రవారం మరో 36 సహాయ ఆచార్యుల పోస్టులకు ప్రకటన ఇవ్వనున్నారు.



మాట్లాడుతున్న మంత్రి కాలవ

ఆరోగ్యాంధ్రప్రదేశే ప్రధాన లక్ష్యం

గొల్లపల్లి (గుమ్మఘట్ట), న్యూస్‌టుడే : ఆరోగ్యాంధ్రప్రదేశ్ ప్రధాన లక్ష్యంగా జిల్లాలోని అన్ని పల్లెల్లో మరుగుదొడ్ల నిర్మాణం పూర్తి చేసి ఓడీఎఫ్‌గా ప్రకటించాలని రాష్ట్ర సమాచార, పౌరసంబంధాల శాఖ మంత్రి కాలవ శ్రీనివాసులు పిలుపునిచ్చారు. గురువారం మండలంలోని గొల్లపల్లి గ్రామంలో సర్పంచి విజయేంద్ర ఆధ్వర్యంలో జరిగిన జన్మభూమి - మాఊరు గ్రామసభకు ముఖ్య అతిథులుగా మంత్రి కాలవ, జడ్పీ ఛైర్మన్ పూలనాగరాజులు హాజరయ్యారు. స్వచ్ఛతపై గొల్లపల్లి ఉన్నత పాఠశాల విద్యార్థి లోకేష్ ప్రసంగం అందరినీ ఆకట్టుకుంది. మంత్రి శ్రీనివాసులు మాట్లాడుతూ రాయదుర్గం నియోజకవర్గం ప్రజలు తమకు వెనుక ఉండి ప్రోత్సహిస్తే వందశాతం ఈ ప్రాంతాన్ని అభివృద్ధి సాధిస్తామన్నారు. జడ్పీ ఛైర్మన్ పూలనాగరాజు మాట్లాడుతూ గొల్లపల్లి గ్రామంలో సబ్ సెంటర్ మరమ్మతులు, గ్రామంలో జూనియర్ కళాశాల ఏర్పాటు చేయాలని మంత్రి కాలవను సభాముఖంగా కోరారు. కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్సీ మెట్టు గోవిందరెడ్డి మాట్లాడారు. కార్యక్రమంలో మండలాధ్యక్షుడు పాలయ్య, జిల్లా అధికారులు డీఆర్‌డీఏ పీడీ రామారావు, ఆర్‌డబ్ల్యూఎస్ ఎస్ఈ హరేరామ్‌నాయక్, ప్రత్యేక అధికారి సెల్వరాజ్, ఉద్యాన శాఖ జేడీ సుబ్బరాయుడు, వ్యవసాయశాఖ జేడీ శ్రీరామ్మూర్తి, డీఎంఅండ్‌హెచ్‌వో అనిల్, డీఎస్పీ వెంకటరమణ, తదితరులు పాల్గొన్నారు.

పింఛను పోరున అలసి సొలసి..

కేతగానిచెరువు(సోమందేపల్లి): గొల్ల గంగమ్మ.. అనాథ. వయస్సు సుమారు 70 ఏళ్లు. భర్త వడ్డె తిమ్మయ్య పదేళ్ల కిందట మృతి చెందారు. పిల్లలు లేరు. రేషన్ కార్డు, పింఛను మంజూరుకు నోచుకోలేదు. గ్రామానికి చెందిన రామక్క, ఆమె కుమారుడు గోవిందప్ప ఇంట్లో ఉంటోంది. ఎవరైన దయదలచి డబ్బులు ఇస్తే, భోజనం పెడితే తిని కాలం నెట్టుకొస్తోంది. ఎన్టీఆర్ భరోసా కింద సామాజిక పింఛను మంజూరు చేయాలని ఎన్నోసార్లు అధికారులకు వినతులిచ్చినా ఆమెకు ప్రయోజనం దక్కలేదు. గురువారం గ్రామంలో నిర్వహిస్తున్న జన్మభూమి-మాఊరు గ్రామసభకు ఆధార్ కార్డుతో కలిపి చివరిసారిగా వినతి పత్రాన్ని అధికారులకు ఇచ్చేందుకు వెళ్లారు. వినతులు మధ్యాహ్నం తీసుకొంటామని, అంతవరకు గ్రామసభలో కూర్చోవాలని ప్రజలకు తహసీల్దార్ రామాంజనేయరెడ్డి, ప్రత్యేకాధికారి కృష్ణానాయక్ ఆధ్వర్యంలో పలు శాఖల అధికారులు చెప్పడంతో గంగమ్మ కుర్చీలో కూర్చుని ఎదురుచూస్తూనే.. ఆందోళనతో ఒక్కసారిగా కిందపడి పోయారు. వెంటనే అధికారులు, పలువురు మహిళలు వృద్ధురాలిని అక్కడే వైద్య శిబిరంలో పరీక్షలు నిర్వహించారు. రక్తపోటు ఎక్కువగా ఉన్నట్లు గుర్తించి, సెలైన్ ఎక్కించారు. ప్రయోజనం లేకపోవడంతో మెరుగైన వైద్య చికిత్సల కోసం 108 వాహనంలో హిందూపురం ప్రభుత్వాసుపత్రికి తరలించారు. ఈ ఘటనతో అధికారులు, గ్రామస్థులు భయాందోళనకు గురయ్యారు. ఆసుపత్రికి తరలించాక అందరూ ఊపిరి పీల్చుకొన్నారు.



గంగమ్మకు వైద్య చికిత్సలు అందిస్తున్న సీహెచ్‌వో, కార్యకర్తలు



చంద్రన్న సంక్రాంతి కానుకల అందజేత

చెత్తతో సంపద తయారీకి సహకరించండి

కొడికొండ(చిలమత్తూరు), న్యూస్‌టుడే: ప్రభుత్వ సంక్షేమ పథకాలను అందరూ సద్వినియోగం చేసుకోవాలని పంచాయతీరాజ్ కమిషనర్ రామాంజనేయులు పేర్కొన్నారు. చిలమత్తూరు మండలం కొడికొండ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ఆవరణలో సర్పంచి బాలాజీ అధ్యక్షతన జన్మభూమి గ్రామసభ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తడి, పొడి చెత్తను వేరుచేసి వాటితో ఎరువులు తయారుచేసి పంచాయతీ అభివృద్ధికి చేయూత ఇద్దామన్నారు. హిందూపురం నియోజకవర్గ ప్రగతికి ఎమ్మెల్యే బాలకృష్ణ శ్రమిస్తున్నారన్నారు. ఎంపీపీ నౌజియాభాను మాట్లాడుతూ ప్రజలకు ఎలాంటి సమస్యలున్నా వినతుల రూపంలో తీసుకురావాలని పిలుపునిచ్చారు. చిలమత్తూరు, వీరాపురం చెరువులకు లిఫ్టులు ద్వారా సాగు, తాగునీరు అందించాలని జడ్పీటీసీ లక్ష్మీనారాయణరెడ్డి కోరారు. కొడికొండ పంచాయతీకి ప్రభుత్వాసుపత్రి మంజూరు చేయాలని, గ్రామంలో నిలిచిపోయిన బీసీ సామాజిక భవనాలను ప్రారంభించాలని సర్పంచి విన్నవించారు. డీపీవో సుధాకర్‌రెడ్డి, జడ్పీ సీఈవో శోభస్వరూపరాణి, డీడబ్ల్యూఎంఏ జ్యోతిబాసు, తహసీల్దార్ మారుతిప్రసాద్, నియోజకవర్గ ప్రత్యేకాధికారి విశ్వనాథ, ఎమ్మెల్యే వ్యక్తిగత సహాయకుడు వీరయ్య, జిల్లా బీసీ సెల్ అధ్యక్షుడు శివప్ప, రాష్ట్ర తెదేపా కన్వీనర్ అంజినప్ప తదితరులు పాల్గొన్నారు.

హిందూపురం

కంది పంట దగ్ధం

మొరసనపల్లి(చిలమత్తూరు): మండల పోలీస్‌స్టేషన్ పరిధిలోని మొరసనపల్లి పంచాయతీ ఎస్.ముద్దిరెడ్డిపల్లిలో కందిపంట దగ్ధమైంది. ఎస్ఐ ప్రదీప్‌కుమార్ వివరాల మేరకు... గ్రామానికి చెందిన ఏడుగురు రైతులు కొండపై 40 క్వింటాళ్ల పంట నిల్వ చేశారు. గురువారం రాత్రి గుర్తు తెలియని వ్యక్తులు నిప్పటించారు. రైతులు ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేశారు. తహసీల్దార్ మారుతిప్రసాద్ ఘటనాస్థలాన్ని సందర్శించారన్నారు.

యువకుడి ఆత్మహత్యాయత్నం

లేపాక్షి, న్యూస్‌టుడే: స్థానిక జ్యోతిబా పూలే బీసీ గురుకుల పాఠశాలలో కాపలాదారుడిగా పనిచేస్తున్న రామ్మోహన్(24) అనే యువకుడు ద్రావకం తాగి ఆత్మహత్యాయత్నానికి పాల్పడ్డాడు. వెంటనే స్థానికులు ప్రాథమిక ఆరోగ్య కేంద్రానికి తరలించారు. పరీక్షించిన వైద్యురాలు శ్రీదేవి సూచన మేరకు 108 వాహనంలో హిందూపురం తీసుకెళ్లారు. యువకుడి ఆత్మహత్యాయత్నానికి కారణాలు తెలియాల్సి ఉంది.

ప్రగతికి పట్టం



సమావేశంలో మాట్లాడుతున్న ఛైర్‌పర్సన్ లక్ష్మీ

హిందూపురం పట్టణం: ఎమ్మెల్యే బాలకృష్ణ సహకారంతో హిందూపురాన్ని అన్ని విధాలా అభివృద్ధి చేస్తామని, ఏడాది లోపు పట్టణ రూపురేఖలు మారిపోతాయని మున్సిపల్ ఛైర్‌పర్సన్ లక్ష్మీ, బీసీ కార్పొరేషన్ ఛైర్మన్ రంగనాయకులు, ఆసుపత్రి కమిటీ అధ్యక్షుడు వెంకటస్వామి పేర్కొన్నారు. గురువారం 3, 22, 30 వార్డుల్లో జన్మభూమి సమావేశాలు నిర్వహించారు. ఛైర్‌పర్సన్ మాట్లాడుతూ పట్టణంలో అర్హులందరికీ ఇళ్లు నిర్మించి ఇస్తామని, రేషన్‌కార్డులు అందిస్తామని తెలిపారు. సమస్యల్ని విన్నవించటానికి పురసేవా యాప్ వినియోగించాలని మున్సిపల్ కమిషనర్ భాగ్యలక్ష్మీ సూచించారు. పట్టణంలోని సాంఘిక సంక్షేమ గురుకుల పాఠశాల విద్యార్థినుల సాంస్కృతిక ప్రదర్శన అలరించింది. కార్యక్రమంలో మున్సిపల్ వైస్ ఛైర్మన్ రాము, తెదేపా నాయకులు నాగరాజు, తిమ్మయ్య, అమర్, మురళి, రామాంజి, తిమ్మారెడ్డి, కౌన్సిలర్లు మానస, అసిపుల్లా, షేక్ జరీనాలతో పాటు రోషన్ అలీ, సనావుల్లా, వెంకటస్వామి తదితరులు పాల్గొన్నారు. శుక్రవారం 4, 11, 23, 31 వార్డుల్లో సమావేశాలు నిర్వహించనున్నారు.

ఫిర్యాదుల పరిష్కారమేదీ... హిందూపురం 22వ వార్డు గాంధీనగర్‌లోని రవీంద్రనాథ్ ఠాగూర్ మున్సిపల్ పాఠశాలలో, 30వ వార్డు హస్నాబాద్‌లోని ఫకృద్దీన్ అలీ మున్సిపల్ పాఠశాలలో నిర్వహించిన జన్మభూమి సమావేశాలు రసాభాసగా ముగిశాయి. జనం నుంచి నిరసనలు వినిపించాయి. అధికారులను, ప్రజాప్రతినిధులను నిలదీశారు. గత జన్మభూమిలో తీసుకొన్న ఫిర్యాదులకే దిక్కులేదని, మళ్లీ సమావేశాలు ఎందుకని అధికారులు, ప్రజాప్రతినిధులను ప్రజలు నిలదీశారు. ఉన్నవారికే ఇళ్లు మంజూరయ్యాయని ఆరోపించారు. హస్నాబాద్‌లో కౌన్సిలర్ అసిఫ్, కాంగ్రెస్ నాయకుడు రహమత్ కింద కూర్చొని నిరసన తెలిపారు. 30వ వార్డుపై ఎందుకు వివక్ష చూపుతున్నారని నిలదీశారు. ఇళ్ల కోసం 504 దరఖాస్తులు ఇస్తే 80 మంజూరు చేసినట్లు చూపుతున్నారని, జాబితాలో ఉన్న పేర్లన్నీ ఇతర ప్రాంతాలకు చెందినవని వాపోయారు. సొంత నిధులతో కల్వర్టులు వేసుకొన్నా ఇబ్బంది పెడుతున్నారని ఆరోపించారు. విపక్ష నాయకులపై మున్సిపల్ ఛైర్‌పర్సన్ లక్ష్మీ మండిపడ్డారు. ఆసుపత్రి ఛైర్మన్ వెంకటస్వామి మహిళలకు సర్దిచెప్పడానికి ప్రయత్నించారు. మహిళలు పట్టించుకోకపోవటంతో రెండు వార్డుల్లోనూ సమావేశాలు త్వరగా ముగించారు.



నిరసన తెలుపుతున్న కౌన్సిలర్, నాయకులు

పైడేటి(పరిగి): ప్రజా సంక్షేమానికి ప్రభుత్వం పెద్దపీట వేస్తోందని పరిగి ఎంపీపీ సత్యనారాయణ తెలిపారు. పైడేటిలో నిర్వహించిన జన్మభూమి గ్రామసభలో ఆయన మాట్లాడుతూ చంద్రన్నబాట పేరిట మండలంలోని 14 పంచాయతీల్లోనూ సిమెంట్ రహదారుల్ని 80 శాతం పూర్తిచేసినట్లు తెలిపారు. తెదేపా ప్రభుత్వ హయాంలోనే మండలంలో పలు అభివృద్ధి పనులు జరిగాయని జడ్పీటీసీ సూర్యనారాయణ పేర్కొన్నారు. రేషన్ లబ్ధిదారులకు చంద్రన్న సంక్రాంతి కానుకలు పంపిణీ చేశారు. విట్టాపల్లిలో ఎంపీడీవో బాలమునయ్య ఆధ్వర్యంలో గ్రామసభ జరిగింది. మండల ప్రత్యేక అధికారి నాగరంగయ్య, తహసీల్దార్ సుబ్బారెడ్డి, సర్పంచులు తిప్పమ్మ, గౌతమి, నాయకులు రామకృష్ణ, ఆంజనేయులు, నరసింహమూర్తి, మాజీ జడ్పీటీసీ నంజుండప్ప, మాజీ సర్పంచి నాగప్ప, వైస్‌ఎంపీపీ చౌడప్ప, ఎంపీటీసీ శిల్ప, ప్రజలు పాల్గొన్నారు.



పైడేటిలో ప్రసంగిస్తున్న ఎంపీపీ సత్యనారాయణ

మణేసముద్రం,ఎం.బీరేపల్లి(హిందూపురం గ్రామీణం): సమస్యలు పరిష్కరించాలనే లక్ష్యంతో ప్రభుత్వం ప్రజల వద్దకే అధికారులను పంపుతోందని హిందూపురం ఎంపీపీ డి.సుభద్రమ్మ పేర్కొన్నారు. ఎంపీడీఓ కె.శ్రీలక్ష్మీ పర్యవేక్షణలో సర్పంచి లక్ష్మీదేవి అధ్యక్షతన మణేసముద్రం, తహసీల్దార్ చల్లా విశ్వనాథ్ పర్యవేక్షణలో సర్పంచి ఆదినారాయణప్ప ఆధ్వర్యంలో ఎం.బీరేపల్లిలో గ్రామసభలు జరిగాయి. కార్డుదారులకు చంద్రన్న సంక్రాంతి కానుకలు, మహిళా సంఘాలకు రివాల్వింగ్ ఫండ్ నిధులు, ప్రజలకు కొత్త రేషన్‌కార్డులు పంపిణీ చేశారు. పక్కాగృహాలు నిర్మించాలని, బియ్యం కార్డులు ఇవ్వాలని, పింఛన్లు మంజూరు చేయాలని, గ్రామాల్లో సిమెంటు రహదారులు, కాలువలు నిర్మించాలని ప్రజల నుంచి వచ్చిన 81 వినతులను అధికారులు స్వీకరించారు. కార్యక్రమంలో తెదేపా మండల సమన్వయకర్త అశ్వత్తనారాయణరెడ్డి, ఎంపీటీసీ సభ్యుడు సుబ్బయ్య, ఈఓఆర్‌డీ శివన్న, వివిధ శాఖల అధికారులు, జన్మభూమి కమిటీ సభ్యులు, అంగన్‌వాడీ కార్యకర్తలు పాల్గొన్నారు.



మణేసముద్రంలో సంక్రాంతి కానుకలను అందజేస్తున్న ఎంపీపీ తదితరులు

కోడిపల్లి(లేపాక్షి): పేదల సంక్షేమమే ధ్యేయంగా ముఖ్యమంత్రి చంద్రబాబు ప్రవేశపెడుతున్న ప్రభుత్వ పథకాలను ప్రతిఒక్కరూ వినియోగించుకోవాలని ఎంపీపీ హనోక్ తెలిపారు. కోడిపల్లిలో సర్పంచి నాగమ్మ అధ్యక్షతన గ్రామసభ నిర్వహించారు. పంచాయతీలో వ్యక్తిగత మరుగుదొడ్లు నిర్మించుకున్న వారికి ఇంతవరకు బిల్లులు ఇవ్వలేదని గ్రామస్థులు అధికారులకు తెలిపారు. నిబంధనల మేరకు రెండు గుంతలు నిర్మించిన వారికి సత్వరమే బిల్లులు అందిస్తున్నట్లు అధికారులు తెలిపారు. నూతనంగా మంజూరైన రేషన్‌కార్డులను లబ్ధిదారులకు అందించారు. కార్యక్రమంలో జడ్పీటీసీ ఆదినారాయణరెడ్డి, మండల ప్రత్యేకాధికారి రాజేంద్రప్రసాద్, తహసీల్దార్ ఆనంద్‌కుమార్, ఎంపీడీవో సులోచన, ఎంఈవో నాగరాజునాయక్, వ్యవసాయాధికారి సురేంద్రనాయక్, వైద్యాధికారులు శ్రీదేవి, అశ్వినికుమార్,హేమలత, ఆర్‌డబ్ల్యూఎస్ డీఈ మోహన్, ఉపాధి ఏపీఓ లక్ష్మీభాయి, వెలుగు ఏపీఎం రఘునాథరెడ్డి, ఐసీడీఎస్ సూపర్‌వైజర్ శ్రీలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.



ర్యాలీ నిర్వహిస్తున్న కళాశాల విద్యార్థులు

అందరి భాగస్వామ్యం.... జన్మభూమిలో అందరూ భాగస్వాములు కావాలని కళాశాల ఇన్‌ఛార్జి ప్రిన్సిపల్ అనూరాధ తెలిపారు. ప్రభుత్వ జూనియర్ కళాశాల విద్యార్థులు గ్రామంలో ర్యాలీ నిర్వహించారు. ప్రభుత్వ లక్ష్యాలను ప్రజలకు వివరిస్తూ నినాదాలు చేశారు. పులమతిలో వ్యక్తిగత మరుగుదొడ్లు నిర్మించుకోవాలంటూ విద్యార్థులు ప్లకార్డులతో ర్యాలీ నిర్వహించారు. కోడిపల్లిలో మండలస్థాయి అధికారులు, ప్రజాప్రతినిధులు కలసి ప్రదర్శన నిర్వహించారు.

వేగ నియంత్రణకు చర్యలు

కొడికొండ చెక్‌పోస్టు(చిలమత్తూరు), న్యూస్‌టుడే: యువత మితిమీరిన వేగంతో వాహనాలు నడపకూడదని ఎస్ఐ ప్రదీప్‌కుమార్ తెలిపారు. గురువారం మండల పరిధిలోని కోడూరు పంచాయతీ కొడికొండ చెక్‌పోస్టు వద్ద రేడియం స్టిక్కర్లు అతికించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ హిందూపురం, కొడికొండ, గోరంట్ల నుంచి వచ్చే వాహనాలు అతివేగంతో వస్తున్నాయని, వాటిని కొంతైనా అదుపు చేయడానికి స్టిక్కర్లు ఉపయోగపడుతాయన్నారు. ద్విచక్రవాహనదారులు శిరస్త్రాణం తప్పక ధరించాలన్నారు.





హుండీ ఆదాయాన్ని లెక్కిస్తున్న కమిటీ సభ్యులు

లేపాక్షి ఆలయ హుండీ లెక్కింపు

లేపాక్షి, న్యూస్‌టుడే: స్థానిక దుర్గా, పాపనాశేశ్వర, వీరభద్రస్వామి ఆలయంలో హుండీని గురువారం ఆలయ కార్యనిర్వహణాధికారి నాగేంద్రప్రసాద్ ఆధ్వర్యంలో లెక్కించారు. మూడునెలలకు సంబంధించి మొత్తం రూ.2.12లక్షల ఆదాయం వచ్చినట్లు ఈవో తెలిపారు. కార్యక్రమంలో దేవాదాయశాఖ ఇన్‌స్పెక్టర్ తులసీ, ఎంపీపీ హనోక్, కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

చోరీకి యత్నించిన నిందితుల అరెస్టు

హిందూపురంఅర్బన్,న్యూస్‌టుడే: గోళ్లాపురం పారిశ్రామికవాడలోని ఓ పరిశ్రమలో చోరీకి యత్రించిన ముగ్గురు నిందితులను గ్రామీణ పోలీస్‌స్టేషన్ ఎస్ఐ శేఖర్ అరెస్టు చేశారు. బుధవారం రాత్రి తాత్కాలికంగా నిర్మించిన షెడ్‌లోని షీట్లు, ఇనుప సామగ్రిని గోళ్లాపురానికి చెందిన సంజీవరాయప్ప, శివప్ప, శేఖర్‌లు ట్రాక్టర్‌తో ఢీకొట్టించి చోరీకి యత్నిస్తుండగా సమాచారం అందుకొన్న గ్రామీణ పోలీసులు అక్కడికి చేరుకొని అదుపులోకి తీసుకున్నారు. ట్రాక్టర్‌ను స్వాధీనం చేసుకొన్నారు. వారిని న్యాయస్థానంలో హాజరుపరచినట్లు ఎస్ఐ తెలిపారు.



వివరాలు వెల్లడిస్తున్న ఎస్ఐ శేఖర్ తదితరులు

నిబంధనల మేరకు నడపాలి

హిందూపురం అర్బన్, న్యూస్‌టుడే: ట్రాక్టర్ చోదకులు, యజమానులు నిబంధనల మేరకు వ్యవహరించాలని లేదంటే చర్యలు తప్పవని పట్టణ ఒకటో పోలీస్‌స్టేషన్ సీఐ చిన్నగోవిందు అన్నారు. గురువారం పట్టణంలోని ట్రాక్టర్ యజమానులు, చోదకులకు కౌన్సెలింగ్ నిర్వహించారు. మద్యం తాగి వాహనాలు నడిపినా, నిబంధనలు పాటించకపోయినా కేసులు నమోదు చేస్తామని హెచ్చరించారు. చోదకపత్రం, నైపుణ్యం ఉన్నవారినే నియమించుకోవాలని యజమానులకు సూచించారు. ట్రాఫిక్‌కు అంతరాయం కలగకుండా ట్రాక్టర్లు, నీటి ట్యాంకర్లు నడపాలన్నారు.



ట్రాక్టర్ యజమానులతో మాట్లాడుతున్న వన్‌టౌన్ సీఐ చిన్నగోవిందు

హిందూపురం

కొండముచ్చుతో విద్యార్థుల భయాందోళన

మోదా(పరిగి): మండల పరిధిలోని మోదా జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల తరగతి గదుల్లోకి కొండముచ్చు రావడంతో విద్యార్థులు భయాందోళనకు గురవుతున్నారు. అటవీప్రాంతం నుంచి తప్పిపోయి వచ్చిన కొండముచ్చు తరగతి గదుల్లోకి వెళ్లి విద్యార్థుల పైకి ఎక్కి కూర్చోవడంతో భయభ్రాంతులకు గురవుతున్నారు. అటవీశాఖ అధికారులు స్పందించి కొండముచ్చును అటవీ ప్రాంతంలో వదిలి వేయాలని పాఠశాల ఉపాధ్యాయులు విన్నవించారు.


తరగతి గదిలో కొండముచ్చు

సర్వేపై అవగాహన

హిందూపురం పట్టణం, న్యూస్‌టుడే: హిందూపురాన్ని స్వచ్ఛ పట్టణంగా మార్చడానికి ప్రజలు సహకరించాలని మున్సిపల్ కమిషనర్ భాగ్యలక్ష్మీ కోరారు. స్వచ్ఛ సర్వేక్షణ్ సర్వేపై ప్రజలకు అవగాహన కల్పించడానికి మున్సిపల్ ప్రజాప్రతినిధులు, అధికారులు, విద్యార్థులతో కలిసి గురువారం ర్యాలీ నిర్వహించారు. ప్రతి ఒక్కరూ మరుగుదొడ్డి ఉపయోగించాలని సూచించారు. బహిరంగ మల,మూత్ర విసర్జనతో కలిగే నష్టాలపై అవగాహన కల్పించారు. పాఠశాలల్లో మరుగుదొడ్లను సక్రమంగా నిర్వహించాలన్నారు. కార్యక్రమంలో మున్సిపల్ డి.ఇ.లు వన్నూరుస్వామి, రాంప్రసాద్ రెడ్డి, ఆనందరాజ్, ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలల ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.


ప్రదర్శన నిర్వహిస్తున్న నాయకులు, అధికారులు

నిత్యావసర వస్తువుల ధరలు(కిలో/రూ.ల్లో)

బియ్యం(సన్నరకం) 48, పెద్దబియ్యం 30, రాగులు 30, ధనియాలు 80, కందిపప్పు 60-70, పెసర్లు 80, పెసరబ్యాళ్లు 120, బియ్యంపిండి 35, జొన్నలు(తెల్లవి) 22, సజ్జలు 25, సెనగలు 30, బెల్లం 50, మంచినూనె(వేరుసెనగ) 70-90, పామాయిల్ 67, గోధుమపిండి 30, గోధుమరవ్వ 25, బఠాణి 50, సెనగపప్పు 80, చింతపండు 250, ఉలవలు 80.

చేయూతకు శిక్షణ తరగతులు

హిందూపురం అర్బన్, న్యూస్‌టుడే: మానవతా దృక్పథంతో విపత్తు బాధితులను ఆదుకోవాలని ఇండియన్ రెడ్‌క్రాస్, విపత్తు స్పందన సర్వీస్ శాఖ అధికారులు తెలిపారు. యువజన సంక్షేమశాఖ సహకారంతో విపత్తు నిర్వహణ-ప్రథమ చికిత్సపై మూడు రోజులు కొనసాగే శిక్షణ తరగతులు స్థానిక ఎన్ఎస్‌పీఆర్ ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాలలో గురువారం ప్రారంభమయ్యాయి. కళాశాలలో ఏర్పాటుచేసిన సమావేశంలో ఇండియన్ రెడ్‌క్రాస్ అధికారులు శిర్రప్ప, శంకర్‌రెడ్డి, కళాశాల ఉప ప్రధానాచార్యులు హేమలత తదితరులు పాల్గొని మాట్లాడారు. నిత్యం ఎందరో ప్రమాదాలు, ప్రకృతి, ఇతర విపత్తుల బారినపడుతుంటారని అలాంటి వారికి చేయూత ఇవ్వటానికి శిక్షణ తరగతులు ఎంతో ఉపయోగపడుతాయన్నారు. యువత సామాజిక స్పృహ ఏర్పరుచుకోవాలని అప్పుడే ఆరోగ్యకరమైన సమాజం ఏర్పడేందుకు అవకాశం ఉంటుందన్నారు. రెడ్‌క్రాస్ సొసైటీ 192 దేశాల్లో సేవలు అందిస్తోందన్నారు. సమావేశంలో యూత్ రెడ్‌క్రాస్ సమన్వయకర్త నాగమణి, రమేష్ తదితరులు ప్రథమ చికిత్స ప్రాధాన్యతను విద్యార్థులకు వివరించారు.



మాట్లాడుతున్న రెడ్‌క్రాస్ ప్రాంతీయ ఉప ఛైర్మన్ శిర్రప్ప

జాతీయ యోగా పోటీల్లో ప్రతిభ


విద్యార్థులతో యోగా శిక్షణ భవన ప్రతినిధులు

హిందూపురం గ్రామీణం, న్యూస్‌టుడే: బెంగుళూరులోని శ్రీవివేకానంద యోగాప్రధాన కార్యాలయం ఆధ్వర్యంలో ఈనెల 2, 3 తేదీల్లో నిర్వహించిన జాతీయ యోగా పోటీల్లో హిందూపురానికి చెందిన విద్యార్థులు ప్రతిభ చూపారు. ఎల్ఆర్‌జీ విద్యాలయానికి చెందిన జె.వి. కౌస్తుభ్(7వతరగతి), చిన్మయా విద్యాలయలో కె. పవన్(8వ తరగతి) ద్వితీయస్థానం సాధించారు. జూనియర్ బాలికల విభాగంలో పట్టణంలోని వివిధ పాఠశాలల విద్యార్థినులు ప్రణవి, అనన్య, హిరణ్యశ్రీ, బాలుర విభాగంలో సందీప్, నవీన్, విజేంద్ర, సీనియర్స్ బాలికల విభాగంలో లాస్య, సంస్కృతి, భారతి, చిల్లేశ్వరీ, బాలుర విభాగంలో ప్రజ్వల్, పవన్ భరద్వాజ్ జాతీయ కరాటే పోటీల్లో ప్రోత్సాహక బహుమతులు అందుకున్నారు. విద్యార్థులను హిందూపురం వివేకానంద యోగా శిక్షణాభవన్ ప్రతినిధులు బదిరీనారాయణ, కరే రమేష్, అనిల్‌కుమార్, బాలాజీకుమార్, శివకుమార్ గురువారం అభినందించారు.

త్వరలో ఇళ్ల నిర్మాణాలు

హిందూపురం పట్టణం, న్యూస్‌టుడే: పట్టణానికి నూతనంగా మంజూరైన 2750 ఇళ్లను త్వరలో నిర్మిస్తామని అధికారులు పేర్కొన్నారు. ప్రజాప్రతినిధులు, అధికారులు గురువారం మున్సిపల్ కార్యాలయంలో సమావేశం నిర్వహించారు. ఏపీ టిడ్కో సంస్థ అధికారులు, నిర్మాణాలు చేపట్టే షాపూర్ పల్లోంజీ సంస్థ ప్రతినిధి రవి హాజరయ్యారు. మున్సిపల్ ఛైర్‌పర్సన్ లక్ష్మీ, వైస్ ఛైర్మన్ రాము, మున్సిపల్ కమిషనర్ భాగ్యలక్ష్మీ, మున్సిపల్ ఇంజినీర్ రమేష్, టిడ్కో డి.ఇ. రంగారావు, ఉప తహసిల్దార్ మైనుద్దీన్, తెదేపా నాయకుడు నాగరాజు తదితరులు పాల్గొన్నారు. స్థల సేకరణ విషయమై చర్చించారు. స్థలాన్ని కేటాయిస్తే నిర్మాణాలు ప్రారంభించాలని నిర్ణయించారు. స్థల కేటాయింపు బాధ్యతలు రెవెన్యూశాఖ తీసుకొంది. త్వరలో మొదలుపెట్టి, వేగవంతంగా పూర్తి చేయాలని నిర్ణయించారు.

కాలుష్యరహిత సమాజమే లక్ష్యం


మొక్క నాటుతున్న ఎంపీపీ, పంచాయతీరాజ్ కమిషనర్ తదితరులు

కొడికొండ(చిలమత్తూరు), న్యూస్‌టుడే: పచ్చదనాన్ని పెంపొందించి పర్యావరణ పరిరక్షణకు అందరూ సహకరించాలని పంచాయతీరాజ్ కమిషనర్ రామాంజనేయులు పేర్కొన్నారు. మండల పరిధిలోని కొడికొండలో గురువారం ఆయన పలు కార్యక్రమాల్లో పాల్గొన్నారు. తొలుత మొక్కలు నాటారు. సర్పంచి బాలాజీ ఆధ్వర్యంలో పెరటితోటల పెంపకాన్ని ప్రారంభించారు. గ్రామంలో 20మంది ఉపాధి కూలీలకు 60 మొక్కలు అందజేశారు. ఈ సందర్భంగా పంచాయతీరాజ్ కమిషనర్ మాట్లాడుతూ కాలుష్యరహిత ప్రపంచంగా తీర్చిదిద్దడానికి ప్రతి ఒక్కరూ కృషి చేయాలన్నారు. మొక్కలు నాటడానికి యువకులు ముందుకు రావాలన్నారు. సంరక్షణ బాధ్యతలు కూడా తీసుకోవాలన్నారు. ప్రతిష్టాత్మకంగా చేపడుతున్న వ్యక్తిగత మరుగుదొడ్లు నిర్మించుకోవాలని పిలుపునిచ్చారు. గ్రామంలో మరుగుదొడ్డి ప్రారంభించారు. కార్యక్రమంలో ఎంపీపీ నౌజియాభాను, జడ్పీటీసీ లక్ష్మినారాయణరెడ్డి, ఏపీవో అమరావతి, ఏపీఎం నారాయణ, ఫారెస్టు బీట్‌అధికారి అనిల్, తెదేపా నాయకులు అన్సర్, లక్ష్మినారాయణయాదవ్, గౌరీశంకర్, పాపన్న, నందీశప్ప, అశ్వర్థప్ప, సోము తదితరులు పాల్గొన్నారు.

కూరగాయల ధరలు(కిలో/రూ.ల్లో)(నిన్నటివి)

హిందూపురం అర్బన్: వంకాయలు 20, పచ్చిమిరప(బళ్లాపురం)60-80, బీరకాయలు 40, గోరుచిక్కుడు 40, బెండకాయ 40, బీన్స్ 40, టమోటా 5-8, ముల్లంగి 20, కోస్ 30, కాలీఫ్లవర్ 25, ఉల్లిపాయలు 50, వెల్లుల్లి 60, ఆలుగడ్డలు 20, బీట్‌రూట్ 40, కాకర 40, క్యారెట్ 60-80, సొరకాయలు 30, క్యాప్సికమ్ 60, పచ్చిబఠాణి 30, ఎండుకొబ్బరి 150, గుమ్మడికాయ 30, దొండకాయలు 40, బఠాణి 160, చిక్కుడు 40, పొట్లకాయ 30, మునగకాయలు 80.

బాలుర ప్రభుత్వ జూనియర్ కళాశాల ప్రారంభించాలి

హిందూపురంఅర్బన్,న్యూస్‌టుడే: రాబోయే విద్యాసంవత్సరం నుంచి పట్టణంలో బాలుర ప్రభుత్వ జూనియర్ కళాశాల ప్రారంభించాలని అఖిల భారత విద్యార్థి సమాఖ్య ప్రతినిధులు డిమాండ్ చేశారు. గురువారం సమాఖ్య జిల్లా అధ్యక్షుడు మధు, భార్గవ్, బెన్ని, రాజు నాగార్జున, గంగాధర్ తదితరులు ఉప తహసీల్దార్ మైనుద్దీన్‌కు వినతిపత్రం అందించారు. అనంతరం మాట్లాడుతూ బాలురకు ప్రభుత్వ జూనియర్ కళాశాల లేనందున ఈ ప్రాంతంలోని పేద, మధ్యతరగతి విద్యార్థులు వేలాది రూపాయలు వెచ్చించి ప్రైవేట్ జూనియర్ కళాశాలల్లో విద్యను అభ్యసించాల్సిన పరిస్థితి నెలకొందని ఆవేదన వ్యక్తం చేశారు. వచ్చే విద్యాసంవత్సరం నుంచి కళాశాల ప్రారంభిస్తే ఎందరో విద్యార్థులకు వెసులుబాటు కలిగే అవకాశం ఉందన్నారు.

రైతులకు అవగాహన


అవగాహన కల్పిస్తున్న అగ్నిమాపకశాఖ అధికారులు

హిందూపురం అర్బన్, న్యూస్‌టుడే: వేసవికాలం సమీపిస్తున్నందున పశుగ్రాసం నిల్వ, చెట్ల పరిరక్షణలపై తగిన జాగ్రత్తలు తీసుకోవాలని అగ్నిమాపక నిరోధకశాఖ అధికారి అశ్వర్థ తెలిపారు. గురువారం బీరేపల్లిలో అగ్నిప్రమాదాలపై రైతులకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో తహసీల్దార్ చల్లా విశ్వనాథ్, అగ్నిమాపక అధికారి అశ్వర్థ మాట్లాడుతూ విద్యుత్తు తీగల కింద పశుగ్రాసం, గడ్డివామి లేకుండా జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. పొలాల గట్లపై ఎండుగడ్డి లేకుండా చూసుకోవాలన్నారు. గడ్డివామి ఉన్న ప్రాంతాల్లో సిగరెట్, బీడీలు కాల్చి పడేయకుండా చూడాలన్నారు. సమావేశంలో అగ్నిమాపక సిబ్బంది, రైతులు తదితరులు పాల్గొన్నారు.

శుభ్రతపై శ్రద్ధ తీసుకోవాలి



సమావేశంలో మాట్లాడుతున్న సీఐ చిన్నగోవిందు

హిందూపురం అర్బన్, న్యూస్‌టుడే: విద్యార్థులు వ్యక్తిగత శుభ్రతపై ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని పట్టణ ఒకటో పోలీస్‌స్టేషన్ సీఐ చిన్నగోవిందు అన్నారు. ముక్కడిపేటలోని బాలయోగి గురుకుల పాఠశాలలో గురువారం విద్యార్థులకు రోటరీక్లబ్ ఆధ్వర్యంలో రక్తపరీక్షలు నిర్వహించారు. ఈ సందర్భంగా సీఐ మాట్లాడుతూ అందరూ చదువుకోవాలనే లక్ష్యంతో గురుకుల పాఠశాలలు, వసతిగృహాలు ఏర్పాటుచేశారని, అవకాశాన్ని విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో రోటరీ క్లబ్ అధ్యక్షుడు శివయ్య, కార్యదర్శి ఓబుల కొండయ్య, పాఠశాల ప్రధానాచార్యులు విజయభాస్కర్ తదితరులు పాల్గొన్నారు.

ప్రకటన

ఇందుమూలముగా యావన్మందికి తెలియజేయడం ఏమనగా యన్.మస్తాన్‌వలి S/o సుకుర్‌సాబ్ అను అతను హిందూపురం అదనపు జిల్లా కోర్టు యందు O.S. No. 16/2014 అను కేసును ఈ క్రింద కనపర్చిన షెడ్యూలు దాఖల ఆస్తిపై వేసినాడు. సదరి కేసు యందు పై కనపర్చిన వాది ప్రతివాదులైన అన్వర్ బాషా S/o Late హెచ్.అమీరిజాన్, యస్.అనిల్‌కుమార్ S/o శ్రీనివాసరెడ్డి, డి.ఆదిరెడ్డి S/o డి.బయపరెడ్డి మరియు వై.సీతారాములు అను వారు రాజీ అయినారు. కావున వీరందరు కలిసి ఈ క్రింద కనపర్చిన షెడ్యూలు దాఖల ఆస్తి యందు 0.60.6 సెంట్లు భూమిని చెన్నేకొత్తపల్లి గ్రామ కాపురస్తులైన కె.బాబజాన్ కుమారుడు కె.బాబులాల్‌కు విక్రయించుచున్నారని 0.60.6 సెంట్లు ఇందు ఎవ్వరికైన ఎటువంటి అభ్యంతరములున్న తెలియజేయవలెయునని ఇందుమూలముగా తెలియజేయడమైనది.

షెడ్యూలు

అనంతపురం జిల్లా, హిందూపురం ఆర్.డి., హిందూపురం సబ్ ఆర్.డి.కి చేరి హిందూపురం మున్సిపల్ ఏరియాలో Govt. Dry. Old. S.No. 156-1, New S.No. 44-2 యందు A.C. 2-71 Cents పైకి 0.60.6 సెంట్లు మాత్రమే. అందుకు చెక్కుబంది. **తూర్పు:** రోడ్డు, **పడమర:** ముస్లింస్ బరియల్ గ్రౌండు, **ఉత్తరం:** మిగిలిన Same S.No. మా ఆస్తి **దక్షిణం:** మాడిశెట్టి సుబ్బయ్య గారి కమలాక్షమ్మ ఆస్తి.

G.R.Siddu, Advocate
9490582585, 9441381655

ప్రతిభకు జీవన సాఫల్యం!

- భారత్ నుంచి ఒకే ఒక్కరు
- ఎస్కేయూ ఎంబీఏ ఆచార్యుని ఘనత

ఎస్.కె.విశ్వవిద్యాలయం: బోధనలో నవ్యత.. ప్రతిభలో సరికొత్త మైలురాయి. అందుకే భారతదేశంలోనే ఒకే ఒక్కరిగా నిలిచారు. శ్రీకృష్ణదేవరాయ విశ్వవిద్యాలయం మేనేజ్‌మెంట్ విభాగం ఆచార్యులు కె.వేణుగోపాల్‌రావుకు జీవన సాఫల్య పురస్కారం దక్కింది. దేశవ్యాప్తంగా మేనేజ్‌మెంట్ రంగంలో ఉన్న వారిని గుర్తించి అందులో అత్యంత ప్రతిభ ఉన్న వారిని మాత్రమే ఈఅవార్డుకు ఎంపిక చేస్తారు. తమిళనాడులోని భారతిదాసన్ విశ్వవిద్యాలయంలో ఈనెల 6, 7 తేదీల్లో ఫైనాన్షియల్ మార్కెట్స్ ఇష్యూస్ అండ్ ఛాలెంజస్‌పై (ఎఫ్ఎమ్ఐసీ-2018) అంతర్జాతీయ సదస్సు నిర్వహించనున్నారు. అంతర్జాతీయ స్థాయిలో మేనేజ్‌మెంట్ రంగానికి విశిష్టమైన సేవలు అందించిన వారిలో ఇద్దరికి లైఫ్‌టైమ్ అచీవ్‌మెంట్ అవార్డును ప్రదానం చేయాలని నిర్ణయించారు. ఇందులో భారత్ నుంచి ఎస్కేయూ ఆచార్యులు, న్యూజిలాండ్ నుంచి ఇర్షాద్ అలీ మాత్రమే ఎంపిక అయ్యారు. వీరికి ఈనెల 6న దేశాల్లో జాతీయ అంతర్జాతీయ స్థాయిలో అవార్డు ప్రదానం చేయనున్నారు.



వేణుగోపాలరావు

ఇదీ అవార్డుకు కొలమానం: ఆచార్య వేణుగోపాల్‌రావు ఎస్కేయూలో గత 28 ఏళ్లుగా ఎంబీఏ మార్కెటింగ్‌పై బోధిస్తున్నారు. తాజాగా విభాగాధిపతిగా, వర్సిటీ పరిధిలోని అనుబంధ కళాశాలలకు కళాశాలల అభివృద్ధి కమిటీ డీన్‌గా బాధ్యతలు నిర్వహిస్తున్నారు. ఇప్పటి దాకా ఆరు నిర్వహించిన సదస్సుల్లో మేనేజ్‌మెంట్ రంగంలో వస్తున్న మార్పులు, సవాళ్లు తదితర అంశాలపై ప్రసంగాలు చేశారు. 45 పరిశోధనా పత్రాలు సమర్పించగా.. 15 మంది పరిశోధకులు ఈయన పర్యవేక్షణలో పీహెచ్‌డీలు పూర్తి చేశారు. ఇటీవల పర్యాటక విభాగం ఆధ్వర్యంలో అవార్డు ప్రదానం చేశారు. భారత్‌శిరోమణి, విద్యారత్న బంగారు పతకాలు అందుకున్నారు. ఎంబీఏ ఆచార్యుడికి ఉత్తమ పురస్కారం రావడంపై వర్సిటీలోని పలువురు అధికారులు, ఆచార్యులు, పరిశోధకులు అభినందనలు తెలిపారు.

నిందితులను కఠినంగా శిక్షించండి



కలెక్టరేట్ ఎదుట ముస్లిం సంఘాల నాయకుల ఆందోళన

జిల్లా సచివాలయం, న్యూస్‌టుడే: తూర్పుగోదావరి జిల్లా రాజమహేంద్రవరంలో ఓ మసీదులో మత గురువును హత్య చేసిన ఉదంతాన్ని ముస్లిం సోదరులు, మతపెద్దలు తీవ్రంగా ఖండించారు. నిందితులను కఠినంగా శిక్షించాలని కోరుతూ గురువారం అనంత నగరంలో ముస్లింలు భారీ ఎత్తున ప్రదర్శనగా సాగి కలెక్టరేట్‌కు వచ్చారు. ప్రధాన ద్వారం ముందు సుమారు గంటపాటు నల్లజెండాలతో నిరసన తెలియజేశారు. మతపెద్దలు ఇబ్రహీం, అబ్దుల్‌మజీద్ మాట్లాడుతూ, మౌజన్ హత్యపై విచారణ చేపట్టిన పోలీసులు నిందితుడిని అదుపులోకి తీసుకున్నారనీ.. నిందితుడు నగదును దోచుకెళ్లడానికి వచ్చి హత్య చేశారని పేర్కొంటున్నారన్నారు. కానీ మసీదులో హత్య జరిగిన తీరు చూస్తే పవిత్ర ఖురాన్‌ను తగలబెట్టినట్లు తెలుస్తోందన్నారు. మసీదులో సీసీ కెమెరాలు పనిచేయడం లేదని పోలీసులు చెప్పడం విడ్డూరంగా ఉందన్నారు. నిందితుడు పట్టుబడిన 24 గంటల వరకు మీడియా ముందు ఎందుకు ప్రవేశపెట్టలేదని వారు ప్రశ్నించారు. ఈ ఉదంతం.. సామరస్యాన్ని, సమైక్యతను దెబ్బతీసేలా ఉందన్నారు. తమకు భారత రాజ్యాంగం, న్యాయవ్యవస్థపై అపారమైన నమ్మకం ఉందనీ.. కేసును వివిధ కోణాల్లో లోతుగా అధ్యయనం చేసి అసలైన నిందితులను గుర్తించి కఠినంగా శిక్షించాలని వారు డిమాండు చేశారు. కార్యక్రమంలో ఆవాజ్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఇంతియాజ్, సమన్వయకర్త నదీం, ఆల్‌మేవా రాష్ట్ర సహాధ్యక్షుడు ఫక్రుద్దీన్, నాయకులు దాదాగాంధీ, అల్లీపీరా, ముస్కీం, జాఫర్ తదితరులు పాల్గొన్నారు.

అనుగృహామస్తు!

జిల్లాకు 14,433 ఇళ్ల మంజూరు



అనంత గ్రామీణం (తపోవనం), న్యూస్‌టుడే: జిల్లాలో మున్సిపాల్టీల పరిధిలోని పట్టణాల్లో నివసిస్తూ పక్కాగృహాలు లేని వారికి శుభవార్త. దరఖాస్తు చేసుకుని అనేక ఏళ్లుగా ఎదురుచూస్తున్న లబ్ధిదారులను ఎట్టకేలకు కేంద్రం కరుణించింది. జిల్లాలోని 11 మున్సిపాల్టీల పరిధిలోని పట్టణాలకు 14,433 ఇళ్లను మంజూరు చేస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. పీఎంఏవై పథకం కింద ఈ ఇళ్లను నిర్మించడానికి కేంద్రం ఆమోదం తెలిపింది. పట్టణాల్లో నివసిస్తూ సొంత స్థలం ఉన్న వారు ఇక పక్కా గృహాలు నిర్మించుకోవడానికి వెసులుబాటు కల్పించారు. జిల్లాలోని అనంతపురం నగరపాలక సంస్థతో పాటు మరో పది మున్సిపాల్టీలకు ఇళ్లను మంజూరు చేస్తూ ఉత్తర్వులు జారీ చేశారు. అనంతపురం (2 వేల ఇళ్లు), ధర్మవరం (2,400), గుత్తి (1,159), హిందూపురం (819), కళ్యాణదుర్గం (1,557), మడకశిర (2,116), పామిడి (545), పుట్టపర్తి (1,507), తాడిపత్రి (1,000), గుంతకల్లు (1,330) చొప్పున కేటాయిస్తూ ఉత్తర్వులు జారీ చేశారు. ఈ ఇళ్లకు యూనిట్ ధరను రూ.3.50 లక్షలుగా నిర్ణయించారు. కేంద్ర ప్రభుత్వ రాయితీ రూ. 1.50 లక్షలు, రాష్ట్ర ప్రభుత్వ రాయితీ రూ.లక్ష, లబ్ధిదారుడి వాటా రూ.25 వేలు, రుణం రూ.75 వేలుగా నిర్ణయించారు. పట్టణాలకు మంజూరైన ఇళ్ల నిర్మాణాలను త్వరలో ప్రారంభిస్తామని పీడీ సెల్వరాజ్ తెలిపారు. సొంత స్థలం ఉన్న లబ్ధిదారులు వెంటనే ఇళ్ల నిర్మాణాలను ప్రారంభించడానికి సిద్ధంగా ఉండాలని సూచించారు.

క్యాన్సర్ బాధితునికి రూ.50 వేలు సాయం



నగదును అందజేసిన శ్రీనివాసులు

చిన్నముష్టూరు (ఉరవకొండ), న్యూస్‌టుడే: క్యాన్సర్ వ్యాధితో బాధపడుతూ చికిత్స చేయించుకొనే స్తోమత లేని నిరుపేదకు తెదేపా నాయకుడు పయ్యావుల శ్రీనివాసులు ఆర్థిక సహాయం చేశారు. వివరాలు ఉరవకొండ మండలం చిన్నముష్టూరు గ్రామానికి చెందిన లాలుస్వామి(38) ఆరు నెలల నుంచి క్యాన్సర్‌తో బాధపడుతున్నారు. బెంగళూరులోని ఆసుపత్రిలో చికిత్స చేయించుకొన్నారు.

నయం కాకపోవడం, చికిత్స చేయించుకొనే స్తోమత లేక స్వగ్రామానికి తిరిగి వచ్చారు. గ్రామంలోని తెదేపా నాయకుల ద్వారా సమాచారం తెలుసుకొని బాధితున్ని హైదరాబాద్‌లోని బసవ తారకం క్యాన్సర్ ఆసుపత్రిలో చేర్పించారు. వైద్యపరీక్షలు నిర్వహించిన వైద్యులు నాలుగు నెలలు చికిత్స చేయించుకోవాలని రూ.లక్ష ఖర్చవుతుందని తెలిపారు. దీంతో పయ్యావుల శ్రీనివాసులు రూ.50 వేలు, వసుధ ఫౌండేషను మరో రూ.50 వేలు సమకూర్చింది. గురువారం ఉరవకొండలోని తెదేపా కార్యాలయంలో నగదును అందచేశారు. వెంటనే చికిత్స చేయించుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో తెదేపా నాయకులు రాంబాబు తదితరులు పాల్గొన్నారు.

మా బాధను గుర్తించండి

జిల్లా సచివాలయం, న్యూస్‌టుడే: ఆరేళ్లపాటు చదువుకున్న కోర్సుకు గుర్తింపునిచ్చి, ఉపాధి చూపించాలని కోరుతూ ఫార్మా-డి విద్యార్థులు కలెక్టరేట్ ముందు చేపట్టిన దీక్షలు గురువారం మూడోరోజుకు చేరుకున్నాయి. శిబిరం ముందు ప్లకార్డులు పట్టుకుని మోకాళ్లపై నిరసన తెలియజేశారు. అనంతరం సంఘం జిల్లా అధ్యక్షుడు లక్ష్మీకాంత్ మాట్లాడుతూ, ఎంబీబీఎస్ కోర్సుతో ఫార్మా-డి కోర్సు సమానమని చెప్పి ప్రభుత్వమే చదివిందన్నారు. ఇప్పటికే ఆరేళ్లు పూర్తి చేసుకుని నాలుగు బ్యాచ్‌ల విద్యార్థులు సుమారు 20 వేల మంది బయటకు వచ్చారన్నారు. రూ.లక్షలు వెచ్చించి కోర్సు పూర్తి చేస్తే. . ప్రభుత్వం ఉపాధి చూపక రూ.5 వేల నుంచి రూ.10 వేలకు ప్రైవేటు సంస్థల్లో పనిచేయాల్సిన దుస్థితి వచ్చిందని వాపోయారు. ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ప్రభుత్వానికి ఎన్నో దఫాలుగా సమస్య విన్నవించుకున్నా పట్టించుకోవడంలేదన్నారు. కోర్సు పూర్తయితే ఏదో డాక్టర్ అవుతారని భావించిన తల్లిదండ్రుల్లో నిరాశను నింపిందన్నారు. విధిలేని పరిస్థితుల్లో రోడ్డెక్కాల్సిన దుస్థితి వచ్చిందన్నారు. ఇప్పటికైనా ప్రభుత్వం ఫార్మా-డి కోర్సుకు గుర్తింపునిచ్చి, నిరుద్యోగులు అందరికీ ఉద్యోగావశాలు కల్పించాలన్నారు. ఈనెల 11న జిల్లాకు వచ్చే ముఖ్యమంత్రి చంద్రబాబు దృష్టికి సమస్యను తీసుకెళ్తామన్నారు. నాయకులు భవానీ, మమత, ప్రియాంక, ఉష, జగదీష్, పవన్, రాజవర్ధన్ తదితరులు పాల్గొన్నారు.



నిరసన తెలియజేస్తున్న విద్యార్థులు, నిరుద్యోగులు

ఈనాడు-ఈటీవీ **ఆంధ్రప్రదేశ్** నిర్వహిస్తున్న
ముత్యాల ముగ్గుల పోటీ
జనవరి 3, 2018 విజేతలు

1. పి. పద్మజ, బెంగళూరు; 2. ఇ. నాగకుమారి, నందికొట్కూరు; 3 ఏ. జ్యోత్స్న, శ్రీరాంనగర్ కాలనీ; 4. వకుళా దేవి, గుంటూరు; 5. కె. దుర్గామీనా, కాకినాడ; 6. జి. విజిత, యర్రగుంట్ల, కడప; 7. టి. కళ్యాణి, ప్రొద్దుటూరు; 8. టి. వల్లీసాయి, ఉయ్యూరు; 9. టి. అనురాధ, గుంటూరు; 10. టి. విజయలక్ష్మి, చిలకలూరిపేట. విజేతల వివరాలు ఈనాడు డాట్ నెట్ చూడవచ్చు.


నీరు ఆపాలంటే అవస్థే..

జలధార.. వృథాదారిన

రొద్దం మండలంలోని చెరుకూరు సమీపంలో తాగునీటి బోరు వద్ద పైపు లైను ట్యాపు బిగించకపోవడంతో నీరంతా వృథాగా పోతోంది. స్థానికులు నీటిని పట్టుకుని కర్ర పుల్లను అడ్డుగా పెడుతున్నారు. దీంతో నిరంతరం నీరు లీకవుతోంది. ఇదే మార్గంలోని రహదారిపై గుంతల్లో నీరు నిలిచి రాకపోకలకు ఇబ్బందిగా మారుతోంది. కొందరు మహిళలు ఇక్కడి నుంచే నీరు తీసుకెళ్తుంటారు. నీటివృథాతో గ్రామాలకు తాగునీరు అందటంలేదు. అధికారులు ఇప్పటికైనా చర్యలు తీసుకుని నీటి వృథాను అరికట్టాల్సి ఉంది.


వృథా అవుతున్న నీరు.. రహదారిపై చేరిందిలా..

- చిత్రాలు: ఈనాడు, హిందూపురం

కళాశోభితం

జిల్లా సచివాలయం, న్యూస్‌టుడే: జన్మభూమి-మాఊరు కార్యక్రమంలో భాగంగా గురువారం సాయంత్రం మూడోరోజు కృష్ణకళా మందిరంలో జన్మభూమి సాంస్కృతిక కేంద్రంలో నృత్య కళా ప్రదర్శనలు ఆకట్టుకున్నాయి. యూత్ వెల్ఫేర్ ఆధ్వర్యంలో సాంప్రదాయ నృత్య ప్రదర్శనలు ఆహుతులను అలరించాయి. విశ్వభారతీ ఇంగ్లీషు మీడియం పాఠశాలల విద్యార్థులు స్వచ్ఛభారత్‌లో భాగంగా పచ్చదనం-పరిశుభ్రతపై పాడిన గేయాలు మంత్రముగ్ధులను చేశాయి. గార్లదిన్నె మండలం కేజీబీవీ పాఠశాల విద్యార్థులు చేసిన విన్యాసాలు సభికులను అబ్బురపరిచాయి. శ్రీసాయితేజ డ్యాన్స్ అకాడమీ ఆధ్వర్యంలో విద్యార్థుల నృత్య కళా ప్రదర్శన చూపురులను రంజింపజేసింది. తాడిపత్రికి చెందిన ఉస్మాన్ బొమ్మ మిమిక్రీతో సభికులను కడుపుబ్బ నవ్వించారు. ఈ కార్యక్రమంలో వివిధ రకాల కళాకారులు, విద్యార్థులు పాల్గొన్నారు.


అలరించిన మిమిక్రీ


ఆకట్టుకున్న నృత్య భంగిమ


చిన్నారుల జానపద నృత్యం

మత్తు చోదకులకు జరిమానా

అనంత నేరవార్తలు, న్యూస్‌టుడే: డిసెంబరు ఆఖరి రోజున మద్యం తాగి వాహనాలు నడిపిన 42 మందికి రూ.1500 చొప్పున జరిమానా విధిస్తూ అడిషనల్ జ్యూడీషియల్ కోర్టు న్యాయమూర్తి గీతావాణి తీర్పునిచ్చారు. ట్రాఫిక్ ఇన్‌ఛార్జి డీఎస్పీ నాగసుబ్బన్న తెలిపిన వివరాల మేరకు డిసెంబరు 31న రాత్రి అనంత ట్రాఫిక్ పోలీసులు, రవాణాశాఖ అధికారులు నగరంలోని ప్రధాన కూడళ్లలో వాహనాలు ఆపి శ్వాస పరీక్షలు నిర్వహించారు. పరీక్షల్లో మద్యం తాగి వాహనాలు నడిపినట్లు ధ్రువీకరణ కావడంతో 42 మందిపై కేసులు నమోదు చేసి కోర్టులో హాజరు పరిచారు. కోర్టు నిందితులకు రూ.1500 చొప్పున జరిమానా విధించింది. అనంతరం ట్రాఫిక్ పోలీసులు నిందితులకు ట్రాఫిక్ అవగాహన కేంద్రంలో నిబంధనలపై వివరించారు.

పక్కా... వసూల్!

(మొదటి పేజీ తరువాయి) దర్జాగా దోచేస్తున్నారు. అన్నింటా ముందున్నామని చెప్పే తాడిపత్రి పురపాలిక అధికారులు.. ఈ దోపిడీ విషయంలో అన్నీ తెలిసినా మళ్లీ కళ్లకు గంతలు కట్టేసుకున్నారనే విమర్శలు వస్తున్నాయి. తమను నిత్యం దోచేస్తున్నారని ఇటీవలే వ్యాపారులు తెలుసుకున్నా.. గుత్తేదారుడిని ఎదురు ప్రశ్నించలేక అడిగినంత మొత్తం చెల్లిస్తున్నామని వాపోతున్నారు.

పనుల వేగవంతానికి ఆదేశం

ధర్మవరం, న్యూస్‌టుడే: ముఖ్యమంత్రి చంద్రబాబు ఈ నెల 11న ధర్మవరంలో నిర్వహించే జన్మభూమి ముగింపు సభకు వస్తుండటంతో అందుకు సంబంధించిన ఏర్పాట్లను గురువారం ఎమ్మెల్యే గోనుగుంట్ల సూర్యనారాయణ, జేసీ-2 ఖాజామొహిద్దీన్, ప్రత్యేక అధికారి వెంకటేశం, ఆర్డీవో బాలానాయక్, డీఎస్పీ రామవర్మ పరిశీలించారు. పట్టణంలోని లక్ష్మీచెన్నకేశవపురం కాలనీ సమీపంలో చెరువు ప్రాంతం వద్ద ఏర్పాటు చేస్తున్న సభావేదిక పనులను అధికారులతో కలసి ఎమ్మెల్యే పరిశీలించారు. పనులను వేగవంతంగా చేయాలని అధికారులను ఎమ్మెల్యే ఆదేశించారు. తహసీల్దార్ మహబూబ్‌బాషా, ఉప తహసీల్దార్ నారాయణమూర్తి, మార్కెట్‌యార్డు ఛైర్మన్ కాటమయ్య, ఎంపీపీ వేణుగోపాల్‌రెడ్డి, తెదేపా పట్టణ, గ్రామీణ అధ్యక్షులు మల్లికార్జున, శ్రీనివాసులు, బ్రాహ్మణ కార్పొరేషన్ డైరెక్టర్ శ్యామ్‌రావు, తదితరులు పాల్గొన్నారు.


ఏర్పాట్లను పరిశీలిస్తున్న ఎమ్మెల్యే, అధికారులు

అదృశ్యమైన మహిళ హత్య

ధర్మవరం,న్యూస్‌టుడే: ధర్మవరంలో అదృశ్యమైన నార్పలకు చెందిన జ్యోతి (37) అనే వివాహిత మహిళ గురువారం నార్పల మండలం బొందలవాడ సమీపంలోని హెచ్ఎల్‌సీ కాలువలో శవమై కనిపించింది. నార్పలకు చెందిన జ్యోతి గత నెలలో ధర్మవరంలో ఉన్న ఆమె సోదరుని ఇంటికి వచ్చారు. ధర్మవరం వచ్చిన జ్యోతి కనిపించడం లేదని ఆమె సోదరుడు ధర్మవరం పట్టణ పోలీసుస్టేషన్‌లో ఫిర్యాదు చేశాడు. విచారణ చేపట్టిన ధర్మవరం పట్టణ పోలీసులు బుక్కరాయసముద్రం మండలం సంజీవపురం గ్రామానికి చెందిన ఓ వ్యక్తిపై అనుమానాలు ఉండటంతో అతన్ని పోలీసులు అదుపులోకి తీసుకొని విచారించారు. జ్యోతిని హతమార్చి గోనెసంచిలో కట్టి కాలువలో పడవేసినట్లు పోలీసువిచారణలో వెల్లడికావడంతో సంఘటనాస్థలానికి వెళ్లి మృతదేహాన్ని పోలీసులు వెలికి తీయించారు. పట్టణ సీఐ హరినాథ్ పోలీసులతో కలసి సంఘటనాస్థలాన్ని పరిశీలించారు. మహిళ మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం అనంతపురము ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు.

పనులు చూసొ్క.. పండగ చేసొ్క!

(మొదటి పేజీ తరువాయి) తిరుగుండదనే ధీమాతో కొంత మేర పనులు కూడా చేశారు. ఈ విషయం పంచాయతీరాజ్ శాఖ ఉన్నతాధికారులు ఆలస్యంగా గుర్తించారు.

టెండరేసి.. పనులు ఆరంభించి...

కళ్యాణదుర్గం నియోజకవర్గంలోని బ్రహ్మసముద్రం మండలంలో కన్నేపల్లి నుంచి బుడిమేపల్లి వరకు ఆరు కి.మీ. మేర తారు రోడ్డు నిర్మించనున్నారు. ఈ రహదారి అధ్వానంగా మారడంతో పంచాయతీరాజ్ శాఖ రూ.2.54 కోట్లు నిధులు మంజూరు చేసింది. దీంతో ఈ రహదారి పనులకు పంచాయతీరాజ్ శాఖ ఇంజినీర్లు ఈ-ప్రొక్యూర్‌మెంట్ విధానంలో మూడు నెలల కిందట టెండరు పిలిచారు. ఇందులో ఇద్దరు గుత్తేదారులు టెండర్లు దాఖలు చేశారు. వీరిలో ఒకరికి కచ్చితంగా పని దక్కేలా ఏర్పాట్లు చేసుకున్నట్లు సమాచారం. దీంతో టెండరు దాఖలు చేసిన తర్వాత నుంచి సదరు గుత్తేదారు ఏకంగా క్షేత్రస్థాయిలో పనులు ఆరంభించేశారు. ఆ రహదారి అంతా కంకర వేసి ఓ లేయర్ పనులు పూర్తిచేశారు. ఐదు చోట్ల కల్వర్టులు కూడా నిర్మించేశారు. అక్కడి వారంతా ఆ గుత్తేదారుకు టెండరులో ఈ పని దక్కిందనీ... అందుకే అతను పనిచేస్తున్నారని అంతా భావించారు. కానీ వాస్తవం మరోలా ఉంది.

తిరస్కరణకు గురైనా...

ఈ పనులకు సంబంధించిన ఈ గుత్తేదారుకు చెందిన టెండర్ సాంకేతిక అంశాలను పంచాయతీరాజ్‌శాఖ ముఖ్య ఇంజినీర్ (సీఈ) కూడా ఆమోదించారు. ఆ తర్వాత దస్త్రం కమిషనర్ ఆఫ్ టెండర్స్‌కు (సీవోటీ) వెళ్లింది. సీవోటీలో మాత్రం కీలక ఇంజినీర్లు దీనికి అభ్యంతరం తెలిపారు. గ్రావెల్ నాణ్యతకు సంబంధించి సరైన వివరాలు పేర్కొనకపోవడంతో అతడి టెండరు తిరస్కరించారు. దీంతో ఇంజినీర్లు మళ్లీ వివిధ వివరాలు పేర్కొంటూ ఇటీవలే మళ్లీ ఈ రహదారి పనులకు కొత్తగా టెండరు పిలిచారు. ఇంకా టెండర్ల దాఖలు గడువు కూడా ముగియలేదు. ఇదిలా ఉండగా... తొలిసారి టెండర్లు పిలిచి, అందులో కీలక గుత్తేదారు టెండరు తిరస్కరణకు గురైనా... ఆ గుత్తేదారు మాత్రం అప్పటికే పనులు ఆరంభించి కొంత వరకు చేసేశాడు. కన్నేపల్లి నుంచి గుడిపల్లి సమీపంలో శ్రీనోముగడ్డ గంగమ్మదేవి వంక వరకు గ్రావెల్ పనులు పూర్తిచేశారు.

రాజకీయుల అభయంతోనే...

అసలు టెండరు ఖారరు కాకుండా, అగ్రిమెంట్ కూడా కాకుండా పనులు ఎలా చేశారనేది ఆశ్చర్యం కలిగిస్తోంది. అయితే కచ్చితంగా ఈ పని ఆ గుత్తేదారుకే అప్పగించేలా అక్కడి నాయకులు ముందుగానే అభయం ఇచ్చినట్లు తెలుస్తోంది. ఎప్పటికైనా తనకే పని దక్కుతుందనే ధీమాతో గుత్తేదారు పనులు ఆరంభించినట్లు సమాచారం. మరోవైపు టెండరు తంతు పూర్తికాకపోవడం, ఒప్పందం కూడా లేకుండా పనులు జరుగుతున్నా సరే పంచాయతీరాజ్ శాఖ అక్కడి ఇంజినీర్లు ఎందుకు అభ్యంతరం వ్యక్తం చేయలేదనేది ప్రశ్నార్థకమవుతోంది. రాజకీయుల ఒత్తిళ్లతో ఇంజినీర్లు కూడా చేతులెత్తేశారని తెలుస్తోంది. తాజాగా పిలిచిన టెండరులో ఈ గుత్తేదారే పని దక్కించుకుంటాననే ధీమాతో ఉన్నట్లు సమాచారం.

ముందుగానే పనులు నిజమే

బ్రహ్మసముద్రం మండలంలోని కన్నేపల్లి నుంచి బుడిమేపల్లి వరకు రహదారి పనులకు టెండర్ల ప్రక్రియ పూర్తికాకుండా ఓ గుత్తేదారు పనులు ఆరంభించింది నిజమే. ఆ విషయం నా దృష్టికి ఆలస్యంగా వచ్చింది. అప్పటికే కొంత పనులు జరిగాయి. వెంటనే ఆ పనులు ఆపేయమని ఆదేశాలిచ్చాం. ఇలా ఎందుకు జరిగిందో చూస్తాం. తాజాగా పిలిచిన టెండర్లలో పనులు ఎవరికి దక్కితే వారితో ఒప్పందం చేసుకొని పనులు అప్పగిస్తాం. ఇందుకు నెల రోజులుపైనే పట్టే అవకాశం ఉంది.

- సుబ్బారావు, పంచాయతీరాజ్ శాఖ ఎస్ఈ

పల్లె మేల్ తలపెట్టవోయ్..

✧ జన్మభూమి రుణం తీర్చుకొంటున్న శ్రీమంతుడు
✧ వైద్యుడిగా పనిచేస్తూ గ్రామాభివృద్ధికి కృషి



గ్రామంలో బోరును చూపిస్తున్న గ్రామస్థులు

గుంతకల్లు గ్రామీణం, న్యూస్‌టుడే: సొంత లాభం కొంత మానుకొని గట్టి మేల్ తలపెట్టవోయ్ అన్న గురజాడ మాటలకు అక్షర రూపం డాక్టర్ శంకర్. కూలీకి వెళితే తప్ప పూట గడవని కుటుంబాలు.. వరుణుడు కరుణిస్తే తప్ప పంట పండని పొలాలు. స్థానికంగా పనులు లేక పిల్లలు, వృద్ధులను ఇళ్లవద్దే వదిలి మూటముళ్లె సర్దుకొని ఇతర ప్రాంతాలకు వలస వెళ్లాల్సిన దుస్థితి. ఇలాంటి పేద కుటుంబంలో పుట్టిన ఆ వ్యక్తి చిన్నప్పటి నుంచి వసతి గృహాల్లో ఉంటూ. . ప్రభుత్వ బడిలో చదువును కొనసాగించారు. తల్లిదండ్రుల కష్టాలను కళ్లారా చూసి ఇలాంటి కష్టం ఇంకెవ్వరూ పడకూడదని నిర్ణయించుకొన్నారు. కష్టపడి చదివి డాక్టర్ అయ్యారు. తనకు జన్మనిచ్చిన తల్లిదండ్రులు, ఊరిని మరచిపోకుండా లక్షల రూపాయలు వెచ్చించి అభివృద్ధి కార్యక్రమాలు చేపట్టారు.

బాధ్యతను మరువక...

ఉద్యోగం వచ్చింది కదా.. ఇక తన కుటుంబం బాగుంటుందని సంతృప్తి చెందలేదు. తన గ్రామంలో మార్పు కోసం శ్రీకారం చుట్టారు. మండల పరిషత్ ప్రాథమిక పాఠశాలలో 150 మంది విద్యార్థులు కూర్చోవడానికి అనుకూలంగా బెంచీలు, బల్లలు ఏర్పాటు చేశారు. తరగతి గదిలో పాడైన విద్యుత్తు తీగలను తొలగించి నూతనంగా విద్యుత్తు సౌకర్యం కల్పించారు. రెండు తరగతి గదులను మరమ్మతులు చేసి, పాఠశాల చుట్టూ ప్రహరీని నిర్మించి రంగులు వేయించారు. గతంలో 1 నుంచి 5వ తరగతి వరకు 100 మంది విద్యార్థులు ఉండేవారు. ప్రస్తుతం 130 మంది ఉన్నారు.

➧ దాదాపు శతాబ్ద కాలంగా ముళ్లకంపలు పెరిగి ప్రమాదకరంగా ఉన్న చెరువును శుభ్రం చేయించారు. చెరువు పక్కనే ఉన్న చేతిపంపునకు విద్యుత్తు మోటారును అమర్చి పక్కనే నీటి ట్యాంకు ఏర్పాటు చేశారు. దానిపక్కనే పశువులు తాగడానికి నీటితొట్టెలను ఏర్పాటు చేశారు. గ్రామంలో నీటి ట్యాంకును నిర్మించారు. గ్రామంలో గొడవలు మాని ప్రశాంతంగా ఉండాలని గంగమ్మ దేవాలయం నిర్మిస్తున్నారు. ఊరి చివర్లో రోడ్డు పక్కన 6 అడుగుల శివుడి విగ్రహం కట్టించారు. గ్రామప్రజలను వ్యాధుల నుంచి దూరం చేయాలని ప్రతి రెండు నెలలకోసారి వైద్యశిబిరాలను నిర్వహిస్తూ ఉచితంగా మందులు పంపిణీ చేస్తున్నారు. ఎవరికైనా శస్త్రచికిత్సలు అవసరమైతే కర్నూల్‌కు రమ్మని అక్కడ చేయిస్తారు.



తరగతి గదిలో ఏర్పాటు చేసిన బెంచీలు

ఉపాధ్యాయుల ప్రోత్సాహంతో...

గుంతకల్లు మండలంలోని గుండాల తండా గ్రామానికి చెందిన హనుమాన్‌నాయక్, లక్ష్మమ్మ దంపతులకు ఇద్దరు కుమారులు శంకర్, తిరుపతి నాయక్. తిరుపతి నాయక్ గ్రామంలోనే పొలం పనులు చేస్తున్నారు. శంకర్ 7వ తరగతి వరకు గ్రామానికి దగ్గరలో ఉన్న కర్నూల్ జిల్లాలోని మద్దికెర గ్రామంలో చదువుకున్నారు. 10వ తరగతి కొడిగెనహాల్, ఇంటర్ నాగార్జున సాగర్‌లో చదువుకొన్నారు. ఎంసెట్‌లో మంచి ర్యాంకు సాధించి ఎంబీబీఎస్ కర్నూల్‌లో పూర్తి చేశారు. ఆయన ఎదుగుదలకు తల్లిదండ్రులతోపాటు మద్దికెరలో పాఠాలు చెప్పిన ఉపాధ్యాయులు, మద్దికెరకు చెందిన కేశవరెడ్డి అనేవ్యక్తి ఎంతో సాయం చేశారు. 1998 జులైలో వైద్యుడిగా ఉద్యోగం సాధించారు. పగిడిరాయిలో, ఆదోనిలో పనిచేసి ప్రస్తుతం కర్నూల్‌లోని ప్రభుత్వ జనరల్ ఆసుపత్రిలో అసోసియేట్ ప్రొఫెసర్‌గా పనిచేస్తున్నారు.

మార్పు తేవాలన్నదే లక్ష్యం



గ్రామస్థుల్లో మార్పు తెచ్చి గ్రామాన్ని పూర్తిగా అభివృద్ధి చేయాలనే ఈ ప్రయత్నం చేస్తున్నాను. ప్రస్తుతం గ్రామ యువతలో మార్పు వచ్చింది. చాలామంది పలు ఉద్యోగాల్లో స్థిరపడుతున్నారు. పిల్లలను పాఠశాలలకు పంపుతున్నారు. గొడవల జోలికి వెళ్లకుండా ప్రశాంతంగా ఉన్నారు. స్థానిక నాయకులు, గ్రామస్థుల సహకారం బాగా ఉంది. ఏపని చేయాలన్నా ముందుకు వస్తున్నారు.

- శంకర్, అసోసియేట్ ప్రొఫెసర్



గృహ నిర్మాణ సమయంలో తడి కోసం బాటిళ్లలో నీరు పోసి ఉంచిన దృశ్యం..

చుక్కలు జారే.. చక్కటి దారి

అసలే కరవు జిల్లా.. నీటి విలువ తెలిసిన వారే ఎక్కువ.. గృహ నిర్మాణ సమయంలో అధిక నీరు అవసరం ఉంటుంది.. దీనిని అర్థం చేసుకున్న ఆ గృహ నిర్మాణ యజమాని పిల్లర్లకు సీసాలు ఏర్పాటు చేసి వాటికి సన్నని రంధ్రం ఏర్పాటు చేసి వాటిలో నీరు నిల్వఉండేలా చూస్తున్నాడు. అవి సన్నని ధారగా కారుతూ.. ఎక్కువ సమయం తడిని అందిస్తుంది. తనకల్లు మండలం కొక్కంటి క్రాస్‌లో కనిపించిన దృశ్యమిది.

చిత్రం: ఈనాడు, అనంతపురం



అవార్డుతో అభినందిస్తున్న డాక్టర్ జగన్నాథ్

రక్తపు బొట్టు.. రక్షణకు మెట్టు

- ఏటా 10వేల మంది రక్తదానం
- రాష్ట్రంలోనే ప్రథమ స్థానం
- సర్వజనాస్పత్రి రక్తనిధికి అరుదైన అవార్డు



అనంతపురం(వైద్యం), న్యూస్‌టుడే: ప్రభుత్వ సర్వజన ఆస్పత్రి రక్తనిధి కేంద్రం.. పేదలకు సంజీవనిలా ఆదుకుంటోంది. రక్తం కొరత అన్న మాటే లేకుండా పనిచేస్తోంది. అన్ని రకాల గ్రూపుల రక్తం ఇక్కడ అందుబాటులో ఉంది. ఆస్పత్రి అధికార యంత్రాంగం చొరవ, ప్రత్యేక శ్రద్ధతోపాటు.. కొన్ని రక్తదాతల సేవా సంస్థల సహకారంతో విజయవంతంగా నడుస్తోంది. అంతేకాదు కొందరు యువకులు స్వచ్ఛందంగా రక్తనిధికి వచ్చి రక్తదానం చేస్తున్నారు. తీవ్ర రక్తహీనతతో వచ్చే గర్భిణులు, ప్రమాదాల్లో తీవ్రంగా గాయపడి రక్తస్రావంతో వచ్చే క్షతగాత్రులు, శస్త్ర చికిత్సలు చేయించుకునే రోగులకు.. ఇలా ఎందరికో 'నేనున్నా' నంటూ భరోసా.. ధైర్యాన్ని ఇస్తోంది. నిత్యం రక్తం సిద్ధంగా ఉంటుంది. రక్తనిధి కేంద్రం వేళలతో నిమిత్తం లేకుండా రోగులకు రక్తం అందిస్తూ ప్రాణాలను నిలబెడుతోంది. అందుకే రాష్ట్రంలోనే ప్రథమ స్థానంలో నిలిచింది. రాష్ట్రంలో 160 రక్తనిధి (బ్లడ్ బ్యాంకు) కేంద్రాలు ఉండగా.. అనంత కేంద్రం అగ్ర భాగాన నిలిచి, అవార్డును సొంతం చేసుకుంది. సర్వజనాస్పత్రి రక్తనిధి వైద్యాధికారులు, నర్సులు, సాంకేతిక సిబ్బంది, ఎల్‌టీల శ్రమ, కృషి అభినందనీయం. రక్తనిధి సిబ్బందిని ఆస్పత్రి వైద్య పర్యవేక్షకుడు డాక్టర్ జగన్నాథ్ ప్రశంసించి, ఘనంగా సత్కరించారు.

అనంత అగ్రస్థానం

రాష్ట్రంలో మొత్తం 160 రక్తనిధి కేంద్రాలు ఉన్నాయి. ఇందులో ప్రభుత్వ ఆస్పత్రుల్లో 39, ప్రైవేట్‌లో 45, రెడ్‌క్రాస్‌లో 63, సంచార రక్త సేకరణ వాహనాలు 13 చొప్పున ఉన్నాయి. జిల్లాలో అనంత ప్రభుత్వ ఆస్పత్రి, రెడ్‌క్రాస్, ప్రైవేట్, బత్తలపల్లి ఆర్డీటీ, కదిరి, హిందూపురం ఆస్పత్రుల్లో రక్తనిధి కేంద్రాలు ఏర్పాటయ్యాయి. రాష్ట్రంలోనే అత్యధికంగా రక్త సేకరణ చేసిన అనంత ఆస్పత్రి రక్తనిధి తొలి స్థానంలో నిలిచింది. 2016-17 ఆర్థిక సంవత్సరంలో 41 వైద్య శిబిరాలు నిర్వహించి.. 10,834 మందితో రక్తం సేకరించారు. 2017-18లో డిసెంబరు నాటికి 33 శిబిరాలు నిర్వహించి 9,914 మందితో సేకరించారు. ఇక రక్తశుద్ధిలోనూ జిల్లానే అగ్రభాగాన ఉండటం విశేషం.

జిల్లాలో నీటికి కరవు ఉన్నా.. రక్త దాతలకు కొదవలేదు. ఏ రోజూ రక్తం కొరత ఏర్పడి రోగి చనిపోయిన దాఖలాలు లేవు. ఇందులో ఎన్జీఓలు, యువత పాత్ర కీలకం. సర్వజనాసుపత్రి సిబ్బంది యువతలో చైతన్యం, అవగాహన కల్పిస్తున్నారు. అందుకే ఆసుపత్రి రక్తనిధికి రాష్ట్రస్థాయిలోనే ఉత్తమ అవార్డు దక్కింది. ప్రపంచ ఎయిడ్స్ నివారణ దినోత్సవం పురస్కరించుకుని విజయవాడలోని తుమ్మలపల్లి కళాక్షేత్రంలో గతేడాది డిసెంబరు 1న అవార్డును అందుకున్నారు.

రెండేళ్లలో రక్తసేకరణ, పంపిణీ వివరాలు ఇలా..

	2016-17	2017-18 (డిసెంబరు వరకు)
దాతల సంఖ్య	10,834	9914
రక్తం తీసుకున్న రోగులు	10,648	9507
రక్తదాన శిబిరాలు	41	33

2016-17 గణంకాలను చూస్తే.. రక్తహీనత రోగులకు వాడే ప్యాక్డ్‌సెల్స్ 1,269, కాలిన గాయాల బాధితులకు వినియోగించే ప్లాస్మా రక్తం 913 మంది, డెంగీ, రక్తస్రావం రోగులకు ఉపయోగించే ప్లేట్‌లేట్ రక్తం 652 మందికి ఇచ్చారు. అదే 2017-18లో ప్యాక్డ్‌సెల్స్ 2944, ప్లాస్మా 1910, ప్లేట్‌లేట్ రక్తం 2251 మందికి పంపిణీ చేశారు. జిల్లాలో ఆరు రక్తనిధి కేంద్రాలు ఉండగా.. వీటి కింద రక్తనిల్వ కేంద్రాలు ఎనిమిది ఉన్నాయి.



దాత నుంచి రక్తం సేకరిస్తున్న సిబ్బంది

పదిసార్లు ఇచ్చా



నేను స్వచ్ఛందంగా రక్తదానం చేస్తున్నాను. ఇప్పటికే కనీసం పదిసార్లు తక్కువ కాకుండా ఇచ్చా. నా ఫోన్ నెంబరు చాలా మంది సేవా సంస్థల వద్ద ఉంది. వారు ఎప్పుడు ఫోన్ చేసినా మూడు నెలలకు ఒకసారి విధిగా రక్తం ఇస్తున్నా.

- ఇస్మాయిల్, ఆశావీధి, అనంత నగరం

స్వచ్ఛందంగా..



మా కుటుంబ ట్రాక్టర్ నగర్‌లో ఉంటుంది. ప్రతి మూడు నెలలకోసారి రక్తదానం చేస్తున్నా. ఎవరు పిలవకపోయినా నేరుగా రక్తనిధికి వెళ్లి స్వచ్ఛందంగా రక్తం ఇస్తున్నా. ఇదొక సామాజిక సేవగా భావిస్తున్నా. ఆపదలో నా రక్తం ఉపయోగపడటం గర్వంగా ఉంటుంది.

- భాస్కర్, ట్రాక్టర్‌నగర్, గార్లదిన్నె


24 గంటలూ పనిచేసేలా కృషి చేస్తాం



రాష్ట్రంలోనే అనంత రక్తనిధి కేంద్రానికి ప్రథమ స్థానం దక్కింది. అవార్డును అందుకున్నాం. సిబ్బంది సమష్టి కృషి... అధికారుల ప్రోత్సాహం.. ఎన్జీఓల సహకారం ఎంతో ఉంది. 2004లో రెండో స్థానం వచ్చింది. 13 ఏళ్ల తర్వాత ప్రథమ స్థానంలో నిలిచాం. చాలా సంతోషంగా ఉంది. అయితే రక్తనిధికి తగినంత సిబ్బంది అవసరం. ఉన్నంతలోనే పని ఒత్తిడి ఉన్నా రోగులకు ఎలాంటి ఇబ్బంది లేకుండా పని చేస్తున్నాం. రక్తనిధి 24 గంటలూ పనిచేసేలా చూస్తాం. ఈ విషయంపై తమ అధికారులు కూడా హామీ ఇచ్చారు. ఎల్‌టీలు, నర్సులు, వైద్యులు మరింత మంది అవసరం.

- శివకుమార్, వైద్యాధికారి, సర్వజనాస్పత్రి రక్తనిధి

సచిన్ తెండూల్కరే స్ఫూర్తి



క్రికెట్ దిగ్గజం సచిన్ తెండూల్కర్ కుమారుడి పేరు అర్జున్ తెండూల్కర్. సచిన్ అంటే ఎంతో అభిమానించే ఆదినారాయణ తన కుమారుడికి అర్జున్ తెండూల్కర్ అని పెట్టారు. ధర్మవరం మండలం గొట్లూరు గ్రామానికి చెందిన ఆదినారాయణ నేత కార్మికుడు. కుమారుడిని క్రికెటర్‌ను చేయాలన్నదే తండ్రి ఆశయం. అందుకే ఎనిమిదేళ్ల వయసుకే బ్యాటు చేత పట్టించారు. పదేళ్లు దాటగానే అర్జున్ అంతర్ జిల్లా పోటీలకు ఎంపికయ్యాడు. అండర్-12 క్రికెట్‌లో జోన్ స్థాయి పోటీలకు ప్రాతినిధ్యం వహించాడు. గత ఏడాది ఓపెనింగ్ బ్యాట్స్‌మెన్‌గా పరుగుల వరద పారించాడు. సెలెక్టర్లు ఆ బాలుడి ప్రతిభను గుర్తించి అండర్-14 ఆంధ్ర జట్టుకు ఎంపిక చేశారు. పట్టువదలకుండా గతేడాది మాదిరిగానే రాణించడంతో వరుసగా రెండోసారి ఆంధ్ర అండర్-14 జట్టుకు ఎంపికయ్యాడు. ఓపెనింగ్ బ్యాట్స్‌మెన్‌గా, లెగ్‌బ్రేక్ బౌలరుగా జట్టుకు మణిపూసగా మారాడు. తండ్రి ఆదినారాయణకు ముగ్గురు సంతానం కాగా అందరినీ క్రికెటర్లుగా తీర్చిదిద్దాడు. వీరి సాధనకు ఇబ్బందులు లేకుండా చేయాలని కుటుంబాన్ని గొట్లూరు నుంచి అనంతపురం మార్చాడు. అర్జున్ అక్క పల్లవి అండర్-16 ఆంధ్ర మహిళా జట్టుకు ఎంపికైంది. తమ్ముడు మణిదీప్ కూడా అండర్-12 జిల్లా జట్టుకు ప్రాతినిధ్యం వహించడం విశేషం. క్రికెట్ దిగ్గజంపై ఉన్న అభిమానంతోనే ముగ్గురు పిల్లలను క్రికెటర్లుగా తీర్చిదిద్ది స్ఫూర్తిగా నిలిచారు ఆదినారాయణ. ప్రస్తుతం కడపలో జరుగుతున్న శిక్షణ శిబిరంలో ఉన్న అర్జున్ మాట్లాడుతూ రంజీ జట్టులో స్థానం సాధించాలన్నదే తొలి లక్ష్యమన్నారు. ఆర్డీటీ అందిస్తున్న ప్రోత్సాహంతోనే ముగ్గురం క్రికెటర్లుగా ఎదిగామన్నాడు. కేరళలో జరగనున్న అంతర్ రాష్ట్ర పోటీల్లో కూడా సత్తాచాటి జాతీయస్థాయిలో గుర్తింపు తెచ్చుకుంటానని ధీమా వ్యక్తం చేశాడు.

ఆటే శ్వాస..!

- క్రికెట్‌లో రాణిస్తున్న చిన్నారులు
- ఆంధ్ర జట్టులో స్థానం

అనంతపురం క్రీడలు, న్యూస్‌టుడే: పేదరికంలో పుట్టారు.. పేదరికంలో పెరుగుతున్నారు. అయితేనేం! ఖరీదైన క్రికెట్ ఆటలో మాత్రం చిచ్చరపిడుగుల్లా దూసుకెళ్తున్నారు. క్రికెట్‌లో ఎదగాలంటే పేదరికం ఏ మాత్రం అడ్డురాదని నిరూపించారు. పట్టుదల, ఆత్మవిశ్వాసం, ఎదగాలన్న తపన ఉంటే ఉన్నతస్థాయిని అందుకోవచ్చని అక్షర సత్యం చేశారు. కనీసం బ్యాట్ కొనుగోలు చేసే ఆర్థికశక్తిలేని కుటుంబాల్లో పుట్టిన ఈ చిన్నారులు అనతికాలంలోనే ఆంధ్ర క్రికెట్ జట్టుకు ఎంపికయ్యారు. జిల్లా నుంచి అండర్-14 క్రికెట్ జట్టుకు ఇద్దరు మాత్రమే ఎంపికకాగా.. అందులో ఒకరు అర్జున్ తెండూల్కర్.. మరొకరు మల్లికార్జున. ఇద్దరూ పేద పిల్లలే. వీరు క్రికెట్‌లో ఎదిగిన తీరుపై కథనం.

తండ్రి ఆశ నెరవేర్చాలని..



రాప్తాడు గ్రామానికి చెందిన ఉమామహేష్ ట్రాక్టరు హమాలీగా కూలీకి వెళ్లేవాడు. కుమారుడు మల్లికార్జునను ఉన్నత క్రికెటర్‌గా చూడాలన్నదే అతని ఆశ. మూడేళ్ల క్రితం ఆర్డీటీ స్టేడియంలో ఓనమాలు దిద్దించాడు. అయితే ఏడాది క్రితం ఉమామహేష్‌కు గుండెపోటు రావడంతో మరణించాడు. అయినా మల్లికార్జున క్రికెట్ సాధన ఆపలేదు. తండ్రి ఆశను నెరవేర్చాలన్న తపనతో కఠోర సాధన చేస్తున్నాడు. ఎడమ చేతివాటం స్పిన్నర్‌గా విశేషంగా రాణిస్తున్నాడు. ఈ సీజన్‌లో జరిగిన అంతర్ జిల్లా పోటీల్లో 28 వికెట్లు తీసి స్పిన్నర్లలో అగ్రస్థానంలో నిలిచాడు. సెలెక్టర్లు ఏ మాత్రం ఆలోచన చేయకుండా ఆంధ్ర అండర్-14 జట్టుకు ఎంపిక చేశారు. ఆట ఆరంభించిన మూడేళ్లలోనే ఆంధ్ర జట్టుకు ఎంపిక కావడం విశేషం. భారత క్రికెట్ జట్టులో ఒక స్పిన్నర్‌గా స్థానం సంపాదించాలన్నదే లక్ష్యమని మల్లికార్జున పేర్కొన్నాడు. కేరళలో జరిగే అంతర్ రాష్ట్ర పోటీల్లో ఆంధ్ర జట్టును గెలిపిస్తానని పేర్కొన్నాడు.

వారంతా ఆర్థికంగా వెనుకబడిన కుటుంబాలకు చెందిన వ్యక్తులు.. సొంతంగా వ్యాపారాలు చేసుకునే ఆర్థిక స్థోమత లేక అనేక ఇబ్బందులు ఎదుర్కొన్నారు.. దొరికిన పని చేసుకుంటూ జీవనం సాగించారు.. ఈ నేపథ్యంలో ప్రభుత్వ సాయాన్ని అందిపుచ్చుకుని ఆర్థిక ప్రగతి వైపు పయనిస్తున్నారు. వ్యక్తిగత రుణాలు పొంది.. సొంతంగా చిరు వ్యాపారాలు మొదలెట్టారు.. కుటుంబాలను పోషిస్తూ.. దర్జాగా జీవనం సాగిస్తున్నారు. తమ పిల్లలకు ఉన్నత చదువులు చెప్పిస్తూ శెభాష్ అనిపించుకుంటున్నారు. ఒకప్పుడు ఒకరి వద్దకు కూలీ పనులకు వెళ్లే వారే.. నేడు నలుగురికి ఉపాధి మార్గం చూపుతున్నారు. వెనుకబడిన తరగతుల సేవా సహకార సంఘం ద్వారా ప్రభుత్వం అందించిన రాయితీ రుణాలను పొంది, వివిధ వ్యాపారాలతో విజయంవైపు దూసుకెళుతున్న పలువురు బీసీ లబ్ధిదారుల సంక్షేమ పథంపై 'న్యూస్‌టుడే' ప్రత్యేక కథనం.
- న్యూస్‌టుడే, లక్ష్మీనగర్ (అనంతపురం)

స్వయం ఉపాధి.. ప్రగతికి వారధి!

రాయితీ రుణాలతో మేటిగా రాణింపు



బీసీ లబ్ధిదారులకు రాయితీ రుణాల చెక్కును అందిస్తున్న బీసీ కార్పొరేషన్

విరివిగా రాయితీ రుణాలు

ప్రభుత్వం వెనుకబడిన వర్గాల అభివృద్ధికి పెద్దఎత్తున రాయితీ రుణాలను అందిస్తోంది. ఇందులో భాగంగా 2016-17లో జిల్లాలో బీసీ సంక్షేమశాఖ ద్వారా 3,868 మందికి వివిధ వ్యాపారాలు చేసుకునేందుకు రూ.39.13 కోట్లు కేటాయించింది. ఇందులో రూ.19 కోట్లు ప్రభుత్వం రాయితీగా కేటాయించగా.. రూ.20.11 కోట్లు లబ్ధిదారులకు బ్యాంకుల ద్వారా రుణాలను అందజేశారు. ఈ రుణాలను పొందిన లబ్ధిదారులు కిరాణా దుకాణాలు, దుస్తులు, షామియానాలు, కూరగాయల వ్యాపారం, టీవీ మెకానిక్, చీరల వ్యాపారం చేస్తూ ఆర్థికంగా ఎదుగుతున్నారు. అలాగే ఇటుకల తయారీ, టైలరింగ్, బ్యూటీషియన్ కేంద్రాలు నిర్వహిస్తున్నారు. 2017-18 సంవత్సరానికి ప్రభుత్వం వెనుకబడిన తరగతుల సేవా సహకార సంఘం ద్వారా జిల్లాలో 5,229 మందికి రాయితీ రుణాలను అందించాలని లక్ష్యంగా నిర్దేశించుకున్నారు. దరఖాస్తులను ఆహ్వానించి లబ్ధిదారుల ఎంపిక పూర్తి చేశారు. మొత్తం రూ.104.29 కోట్లు ఇవ్వాలని నిర్ణయించింది. త్వరలోనే నిధులను అందించేందుకు సదరు శాఖ, బ్యాంకు అధికారులు కసరత్తు చేస్తున్నారు.

చిరు వ్యాపారాలతో ఆర్థిక స్వావలంబన

రుణంతో ఆ ఇంట వెలుగులు

ఈ చిత్రంలో కనిపిస్తున్న టైలర్ పేరు వన్నూరప్ప. అనంతపురంలోని శ్రీనివాస్‌నగర్ ప్రధాన వీధిలో చిన్నపాటి టైలర్ దుకాణాన్ని నిర్వహించేవారు. గత ఏడాది బీసీ కార్పొరేషన్ ద్వారా వ్యక్తిగతంగా రాయితీ రుణం పొందారు. రూ.2 లక్షలు తీసుకున్నారు. అందులో రూ.లక్ష రాయితీ పోయింది. మిగిలిన రూ.లక్ష సిండికేట్ బ్యాంకు ద్వారా రుణం పొందారు. ఈ మొత్తంతో టైలర్ దుకాణంతోపాటు దుస్తుల వ్యాపారం చేస్తున్నాడు. అలాగే మరో ఇద్దరికి ఉపాధి కల్పిస్తున్నారు. ఇంటికి, దుకాణానికి అద్దెలు, ఖర్చుపోను నెలకు రూ.20 వేల వరకు సంపాదిస్తున్నారు. ఓ అమ్మాయికి పెళ్లి చేశానని, మరో అమ్మాయి 7వ తరగతి, అబ్బాయి ఇంటర్ ద్వితీయ సంవత్సరం చదివిస్తున్నట్లు ఆయన తెలిపారు. ప్రభుత్వం రాయితీ రుణం ఇవ్వడం వల్లే ఆర్థికంగా నిలదొక్కుకున్నానని ఆయన సంతోషం వ్యక్తం చేశారు.



స్వశక్తితో ఎదుగుదల...



ఈమె పేరు విజయలక్ష్మి. అనంతపురంలోని హౌసింగ్‌బోర్డులో ఎల్ఐజీ కాలనీలో ఉంటోంది. ఈమె బీసీ కార్పొరేషన్ ద్వారా వ్యక్తిగత రాయితీ రుణం రూ.లక్ష తీసుకుంది. ప్రభుత్వం రూ.50 వేలు రాయితీ ఇవ్వగా మిగిలిన రూ.50 వేలను ఆంధ్రప్రగతి బ్యాంకు అందించింది. ఈ సొమ్ముతో ఇంట్లోనే చీరల దుకాణాన్ని ప్రారంభించింది. నెలకు రూ.8 వేల నుంచి రూ.12 వేలు గడిస్తోంది. ఓ అమ్మాయికి గతంలో పెళ్లి చేయగా, మరో అమ్మాయిని ఇంటర్ చదివిస్తున్నారు. గతంలో ఇంట్లో ఖాళీగా ఉండేదాన్నని, ప్రభుత్వం ఇచ్చిన రుణంతో సొంతంగా వ్యాపారం చేస్తూ భర్తకు చేదోడు వాదోడుగా నిలుస్తున్నానని ఆమె చెబుతోంది.

మరో ముగ్గురికి..



ఈమె పేరు లక్ష్మి. బీసీ కార్పొరేషన్ ద్వారా ప్రభుత్వం ఇచ్చే రాయితీ రుణం పొందేందుకు నిబంధనల ప్రకారం ఎంపికైంది. రూ.రెండు లక్షలతో షామియానా దుకాణం ఏర్పాటు చేసింది. ప్రభుత్వం రూ.లక్ష రాయితీ ఇవ్వగా మరో రూ.లక్ష బ్యాంకు ద్వారా రుణం పొందింది. భర్త వేమలప్పనాయుడు సహకారంతో అనంతపురంలోని పాతూరు విద్యుత్తు కార్యాలయం ఎదురుగా షామియానాల దుకాణం ప్రారంభించింది. ఆమె ఉపాధి పొందుతూ మరో ముగ్గురికి ఉపాధి కల్పిస్తున్నారు. పెళ్లిళ్లు, వేడుకలకు కుర్చీలు, షామియానా, డ్రమ్ములు, ప్లేట్లు, గ్లాసులు వంటివి అద్దెకు ఇస్తూ వ్యాపారం సాగిస్తున్నారు. నెలకు రూ.15 వేల నుంచి రూ.30 వేల వరకూ సంపాదిస్తున్నారు. ప్రభుత్వం ఇచ్చిన రాయితీ రుణంతో ఆర్థికంగా స్థిరపడ్డామని ఆమె తెలిపింది.

కుమార్తెలకు బీటెక్ యోగం...



ఈమె పేరు చంద్రకళ. అనంతపురంలోని కలెక్టరేట్ సమీపాన జిరాక్స్ సెంటర్ నిర్వహిస్తోంది. గతంలో ఇంటి పనులు మాత్రమే చూసేది. ప్రభుత్వ రుణం కోసం దరఖాస్తు చేయగా.. నిబంధనల మేరకు రూ.2లక్షలు అందించింది. ఈ సొమ్ముతో జిరాక్స్ సెంటర్‌ను ప్రారంభించింది. ప్రభుత్వం కేటాయించిన మొత్తంలో రూ.లక్ష ఆంధ్రా బ్యాంకు రుణంగా ఇవ్వగా.. మరో రూ.లక్ష ప్రభుత్వం రాయితీగా ఇచ్చింది. ఖర్చులు పోగా నెలకు రూ.15 వేలకు పైగా సంపాదిస్తోంది. ఆమె భర్త సుదర్శన్ ప్రైవేట్ ఉద్యోగం చేస్తున్నాడు. వీరికి ఇద్దరు అమ్మాయిలు. ఇద్దరూ బీటెక్ చదువుతున్నారు. ప్రభుత్వ సాయంతో ఆర్థిక స్వావలంబన సాధిస్తున్నానని, భర్తకు చేదోడుగా ఉంటున్నట్లు ఆమె సంతోషం వ్యక్తం చేసింది.



హాయ్! బుజ్జీ!!


నేర్చుకుందాం!

ఆంగ్లంలో చాలా పదాల్లో సైలెంట్ లెటర్స్ ఉంటాయి. తెలియక మనం వాటిని తప్పుగా పలికేస్తుంటాం. వాటి సరైన ఉచ్చారణ తెలుసుకుంటే సరి.

honest - ఆనెస్ట్
honor - ఆనర్



ఈ చెట్లకు సిగ్గెక్కువ!



నేలపై నెర్రలు ఏర్పడటం చూశాం కానీ ఇదేంటీ చెట్ల మధ్య పగుళ్లు కనిపిస్తున్నాయి' అనుకుంటారు ఈ ఫొటోల్ని చూసినవారెవరైనా. దీనికి కారణం చెట్లకున్న ఓ గమ్మత్తయిన తీరు. దీన్ని 'క్రౌన్ షైనెస్' అని పిలుస్తారు.

✦ ఈ స్వభావం వల్లే చెట్లు ఒకదాన్నొకటి 'అంటను ముట్టను' అన్నట్లు భలేగా పెరుగుతాయి. గుబుర్లు గుబుర్లుగా, చెట్ల కొమ్మలన్నీ దట్టమైన ఆకులతో ఉన్నా పక్క చెట్టుకు తగలకుండా ఉంటాయి. అందుకే ఈ వృక్షాల పందిర్లపైన చివర్లో సన్నని కాలువల్లా ఖాళీ స్థలం కనిపించేస్తుంది. చూడ్డానికి ఎవరో గీసిన చిత్రలేఖనంలా గమ్మత్తుగా అనిపిస్తుంది. అందుకే ఫొటోగ్రాఫర్లు కూడా కింది నుంచి వీటి అందాల్ని కెమెరాల్లో బంధించడానికి ఆసక్తి చూపిస్తుంటారు.

✦ ఎక్కువగా మలేషియా, ఇండోనేషియా దేశాల్లోని అడవుల్లో డ్రయోబలనొప్స్, యూకలిప్టస్ వంటి కొన్ని రకాల జాతి చెట్లలో చూడొచ్చు ఈ తీరు.

✦ మొదటిసారిగా 1920లో చెట్లలోని ఈ క్రౌన్ షైనెస్ గురించి ప్రపంచానికి తెలిసింది.

✦ టచ్ మి నాట్ అన్నట్టు చెట్లలో ఈ వింతేంటో అన్న దానిపై భిన్నమైన కారణాలున్నాయి అంటూ చెబుతున్నారు పరిశోధకులు. ఒకటేమో... ఆకులు తినే ఓ రకమైన పురుగులు ఒక చెట్టు నుంచి మరో చెట్టుపైకి చేరకుండా ఉండటానికే ఈ చెట్లు ఇలా ఖాళీ స్థలాల్ని వదులుతూ పెరుగుతాయని. రెండోదేమో ఒక చెట్టు ఆకులు మరో చెట్టుకు తగలకుండా, చెట్ల కిరణజన్యసంయోగ క్రియకు అడ్డు రాకుండా ఉండటానికేనని.

✦ కారణం కచ్చితంగా తెలియకపోయినా ఈ స్వభావంతో అందర్నీ ఆకట్టుకుంటున్నాయీ చెట్లు.



సబ్జెక్ట్ ల్యాబ్ - సోషల్

కనుక్కోండి!


ఒకే దేశం ఉన్న ఏకైక ఖండం ఆస్ట్రేలియా మాత్రమే అని మనకు తెలుసు. ఇక్కడున్న మ్యాప్‌ను సరిగ్గా చూడండి. మన దేశం కింద శ్రీలంక ఎలా ఉంటుందో, సరిగ్గా ఆస్ట్రేలియా కింద కూడా ఓ భూభాగం ఉంది. అయితే ఇది ప్రత్యేక దేశం కాదు. ఆస్ట్రేలియాలోని ఓ రాష్ట్రం. అయితే దాని పేరేంటో చెప్పుకోండి?



పూర్తి చేస్తారా?

గడుల సాయంతో మిగతా బొమ్మని పూర్తి చేసి రంగులేయండి






మన దేశం తయారు చేసిన మొదటి ఉపగ్రహం?

స్కూల్ సవాల్

1. హరిత విప్లవ పితామహుడెవరు?
2. ఆర్య సమాజాన్ని స్థాపించిందెవరు?
3. మన దేశం తయారు చేసిన మొదటి ఉపగ్రహం?



- ఆకెల శ్రీధాత్రి, తొమ్మిదో తరగతి



- ఎంఎస్‌విఐఆర్ ఉత్తేజ్, ఏడో తరగతి, కె.వి.ఎస్, విజయనగరం

జవాబులు: స్కూల్ సవాల్:
1. ఎంఎస్ స్వామినాథన్
2. స్వామి దయానంద సరస్వతి
3. ఆర్యభట్ట
సబ్జెక్ట్ ల్యాబ్ - సోషల్: టాస్మేనియా

మా చిరునామా:
హాయ్‌బుజ్జీ విభాగం,
ఈనాడు ప్రధాన కార్యాలయం,
రామోజీ ఫిలింసిటీ,
హైదరాబాద్ - 501512
email: hb.eenadu@gmail.com


ఆణిముత్యం

మన సుగుణం మనల్ని రాజును చేస్తే, మన మూర్ఖత్వం మనల్ని బానిసల్ని చేస్తుంది
– ఆస్కార్ వైల్డ్

అవునా!



● హిప్పోలు మనిషికంటే వేగంగా పరిగెడతాయి.



● కప్పలు నీరు తాగవు. వాటి చర్మం నుంచే దాన్ని లోపలికి గ్రహిస్తాయి.



● అంత శరీర ఆకారంతో ఉండే ఏనుగులకు చిన్న తేనెటీగల్ని చూస్తే చెప్పలేనంత భయమట.

● కొన్ని ఉడుతలు పిల్లల్ని వదిలి పెట్టేస్తుంటాయి. అలాంటప్పుడు వేరే ఉడుత వాటి బాధ్యత తల్లి తీసుకుంటుంది.





● సాలీళ్లు ఎగరలేవు, దూకుతాయంతే.



రూపు మారితేనే ర్యాంక్

✤ జిల్లాకు రానున్న స్వచ్ఛ సర్వేక్షణ్ బృందం ✤ సన్నద్ధమవుతున్న యంత్రాంగం

హిందూపురం పట్టణం పరిగిరోడ్డులోని డంపింగ్‌యార్డులో వేసిన చెత్త

హిందూపురం, న్యూస్‌టుడే: పట్టణం నుంచి పల్లెదాకా రాష్ట్రంలోని అన్ని ప్రాంతాల్లోనూ స్వచ్ఛత నెలకొల్పాలన్నదే ప్రభుత్వ లక్ష్యం. పారిశుద్ధ్య నిర్వహణ, వ్యక్తిగత మరుగుదొడ్ల నిర్మాణం, బహిరంగ మలవిసర్జన రహితం తదితర అంశాలను పరిశీలించేందుకు స్వచ్ఛసర్వేక్షణ్ చేపట్టనున్నారు. పాయింట్ల ఆధారంగా స్వచ్ఛ పట్టణాలుగా ఎంపిక చేయాలని నిర్ణయించారు. జిల్లాలో అనంతపురం, హిందూపురం, తాడిపత్రి, గుంతకల్‌తో పాటు పలు ప్రాంతాల్లో స్వచ్ఛత పరిశీలనకు ఈనెలలో దిల్లీ నుంచి ప్రత్యేకబృందం రానుంది. ఆ సమయానికి నిర్దేశిత అంశాల్లో మెరుగుపడాలి. ఇప్పటికే హిందూపురం, తాడిపత్రి మున్సిపల్ అధికారులు, పాలకవర్గం ఆ దిశగా అడుగులు వేస్తున్నాయి.

✦ స్వచ్ఛ సర్వేక్షణ్‌లో భాగంగా ఒక్కో పట్టణానికి 2వేల మార్కులు కేటాయించారు. వ్యర్థాల నిర్వహణకు 200 ఉన్నాయి. గతంలో జిల్లాలోని అనంతపురం, కదిరి, గుంతకల్లు పట్టణాల్లో చెత్త.. పెద్ద సమస్యగా మారడంతో మార్కులు కోల్పోవాల్సి వచ్చాంది. హిందూపురం 160వ ర్యాంకులో నిలిచింది. 10లోపు ర్యాంకు సాధించేందుకు పాలకవర్గం, అధికారులు కృషి చేస్తున్నారు.

గత ఏడాది (2017) వచ్చిన ర్యాంకులు	
అనంతపురం	213
హిందూపురం	160
ధర్మవరం	149
గుంతకల్లు	93

పరిశీలించే అంశాలు

✦ జిల్లాలోని పట్టణాల్లో గత ఏడాది కాలంలో 10వేల వ్యక్తిగత మరుగుదొడ్లు నిర్మాంచారు. ఇప్పటికీ పనులు సాగుతున్నాయి. కదిరి, ధర్మవరం, హిందూపురంలో అరకొరగా జరిగాయి. వందశాతం లక్ష్యాన్ని చేరుకునేలా వాటిని సకాలంలో పూర్తి చేయాలి.

✦ జిల్లావ్యాప్తంగా 500 టన్నుల వరకు నిత్యం చెత్త సేకరిస్తున్నారు. పురపాలక సంఘాలను పరిశీలిస్తే రహదారులు, కాలువగట్టలే డంపింగ్ స్థలాలు. తడి, పొడి చెత్త వేర్వేరుగా సేకరణ జరిపితే ఆదాయం పొందే వీలుంది. గుంతకల్లులో బయోప్లాంట్ ఏర్పాటు చేసినా ప్రస్తుతం మూలనపడింది. చెత్తను సేకరించే సమయంలో కాగితాలు, ఇనుము, సీసాలను వేరు చేస్తే చెత్త కుళ్లి కంపోస్టుగా ఉపయోగపడే అవకాశముంది.

✦ పట్టణంలో ప్రధాన కూడళ్లు, విద్యాసంస్థలు, బస్టాండ్‌లు, రద్దీగా ఉండే బ్యాంకుల ముందు చెత్త డబ్బాలు ఏర్పాటు చేయాలి.

✦ పట్టణంలో పారిశుద్ధ్యం, ఇతర సమస్యలు నేరుగా అధికారులకు విన్నవించేందుకు పురయాప్ అందుబాటులో ఉంది. దీనిని వినియోగించుకునే పరిజ్ఞానం జనాభాకు తెలిసుండాలి.

✦ రెండు విడతల్లో నిర్దేశిత అంశాలు పరిశీలన సమయంలో లేకపోతే ఆ అంశాన్ని తొలగించే వారు. ఈ ఏడాది నుంచి అమలు చేయకపోతే మైనస్ మార్కులు వేస్తారు. పురపాలకయాప్ ఎంతవరకు ఉపయోగపడుతోంది, సమస్యలు పరిష్కారమయ్యాయా లేదా అన్నది నేరుగా ప్రజల నుంచే పరిశీలనా బృందం సేకరించనుంది.

✦ పట్టణంలో స్వచ్ఛత ఎలా ఉందని పరిశీలనకు వచ్చే బృందం సభ్యులు అడగ్గానే బాగుందన్న సమాధానం రావాలి. ఏఏ అంశాల్లో మార్పు కనిపించిందో అడిగితే వెంటనే చెప్పగలగాలి. గతంలో అధికారులు కొన్ని వార్డులను ఎంపిక చేసి ఆ ప్రాంతాలకు ఈ బృందాలను తీసుకెళ్లి మెప్పించే ప్రయత్నం చేసేవారు. ఈ సంవత్సరం సర్వే పక్కాగా ఉంటుందని మున్సిపల్ అధికారులు అంటున్నారు.

✦ స్వచ్ఛ సర్వేక్షణ్‌లో భాగంగా గత ఏడాది దేశవ్యాప్తంగా 400 పట్టణాల్లో పరిశీలన చేశారు. ఈ ఏడాది 4 వేల పట్టణాలతో పోటీ పడాల్సి వస్తోంది. పరిశీలనా బృందం వచ్చేనాటికి అన్ని బాగుండేలా చూడాలని పురపాలక సంఘాలను సమయాత్తం చేస్తున్నారు.

✦ జిల్లాలోని పట్టణాల ర్యాంకులు తగ్గడానికి ప్రధానకారణం డంపింగ్ యార్డుల సమస్య. హిందూపురంలో 1.60 లక్షల జనాభా ఉన్నారు. రోజూ 60 టన్నులకు పైగా చెత్త సేకరించి పరిగిరోడ్డులోని డంపింగ్‌యార్డుకు తరలిస్తున్నారు. రోడ్డు పక్కనే డంపింగ్‌యార్డు ఉండటంతో చెత్త మళ్లీ రోడ్డుపైకి వస్తోంది. గుంతకల్లు, కదిరిల్లోనూ డంపింగ్‌యార్డుల సమస్య ఉంది. చెత్త పేరుకుపోయి కొండలను తలపిస్తున్నాయి. చెత్త నుంచి వర్మీ కంపోస్టు తయారీ, ఇతర వాటికి వినియోగించాల్సి ఉన్నా ఆదిశగా ముందుకు వెళ్లలేదు.

రూ.486 కోట్లతో ప్రతిపాదనలు

✦ సీబీఆర్ పరిహారానికి రూ.192 కోట్లు
✦ అంచనాలు రూపొందించిన జలవనరుల శాఖ

అనంతపురం(శ్రీనివాస్‌నగర్), న్యూస్‌టుడే: జిల్లాలోని హెచ్చెల్సీ పరిధిలో పలు జలవనరుల ఆధునీకరణ, బాధితుల పరిహారం.. తదితర వాటికి రూ.486 కోట్లు అవసరమని అధికారులు అంచనాలు రూపొందించారు. చిత్రావతి, పీఏబీఆర్ జలాశయాలకు సంబంధించి పలు పనులకు అంచనాలు తయారు చేశారు. గురువారం రాష్ట్ర జలవనరుల శాఖ మంత్రి ఓఎస్‌డీ రాజేంద్రప్రసాద్, హెచ్చెల్సీ ఎస్‌ఈ సురేందర్‌రెడ్డి, ఈఈ మోహన్‌మూర్తి, డీఈ పక్కీరప్ప తదితరులు పీఏబీఆర్ జలాశయాన్ని, చాగల్లు జలాశయాలను పరిశీలించారు. ఆ తర్వాత పలు అంశాలపై చర్చించారు. తుదకు ఏయే పనికి ఎంతెంత అవసరమన్న దానిపై అంచనాలు పంపారు. చాగల్లు జలాశయం వల్ల ఉల్లికల్లు గ్రామంలో ఎన్ని ఇళ్లు ఇబ్బందిలో ఉన్నాయన్న దానిపై సర్వే చేయాలని నిర్ణయించారు. చిత్రావతి సమతుల జలాశయం(సీబీఆర్) ముంపు గ్రామాలు ఏడింటిని గుర్తించారు. తాడిమర్రి మండలంలోని పెద్దకోట్ల, చిన్నకోట్ల, సీసీరేవు, పీసీరేవు, ఎగువపల్లి, మోదుకులకుంట ఉప్పులపాడు గ్రామాలు ముంపు జాబితాలో ఉన్నట్లు ఇదివరకే గుర్తించిన సంగతి తెలిసిందే. ఇక్కడ దాదాపు 2080 ఇళ్లు ఉన్నట్లు లెక్కించారు. వీరికి 140 ఎకరాల భూసేకరణ, పక్కా గృహాలు నిర్మించి ఇవ్వడం లేదా పరిహారం చెల్లించడం వంటి వాటిపై ప్రతిపాదనలు తయారు చేశారు. మొత్తం రూ.192 కోట్ల దాకా వ్యయం అవుతుందని భావిస్తున్నారు. ఇక పీఏబీఆర్ లీకేజీలను అరికట్టడానికి అధునాతన జీయో మెమోరిన్(రక్షణ కవచం) వేయడానికి రూ.80 కోట్లు, పాత గేట్ల మరమ్మతులు, సెకండరీ గ్రౌంటింగ్ కోసం రూ.8 కోట్లు కేటాయించాల్సి ఉందని ప్రతిపాదనలు తయారు చేశారు. ఇక హెచ్చెల్సీ ప్రధాన కాలువ నుంచి పీఏబీఆర్‌కు నేరుగా 11 కి.మీ. మేర లింకు కాలువ తవ్వడానికి రూ.80 కోట్లు, పీఏబీఆర్ కుడి కాలువ మొత్తం 112 కి.మీ.ను ఆధునీకరణ చేయడానికి రూ.60 కోట్లు అవసరమని భావించారు. అదనంగా 50 వేల ఎకరాలను ఆయకట్టులోకి తేవడం, 50 చెరువులకు నీరు ఇచ్చేందుకు డిస్ట్రిబ్యూటరీలను తవ్వాల్సి ఉంటుంది. మరో వైపు... రూ.40 కోట్లతో ప్రత్యేక పైపు లైన్‌ను కూడా నిర్మిస్తారు. ఇలా ప్రతిపాదనలను ఇప్పటికే ప్రభుత్వానికి పంపారు. వీటన్నింటిపై క్షేత్ర పరిశీలన చేసి అంచనాలను తేల్చడానికి విశ్రాంత ఇంజినీర్లు కృష్ణారావు, సత్యనారాయణ జిల్లాకు రానున్నట్లు ఎస్‌ఈ సురేందర్‌రెడ్డి తెలియజేశారు.

హంద్రీనీవా ఉప సీఈగా హరిప్రసాద్ బాధ్యతల స్వీకరణ

అనంతపురం(శ్రీనివాస్‌నగర్), న్యూస్‌టుడే: హంద్రీనీవా సుజల ప్రవంతి(హెచ్ఎన్ఎస్ఎస్) సర్కిల్-2 ఉప సీఈగా హరిప్రసాద్ గురువారం పదవీ బాధ్యతలు తీసుకున్నారు. ఇక్కడ ఉన్న కమతం శ్రీనివాసులు తెలుగుగంగకు ఈఈగా బదిలీ చేసిన సంగతి తెలిసిందే. ఇదే ప్రాజెక్టులో డీఈగా ఉన్న హరిప్రసాద్‌కు పదోన్నతి కల్పించి ఉప సీఈగా నియమించారు. కర్నూలు జిల్లాలో ఎమ్మెల్సీ ఎన్నికల కోడ్ ఉండటంతో ఇన్నాళ్లూ వీరిద్దరూ రిలీవ్ కాలేదు. తాజాగా హరిప్రసాద్ బాధ్యతలు తీసుకున్నారు.

వర్శిటీ ప్రగతిలో విద్యార్థే నిర్ణేత



సూచనలు ఇస్తున్న ఉపకులపతి

జేఎన్‌టీయూ, న్యూస్‌టుడే: విద్యార్థే నిర్ణేతగా ఉండాలని ఉపకులపతి శ్రీనివాస్‌కుమార్ పేర్కొన్నారు. అనంత జేఎన్‌టీయూ ఉపకులపతిగా బాధ్యతలు స్వీకరించిన అనంతరం వర్శిటీలో కళాశాలలో ఉన్న సమస్యలపై ఆయన దృష్టి సారించారు. గురువారం సాయంత్రం ఉపకులపతి కెమికల్ విభాగాన్ని పరిశీలించారు. ముందుగా బోధనా సిబ్బందితో మాట్లాడారు. అనంతరం విభాగంలోని పలు ప్రయోగశాలలను పరిశీలించారు. ప్రయోగశాలలు ఆశావహంగా ఉన్నా వాటిని సరైన విధానంలో వినియోగించుకోవాలని సూచించారు. పనిచేయని వాటిని గుర్తించాలన్నారు. పూర్తిగా పనిచేయనివి, మరమ్మతులు చేస్తే పని చేసేవి... సక్రమంగా ఉన్న పరికరాల వివరాలను క్రోడీకరించి నివేదిక ఇవ్వాలన్నారు. విద్యార్థులతో వీసీ ప్రత్యేకంగా మాట్లాడారు. వర్శిటీ అభివృద్ధిలో మీరే నిర్ణేతలు. మీకు ఏతరహా సమస్యలు ఉన్నా తెల్ల కాగితంపై రాసివ్వాలని అవి అత్యంత రహస్యంగా ఉంచుతామన్నారు. మీపేర్లు ఏమీ రాయాల్సిన అవసరం లేదనీ.. మీరు ఎదుర్కొంటున్న సమస్య ఏమిటో తెలిపితే వాటిని పరిష్కరిస్తామన్నారు. విద్యార్థుల వారి సమస్యను రాసి అక్కడే ఉంచిన కవర్‌లో వేశారు. ఈవిధానం ఏమేరకు సఫలం అవుతుందోనన్న ఆసక్తి నెలకొంది.

కళలతో సామాజిక చైతన్యం

✦ దర్శకనిర్మాత తమ్మారెడ్డి భరద్వాజ ✦ ముగిసిన బళ్లారి రాఘవ సాంస్కృతిక ఉత్సవాలు



ప్రసంగిస్తున్న భరద్వాజ

అనంత సాంస్కృతికం, న్యూస్‌టుడే : కళలు సామాజిక మూలాలు అని, ప్రజా ఉద్యమాల్లో సాంస్కృతిక, నాటకరంగ కళలు ముఖ్యభూమిక పోషిస్తాయని సినీ దర్శకనిర్మాత తమ్మారెడ్డి భరద్వాజ పేర్కొన్నారు. నగరంలో ప్రజానాట్య మండలి ఆధ్వర్యంలో మూడురోజులుగా జరుగుతున్న బళ్లారి రాఘవ స్మారక రాష్ట్రస్థాయి సాంస్కృతిక ఉత్సవాల ముగింపు వేడుకలకు ఆయన ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. స్థానిక ఆర్ట్స్ కళాశాల మైదానంలో జరిగిన కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ కళలు సామాజిక స్ఫూర్తిని కల్పిస్తాయన్నారు. దేశం పురోగమనం వైపు కాకుండా తిరోగమనం వైపు పయనిస్తున్న సమయంలో కళాకారుల ఆవశ్యకత ఎంతో ఉందన్నారు. జోహార్, అమర్‌రహే అనే పాటలే కాకుండా ఉద్యమాలకు స్ఫూర్తినిచ్చే కొత్తపాటలు రావాలని, సామాజిక పరిస్థితులను మార్చే సత్తా కళలకే ఉందన్నారు. తెలుగు సినీ పరిశ్రమ నేడు ఇంత అభివృద్ధి చెందడానికి కారణం ప్రజానాట్యమండలి అన్నారు. సినీవినీలాకాశంలో తారగా వెలుగొందిన నందమూరి తారకరామారావు నేషనల్ ఆర్ట్ థియేటర్ ప్రారంభించారన్నారు. నటులు రాజారావు, జమున, నాగభూషణం, తాతినేని, అల్లురామలింగమయ్య, మాదాల రంగారావు, టి.కృష్ణ, నారాయణరావు తదితరులంతా ప్రజానాట్యమండలి నుంచి వెండితెరకు వచ్చారన్నారు. సమాజం బాగుపడాలంటే మరిన్ని ఉత్తమ గేయాలు, కళారూపాలు, నాటకాలు మారుమూల పల్లెల్లో ప్రదర్శించాలన్నారు. అనంతరం రాష్ట్రంలోని పలు ప్రాంతాల నుంచి వచ్చిన కళాకారులు గిరిజన కళారూపం, అల్లూరి సీతారామరాజు, ఏదినిజం, ఉరుముల జానపదకళా రూపం, కీలుగుర్రాలు, కోలాటం, చెక్కభజన తదితర సాంస్కృతిక కార్యక్రమాలతో ఆకట్టుకున్నారు. ఈ కార్యక్రమంలో ప్రజానాట్య మండలి సభ్యులు సురేష్, ఈశ్వరయ్య, చంద్రశేఖర్, ఖాన్, సాహితీవేత్తలు రాచపాళెం చంద్రశేఖరరెడ్డి, రమేష్‌నారాయణ, జూపల్లి ప్రేమ్‌చంద్, సత్యబోస్, అశ్వర్థరెడ్డి, లెనిన్‌బాబు, సావిత్రి, కృష్ణవేణి తదితరులు పాల్గొన్నారు.



అల్లూరి భళా..



ఆకట్టుకున్న నృత్య ప్రదర్శన

సంస్కృతిని కాపాడాల్సిన బాధ్యత అందరిదీ

గుల్జార్‌పేట, న్యూస్‌టుడే: అంతరించిపోతున్న సంస్కృతిని, కళలను కాపాడుకోవాల్సిన బాధ్యత మనందరిపై ఉందని ప్రముఖ సినీ దర్శక, నిర్మాత తమ్మారెడ్డి భరద్వాజ అన్నారు. గురువారం ప్రెస్‌క్లబ్‌లో విద్వాన్ విశ్వం విజ్ఞాన కేంద్రం ఆధ్వర్యంలో 'సాంస్కృతిక రంగం- సవాళ్లు' అనే అంశంపై జరిగిన సదస్సులో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడారు. సినిమారంగం ప్రజల్ని ప్రభావితం చేస్తుందనడంలో పూర్తి నిజం కాదని, తీసే 300 సినిమాల్లో ఓ పది మాత్రమే అలా ఉండవచ్చన్నారు. కానీ మిగిలిన అన్ని సినిమాలు ప్రజలను మేలుకొల్పే దిశగా తీసినవేనన్నారు. నేటి ఆధునిక, యాంత్రిక జీవనంలో తల్లిదండ్రులు సైతం తమ పిల్లల్ని పట్టించుకునే సమయం ఉండటం లేదన్నారు. సామాజిక మాధ్యమాల్లో విమర్శలకే ఎక్కువ ప్రాధాన్యమిస్తున్నారని, ఈ ధోరణి మారాలన్నారు. మంచిని కూడా ప్రచారం చేయాలని ఆయన సూచించారు. సంస్కృతి, సంప్రదాయాలను కాపాడుకోవడానికి ఏ రాజకీయాలు అడ్డురావని, అన్ని ప్రసార మాధ్యమాలు వీటి పరిరక్షణ దిశగా కృషి చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో విద్వాన్‌విశ్వం విజ్ఞాన కేంద్రం సభ్యులు ప్రగతి, రచయిత దేవేంద్రప్ప, కేంద్ర సాహిత్య అకాడమీ అవార్డు గ్రహీత రాచపాళెం చంద్రశేఖరరెడ్డి, కవి సింగమనేని నారాయణ, సీపీఎం జిల్లా కార్యదర్శి రాంభూపాల్, నాయకులు నాగేంద్రకుమార్, చంద్రాయుడు, లక్ష్మీదేవి పాల్గొన్నారు.



ఏఎంసీలో చికిత్స పొందుతున్న రోగి చిట్టి

పెద్దాస్పత్రిలో పేలిన సిలిండర్

తప్పిన ప్రమాదం

అనంతపురం(వైద్యం), న్యూస్‌టుడే: సర్వజన ఆస్పత్రి సాధారణ వైద్య విభాగం మహిళా వార్డులో(ఎఫ్ఎం) ఆక్సిజన్ సిలిండర్ పేలింది. అదృష్టవశాత్తు ఎలాంటి ప్రమాదం జరగలేదు. నర్సులు అప్రమత్తం కావడంతో పెను ప్రమాదం తప్పింది. గురువారం ఈ ఘటన చోటు చేసుకుంది. ఉదయమే చిట్టి అనే రోగికి ఆక్సిజన్ పెట్టడానికి స్టాఫ్‌నర్సులు శ్రీదేవి, రాణి వెళ్లారు. సిలిండర్ మీటర్‌ను తిప్పడానికి యత్నించారు. ఒక్కసారి పెద్ద శబ్దంతో పేలింది. దీంతో ఆ వార్డులో ఉన్న రోగులు పరుగులు తీశారు. వేగంగా కింద అంతస్తులో ఉన్న ఆర్థో విభాగానికి చేరుకున్నారు. ఈలోపు అక్కడే ఉన్న మరికొందరు నర్సులు వచ్చారు. సిలిండర్ మీటర్‌ను పూర్తి తొలగించేసి.. మూత తెరవకుండా తగిన జాగ్రత్తలు తీసుకున్నారు. భయంతో ఉన్న సదరు రోగిని వెంటనే ఏఎంసీకి తరలించారు. ఈ తరహా ఘటనలు ఇటీవలే మూడు చోటు చేసుకున్నాయి. అయినా ఆస్పత్రి అధికారులు తగిన శ్రద్ధ చూపలేదు. ఆక్సిజన్ సిలిండర్ పేలిన ఘటన అసలు ఆస్పత్రి అధికారులకే తెలియని పరిస్థితి. విలేకరులు వైద్యుల దృష్టికి తీసుకెళ్లాల్సిన దుస్థితి నెలకొంది.



పేలిన సిలిండర్ ఇదే

ఈటీవీలో ఈనాడు

ఉదయం

05-45: ఆరాధన, 06-30: అన్నదాత, 07-00: ఈటీవీ న్యూస్, 07-30: శుభమస్తు: పనుల్లో ఆటంకాల నివారణకు గణపతిని ఎలా పూజించాలి? రైతులకు లాభాన్నిచ్చే వ్యవసాయ వాస్తు నియమాలు.. 8-30: టాలీవుడ్ టైమ్, 09-00: ఈనాడు సినిమా: లాహిరి లాహిరి లాహిరిలో.. (హరికృష్ణ, భానుప్రియ).

మధ్యాహ్నం

12-00: తెలుగు'రుచి': ఘుమఘుమలు 'రాజ్‌మా ఆనపకాయకుర్మా', మీ చేతి వంట 'సోయాకాజూకర్రీ', 'వెజ్ కోకోనట్ పలావు', జస్ట్ ఎ మినిట్ 'చిక్కుడు గింజల ఛాట్' తయారుచేసే విధానం, ఇంటింటి వంటింటి చిట్కాలు, 01-00: స్టార్ మహిళ (మెగా గేమ్ షో), 02-00: అభిషేకం (డైలీ సీరియల్), 02-30: అత్తారింటికి దారేది (డైలీ సీరియల్), 03-00: సీతమ్మ వాకిట్లో సిరిమల్లె చెట్టు (విధి 2) (డైలీ సీరియల్), 03-30: ఆడదే ఆధారం (డైలీ సీరియల్).

సాయంత్రం

04-00: ఋతుగీతం (డైలీ సీరియల్), 04-30: వసంతం (డైలీ సీరియల్), 05-00: సైసై సయ్యారే (రిపీట్), 06-00: ఒకరికి ఒకరు (డైలీ సీరియల్), 06-30: తేనెమనసులు (డైలీ సీరియల్)

రాత్రి

07-00: సావిత్రి (డైలీ సీరియల్), 07-30: మనసు మమత (డైలీ సీరియల్), 08-00: స్వాతిచినుకులు (డైలీ సీరియల్), 08-30: నా పేరు మీనాక్షి (డైలీ సీరియల్), 09-00: ఈటీవీ న్యూస్, 09-30: ఎక్స్‌ట్రా జబర్దస్త్: 100% కామెడీ షో, 10-30: ఎక్స్‌ట్రా జబర్దస్త్ జల్సాటైం...

ఈటీవీ ప్లస్

ఉదయం 11:00 కిక్ రిపీట్

మధ్యాహ్నం

12:00 జబర్దస్త్ రిమిక్స్
01:00 నేను..తను రిపీట్
01:15 ప్రేమిస్తే చుక్కలు చూపిస్తా రిపీట్
01:30 పటాస్ రిపీట్
02:00 అల్లరే అల్లరి రిపీట్
02:30 సరదాగా కాసేపు రిపీట్
03:00 తారక్ మామా అయ్యోరామా
03:30 పటాస్ పంచెస్

సాయంత్రం

04:30 ఎక్స్‌ప్రెస్ రాజా
05:00 జిల్ జిల్ జిగా
06:00 అమృతం రిపీట్
06:30 ఎక్స్‌ప్రెస్ రాజా

రాత్రి

07:30 తారక్ మామా అయ్యోరామా
08:00 కిర్రాక్ కిడ్స్
09:00 పటాస్
09:30 డీజే
09:45 స్టే..పూలిష్
10:00 ఈ-జంక్షన్ రిపీట్
11:30 ఎక్స్‌ప్రెస్ రాజా రిపీట్

ఈటీవీ లైఫ్

★ మానస – (ఉ.6:00, రా. 11:30)
★ యోగమంత్ర (ఉ.7:00, సా.6:00, రా. 10:30)
★ గెట్‌సెట్‌ఫిట్ (ఉ.7:30, సా.6:30, రా.10:00)
★ అమృతం: తృణ ధాన్యాలు (ఉ.8:00, మ.12:30, రా. 8:00)
★ హెల్దీ & టేస్టీ (ఉ.8:30, మ.01:00, రా.8:30)
★ కౌంట్ యువర్ కేలరీస్ (మ.1:30)
★ జీవనరేఖ చైల్డ్ కేర్: మీ పిల్లలు తక్కువ బరువుతో పుట్టారా ? (ఉ.9:30)
★ హోమియో – మోనోపాజ్ కంటే ముందు నొప్పులు (మ.2:00, రా.7:00)
★ సుఖజీవనం (ఉ.10:00)
★ లైఫ్ ఈజ్ బ్యూటిఫుల్ (మ.2:30, రా.9:30)
★ ఆరోగ్యమస్తు – 1. మీ జుట్టు తీరు - మీ ఆరోగ్య స్థితి, 2. బాడీ పెయిన్స్ రావడానికి కారణాలు - పరిష్కారాలు, 3. మీ పళ్ళు జుంమంటున్నాయా? (ఉ.10:30)
★ ఆరోగ్యమస్తు – 1. పొడిబారిన కళ్ళు - తీసుకోవలసిన జాగ్రత్తలు, 2. మన శరీరం మీద మద్యం ప్రభావం, 3. అల్లం తీసుకోవడం ఎప్పుడు మంచిది కాదు (మ.3:00, రా.9:00)
★ డా. ఈటీవి – అజీర్తి సమస్యలు (ఉ.11:00)
★ డా. ఈటీవి – జనరల్ హెల్త్ (ఉ.11:15)
★ డా. ఈటీవి – శ్వాసకోశ సమస్యలు (మ.3:30, రా. 7:30)
★ డా. ఈటీవి – ఎముక ఆరోగ్యం - కీళ్లవాతం (మ. 3:45, రా. 7:45).

ఈటీవీ సినిమా

ఉదయం: 6-00: టెలీషాపింగ్ , 7-00: సన్‌రైజ్ సినిమా: మోసగాడు, (శోభన్‌బాబు, శ్రీదేవి) 10-00: మార్నింగ్ షో: భలే అబ్బాయిలు (కృష్ణ, కె.ఆర్.విజయ), మధ్యాహ్నం: 1-00: మాట్నీ: ధర్మక్షేత్రం (బాలకృష్ణ, దివ్యభారతి), సాయంత్రం: 4-00: ఈవినింగ్ షో: ముసుగుదొంగ, (సుమన్, భానుప్రియ), రాత్రి: 7-00: ఫస్ట్ షో: పెద్దకొడుకు (శోభన్‌బాబు, కాంచన), 10-00: సెకండ్ షో: 47 రోజులు (చిరంజీవి, జయప్రద).

ఈటీవీ అభిరుచి

ఉ.6.00: బ్రేక్ ఫాస్ట్ షో - కాబూలిచెనా బొరుగుల ఉప్మా & పచ్చిమిర్చి మొక్కజొన్న మఫిన్స్, ఉ.8.00, రా.9.00: బ్రేక్ ఫాస్ట్ షో - కాబూలి శెనగల పుదీనా బ్రౌన్ రైస్ & క్యారెట్ కీన్వా మఫిన్స్, ఉ.8.45: టేస్ట్ ఆఫ్ ఇండియా (కర్ణాటక క్యూసైన్) - మిక్స్‌డ్ వెజ్ సాగూ, ఉ.9.30: సూపర్ భీమ్ - గేమ్ షో, ఉ.11.00: గోరుముద్దలు - మిక్స్‌డ్ దాల్ మిల్లెట్ కిచిడి, ఉ.11.15, రా.8.30: డైట్ మెనూ (మైగ్రేన్ నివారణకు) - మిక్స్‌డ్ గ్రీన్ ఓట్స్ కబాబ్, ఉ.11.30, రా.8:00: గోదావరి నెయ్యి "బాబాయ్ హోటల్" - చెట్టినాడ్ ఎగ్ కర్రీ & చెట్టినాడ్ ఎగ్ దోస, మ.12.00, సా.5.45: టేస్ట్ ఆఫ్ ఇండియా (కర్ణాటక క్యూసైన్) - పంచ్ ఖద్యా, మ.12.15, రా.10.15: మమ్మీస్ కిచెన్ - చిల్లీ చీజ్ ఫ్రైస్, మ.12.30, రా.8.45: సూపర్ చెఫ్ - రైస్ సేమ్యా చికెన్ బిర్యాని, మ.12.45, సా.6.15: ఛాట్స్ & సూప్స్ - స్వీట్ కార్న్ బంగాళదుంప బేల్, మ.1.00, సా.4.30: వావ్ ఏమి రుచి (పార్సీ క్యూసైన్) - పార్సీ కట్‌లెట్ & చికెన్ కోకోనట్ మిల్క్ బనానా ఫ్లవర్, మ.1.30, రా.10.00: చటపట (అత్తమ్మ రుచుల స్పెషల్) ఎండురొయ్యల పొట్లకూర, మ.1.45, రా.7.30: పెరటి రుచులు - ఆయుర్వేదిక పెరటి మొక్కలు - ఇంటి చిట్కాలు, మ.2.15: మటన్‌తో మస్త్ మస్త్ - తలకాయ కూర & షికమ్ పూరీ కబాబ్, మ.2.30, సా.6.00: మంత్రా డిటర్జెంట్ సోప్ "చోటా షెఫ్" - కోకోనట్ ఫింగర్స్, మ.2.45, రా.10.30: కారాలు, పొడులు - వెల్లుల్లి కారం & రాగి తీపి అట్టు పొడి, మ.3.30: మా ఊరి రుచులు - గ్రీన్ చిల్లీ చికెన్ & బ్రెడ్ గులాబ్ జామున్.

ఈటీవీ ఆంధ్రప్రదేశ్ కార్యక్రమాలు

ఉదయం: 05-30 తమసోమా జ్యోతిర్గమయ, 06-00 ఘంటారావం, 06-30 ప్రార్థనా సమయం, 07-00 అంతర్యామి, 07-30 ఈటీవీ 360⁰, 08-30 యువ, 09-00 ఘంటారావం, 09-30 సుఖీభవ, 10-00 ఘంటారావం, 10-30 ఈటీవీ టాకీస్, 11-00 ఘంటారావం, 11-30 ఇదీ సంగతి!, **మధ్యాహ్నం:** 12-00 ఘంటారావం, 12-30 ప్రత్యేక వాణిజ్య కార్యక్రమం, 01-00 ఈటీవీ 360⁰, 02-30 సఖి, 03-00 ఘంటారావం, 03-30 సుఖీభవ: **సాయంత్రం:** 04-00 ఘంటారావం, 04-30 తీర్థయాత్ర: శ్రీ మహాలక్ష్మి ఆలయం, చిట్టినగర్, విజయవాడ, 05-00 ఘంటారావం, 05-30 కమర్షియల్ స్లాట్, 06-00 ఘంటారావం, 06-30 జై కిసాన్, **రాత్రి:** 07-00 ఘంటారావం, 07-30 ఇదీ సంగతి, 08-00 ఈటీవీ 360⁰, 09-00 ప్రతిధ్వని, 09-30 యువ, 10-00 ఘంటారావం, 10-30 బీబీసీ ప్రపంచం, 11-00 ఘంటారావం, 11-30 ఇదీ సంగతి.

ఈటీవీ తెలంగాణ కార్యక్రమాలు

ఉదయం: 05-30 తమసోమా జ్యోతిర్గమయ, 06-00 ఘంటారావం, 06-30 యువ (రి), 07-00 అంతర్యామి, 07-30 ఈటీవీ 360⁰, 08-30 యువ, 09-00 ఘంటారావం, 09-30 ఈటీవీ టాకీస్, 10-00 ఘంటారావం, 10-30 సుఖీభవ, 11-00 ఘంటారావం, 11-30 ఇదీ సంగతి!, **మధ్యాహ్నం:** 12-00 ఘంటారావం, 12-30 కమర్షియల్ స్లాట్, 01-00 ఈటీవీ 360⁰, 02-30 సఖి, 03-00 ఘంటారావం, 03-30 తీర్థయాత్ర: శ్రీ సంతోషిమాతా ఆలయం, సూర్యాపేట, **సాయంత్రం:** 04-00 ఘంటారావం, 04-30 సుఖీభవ: 05-00 ఘంటారావం, 05-30 కమర్షియల్ స్లాట్, 06-00 ఘంటారావం, 06-30 జై కిసాన్, **రాత్రి:** 07-00 ఘంటారావం, 07-30 ఇదీ సంగతి!, 08-00 ఈటీవీ 360⁰, 09-00 ప్రతిధ్వని, 09-30 యువ, 10-00 ఘంటారావం, 10-30 బీబీసీ ప్రపంచం, 11-00 ఘంటారావం, 11-30 ఇదీ సంగతి.

ఏ ఛానల్లో ఏముంది.. 05-01-2018

ఉదయం: 05-30 తిరుప్పావై + గోదాస్తుతి, 06-30 తిరుప్పావై + గోదాస్తుతి + నిత్యపూజలివిగో, 07-00 విష్ణుసహస్రనామస్తోత్రం, 07-30 శ్రీవారి సేవలు - (అభిషేకం), 08-00 శతమానంభవతి, 08-30 లైవ్ డయల్ యువర్ ఈ.ఓ., 09-30 భక్తిగీతమాలిక, 10-00 ఆధ్యాత్మిక విశేషగలు - కన్నడ, 10-30 లైవ్ పద్మావతి అమ్మవారి కల్యాణం - తిరుచానూరు, 11-30 స్పెషల్ న్యూస్ + ఆముక్తమాల్యద, **మధ్యాహ్నం:** 12-00 లైవ్ కళ్యాణోత్సవం, 01-00 ఆధ్యాత్మిక విశేషాలు, 01-30 విష్ణుసహస్రనామామృతం, లైవ్ డోలోత్సవం, 02-00 లైవ్ ఆర్జితబ్రహ్మోత్సవం, 02-30 లైవ్ వసంతోత్సవం, 03-00 లైవ్ శ్రీ పద్మావతి అమ్మవారి అభిషేకం, **సాయంత్రం:** 04-00 శ్రీ లలితా సహస్రనామస్తోత్ర పారాయణం, 04-30 యక్షప్రశ్నలు, 05-00 లైవ్ ఎస్.డి సేవ - తిరుమల + స్పెషల్ న్యూస్ + లైవ్ ఎస్.డి. సేవ తిరుచానూరు, - తిరుచానూరు, 06-00 ఎస్.డి. సేవ - తిరుచానూరు, 06-30 లైవ్ నాదనీరాజనం - తిరుమల, **రాత్రి:** 07-30 లైవ్ ఘంటానాదం +శ్రీనివాస గద్యం + అలివేలుమంగ నామావళి 08-00 లైవ్ అధ్యయనోత్సవాలు, భక్తుల అనుభవాలు, 08-30 మల్లిఖార్జున సుప్రభాతం - శ్రీ చాగంటి, 09-00 ఆలయదర్శనం, 09-30 శివమహాపురాణం - శ్రీ సామవేదం, 10-00 ఆధ్యాత్మిక విశేషాలు.

ఉదయం: 06-00 శ్రీలక్ష్మీ సహస్రం 6-30 శ్రీకనకధారస్తోత్రం, 7-00 అర్చన, 7-30 శ్రీలలితా సహస్రం 08-00 పుణ్యక్షేత్రం, 08-30 జ్యోతిస్వరూపా అయ్యప్ప 9-00 సంపూర్ణ మహాభారతం, 11-00 ధర్మ సందేహాలు, **సాయంత్రం:** 04-30 పుణ్యక్షేత్రం, 05-00 శ్రీకనకధార స్తోత్రం, 05-30 శ్రీలలితాసహస్రం, 6-00 శ్రీ లక్ష్మీసహస్రం, **రాత్రి:** 7-00 భక్తి విశేషాలు 7-30 అమృతకలశం, 8-00 పరిహారం, 8-30 శ్రీమద్భగద్గీత 9-00 త్యాగయ్య (డాక్యుమెంటరీ), 10-00 ధర్మ సందేహాలు, 10-30 భక్తివిశేషాలు, 11.00 గోదామృతం.

ఉదయం: 06-30 ఎంజాయ్ ఎవ్రిడే లైఫ్ 07-00 టెలిషాపింగ్, 07-30 శుభోదయం, 08-30 సినిమా: కొత్తబంగారులోకం, 11-30 వారెవా, **మధ్యాహ్నం:** 12-00 గోల్డ్ రష్, 01-00 బతుకు జట్కా బండి, 02-00 గృహప్రవేశం, 02-30 నా కోడలు బంగారం, 03-00 సూర్యవంశం, 03-30 కల్యాణ వైభోగం, **సాయంత్రం:** 04-00 కొంచెం టచ్‌లో ఉంటే చెప్తా , 05-00 జై కృష్ణా ముకుంద మురారి, 05-30 కుంకుమ భాగ్య, 06-00 పక్కింటి అమ్మాయి, 06-30 పున్నాగ, **రాత్రి:** 07-00 అమెరికా అమ్మాయి, 07-30 ముద్ద మందారం, 08-00 దట్ ఈజ్ మహాలక్ష్మి, 08-30 ఎవరే నువ్వు మోహిని, 09-00 కల్యాణ వైభోగం, 09-30 ముత్యాల ముగ్గు, 10-00 సూర్యవంశం, 10-30 నా కోడలు బంగారం (రిపీట్), 11-00 కొంచెం టచ్‌లో ఉంటే చెప్తా (రిపీట్).

ఉదయం: 06-30 సిల్వర్ స్క్రీన్, 07-00 హరహర మహాదేవ, 08-00 రాశి ఫలాలు దినఫలం, 08-30 జానకి రాముడు, 09-00 సినిమా: ఇంట్లో ఇల్లాలు వంటింట్లో ప్రియురాలు, **మధ్యాహ్నం:** 12-00 కోడలా కోడలా కొడుకు పెళ్లామా, 12-30 అగ్నిసాక్షి (రిపీట్), 01-00 కుంకుమపువ్వు (రిపీట్), 01-30 చూపులు కలిసిన శుభవేళ, 02-00 కార్తీక దీపం (రిపీట్), 02-30 సినిమా: మల్లన్న, **సాయంత్రం:** 06-00 ఉయ్యాలా జంపాలా, 06-30 అగ్నిసాక్షి, **రాత్రి:** 07-00 లక్ష్మీ కల్యాణం, 07-30 కార్తీకదీపం, 08-00 కోయిలమ్మ, 08-30 కుంకుమ పువ్వు, 09-00 సుందరకాండ, 09-30 పవిత్ర బంధం, 10-00 నీలికలువలు, 10-30 సినిమా: సింహా.

ఉదయం: 06-30 శ్రీ కరుణామయి దేవీ వైభవం, 07-00 అమృతకలశం, 07-30 అనుగ్రహం, 08-00 శ్రీ ఆంజనేయం, 08-30 సినిమా: పెళ్లైన కొత్తలో, 11-30 నాగిని, **మధ్యాహ్నం:** 12-00 నువ్వు నాకు నచ్చావ్ 12-30 చక్రవాకం, 01-00 నందిని, 01-30 మొగలి రేకులు, 02-00 అమ్మ నేను ఓ అమ్మాయి, 02-30 శిరిడి సాయి, 03-00 సినిమా: శంఖం, **సాయంత్రం:** 06-00 ప్రతిఘటన, 06-30 శ్రీ ఆంజనేయం, **రాత్రి:** 07-00 నాతిచరామి, 07-30 జై జై వినాయక, 08-00 మాతృదేవోభవ, 08-30 శనీశ్వరుని దివ్యచరిత్ర, 09-00 నందిని, 09-30 బోల్ బేబీ బోల్ - సీజన్ 10, 10-30 సినిమా: పెళ్లైన కొత్తలో...

ఉదయం: 06-00 ది నెక్ట్ గన్ : ఫ్రం ద ఫైల్స్ ఆఫ్ పోలీస్ స్క్వాడ్, 07-01 ఇన్‌సెప్షన్, 09-42 జాక్ ద జయంట్ స్లేయర్, 11-46 మడగాస్కర్, **మధ్యాహ్నం:** 01-14 బ్యాట్‌మేన్ × సూపర్‌మేన్ : డాన్ ఆఫ్ జస్టిస్, 03-58 ది అకౌంటెంట్, **సాయంత్రం:** 06-11 ట్రాన్స్‌ఫార్మర్స్ : డార్క్ ఆఫ్ ది మూన్, **రాత్రి:** 09-00 స్మాఫ్స్: ది గ్రేటర్ గుడ్.

నువ్వు సాగులో జాగ్రత్తలు



వర్షాభావ పరిస్థితుల్లో తక్కువ నీటి తడులతో సాగుచేసే పంటలలో నువ్వు పంట ప్రధానమైనది. జనవరి, ఫిబ్రవరి మాసాల్లో నువ్వులను విత్తుకుని తక్కువ సమయంలో, తక్కువ ఖర్చుతో అధిక రాబడి పొందేందుకు ఈ పంట ఉపకరిస్తుంది. కాగా నువ్వులో వచ్చే తెగుళ్లు, వాటి నివారణ పద్ధతులను పశ్చిమగోదావరి జిల్లా వ్యవసాయ అధికారులు వివరించారు.

ఆకుమచ్చ తెగులు: గాలిలో తేమ ఎక్కువగా ఉన్నప్పుడు ఈ తెగులు వ్యాపిస్తుంది. ఆల్టర్నేరియా అనే శిలీంధ్రం వల్ల ఆకులు, కాండం, కాయల మీద గోధుమరంగు మచ్చలు కనిపిస్తాయి. ముదురు గోధుమరంగు చిన్న చిన్న వలయాకారపు మచ్చలు ఆకంతా వ్యాపించి ఆకులు ఎండి రాలిపోతాయి. దీని నివారణకు కిలో విత్తనాలకు 2 గ్రాములు కార్బండిజంతో విత్తనశుద్ధి చేసుకుని విత్తుకోవాలి. పంట దశలో ఈ తెగులు కనిపిస్తే 2.5 గ్రా. మాంకోజెబ్ లేదా ఒక గ్రాము కార్బండిజమ్‌ను లీటరు నీటిలో కలిపి 15 రోజుల వ్యవధిలో 2, 3 సార్లు పిచికారీ చేయాలి.

బూడిద తెగులు: ఈ తెగులు ఎరిసెఫె అనే శిలీంధ్రం వల్ల సోకుతుంది. లేత ఆకులపై తెల్లటి బూడిదతో కూడిన మచ్చలు ఏర్పడతాయి. తెగులు ఆశించిన ఆకులు పసుపు వర్ణంలోకి మారి రాలిపోతాయి. నివారణకు లీటరు నీటికి 3 గ్రాములు నీటిలో కరిగే గంధకం పొడి కలిపి ఆకులు తడిచేటట్లు పిచికారీ చేయాలి.

వెర్రి తెగులు: ఈ తెగులు పూత సమయంలో ఆశిస్తుంది. ఇది సోకిన మొక్కల్లో ఆకులు చిన్నవిగా మారి పువ్వులోని భాగాలన్నీ ఆకుల మాదిరిగా రాలిపోయి కాయలు ఏర్పడవు. దీపపు పురుగుల ద్వారా ఒక మొక్క నుంచి ఇంకొక మొక్కకు వ్యాధి వ్యాప్తి చెందుతుంది. నివారణకు తెగులును తట్టుకునే చందన, హిమ రకాలను ఎంపిక చేసుకోవాలి. తెగులు సోకిన మొక్కలను పీకి తగులబెట్టాలి. దీపపు పురుగుల నివారణకు లీటరు నీటికి 2 మి.లీ. డైమిథోయేట్ కలిపి పిచికారీ చేయాలి.

వేరు, కాండంకుళ్లు తెగులు: ఇది సోకిన మొక్కలు పసుపు వర్ణంలోకి మారి కాండం మీద నల్లని చారలు కనిపిస్తాయి. వేర్లు కూడా కుళ్లిపోతాయి. ఈ తెగులును కలుగచేసే శిలీంధ్రం భూమిలో, విత్తనాలు, పంట అవశేషాలపై జీవిస్తుంది. నివారణకు పంటమార్పిడి పద్ధతి పాటించాలి. పంట అవశేషాలను కాల్చివేయాలి. కిలో విత్తనాలకు 3 గ్రా. కాప్టాన్, 3 గ్రా. మాంకోజెబ్ కలిపి శుద్ధిచేసి విత్తుకోవాలి. లీటరు నీటికి ఒక గ్రాము కార్బండిజమ్ కలిపి మొక్కల మొదళ్లు తడపాలి.

– న్యూస్‌టుడే, జీలుగుమిల్లి

ఆరుతడి పైర్లలో సూక్ష్మనీటి పద్ధతులు

ప్రస్తుత పరిస్థితుల్లో నీటిని పొదుపుగా వాడుకోవాల్సిన అవసరం ఉంది. వ్యవసాయంలో నీటి వినియోగ సామర్థ్యం తక్కువగా ఉంది. వినియోగించే నీటిలో దాదాపు 60-70 శాతం వృథా అవుతోంది. దీనివల్ల సాగునీటి వృథా, భూసారం క్షీణించడం వంటి సమస్యలు వస్తున్నాయి. అధునాతన నీటి పారుదల విధానాలైన బిందు, తుంపర్ల సేద్య పద్ధతుల వల్ల దిగుబడి పెరగడమే గాకుండా, నీటి వినియోగ సామర్థ్యం పెరుగుతుంది.

నీరు ఎక్కువగా లభ్యమయ్యే చోట ఆ నీటిని విచ్చలవిడిగా వాడటం వల్ల సారవంతమైన భూములెన్నో చౌడు భూములుగా మారి పంటల దిగుబడి క్రమేణా తగ్గుతున్నాయి. నేలలు కోతకు గురవుతున్నాయి. ఆశించిన దిగుబడులు సాధించాలంటే నీటిని సమర్థవంతంగా వినియోగించుకోవాలి. నీటిని పెట్టిన మొదటి మూడు రోజులలో నేల లోపలి పొరలు నీటితో నిండిపోయి పొరలలో ఉన్న గాలి బయటికి వెళ్ళిపోతుంది. దీనివల్ల నేలలో సామర్థ్యం కంటే ఎక్కువ నీరు నిల్వ ఉంటుంది. మొక్కలకు కావల్సిన పోషకాలు భూమిలో ఉన్నా మొక్కలకు లభ్యం కావు. దీని వల్ల మొక్కల పెరుగుదల ఆగిపోతుంది. కానీ బిందు సేద్య పద్ధతిలో నీటిని ప్లాస్టిక్ గొట్టాలు, ఇతర పరికరాలతో బిందువుల రూపంలో అన్ని మొక్కలకు సమానంగా మొక్క వేరు భాగానికి కావల్సినంత అందించవచ్చు. ఈ విధానం ద్వారా భూమిలో ఎప్పుడు తేమ మాత్రమే ఉండేలా చేయవచ్చు.

★ మొక్కజొన్న జల్లు వేసేటప్పుడు, పాలు పోసుకునేటప్పుడు, గింజ గట్టిపడే సమయంలో నీరు చాలా అవసరం. వేసవిలో 7-10 రోజులకొకసారి నీటితడి ఇవ్వాలి.
★ వేరుశనగలో విత్తిన వెంటనే ఒకతడి, తరువాత 20-25 రోజులకు, ఆ తరువాత పూత, కాత దశలో ప్రతి 10-15 రోజులకు ఒక తడి ఇవ్వాలి.
★ పొద్దుతిరుగుడులో ఆశించిన దిగుబడులు సాధించాలంటే మొగ్గతొడిగే దశ, పువ్వు వికసించే దశ, గింజ కట్టే దశలలో నీటితడి అవసరం.
★ శనగ పంటలో విత్తిన 20-25 రోజులలో తడి ఇవ్వాలి. శనగ పంట ఎక్కువ నీటిని తట్టుకోదు. అవసరాన్ని బట్టి నీటి తడులు అందించాలి.

హైకోర్టు ఉత్తర్వులతో హంద్రీనీవా పనులు ప్రారంభం


కోర్టు ఉత్తర్వులను రైతులకు చూపుతున్న శిక్షణ కలెక్టర్ వెంకటేశ్వర్లు, ఆర్డీవో రామమోహన్


పనులు చేయకుండా యంత్రాలను అడ్డుకుంటున్న మహిళలు, రైతులు

పుట్టపర్తి, న్యూస్‌టుడే: పుట్టపర్తి సమీపంలోని హంద్రీనీవా 9ప్యాకేజీ పనులు హైకోర్టు ఉత్తర్వులతో గురువారం ప్రారంభమయ్యాయి. హంద్రీనీవా 9 ప్యాకేజీ భూముల ధరల వ్యవహారం హైకోర్టు పరిధిలో ఉంది. పుట్టపర్తి సమీపంలోని 9 ప్యాకేజీలో 14.80 ఎకరాలు భూమికి మార్కెట్ ధరకు అనుగుణంగా పరిహారం ఇప్పించాలని రైతులు హైకోర్టును ఆశ్రయించారు. రెండేళ్లుగా ఈ వ్యవహారం సాగుతోంది. గురువారం ఉదయం 9 ప్యాకేజీలో పెండింగ్‌లో ఉన్న 500 మీటర్ల కాలువ పనులు పోలీసులు, రైతుల వాగ్వాదం మధ్య ప్రారంభమయ్యాయి. న్యాయమైన పరిహారం అందించాలని కోరితే, ప్రభుత్వం ఇలా చేయడం తగదని ముమ్మనేని వెంకట్రామయ్య, ముమ్మనేని నారాయణస్వామి, రాంమోహన్, వెంకటనారాయణ, అమ్మినేని వివేకా, అమరేంద్ర ఆందోళన వ్యక్తం చేశారు. ఎన్నో ఏళ్లుగా పొలాలను సాగు చేసుకుంటూ జీవనం సాగిస్తున్నామని, న్యాయమైన పరిహారం అందించాలని రైతులు యంత్రాలను అడ్డుకున్నారు. శిక్షణ కలెక్టర్ వెంకటేశ్వర్లు, ఆర్డీవో రామోహన్, తహసీల్దార్ సత్యనారాయణ, హంద్రీనీవా ఈఈ శ్రీనివాసులు, డీఎస్పీ రామవర్మ చేరుకొని హంద్రీనీవా కాలువ పనులు చేపట్టేందుకు కోర్టు ఉత్తర్వులు జారీ చేసిందని నిరసనకారులకు తెలిపారు. కోర్టు ఉత్తర్వుల మేరకు పనులు చేపడుతున్నామని, రైతులకు ఎలాంటి అన్యాయం జరగదని, న్యాయమైన పరిహారం కోర్టును ఆశ్రయించే వెసులుబాటు కల్పించిందని అధికారులు తెలిపారు. అధికారులు, పోలీసుల సహకారంతో పనులు చేపట్టేందుకు వెళ్లగా రైతులు యంత్రాలను అడ్డుకున్నారు. పోలీసులు ఆందోళనకారులను తరలించి పనులు చేపట్టారు. కార్యక్రమంలో హంద్రీనీవా డీఈ విశ్వనాథ్, సీఐలు ఆంజనేయులు, రవికుమార్, ఏఈ కైలాస్‌కుమార్ పోలీసు సిబ్బంది, రెవెన్యూ అధికారులు పాల్గొన్నారు.

నెల్లూరులో జనవరి 21న బలిజ వధూవరుల వివాహ పరిచయ వేదిక

బలిజ కమ్యూనిటీలో సంబంధాలను అన్వేషించే వారి సౌకర్యార్థం ఈనాడు పెళ్లిపందిరి.నెట్ నెల్లూరులో జనవరి 21న పరిచయవేదిక నిర్వహిస్తుంది.

వేదిక : డి.ఎస్.ఆర్. కళ్యాణ మండపం, డోర్ నెం. 23-1219, శోధన్‌నగర్, ఆర్.టి.సి.బస్టాండ్ దగ్గర, నెల్లూరు.

ప్రత్యేకతలివీ.....

వధువు/వరుడు, వారి ఇష్టాఇష్టాల పరిచయం. వధువు/వరుడు వివరాలతో కూడిన సి.డి. ఇవ్వబడును.

ఈనాడు పెళ్లిపందిరి.నెట్ వెబ్‌సైట్ ద్వారా మీకు నచ్చిన 10 'కాంటాక్ట్ నంబర్స్' 30 రోజుల కాల వ్యవధిలో పూర్తి ఉచితంగా చూసుకునే అవకాశం.

ఈనాడు పెళ్లిపందిరి.నెట్ ద్వారా వివాహం జరిగిన వారు 3 నెలల లోపు తెలియచేస్తే రూ 2500/- విలువ గల గిఫ్ట్ కూపన్ అందచేయబడును.

పరిచయవేదికకు వచ్చిన వధువు/వరుడుతో కలిపి ముగ్గురు వ్యక్తులకు భోజన వసతి.రిజిస్ట్రేషన్ల సంఖ్య పరిమితం. రుసుము రూ 2100/-.

ముందుగా రిజిస్ట్రేషన్ చేసుకొనేవారికి 10% తగ్గింపు కలదు. 10% తగ్గింపు పొందుటకు ఆఖరు తేది : 11-01-2018.

మరిన్ని వివరాలకు సంప్రదించండి : ఈనాడు ఆఫీస్, 24-384ఎ, 2వ అంతస్తు, పి.ఎస్.ఆర్.ఎన్‌క్లేవ్, సరస్వతినగర్, నెల్లూరు. ఫోన్స్ : 8897511778, 9704671294, అనంతపురం : 8008551134, కర్నూలు : 8008551140, తిరుపతి : 9121178837, కడప : 8008551141, ఒంగోలు : 9121178837.

రిజిస్ట్రేషన్ కొరకు వచ్చునపుడు వధువు/వరుడుల ID Proof (Aadhar / Passport / Driving Licence / Voter ID) & Photo వెంట తీసుకురాగలరు లేదా మా WhatsApp Number : 8008550212 కు పంపగలరు. రిజిస్ట్రేషన్స్ ఆన్‌లైన్‌లో కూడా చేసుకోవచ్చు. www.eenadupelli-pandiri.net

ఖాతాదారుల్లో అలజడి

డిపాజిట్ సొమ్ము వెనక్కి

అనంతపురం (అరవిందనగర్), న్యూస్‌టుడే: డిపాజిట్ల బీమా పరిమితిపై కేంద్రం తీసుకురానున్న ఎఫ్ఆర్‌డీఐ (ఫైనాన్షియల్ రిజల్యూషన్ అండ్ డిపాజిట్ ఇన్సూరెన్స్) బిల్లు ఖాతాదారుల గుండెల్లో అలజడి రేపింది. ఈ బిల్లు చర్చనీయాంశంగా మారింది. సామాన్య, మధ్య తరగతి కుటుంబాలకు చెందిన ఖాతాదారులు బ్యాంకుల్లో దాచుకున్న డబ్బును తీసేసుకుంటున్నారు. పది రోజులుగా ఖాతాదారులు రూ.500 కోట్లు డ్రా చేసి ఉంటారని బ్యాంకర్ల అంచనా. జిల్లాలో ఎస్‌బీఐ, సిండికేట్ బ్యాంకు, ఆంధ్రప్రగతి గ్రామీణ బ్యాంకు తదితర ప్రభుత్వ రంగ బ్యాంకుల్లో సుమారుగా రూ.25 వేల కోట్ల డిపాజిట్లు, లావాదేవీలు జరుగుతున్నాయి. డిపాజిట్లు తీసుకోవడానికి వస్తున్న ఖాతాదారులకు నచ్చచెబుతున్నా లాభం లేదంటూ బ్యాంకర్లు ఆందోళన చెందుతున్నారు. తాజాగా ప్రభుత్వ రంగ బ్యాంకులకు ఈ బిల్లు వర్తించబోమని ఆర్థిక మంత్రి అరుణ్ జైట్లీ రాజ్యసభలో ప్రకటించారు. ఈ విషయంపై ప్రచారం చేసేందుకు బ్యాంకర్ల ప్రయత్నాలు మొదలెట్టారు. ఖాతాదారుల సమావేశాలు నిర్వహించి అవగాహన కల్పించేందుకు ఏర్పాట్లు చేస్తున్నారు.

వదంతులు నమ్మవద్దు: జయసింహారెడ్డి, ఏపీజీబీ ఆర్ఎం

డిపాజిటర్లకు ఎలాంటి ఇబ్బంది లేదు. వదంతులు నమ్మవద్దు. ప్రపంచ బ్యాంకు, నాబార్డు సంస్థల పర్యవేక్షణలో ప్రభుత్వ రంగ బ్యాంకులు పని చేస్తున్నాయి. ఎఫ్ఆర్‌డీఐ బిల్లుపై గ్రామీణుల్లో నెలకొన్న అపోహలను తొలగించడానికి ఖాతాదారులతో సమావేశాలు నిర్వహిస్తాం. అవగాహన కల్పిస్తాం.

డీలరుపై కేసు


అనంతపురం (అరవిందనగర్), న్యూస్‌టుడే: పెనుకొండ మండలం మునకమడుగు గ్రామంలో 23వ నంబరు దుకాణం డీలరు తక్కువ తూకంతో బియ్యం ఇస్తున్నారని ప్రశ్నించినందుకు దాడి చేశారని, చర్యలు తీసుకోవాలని గ్రామస్థుడు రాష్ట్ర వినియోగదారుల రక్షణ మండలి గురువారం తమకు ఫిర్యాదు చేసినట్లు తూనిక, కొలతల శాఖ తనిఖీ అధికారి శంకర్ తెలిపారు. దీంతో గ్రామానికి వెళ్లి చౌక దుకాణంలో తనిఖీ చేశామన్నారు. తక్కువ తూకం కలిగిన 5, 2, కిలో తూనిక రాళ్లను స్వాధీనం చేసుకున్నట్లు ఆయన పేర్కొన్నారు. అలాగే కొత్తచెరువు, పెనుకొండ, బుక్కపట్నం గ్రామాల్లోని చౌక దుకాణాల్లో డీలర్లు ఈపోస్ యంత్రాలను వినియోగించకుండా త్రాసులను వాడుతున్నారని, గుర్తించి నాలుగు కేసులు నమోదు చేశామని ఆయన తెలిపారు.


మాట్లాడుతున్న రామకృష్ణ

ప్రజాసమస్యలపై ఉద్యమం ఉద్ధృతం

ధర్మవరం గేట్‌రోడ్డు (గుంతకల్లు), న్యూస్‌టుడే : ప్రజా, రైతు సమస్యలపై ఇక నుంచి ఉద్యమాన్ని ఉద్ధృతం చేస్తామని సీపీఐ రాష్ట్ర కార్యదర్శి రామకృష్ణ పేర్కొన్నారు. ఆయన గురువారం గుంతకల్లుకు వచ్చిన సందర్భంగా పార్టీ కార్యాలయంలో మాట్లాడారు. ఏప్రిల్ 7 నుంచి మూడు రోజుల పాటు రాష్ట్ర మహాసభలు జరుగుతాయన్నారు. ప్రారంభం రోజున పెద్ద ప్రదర్శనను నిర్వహించనున్నట్లు చెప్పారు. మోదీ పాలనలో మైనార్టీలు, దళితులపై దాడులు ఎక్కువగా జరుగుతున్నాయని తెలిపారు. ముఖ్యమంత్రి రాష్ట్రంలో జోరుగా అభివృద్ధి జరుగుతోందని చెబుతున్నారని, ఎక్కడ అభివృద్ధి జరిగిందో అర్థం కావడం లేదని విమర్శించారు. రాష్ట్రంలో క్షయవ్యాధి కారణంగా వేలాదిమంది చనిపోతుంటే ప్రభుత్వం ఏంచేస్తోందని ప్రశ్నించారు. భవిష్యత్తులో మరణాలు జరగకుండా ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని కోరారు. 2018ని పోరాటాల సంవత్సరంగా నిర్ణయించామని పేర్కొన్నారు. రాగులపాడు వద్ద తూమును ఏర్పాటు చేసి గుంతకల్లు నియోజకవర్గంలోని చెరువులు, కుంటలకు నీటిని అందించడానికి ఉద్దేశించిన రూ.42 కోట్ల పథకానికి ప్రభుత్వం వెంటనే నిధులు విడుదల చేయాలని కోరారు. సమావేశంలో సీపీఐ కర్నూలు జిల్లా కార్యదర్శి భీమలింగయ్య, గుంతకల్లు నాయకులు గోవిందు, వీరభద్రస్వామి, అబ్దుల్ వాహబ్, మహేష్, మహమ్మద్ గౌస్ తదితరులు పాల్గొన్నారు.

ప్రభుత్వ పథకాలు అందడం లేదని ఆత్మహత్యాయత్నం


అనంతపురంలో చికిత్స పొందుతున్న సత్యనారాయణ

క్రిష్టాపురం(బుక్కపట్నం), న్యూస్‌టుడే ప్రభుత్వ పథకాలు అందడం లేదని ఓ వ్యక్తి మనస్థాపంతో ఆత్మహత్యాయత్నానికి పాల్పడ్డాడు. స్థానిక నాయకులు పథకాలు పొందనీయకుండా అడ్డుకుంటున్నారని, ప్రశ్నిస్తే తనకు జరిగిన అన్యాయాన్ని సోషల్ మీడియాలో పెట్టి ఈ అఘాయిత్యానికి ఒడిగట్టాడు. బాధిత కుటుంబ సభ్యుల తెలిపిన మేరకు వివరాలు.. మండలంలోని క్రిష్టాపురం గ్రామానికి చెందిన సత్యనారాయణ తల్లి లక్ష్మీదేవమ్మకు గత ప్రభుత్వంలో వృద్ధాప్య పింఛను అందేది. తెదేపా ప్రభుత్వం రూ.వెయ్యి పింఛను చేసిన తర్వాత కొన్ని కారణాలతో ఆమె పింఛనును నాయకులే తొలగించారు. ఎందుకు తొలగించారని ప్రశ్నించగా సాంకేతిక కారణాలతో తొలగించినట్లు నాయకులు తెలిపారు. ఆరు నెలల తర్వాత ఆమె పింఛనును పునరుద్ధరించారు. సత్యనారాయణ భార్య మృతి చెందగా కూతురు, కొడుకు ఉన్నారు. గ్రామంలో ఉపాధి దొరకక అనంతపురంలో చిన్నపాటి పనులు చేసుకుంటూ జీవనం సాగిస్తున్నారు. చౌక దుకాణం కోసం విన్నవించినా అందించలేదు. క్షేత్రసహాయకుని కోసం దరఖాస్తు చేసుకోగా తిరస్కరించారు. ప్రస్తుతం ఉండటానికి ఇల్లు లేదని ఎన్టీఆర్ గృహం మంజూరు చేయమని విన్నవించగా మంజూరు చేయలేదు. దీంతో మనస్థాపం చెందిన ఆయన తనకు అన్యాయం జరిగిందని సామాజిక మాధ్యమం(సోషల్ మీడియా)లో పేర్కొన్నారు. క్రిష్టాపురం పంచాయతీకి చెందిన ఇద్దరు తెదేపా నాయకులు బెదిరింపులకు గురిచేయడంతో పాటు తన కుటుంబ సభ్యులను ఏమైనా చేస్తారని మనస్థాపంతో సత్యనారాయణ బుధవారం రాత్రి ఆత్మహత్యాయత్నానికి పాల్పడ్డారని కుటుంబ సభ్యులు ఆరోపించారు. ప్రస్తుతం అతను అనంతపురంలోని ఓ ప్రైవేటు ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నాడు. ఈ విషయంపై ఎటువంటి ఫిర్యాదు అందలేదని బుక్కపట్నం ఎస్‌ఐ వెంకటేశ్వర్లు తెలిపారు.

అటెండర్ అనుమానాస్పద మృతి


రెడ్డి బాషా మృతదేహం

అనంత నేరవార్తలు, న్యూస్‌టుడే: సంయుక్త కలెక్టర్ (జేసీ) కార్యాలయంలో ఆఫీసు సబార్డినేట్(అటెండర్)గా పని చేస్తున్న దూదేకుల రెడ్డి బాషా(36) అనుమానాస్పదస్థితిలో మృతి చెందాడు. స్థానికులు సమాచారం ఇవ్వడంతో నగర డీఎస్పీ వెంకట్రావు, నాలుగో పట్టణ ఎస్సై శేఖర్ ఘటనా స్థలానికి చేరుకుని మృతదేహాన్ని పరిశీలించారు. మృతదేహాన్ని శవపరీక్షల కోసం ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. రెడ్డి బాషా రుద్రంపేటలో నివాసం ఉంటున్నాడు. బుధవారం భార్య, పిల్లలు మదనపల్లెకు వెళ్లారు. దీంతో గురువారం బాషా మాత్రమే ఉన్నాడు. రాత్రి 10 గంటల సమయంలో ఇంటి వద్ద మెట్ల సమీపంలో కింద పడి ఉన్నాడు. స్థానికులు గమనించి పోలీసులకు సమాచారం అందజేశారు. దీంతో పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని పరిశీలించారు. మెట్లపై నుంచి కింద పడటంతోనే ముక్కుకు బలమైన గాయమై చనిపోయాడా? లేక ఎవరైనా దాడి చేశారా? అన్న కోణంలో పోలీసులు ఆరా తీస్తున్నారు. కుటుంబ సభ్యులకు సమాచారం అందజేశారు. శవ పరీక్షల నివేదిక ఆధారంగా కేసు దర్యాప్తు చేపడతామని పోలీసులు పేర్కొన్నారు.

గిరిజన హక్కులకు భంగం


మాట్లాడుతున్న శంకర్‌నాయక్

మారుతీనగర్(అనంతపురం): గిరిజనుల హక్కులను ప్రభుత్వం కాలరాస్తోందని గిరిజన ప్రజా సమాఖ్య జాతీయ అధ్యక్షుడు శంకర్‌నాయక్ ఆవేదన వ్యక్తం చేశారు. సమాఖ్య రాష్ట్ర అధ్యక్షుడు మల్లికార్జుననాయక్ ఆధ్వర్యంలో గురువారం బాలాజీ రెసిడెన్సీలో సమావేశం నిర్వహించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్రంలో గిరిజనులకు ప్రభుత్వం అన్యాయం చేస్తోందని మండిపడ్డారు. ఎన్నికల హామీలు అమలు చేసి, పెరిగిన జనాభాకు అనుగుణంగా అభివృద్ధి చేయాలన్నారు. సబ్‌ప్లాన్ నిధులను గిరిజన తండాల అభివృద్ధికి మాత్రమే ఖర్చు చేయాలన్నారు. కేబినెట్‌లో గిరిజనులకు మంత్రి పదవి కేటాయించాలని డిమాండ్ చేశారు. అమలుకాని హామీలతో బోయ వాల్మీకులు, గిరిజనుల మధ్య చిచ్చు పెట్టేందుకు ప్రయత్నిస్తున్నారని ఆరోపించారు. అన్ని గిరిజన సంఘాలతో కలిసి ఈనెల 27న ఆర్ట్స్ కళాశాల మైదానంలో గిరిజన శంఖారావం నిర్వహిస్తున్నట్లు ఆయన వెల్లడించారు. ఈ కార్యక్రమంలో గిరిజన రిజర్వేషన్ పరిరక్షణ సమితి కన్వీనర్ కృష్ణానాయక్, రవికుమార్ నాయక్, సుధాకర్‌నాయక్, కేశవనాయక్, వెంకటేష్ నాయక్ తదితరులు పాల్గొన్నారు

JUNIOR INTER

Chemistry

States of Matter, Stoichiometry, Thermodynamics, Chemical Equilibrium and Acids - Bases

2 Marks Questions

Q: Calculate Kinetic energy (in SI units) of 4 g of methane at –73°C.

A: $K.E = \frac{3}{2}\ nTR$

$= \frac{3}{2} \times \frac{4}{16} \times (-73 + 273) \times 8.314$

$= 1.5 \times 0.25 \times 200 \times 8.314$

$= 623.6$ J

Q: Calculate Kinetic energy of 5 moles of N_2 at 27°C.

A: $K.E. = \frac{3}{2} nTR = \frac{3}{2} \times 5 \times (27 + 273) \times 8.314$

$= 1.5 \times 5 \times 300 \times 8.314 = 18706.5$ J

Q: Which of the gases diffuses faster among N_2, O_2 and CH_4? Why?

A: At constant P & T, the rate of diffusion of a gas is inversely proportional to its molecular mass. CH_4 diffuses faster as it has least molecular mass (16 g/ mole).

Q: Calculate RMS speed, most probable speed of CO_2 gas at 27°C.

A: $U_{rms} = \sqrt{\frac{3RT}{M}}$

$= \sqrt{\frac{\frac{3 \times 8.314 \times (27 + 273)}{44}}{1000}}$

$= 4.42 \times 10^2$ m/sec

$U_{mp} = 0.8166 \times U_{rms} = 0.8166 \times 4.42 \times 10^2$

$= 3.36 \times 10^2$ m/sec

Q: State Dalton's law of partial pressures.

A: At constant temperature and volume, the total Pressure exerted by the mixture of non reactive gases is equal to sum of partial pressures of component gases (P_1, P_2)

$P_{total} = P_1 + P_2$

Q: What are standard ambient temperature and pressure (S.A.T.P) conditions?

A: 298.15 K temperature & 1 bar Pressure.

Q: Give the ratio of most probable (M.P), Average (AV) and R.M.S speeds of gas molecules.

A: $U_{M.P} : U_{AV} : U_{R.M.S}$

$= \sqrt{\frac{2RT}{M}} : \sqrt{\frac{8RT}{M}} : \sqrt{\frac{3RT}{M}}$

$= 1.000 : 1.128 : 1.224$

Q: What is critical temperature? Give its value for CO_2.

A: The temperature above which any gas can not be liquified by applying any pressure.

T_C of CO_2 = 30.98°C

Q: What is Surface tension? Give its units in SI System.

A: The downward force acting per unit length perpendicular to the line drawn on the surface of liquid. Units : Nm^{-1}

Q: What is coefficient of viscosity? Give its units in SI system.

A: The Force, when velocity gradient $\left(\frac{du}{dz}\right)$ is unity and the area of contact is unit area (A). Units: NS m^{-2}

$F = n.A.\frac{du}{dz}$

Q: What is "Compressibility factor"?

A: The ratio of actual molar volume of gas to molar volume of an ideal gas. For ideal gas

One can expect 3 to 5 VSAQs from these 4 lessons in inter exams and 5 questions in competitive exams. Inorder to cover all the basics, one must go through all Chapter and VSAQs along with solved problems. List out all important formulas at one place and be perfect with logarithms & square root based calculations for excellent score.

ప్రతిభ

What is 'Compressibility factor'?

Z = 1. $\qquad Z = \frac{PV}{nTR}$

Q: What is "Boyle's temperature"?

A: The temperature at which a real gas obeys ideal gas equation over appreciable range of pressure.

Q: Give Vander Waals equation of state.

A: $\left(P + a\frac{n^2}{v^2}\right)(V - nb) = nTR$

a, b = Vander Waals constants

n = no. of moles, P = pressure, V = Volume,

T = absolute temp., R = Universal gas constant

Q: What is "disproportionation reaction"? Give 1 example.

A: The redox reaction in which an element undergoes oxidation as well as reduction.

$2\ H_2O_2 \rightarrow 2\ H_2O + O_2$

Q: State the "Law of multiple proportions".

A: When 2 elements combine to form 2 or more compounds, then the mass of one element that combines with a fixed mass of other element in the ratio of whole number.

eg. CO & CO_2

Q: Give 2 redox reactions related to environment.

A: ★ Use of liquid H_2 as fuel

★ Development of OZONE hole by CFCs.

Q: What do you mean by "Significant figures"?

A: Meaningful digits which are known with certainity. Eg: 4.007 has 4 significant figures.

Q: Calculate the no. of moles present in

a) 540 g. of glucose b) 200 g. of $CaCO_3$

A: (a) $n_{glucose} = \frac{mass}{g.m.mass} = \frac{540}{180} = 3$ moles

(b) $n_{CaCO_3} = \frac{mass}{g.m.mass} = \frac{200}{100} = 2$ moles

Q: The empirical formula (E.F.) of a compound is CH_2O. Its molecular weight is 90. Calculate the molecular formula of the compound.

A: E.F. = CH_2O

E.F.Wt. = 12 + 2(1) + 16 = 30

$n = \frac{M.F.Wt.}{E.F.Wt.} = \frac{90}{30} = 3$

M.F. = $(E.F.)_n = (CH_2O)_3 = C_3H_6O_3$

Q: Assign oxidation number of underlined elements

a) $\underline{Cr}_2O_7^{-2}$ b) $Ca\underline{O_2}$ C) $\underline{O}F_2$ d) $K_2\underline{Mn}O_4$

A: a) $\underline{Cr}_2O_7^{-2}$

2x + 7 (–2) = –2

∴ x = 6

b) $Ca\underline{O_2}$

+ 2 + 2x = 0

∴ x = –1

(c) $\underline{O}F_2$

x + 2 (–1) = 0

x = +2

d) $K_2\underline{Mn}O_4$

2 (+1) + x

+ 4 (–2) = 0

∴ x = +6

Q: Calculate normality of H_2SO_4 solution if 50 ml of it completely neutralises 250 ml of 0.1 N $Ba(OH)_2$ solutions.

A: $V_1N_1 = V_2\ N_2$

$N_1 = \frac{V_2\ N_2}{V_1} = \frac{250 \times 0.1}{50}$

= 0.5 N



Q: Calculate the volume of 0.1 M $KMnO_4$ required to react with 100 ml of 0.1 M $H_2C_2O_4.2H_2O$ solution in presence of H_2SO_4?

A: 2 Moles of $KMnO_4$

= 5 Moles of $H_2C_2O_4.2H_2O$

$\frac{V_1M_1}{n_1} = \frac{V_2M_2}{n_2}$

$V_1 = \frac{V_2M_2n_1}{n_2M_1} = \frac{100 \times 0.1 \times 2}{5 \times 0.1} = 40$ ml

Q: What is the sign conversion of a) work done on the system and b) work done by the system?

A: a) work done on the system = +Ve

b) work done by the system = –Ve

Q: What are "intensive" and "extensive" properties?

A: **Intensive property:** The property of a system which depends upon the total amount of the material. eg: Mass, Volume

Extensive property: The property of a system which doesn't depend upon the total amount of material. eg: Density, Viscosity

Q: The equilibrium constant for a reaction is 10. (T = 300 K). What will be the value of Δ G°?

A: Δ G° = –2.303 RTlog K_c

= –2.303 × 8.314 × 300 × log 10

= –2.303 × 8.314 × 300 × 1 = –5.744 K.J

Q: State 3rd law of thermodynamics.

A: The entropy of a pure and perfect crystal is zero at absolute zero temperature.

$\lim_{T \to 0} S = 0$

Q: Define "Enthalpy".

A: The total heat content of a system at constant pressure & temperature.

Q: Define "Entropy", "Standard molar entropy".

A: **Entropy:** The degree of disorderness of molecules of the system.

Standard molar entropy: The entropy of 1 mole of a substance at 1 atm pressure & 25°C.

Q: What is "Gibbs energy"?

A: The amount of energy available from a system which can be converted to useful work at constant Pressure & Temperature.

Q: Enthalpies of formation of CO, CO_2, N_2O and N_2O_4 are –110, –393, 81 and 9.7 K.J mol^{-1} respectively. Find the value of Δ_rH for the reaction $N_2O_4 + 3CO \rightarrow N_2O + 3\ CO_2$.

A: $\Delta_rH = H_{products} - H_{reactants}$

$= [3\ H_{CO_2} + H_{N_2O}] - [H_{N_2O_4} + 3H_{CO}]$

= [3 × (–393) + 81] – [9.7 + 3(–110)]

= –778 K.J

Q: What is "homogeneous equilibrium"?

A: The equilibrium in which all the reactants and the products are present in same phase

$N_2\ (g) + 3\ H_2\ (g) \rightleftharpoons 2\ NH_3\ (g)$



Writer:

ANS Sankara Rao

Subject Expert

Q: What is "heterogeneous equilibrium"?

A: The equilibrium in which reactants & products are present in different phase.

$CaCO_3\ (s) \rightleftharpoons CaO\ (s) + CO_2\ (g)$

Q: What is meant by "dynamic equilibrium"?

A: The reversible reaction in which the rate of forward reaction is equal to the rate of backward reaction and both are taking place even at equilibrium state.

Q: Calculate pH of 0.1825% HC*l* aqueous solution.

A: $[H^+] = N = \frac{0.1825}{36.5} \times \frac{1000}{100} = 5 \times 10^{-2}$

pH = –log [H^+]

pH = –log [5 × 10^{-2}] = –[log 5 + log 10^{-2}]

= –[0.6990 – 2] = 1.3010

Q: Calculate pH of 10^{-8} M NaOH.

A: $[OH^-] = [OH^-]_{NaOH} + [OH^-]_{H_2O}$

$= 10^{-8} + 10^{-7} = 10^{-7}\ (10^{-1} + 1)$

$= 1.1 \times 10^{-7}$

pOH = –log[OH^-] = –log[1.1 × 10^{-7}] = 6.96

∴ pH = 14 – pOH= 14 – 6.96 = 7.04

Q: Calculate pH of 0.05 M $Ba(OH)_2$ solution.

A: [OH^-] = N = 2 × 0.05 = 0.1 = 10^{-1}

pOH = –log[OH^-] = –log[10^{-1}] = –(–1) = 1

pH = 14 – pOH = 14 – 1 = 13

Q: Define pH.

A: Negative logarithm of H^+ ion concentration pH = –log [H^+]

Q: What is "Solubility Product"?

A: The product of concentration of Cations & Anions present in saturated salt solution.

Units: $(moles/lit)^n$

Q: 50 ml of NH_4OH & 25 ml of 2M NH_4Cl were mixed to make a buffer. What is its pH if its Pk_b is 4.8

A: $pOH = p^k_b + \log\frac{M_sV_s}{M_bV_b}$

$= 4.8 + \log\frac{2 \times 25}{0.1 \times 50} = 4.8 + 1 = 5.8$

∴ pH = 14 – pOH

= 14 – 5.8 = 8.2

Q: All the bronsted bases are Lewis bases. Explain.

A: Bronsted base is proton acceptor.

$NH_3 + H^+ \rightarrow NH_4^+$. Lewis base is electron pair donor. Where NH_3 can accept a proton (H^+) and donates lone pair of electrons to H^+ ion. So NH_3 is Bronsted base as well as Lewis base.

Q: Classify the following solutions of salts into acidic and basic $AlCl_3$, Na_2CO_3, $CuSO_4$, CH_3COONa.

A: **Acidic:** $CuSO_4$ & $AlCl_3$

Basic: CH_3COONa & Na_2CO_3

Q: What are 'London Forces'?

A: Forces of attraction between 2 temporary dipoles. Eg: n-pentane.

BANK EXAMS
REASONING

In the last few years reasoning section has seen major changes. The difficulty level in reasoning section has tremendously increased, and it has been increasing year on year by introducing new models. Earlier this section used to be considered as the scoring area where in students could easily score around 20 questions from these topics which were regular feature in the paper. (Coded inequalities (5), Coding decoding (5), Input and output (5), Syllogisms (5)).

ప్రతిభ

'yap lap map' would mean...?



Writer:
G.Shashi Kumar
Subject Expert

After the introduction of prelims and mains, the regular models in the above said scoring topics were shifted to prelims. Very few questions, that too new and different questions from these topics were given in the mains. Thus making it very difficult for the students to score in this reasoning section. Today, let us discuss about the latest changes in the reasoning section.

CODED INEQUALITIES

(Old Pattern):

Model-I:

Some statements given followed by two or three conclusions. For example:

1. Statement: E > A = B ≥ C ≤ H > N

Conclusions: I. E > N II. C < E

Solution:

As two opposite symbols are there between E and N, no relation can be established between E and N. So, I does not follow. From the statements as E > C is true, obviously C < E also follows. So, only conclusion II follows.

Model-II:

In this model, the meanings for the symbols will be given. First we should convert the symbols according to their meanings and then start solving the questions.

For example:

A@B means 'A is not greater than B'

A ★ B means 'A is neither greater than nor equal to B'

A # B means 'A is neither greater nor smaller than B'

A $ B means 'A is not smaller than B'

A © B means 'A is neither smaller nor equal to B'

1. Statements: E$V, K#V, K©P, W@P, W#X

Conclusions: (i) X ★ V (ii) W # K

Solution:

Here @ stands for ≤, ★ stands for <, # stands for =, $ stands for ≥, © stands for >.

Statements: E ≥ V, K = V, K > P, W ≤ P, W = X.

Conclusions: (i) X < V (ii) W = K

By combining the above statements, we get

E ≥ V = K > P ≥ W = X

From this as V > X follows ⇒ X < V also follows

As K > W follows W = K does not follow.

New Pattern

Now let us discuss in detail about the new patterns in this topic. The major differences between the old pattern and new pattern is that in the old pattern we used to have a set of 5 questions but where as in the new pattern each question is of a different type and that to at the most only 2 or 3 questions used to be given.

For example:

1. Which of the following elements replace the question marks in that order in the given expressions to make the expressions A ≤ B and B > C definitely true?

? ≤ ? = ? < ? ≥ ? ≥ ?

1) D, A, C, E, B, F 2) F, B, E, C, A, D
3) C, D, E, B, F, A 4) D, C, B, E, A, F
5) D, C, E, F, B, A

Solution:

For these type of questions students should always go through each choice, making it time consuming.

From Choice (1) A ≤ B is false as there are two opposite symbols between A and B it cannot be the answer.

Choice (2) if false, as two opposite symbols are there, no relation can be established.

Choice (3), C ≤ D = E < B ≥ F ≥ A, from this A ≤ B as well as B > C both follow.

Ans: Choice (3)

2. Which of the following symbols replace the question marks in that order in the given expressions to make expressions K < V and Z ≥ S definitely true?

U ? W ? S ? K ? Z ? V

1) >, ≥, =, <, ≤ 2) ≤, <, =, ≥, <
3) ≥, >, =, ≤, < 4) <, ≤, =, ≥, <
5) =, ≤, <, ≥, >

Solution:

From Choice (1), K < V is true but Z ≥ S is false.

From Choice (2) no relation can be established between K and V

From Choice (3), both the conclusions K < V and Z ≥ S are true.

Ans: Choice (3)

3. Which of the following set of symbols should replace the question marks in that order in the given expression in order to make the expressions X > S and A ≤ X are definitely false?

"T ≥ S ? V ≥ X; S = L ≤ D ? A"

1) >, = 2) ≥, > 3) <, ≥
4) ≥, = 5) None

Solution:

From Choice (1), we have

T ≥ S > V ≥ X, S = L ≤ D = A

Combining the two statements

X ≤ V < S = L ≤ D = A

From this both the conclusions X > S and A ≤ X are definitely false.

Ans: Choice (1)

Set - 1

This model is a combination of model-II of the old pattern and model-I of new pattern.

For example:

A @ B means 'A is not greater than B'

A ★ B means 'A is neither greater than nor equal to B'

A $ B means 'A is neither smaller than nor equal to B'

A % B means 'A is not smaller than B'

A # B means 'A is neither greater than nor smaller than B'

1. Which symbol should come in place of question mark (?) in the given expression so as to make the conclusion D ★ O definitely true?

N $ O % M ? P % D ★ Q

1) # 2) % 3) $ 4) ★ 5) @

Solution:

In this @ means ≤, ★ means <, $ means >, % means ≥ and # means =



First one should convert the statements according to the information given,

N ≥ O ≥ M ? P ≥ D < Q

D ★ O means D < O, in order to make D < O true the symbol that has to be replaced is $.

Ans: Choice (3)

2. In which of the following statements both the conclusions A $ D and F @ B definitely false?

1) B % M # F ★ A $ Q # D
2) D $ F # A $ L # K % B
3) M $ F @ D @ B # K ★ A
4) D % Q $ F # A @ B @ T
5) None of these

Solution:

The conclusions A > D and F ≤ B should be definitely false.

From (1), we have A > D is true. So (1) cannot be the answer.

From (2), we have A < D and F > B, hence the conclusions A > D and F ≤ B definitely false.

Ans: Choice (2)

CODING & DECODING

(Old Pattern):

In this topic one can witness huge variation from one exam to the next examination. Some surprise element is being introduced every time, let us have a glance through these changes.

Earlier this model used to be a regular feature in the bank exams where the students can rely upon this model for five marks.

For example:

According to a certain code,

	Sentences	Codes
1	focus on your goal	lap tap cap gap
2	successful people have goal	sap pap lap zap
3	people depends on happiness	gap sap yap map
4	your happiness have memories	pap nap tap yap

1. 'Focus have memories' would be written as

1) sap pap tap 2) cap lap yap
3) pap map cap 4) map zap nap
5) pap nap cap

Solution:

Comparing (1) & (2), the code for 'goal' is 'lap'. From (1) & (3), the code for 'on' is 'gap'. From (1) & (4) the code for 'your' is 'tap'. From (1) the code for 'focus' is 'cap'.

Similarly, we can find the codes for the other words. The codes for the remaining words is as follows: people-sap, have-pap, successful-zap, happiness-yap, depends-map, memories-nap.

The code for 'Focus have memories' is 'cap pap nap'.

Ans: Choice (5)

2. 'yap lap map' would mean

1) happiness on goal
2) people goal happiness
3) successful depends focus
4) goal depends happiness
5) None of these

Solution:

'yap lap map' is the code for 'happiness goal depends'.

Ans: Choice (4)

Condition based:

This model is frequently given in clerical examinations.

In this some elements will be given in row-I, and their corresponding codes in row-II.

Below this table some conditions will be given followed by questions.

Study the following information carefully and answer the questions given below it.

Digits in the numbers are to be coded as follows:

Digit	4	7	1	8	2	6	0	9	3	5
Code	W	R	Q	M	D	U	K	E	Z	I

Following conditions are to be observed:

(i) If the first digit is even and the last digit is odd-prime, they are to be coded as # and © respectively.

(ii) If the first digit is odd and the last digit is zero, then they are coded as & and @.

(iii) If '0' is preceeded by even and followed by prime then '0' is coded as ★ and the codes of first and last digits in the number will interchange.

(iv) If '0' is preceeded by odd (non-prime) and followed by even (non-prime) then '0' is coded as '$' and the codes of first and last digits in the number will interchange.

Note:

★ 0 (Zero) is not considered as either even or odd.

★ If no condition is being followed then the codes for the digits are according to the given table.

1. 20375826

1) #KZRIMD© 2) U★ZRIMDD
3) UKZRIMDD 4) D★ZRIMDU 5) None

Solution:

This satisfies condition (iii), hence the code for 20375826 is U★ZRIMDD.

Ans: Choice (2)

2. 35724910

1) ZIRDWEQ& 2) @IRDWEQ&
3) &IRDWEQ@ 4) &IRDWEQK 5) None

Solution:

This satisfies condition (ii), hence the code for 35724910 is &IRDWEQ@.

Ans: Choice (3)

(To be continued...)


రైల్వేస్టేషన్ ఆవరణలో పూలమొక్కలు, చెట్లు


పాఠశాల గోడలపై బొమ్మలు, దారిలో పచ్చదనం


రైల్వేస్టేషన్ ముందు నూతన శోభ

హరిత సిరి.. మురిసెను మది

హిందూపురం రైల్వేస్టేషన్ ఆవరణ చుట్టూ పచ్చనిచెట్లతో ఆహ్లాదకరంగా ఉంది. ఆవరణ వెనుకభాగంలో రహదారికి ఇరువైపులా చెట్లు ఉద్యానవనాన్ని తలపిస్తున్నాయి. రైల్వే పాఠశాల గోడలపై బొమ్మలు ఆకట్టుకుంటున్నాయి. స్వచ్ఛ స్ఫూర్తితో వీధులను ఎప్పటికప్పుడు సిబ్బందితో శుభ్రం చేయిస్తున్నారు. *– చిత్రాలు: ఈనాడు, హిందూపురం*

కబుర్లతో మొదలై.. భవిత బూడిదై..


బాలికలు, యువకుల కబుర్లు

ఈ చిత్రాన్ని సరిగ్గా పరిశీలిస్తే ఇద్దరు అమ్మాయిలు, ఇద్దరు అబ్బాయిలు కనిపిస్తారు. ఇద్దరు ఆటో డ్రైవర్లు పాఠశాల విద్యార్థినులను అనంతపురంలోని రోడ్లు భవనాలశాఖ అతిథిగృహం వద్దకు తీసుకొచ్చారు. వారిని పాఠశాలకు వెళ్లనీయకుండా ఇటు తీసుకొచ్చి ఇద్దరు కుర్రాళ్లు ఆటోలో కూర్చొని ఇలా కబుర్లు చెబుతున్నారు. జిల్లా పోలీసు కార్యాలయానికి కూత వేటు దూరంలో డీఎస్పీ కార్యాలయం పక్కనే కనిపించిన దృశ్యమిది. జిల్లా కార్యాలయం సమీపంలోనే ఇలా జంటలు ఉదయం సాయంత్రం వేళల్లో కనిపిస్తున్నా మహిళా రక్షక్‌ల నుంచి స్పందన కనిపించడం లేదు. అభం శుభం తెలియని వయసులో బాలికలు పోకిరీల మాయలో పడి జీవితాలను బుగ్గి చేసుకొంటున్నారు. పెనుకొండ మండలానికి చెందిన 17 ఏళ్ల బాలికకు మాయమాటలు చెప్పి ఒక యువకుడు లోబరచుకొన్నాడు. కబుర్లతో ప్రారంభమైన వారి పరిచయం. అమ్మాయి ఇటీవలే ఆడబిడ్డకు జన్మనిచ్చేలా చేసింది. తీరా పెళ్లి చేసుకోమంటే ఆ యువకుడు ఉడాయించాడు. దీంతో ఆ బాలిక బతుకు అన్యాయం అయింది. ఆకతాయిల ఆటకట్టించి ఇలాంటి జంటలకు తరచూ కౌన్సెలింగ్ ఇవ్వాలి.

- అనంత నేర వార్తలు


కల్లూరు గ్రామ సమీపాన జాతీయ రహదారిపై అరబెట్టిన ధాన్యం

దారి కాచారు.. ఆరబోశారు

పామిడి, న్యూస్‌టుడే: కొందరి అవగాహన లేమి.. ఏమవుతుందిలే అన్న మరికొందరి నిర్లక్ష్యం ప్రమాదాలకు కారణమవుతోంది. ఇలా చేయడం ఇతరులకు ప్రమాదకరమని తెలిసినా.. ఏమాత్రం పట్టించుకోకుండా జాతీయ రహదారిని సైతం ధాన్యాన్ని అరబెట్టే ప్లాట్‌ఫారాలుగా కొందరు వినియోగించుకుంటున్నారు. బెంగళూరు, హైదరాబాద్ 44వ జాతీయ రహదారి గార్లదిన్నె మండల పరిధిలోని కల్లూరు సమీపాన ఇలా ధాన్యాన్ని ఆరబెట్టారు. అంతేకాకుండా రాత్రి పూట ధాన్యాన్ని నింపి బస్తాలను అక్కడే కుప్పలుగా ఉంచుతున్నారు. విషయం తెలియని వాహన చోదకులు వేగంగా వచ్చి ప్రమాదాలకు గురవుతున్నారు.

జాతీయ క్రికెట్ పోటీల్లో యోగానంద ద్విశతకం


యోగానంద

అనంతపురం క్రీడలు, న్యూస్‌టుడే: గుజరాత్‌లోని రాజ్‌కోట్‌లో జరుగుతున్న అండర్-16 జాతీయ క్రికెట్ పోటీల్లో జిల్లా ఆణిముత్యం యోగానంద (217) డబుల్ సెంచరీ చేశాడు. తొలి ఇన్నింగ్స్‌లో ఆంధ్ర జట్టు 2 వికెట్లకు 801 పరుగులు చేయగా....అందులో యోగానంద డబుల్ సెంచరీ చేయడం విశేషం. ఓపెనర్‌గా బరిలో దిగిన ఈ బ్యాట్స్‌మెన్ అద్భుతంగా ఆడి అలరించాడు. ఆంధ్ర జట్టుకు ప్రాతినిథ్యం వహిస్తున్న యోగానంద గతంలో అత్యధిక పరుగులు చేసిన ఆటగాడిగా రికార్డు సాధించాడు. యోగానంద డబుల్ సెంచరీ సాధించడంపై జిల్లా క్రికెట్ సంఘం అధ్యక్షుడు మాంచోఫెర్రర్, కార్యదర్శి షాబుద్దీన్‌లు హర్షం వ్యక్తం చేశారు. జిల్లా క్రీడాకారులు ఇలాంటి రికార్డులు మరిన్ని సాధించాలని ఆకాంక్షించారు.

పోలీసుల్లో సేవా దృక్పథం


శుద్ధజల ప్లాంటును ప్రారంభిస్తున్న కమాండెంట్

ఆర్కేనగర్(అనంతపురం), న్యూస్‌టుడే: పోలీసుల్లో సేవా దృక్పథం పెరుగుతోందని 14వ పటాలం కమాండెంట్ జగదీశ్‌కుమార్ తెలిపారు. ఏపీఎస్పీ విభాగం కానిస్టేబుళ్లు బైబిల్ మిషనరీ సొసైటీ ఆశ్రమంలో విద్యార్థులకు రూ.లక్షతో శుద్ధ జల యంత్రాన్ని ఏర్పాటు చేశారు. 39 మంది పోలీసు సిబ్బంది ఆర్థిక సహకారంతో ఏర్పాటైన శుద్ధజల ప్లాంటును కమాండెంట్ జగదీశ్‌కుమార్ గురువారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 2007 బ్యాచ్‌కు చెందిన కానిస్టేబుళ్లు విధుల్లో చేరి 10 ఏళ్లు పూర్తయిన సందర్భంగా ఆశ్రమానికి చేయూతను అందించడం అభినందనీయమన్నారు. పోలీసులు ఇటీవల సేవా దృక్పథంలో పని చేస్తున్నారనడానికి ఇదే నిదర్శనమన్నారు. అనాథలు, నిరుపేదలకు ఆసరాగా నిలవాల్సిన బాధ్యత అందరిపై ఉందన్నారు.

సీసీఎస్ డీఎస్పీగా శ్రీనివాసులు

అనంత నేరవార్తలు, న్యూస్‌టుడే: అనంత కేంద్ర నేర విభాగం(సీసీఎస్) థాణా డీఎస్పీగా శ్రీనివాసులును నియమిస్తూ డీఐజీ కార్యాలయం నుంచి గురువారం ఉత్తర్వులు వెలువడ్డాయి. సీసీఎస్ థాణా డీఎస్పీ నాగసుబ్బన్నను మహిళా థాణాకు బదిలీ చేయడంతో ఈ స్థానం కొద్ది రోజులుగా ఖాళీగా ఉంది. కీలకమైన ఈ విభాగానికి ఎవరిని నియమిస్తారో అని అందరూ భావిస్తున్న తరుణంలో ప్రస్తుతం వీఆర్‌లో ఉన్న శ్రీనివాసులును సీసీఎస్‌కు కేటాయించారు.

అనంతకు అలవోక విజయం


బ్యాటింగ్‌లో రాణించిన రాకేష్ (71)


బ్యాటింగ్ చేసి పోటీలను ప్రారంభిస్తున్న మాంచో

అనంతపురం క్రీడలు, న్యూస్‌టుడే: న్యూజిలాండ్ హట్ హాక్ అండర్-15 జట్టుతో జరిగిన పోటీలో అనంతపురం అండర్-14 జట్టు సునాయసంగా గెలిచింది. గురువారం అనంత క్రీడాగ్రామంలో జరిగిన పోటీలో అనంతపురం జట్టు న్యూజిలాండ్‌పై 87 పరుగుల తేడాతో ఘనవిజయం సాధించింది. టాస్ గెలిచిన న్యూజిలాండ్ జట్టు ప్రత్యర్థిని మొదట బ్యాటింగ్‌కు ఆహ్వానించింది. తొలుత బ్యాటింగ్ చేసిన అనంతపురం జట్టు నిర్ణీత 50 ఓవర్లలో 9 వికెట్లకు 273 పరుగులు చేసింది. ఈ జట్టులోని రాకేష్ (71), జయకృష్ణ (63) బ్యాటింగ్‌లో విజృంభించడంతో భారీస్కోరు నమోదైంది. అనంతరం భారీ విజయలక్ష్యంతో బ్యాటింగ్ ఆరంభించిన న్యూజిలాండ్ జట్టు అనంత బౌలర్ల దెబ్బకు 46.3 ఓవర్లలో 186 పరుగులకే కుప్పకూలింది. అనంత బౌలర్లు ప్రదీప్ (3/36), లోహిత్‌సాయి (2/34) న్యూజిలాండ్ జట్టును కోలుకోలేని దెబ్బతీశారు. ఈ పోటీలను ఆర్డీటీ కార్యక్రమ సంచాలకులు మాంచో ఫెర్రర్, విశాల ఫెర్రర్, న్యూజిలాండ్ జట్టు ప్రతినిధి రవికృష్ణమూర్తి, జిల్లా క్రికెట్ సంఘం కార్యదర్శి షాబుద్దీన్ ప్రారంభించారు. ఆర్డీటీ విద్యార్థుల సాంస్కృతిక కార్యక్రమాలు అలరించాయి. ఇరు జట్లు తమ జాతీయ గీతాలను ఆలపించాయి. అనంతరం క్రీడాకారులను పరిచయం చేసుకుని పోటీలను లాంఛనంగా ప్రారంభించారు.

శ్రీ ఖాద్రీనారసింహుడి ఆలయ సమాచారం

కదిరి పట్టణం, న్యూస్‌టుడే: ధనుర్మాసం సందర్భంగా శ్రీఖాద్రీ లక్ష్మీనారసింహస్వామి ఆలయంలో శుక్రవారం ఉదయం 4 గంటలకు ఆలయశుద్ధి నివేదన ఉంటుంది. ఉదయం 4.30గంటల నుంచి 7 వరకు ధనుర్మాస ప్రత్యేక అభిషేకం, స్వామివారి దర్శనం కొనసాగుతుంది. ఉదయం 7.30నుంచి 9 గంటల వరకు స్వామివారి దర్శనం నిలిపివేస్తారు. ఉదయం 9గంటల నుంచి 10.30 వరకు 8 ఆర్జిత అభిషేకాలు, ఒక స్వర్ణకవచసేవ జరుగుతాయి. 10.30 నుంచి ఒంటి గంట వరకు స్వామివారి సర్వ దర్శనం ఉంటుంది.

అనంతపురం

బ్రెయిలీ జయంతి

అనంతపురం (అరవిందనగర్): నేషనల్ ఫెడరేషన్ ఫర్ బ్లైండ్ సంఘం కార్యాలయంలో గురువారం బ్రెయిలీ జయంతిని నిర్వహించారు. అంధులు చదువుకోడానికి ప్రత్యేక లిపిని రూపొందించిన బ్రెయిలీ మహోన్నతుడని ఆ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు పంపన్న, విజయభాస్కర్, ఉమామహేశ్వర్, కెనరా బ్యాంకు ఎంప్లాయీస్ యూనియన్ నాయకుడు అరుణ్‌బాబు కొనియాడారు.

రైతుల సహకారంతోనే సత్ఫలితాలు

గొందిరెడ్డిపల్లి(రాప్తాడు): గ్రామాల్లోని రైతులు సాగు చేస్తున్న పంటల దిగుబడిని లెక్కించడానికి పల్లెపల్లెనా పంటకోత ప్రయోగాలు నిర్వహిస్తున్నాం. రైతులు సహకారం అందించాలని ఏఈవో భాగ్యశ్రీ, వ్యవసాయ శాఖ సిబ్బంది కోరారు. వారు మాట్లాడుతూఉన్న నీటిని రైతులు సక్రమంగా ఉపయోగించి పంటలు సాగుచేసి అధిక దిగుబడిని తీసుకురావాలన్నారు.

ప్రజలకు జవాబుదారీగా ఉంటాం

జన్మభూమిలో ఎమ్మెల్యే ప్రభాకర్‌చౌదరి



ప్రసంగిస్తున్న ఎమ్మెల్యే ప్రభాకర్‌చౌదరి

అనంత నగరపాలిక, న్యూస్‌టుడే: ప్రజలకు జవాబుదారీగా ఉంటూ, సమస్యలు పరిష్కరించడానికే ప్రభుత్వం జన్మభూమి- మాఊరు కార్యక్రమం నిర్వహిస్తోందని ఎమ్మెల్యే ప్రభాకర్‌చౌదరి పేర్కొన్నారు. గురువారం నగరంలోని 10, 16, 27, 34, 43 డివిజన్లలో జన్మభూమి కార్యక్రమం జరిగింది. 10వ డివిజన్‌లో జరిగిన కార్యక్రమానికి ఎమ్మెల్యే ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తెదేపా ప్రభుత్వం ఎంతో అభివృద్ధి చేస్తోందన్నారు. అనంత నియోజకవర్గాన్ని రాష్ట్రంలోనే ఆదర్శంగా తీర్చిదిద్దుతామన్నారు. ప్రజలంతా ఆరోగ్యంగా ఉండాలనే ఉద్దేశంతో ఆరుబయలు వ్యాయామశాలలు ఏర్పాటు చేసినట్లు చెప్పారు. ఆహ్లాదకరమైన వాతావరణం కల్పించడానికి ఉద్యానవనాలు అభివృద్ధి చేస్తున్నామన్నారు. గత జన్మభూమిలో 13వేల రేషన్‌కార్డులు పంపిణీ చేశామని, అర్హులందరికీ కార్డులు ఇస్తామని చెప్పారు. ప్రభుత్వ నిబంధనల ప్రకారం పింఛన్లు, ఇళ్ల స్థలాలు, ఇళ్లు నిర్మిస్తామని హామీ ఇచ్చారు. సీపీఐ నాయకులు డివిజన్ సమస్యలపై ఎమ్మెల్యేకు వినతి పత్రం అందజేశారు. మరుగుదొడ్లు సక్రమంగా నిర్వహించాలని, శుద్ధనీటి కేంద్రం ఏర్పాటు చేయాలని కోరారు. కార్పొరేటర్ నసీమ అధ్యక్షత నిర్వహించిన కార్యక్రమంలో మున్సిపల్ ఆర్డీ రవీంద్రబాబు, కమిషనర్ మూర్తి, వడ్డెర ఫెడరేషన్ రాష్ట్ర అధ్యక్షుడు మురళి, నోడల్ అధికారి దుష్యంత్ తదితరులు పాల్గొన్నారు.

అన్ని వర్గాల సంక్షేమమే ధ్యేయం

అన్ని వర్గాల సంక్షేమమే ప్రభుత్వ ధ్యేయమని మేయర్ స్వరూప పేర్కొన్నారు. 16, 43 డివిజన్లలో జరిగిన జన్మభూమి కార్యక్రమానికి మేయర్ ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ పాలక వర్గం ఏర్పడిన తరువాత నగరంలో అనేక అభివృద్ధి కార్యక్రమాలు చేపట్టామన్నారు. నగరమంతా ఎల్ఈడీ దీపాలు అమర్చినట్లు చెప్పారు. తాగునీటి సమస్య పరిష్కారానికి పైపులైను, ట్యాంకు నిర్మాణాలు జరుగుతున్నాయి. అందరికీ ఇళ్లు పథకంలో అర్హులకు మంజూరు చేయిస్తామన్నారు. ప్రజలు తమ సమస్యలపై అర్జీలిస్తే వాటికి పరిష్కారం చూపుతామన్నారు. పలు డివిజన్లలో సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించారు. మేయర్ రంగవల్లుల కార్యక్రమంలో పాల్గొన్నారు. కార్పొరేటర్లు మల్లికార్జున, దుర్గేష్ ఆయా డివిజన్లలో అధ్యక్షత వహించారు.



సంక్రాంతి కానుక అందజేస్తున్న మేయర్

పౌష్టికాహారం పంపిణీ

27వ డివిజన్‌లో కార్పొరేటర్ సరిపూటి రమణ అధ్యక్షతన జన్మభూమి కార్యక్రమం జరిగింది. మార్కెట్ యార్డు ఛైర్మన్ ఆదినారాయణ, కార్పొరేటర్లు లక్ష్మిరెడ్డి, హేమలత, విజయశ్రీ, నటేష్‌చౌదరి తదితరులు పాల్గొన్నారు. తెదేపా నాయకుడు బుగ్గయ్యచౌదరి, అరుంధతి దంపతులు డివిజన్‌లోని గర్భిణులకు పౌష్టికాహారం అందజేశారు.

సమస్యల పరిష్కారం

రుద్రంపేట(అనంతపురం): పేదల జీవన ప్రమాణాలు



రంగవల్లులు తీర్చిదిద్దుతున్న మేయర్



విద్యార్థుల నృత్య ప్రదర్శన

పెంచడమే ప్రభుత్వ లక్ష్యమని ఎమ్మెల్యే ప్రభాకర్‌చౌదరి పేర్కొన్నారు. గురువారం రుద్రంపేట, రాజీవ్ కాలనీ పంచాయతీలలో జన్మభూమి-మాఊరు కార్యక్రమం నిర్వహించారు. ఉదయం అజయ్‌ఘోష్ కాలనీలో ఎమ్మెల్యే పర్యటించి నీటి ట్యాంకులు ప్రారంభించారు. అనంతరం పాఠశాలలో జరిగిన కార్యక్రమంలో ఎమ్మెల్యే మాట్లాడుతూ ప్రజా సమస్యలు తెలుసుకుని, వాటిని పరిష్కరించే బాధ్యత నాయకులు, అధికారులపై ఉందన్నారు. రుద్రంపేటలో తాగునీటి సమస్యను తీర్చడంలో ఆర్‌డబ్ల్యూఎస్ అధికారులు నిర్లక్ష్యం వహిస్తే సహించేది లేదని హెచ్చరించారు. అనంతరం ఐసీడీఎస్ ఆధ్వర్యంలో గర్భిణులకు సీమంతం చేశారు. రేషన్ కార్డులు, మహిళలకు రుణాలు, విద్యార్థులకు ఉపకార వేతనాలు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో జడ్పీటీసీ సభ్యుడు వేణుగోపాల్, రాజీవ్‌కాలనీ సర్పంచి పెదయ్య, హౌసింగ్ డీఈ లక్ష్మినారాయణమ్మ, తహసీల్దార్ అన్వర్‌హుసేన్, మండల ప్రత్యేకాధికారి అరుణకుమారి, ఎంపీడీఓ ఓబుళమ్మ తదితరులు పాల్గొన్నారు.

స్వచ్ఛ కక్కలపల్లికి శ్రీకారం



ప్రదర్శన చేస్తున్న నాయకులు, విద్యార్థులు

కక్కలపల్లి(అనంతపురం): స్వచ్ఛ గ్రామంగా కక్కలపల్లిని తీర్చిదిద్దేందుకు చర్యలు చేపట్టారు. ఎస్కేయూ గణితశాస్త్రం విభాగం పరిశోధనా విద్యార్థులు గురువారం గ్రామంలో మరుగుదొడ్లు, పరిసరాల శుభ్రత, చంద్రన్న బీమా, పింఛన్ల పంపిణీ కార్యక్రమాలపై ఇంటింటా సర్వే చేపట్టారు. ముందుగా పంచాయతీ కార్యాలయం నుంచి ప్రారంభమైన ప్రదర్శనను జడ్పీటీసీ సభ్యుడు వేణుగోపాల్, అనంత మండలం తెదేపా ఇన్‌ఛార్జి పరిటాల మహేంద్ర, ఎస్కేయూ గణిత విభాగం అధిపతి శివప్రసాద్ ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం ప్రారంభించిన జన్మభూమి- మాఊరు కార్యక్రమంలో భాగంగా మరుగుదొడ్ల నిర్మాణాల ఆవశ్యకతపై విద్యార్థులు ప్రజలకు వివరిస్తారన్నారు. మరుగుదొడ్ల నిర్మాణంతోనే స్వచ్ఛత సాధ్యమన్నారు. ఈ కార్యక్రమంలో ఆచార్య శోభాలత, తెదేపా మండల కన్వీనర్ జయకృష్ణ, ఎంపీటీసీ సభ్యుడు నారాయణస్వామి, శంకర్ తదితరులు పాల్గొన్నారు.

అంధుల ఆశాజ్యోతి లూయీ బ్రెయిలీ

మూడోరోడ్డు(అనంతపురం): అంధుల ఆశాజ్యోతి లూయీ బ్రెయిలీ అని జాతీయ అంధుల సమాఖ్య రాష్ట్ర అధ్యక్షుడు పామయ్య తెలిపారు. నాలుగో రోడ్డులోని జాతీయ అంధుల సమాఖ్య(ఎన్ఎఫ్‌బీ) కార్యాలయంలో లూయీ బ్రెయిలీ జయంతి వేడుకలు నిర్వహించారు. ఈ సందర్భంగా పామయ్య మాట్లాడుతూ అంధుల సంక్షేమాన్ని దృష్టిలో ఉంచుకుని బ్రెయిలీ విశేషంగా కృషి చేశారన్నారు. కెనరా బ్యాంకు ఉద్యోగుల సంఘం రాష్ట్ర కార్యదర్శి అరుణ్‌బాబు మాట్లాడుతూ అంధుల కోసం జాతీయ సమాఖ్య చేస్తున్న కార్యక్రమాలను అభినందించారు. నేత్రదానాన్ని ప్రోత్సహిస్తూ 50 మందితో నేత్రదానం చేయిస్తామన్నారు. అంధులకు వ్యాయామశాల ఏర్పాటుకు తన వంతు ఆర్థిక సహాయాన్ని అందజేస్తానన్నారు. సమాఖ్య జిల్లా అధ్యక్షులు విజయభాస్కర్ మాట్లాడుతూ 2018 నుంచి అంధుల ఆరోగ్యాలపై సమాఖ్య దృష్టి సారించిందన్నారు. సమావేశంలో నాయకులు మధుసూదన్, వినయ్, ఉమామహేశ్వరరావు, రామకృష్ణ, రామాంజనేయులు, సి. రవి, లక్ష్మినారాయణ పాల్గొన్నారు

రోగికి మందుల అందజేత

అనంతపురం(వైద్యం), న్యూస్‌టుడే: అనంత ఆస్పత్రిలో నెల రోజులుగా వైద్యచికిత్స పొందుతున్న ఓ అనాథ రోగికి ఖరీదైన మందులు అందజేశారు. గురువారం ఆస్పత్రి సర్జికల్ వార్డులో కడుపునొప్పితో చికిత్స పొందుతున్న డ్రైవర్ బాబుకు ఈ మందులు ఇచ్చారు. ధర్మవరానికి చెందిన బాబు కడుపునొప్పితో నెల రోజుల క్రితం ఆస్పత్రిలో చేరారు. శస్త్ర చికిత్స చేయాలంటే శరీరం సహకరించలేదు. అందులోనూ వ్యాధి నిరోధక శక్తి లేదు. టీపీఎన్ ఎలోక్ట్రోలైటీస్ అనే మందులు వాడితే శరీరంలో శక్తి వస్తుంది. తద్వారా శస్త్ర చికిత్స చేయడానికి అవకాశం ఉంటుందని అక్కడి జనరల్ సర్జన్ మనోహర్‌రెడ్డి సంజీవని సంస్థ రమణారెడ్డికి చెప్పారు. దీంతో ఆయన పలువురు దాతల సహకారంతో రూ.16 వేలు ఖరీదు చేసే మందులను అందించారు. రెవెన్యూ ఉద్యోగుల సంఘం నాయకుడు నీలకంఠారెడ్డి, హంద్రీనీవా ఉద్యోగి రమాదేవి, నార్పల సంజీవరెడ్డి, అశోక్‌నగర్‌కు చెందిన సాఫ్ట్‌వేర్ ఇంజినీరు అమర్ ఆర్థిక సహాయం అందించినట్లు సంస్థ ప్రతినిధులు చెప్పారు. సంజీవని సంస్థ ప్రతినిధులు జగదీశ్వర్‌రెడ్డి, రాజశేఖర్‌రెడ్డి, శ్రీనివాసులు వైద్యుడి సమక్షంలో రోగికి అందించారు.



మందులు అందిస్తున్న ప్రతినిధులు

అంగన్‌వాడీలకు అదనపు పౌష్టికాహారం

అనంతపురం(శ్రీనివాస్‌నగర్), న్యూస్‌టుడే: అనంత నగర ఐసీడీఎస్ ప్రాజెక్టు పరిధిలోని అంగన్‌వాడీలకు అదనపు పౌష్టికాహారాన్ని మహిళా క్లబ్ ప్రతినిధులు అందజేశారు. గురువారం జీసస్‌నగర్‌లోని అంగన్‌వాడీ కేంద్రంలో ప్రత్యేక కార్యక్రమాన్ని నిర్వహించి పౌష్టికాహారాన్ని అందించారు. మహిళా క్లబ్ ఉపాధ్యక్షురాలు అరుంధతి రూ.5 వేలు, సభ్యురాలు భారతి రూ. వెయ్యి చొప్పున విరాళంతో 25 కిలోల రాగి పిండి, 25 కిలోల బెల్లం అందించారు. పీడీ వెంకటేశం ఆదేశాల ప్రకారం అదనపు పౌష్టికాహారాన్ని అందివ్వాలని దాతలను కోరాం. దీనికి స్పందించిన అరుంధతి తగిన సాయం చేశారని సీడీపీఓ కృష్ణకుమారి చెప్పారు. అనంతరం దాతలను సత్కరించారు. ఈ కార్యక్రమంలో కార్పొరేటర్లు సరిపూటి రమణ, కృష్ణకుమార్, తెదేపా రాష్ట్ర నేత బుగ్గయ్యచౌదరి, సూపర్‌వైజర్ కొండమ్మ తదితరులు పాల్గొన్నారు.



మహిళా క్లబ్ ప్రతినిధులను సత్కరిస్తున్న ఐసీడీఎస్ అధికారులు

అనంతపురం

6న త్యాగరాజస్వామి ఆరాధనోత్సవాలు

అనంత సాంస్కృతికం: నగరంలోని మొదటిరోడ్డు కాశీవిశ్వేశ్వర కోదండ రామాలయంలో శనివారం త్యాగరాజస్వామి ఆరాధనోత్సవాలు నిర్వహించనున్నారు. విజయవాణి సంగీత కళానిలయం ఆధ్వర్యంలో నిర్వహించనున్న ఈ కార్యక్రమాల్లో ఉదయం ఆలయంలోని త్యాగరాజస్వామికి పంచామృతాభిషేకం, అర్చనలు, సామూహిక పంచరత్నగాన సేవలు నిర్వహించనున్నారు.

తాగునీటి సరఫరాపై ఆరా

అనంత నగరపాలిక: నగరంలో తాగునీటి సరఫరాకు ఆటంకం లేకుండా చర్యలు చేపట్టాలని కమిషనర్ మూర్తి ఆదేశించారు. పీఏబీఆర్ జలాశయాన్ని కమిషనర్ గురువారం పరిశీలించారు. జలాశయం వద్ద మోటార్ల పనితీరు, నీటిశుద్ధి నిర్వహణపై కమిషనర్ అసంతృప్తి వ్యక్తం చేశారు. తరచూ నీటి సరఫరాకు ఆటంకం ఏర్పడుతున్నా పట్టించుకోరా అంటూ మండిపడ్డారు.

పాలకులూ.. పాకలను చూడరూ..!



ఈ ఇంట్లోనే నివాసం

ఈ చిత్రంలో కనిపిస్తున్న పూరి గుడిసె ఎక్కడో.. మారుమూల ప్రాంతంలో ఉందనుకుంటే పొరబాటే.. అనంత నగరానికి కూతవేట దూరంలో ఉన్న కాలనీ ఇది. అనంత గ్రామీణం కక్కలపల్లి కాలనీ పంచాయతీలోని మండ్లసుబ్బారెడ్డినగర్‌లోని చిత్రమిది. ఇక్కడ 135 ఇళ్లు కట్టుకున్నారు. అవన్నీ చుట్టూ బండలు నాటుకుని, బోదె గడ్డితో కప్పుకున్న గుడిసెలే. పదేళ్ల కిందటే కాలనీ ఏర్పడింది. విద్యుత్తు లైన్లు వేశారు. తాగునీటి కోసం చిన్న ట్యాంకులు నిర్మించారు. కాలనీ వాసులకు ఆధార్, రేషన్‌కార్డులు ఉన్నాయి. ఇటీవల నాయకులు రూ.15 లక్షలతో సీసీ రహదారికి భూమిపూజ కూడా చేశారు. కానీ ఒక్క ఇల్లు కూడా మంజూరు చేయలేదు. వర్షాకాలం వస్తే కాలనీవాసులు కష్టాలు చెప్పనవసరం లేదు. ఇప్పటికైనా ఇళ్లు నిర్మించాలని పేదలు కోరుతున్నారు. *- న్యూస్‌టుడే, నందమూరినగర్*

స్వచ్ఛత ఇదేనా..?



పట్టలతో ఏర్పాటు చేసిన స్నానపు గదిని చూపుతూ..

కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలతో పాటు పాలకులు, అధికారులు ప్రతి ఇంటికి మరుగుదొడ్డి నిర్మించుకోవాలనే పదే పదే చెబుతున్నారు. కానీ అవన్నీ మాటలకే పరిమితం అవుతున్నాయి. అందుకు ఈ చిత్రమే నిదర్శనం. ఇంటి పక్కనే పట్టలు చుట్టుకుని స్నానపు గదిని ఏరాపటు చేసుకున్నారు. అనంతపురం గ్రామీణం కురుగుంటలోని వైఎస్‌రాజశేఖర్‌రెడ్డికాలనీలో 1098 ఇళ్లు నిర్మించారు. అయితే వందలాది ఇళ్లకు మరుగుదొడ్లు లేవు. కనీసం స్నానం చేయడానికి కూడా ఇళ్ల వద్ద పట్టలు చుట్టుకున్నారు. ఉదయాన్నే చెంబు పట్టుకుని బయటకు వెళ్లాల్సిందే. స్వచ్ఛత అంటే ఇదేనా? అని పలువురు ప్రశ్నిస్తున్నారు. ఇప్పటికైనా మరుగుదొడ్లు నిర్మించి, స్వచ్ఛతకు బాటలు వేయాలని కాలనీవాసులు కోరుతున్నారు.

- న్యూస్‌టుడే, కురుగుంట

పోలీసు సేవలకు సత్కారం



సీఐ కృష్ణమోహన్‌ను సత్కరిస్తున్న ఉపాధ్యాయులు

అనంత నేరవార్తలు, న్యూస్‌టుడే: అనంత గ్రామీణ పోలీసులు తాటిచెర్ల జడ్పీ ఉన్నత పాఠశాలను దత్తత తీసుకుని మౌలిక సౌకర్యాల కల్పనకు కృషి చేశారు. తాగునీటి కోసం పైపు లైను, నీటి ట్యాంకును ఏర్పాటు చేశారు. విద్యార్థులకు తాగునీటి కష్టాలను తీర్చారు. దీంతో పాఠశాలలోని ఉపాధ్యాయులు గురువారం సీఐ కృష్ణమోహన్‌ను ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా ఉపాధ్యాయులు మాట్లాడుతూ పోలీసులు సేవా దృక్పథంలో పాఠశాల్లో మౌలిక సౌకర్యాలు కల్పించడం మరువలేమన్నారు. దాతల సహాయంతో రాత పుస్తకాలు, ఇతరత్రా సౌకర్యాలు అందజేసినట్లు చెప్పారు. ఈ కార్యక్రమంలో ఎస్సై శివ, ఉపాధ్యాయులు అశోక్‌కుమార్‌రెడ్డి, సాంబశివుడు, శివకుమార్‌రెడ్డి, నారాయణస్వామి, వేణుగోపాల్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

కేంద్రం తీరుపై నిరసన

రాంనగర్(అనంతపురం): రాజ్యాంగం పట్ల కేంద్ర ప్రభుత్వం అనుసరిస్తున్న వైఖరికి నిరసనగా రిజర్వేషన్ పరిరక్షణ సమితి ఆధ్వర్యంలో గురువారం అంబేడ్కర్ విగ్రహం ఎదురుగా కేంద్ర ప్రభుత్వ దిష్టిబొమ్మ దహనం చేశారు. ఈ సందర్భంగా సమితి అధ్యక్షుడు నాగరాజు మాట్లాడుతూ భాజపా ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత రాజ్యాంగం పట్ల కేంద్ర మంత్రులు, పార్లమెంటు సభ్యులు చేస్తున్న వ్యాఖ్యలు బాధాకరమన్నారు. కేంద్ర మంత్రి హెగ్డే వ్యాఖ్యలు రాజ్యాంగాన్ని అవమానపరిచే విధంగా ఉన్నా.. ప్రధాని మోదీ ఎలాంటి చర్యలు చేపట్టకపోవడం బాధాకరమన్నారు. ఈ కార్యక్రమంలో నాయకులు చక్రధర్, బాలరాజు, సుధాకర్‌యాదవ్, రఫీ, సుబ్బరాయుడు తదితరులు పాల్గొన్నారు.

క్రికెట్ జట్టుకు పీవీకేకే విద్యార్థి ఎంపిక

రుద్రంపేట(అనంతపురం): పీవీకేకే ఇంజినీరింగ్ కళాశాలలో ఎంబీఏ రెండో సంవత్సరం చదువుతున్న హరీష్ జేఎన్టీయూ క్రికెట్ జట్టుకు ఎంపికైనట్లు ప్రిన్సిపల్ రమేష్ బాబు తెలిపారు. ఈనెల 3 నుంచి 12 వరకు విశాఖపట్నం ఆంధ్రా యూనివర్సిటీలో జరుగుతున్న దక్షిణ భారత అంతర విశ్వవిద్యాలయ క్రికెట్ టోర్నీలో హరీష్ పాల్గొంటున్నట్లు తెలిపారు. గురువారం కళాశాల యాజమాన్యం విద్యార్థిని అభినందించింది. కార్యక్రమంలో యాజమాన్య ప్రతినిధి శ్రీకాంత్‌రెడ్డి, వ్యాయామాధికారి ధనుంజయ పాల్గొన్నారు.

నేత్రదానంపై అవగాహన

కమలానగర్, న్యూస్‌టుడే: నేత్రదానంతో రెండు జన్మలు జీవించవచ్చని దర్శకనిర్మాత తమ్మారెడ్డి భరద్వాజ తెలిపారు. గురువారం స్థానిక ప్రెస్‌క్లబ్‌లో సాయి స్వచ్ఛంద సంస్థల ఆధ్వర్యంలో నేత్రదానంపై ప్రచార గోడపత్రికలను ఆయన విడదలచేశారు. స్వచ్ఛంద సంస్థలు, ప్రభుత్వాలు నేత్రదానంపై ప్రజలకు అవగాహన కల్పించాలన్నారు.

ఘనంగా ఆలయ వార్షికోత్సవం





పూజలందుకుంటున్న మూలమూర్తి, భక్తులకు అన్నదానం

అనంత సాంస్కృతికం, న్యూస్‌టుడే : నగరంలోని నాలుగోరోడ్డు శ్రీరంగస్వామి నగర్‌లో ఉన్న నసనకోట ముత్యాలమ్మ ఆలయ వార్షికోత్సవం గురువారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆలయాన్ని రంగుల పూలు, విద్యుద్దీపాలతో నేత్రానందంగా అలంకరించారు. ఉదయం మూలమూర్తికి గంగజలాభిషేకం, పంచామృతాభిషేకం నిర్వహించి పట్టువస్త్రాలు, నిమ్మ, వేప, గాజులతో చేసిన మాలలతో అలంకరించారు. రుద్రాభిషేకం, పంచసూక్త మహన్యాసపూజలు, మహిళల సామూహిక లలితాసహస్రనామ పారాయణం చేశారు. కర్ణాటక, చిత్తూరు, కడప, కర్నూలు జిల్లాల నుంచి వచ్చిన భక్తులతో ఆలయం కిటకిటలాడింది. స్ఫూర్తి స్వచ్ఛంద సంస్థ సభ్యులు, ఆలయ వ్యవస్థాపకులు అన్నదానం చేశారు. ఈ కార్యక్రమంలో ధర్మకర్త నారాయణస్వామి, సరళ, రామస్వామి, చంద్రశేఖర్, శ్రీరాములు, సంజీవు, రాజు తదితరులు పాల్గొన్నారు.

రీడింగ్ సెల్ అందుబాటులో ఉంచాలి

ఎస్.కె.విశ్వవిద్యాలయం, న్యూస్‌టుడే: వర్సిటీలోని రీడింగ్ సెల్‌ను 24 గంటలు అందుబాటులో ఉంచాలని లేని పక్షంలో అధికారిక కార్యక్రమాలను అడ్డుకుంటామని వైఎస్సార్ విద్యార్థి సంఘం నాయకులు జయచంద్రారెడ్డి హెచ్చరించారు. గురువారం వర్సిటీ ఉపకులపతి, రిజిస్ట్రార్‌తో వాగ్వాదానికి దిగారు. పోటీ పరీక్షలకు రీడింగ్ సెల్ అందుబాటులో ఉంచితే ఎక్కువ మంది విద్యార్థులకు ఉపయుక్తంగా ఉంటుందన్నారు.

చంద్రన్న బీమా ప్రీమియం చెల్లింపు



బీమా బాండు అందజేస్తున్న ఉప మేయర్

అనంత నగరపాలిక, న్యూస్‌టుడే: 34వ డివిజన్‌లో అర్హులందరికీ చంద్రన్న బీమా ప్రీమియం సొమ్మును చెల్లిస్తానని ఉప మేయర్ గంపన్న హామీ ఇచ్చారు. 34వ డివిజన్‌లో గురువారం జరిగిన జన్మభూమి కార్యక్రమానికి ఉప మేయర్ ముఖ్య అతిథిగా హాజరై, అధ్యక్షత వహించారు. చంద్రన్న బీమా లబ్ధిదారులకు ఆయన బాండ్లు అందజేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ బీమా పేదలకు వరం అన్నారు. కేవలం రూ.15 చెల్లిస్తే బీమా పథకానికి అర్హులవుతారన్నారు. సాధారణ మరణానికి రూ.30 వేలు, ప్రమాదవశాత్తు మరణానికి, శాశ్వత అంగవైకల్యం పొందితే రూ.5 లక్షల వరకూ బీమా సొమ్ము లభిస్తుందన్నారు. పేర్లు నమోదు చేసుకుంటే అందరి బీమా సొమ్ము తానే చెల్లిస్తానన్నారు. ఈ కార్యక్రమంలో అదనపు కమిషనర్ కృష్ణమూర్తి తదితరులు పాల్గొన్నారు.

ధర్మవరం

భాజపా నాయకుల పూజలు

ముదిగుబ్బ, న్యూస్‌టుడే: అనంతపురం నుంచి బెంగళూరు వెళ్తూ రహదారి ప్రమాదంలో గాయపడిన భారతీయ జనతా పార్టీ జిల్లా అధ్యక్షుడు అంకాల్ రెడ్డి త్వరగా కోలుకోవాలని పాతూరు శ్రీ సూర్యచంద్ర అభయ ఆంజనేయ స్వామి ఆలయంలో మండల భాజపా నాయకులు పూజలు చేశారు. పూజలు చేసిన వారిలో మండల భాజపా అధ్యక్షుడు సోమల ప్రకాష్‌నాయుడు, సంజీవరెడ్డి, అశోక్ ఉన్నారు.

మహిళా పోలీసు వలంటీరుపై దాడి

మునిమడుగు(పెనుకొండ పట్టణం), న్యూస్‌టుడే: పెనుకొండ మండలం మునిమడుగులోని చౌకదుకాణం వద్దకు రేషన్ సరకులు తీసుకునేందుకు వెళ్లిన మహిళా పోలీసు వలంటీరు లక్ష్మీనరసమ్మ.. బియ్యం తూకంలో మోసాలకు పాల్పడుతున్నారని, ఎలక్ట్రానిక్ త్రాసుపై సంచి అదనంగా ఉంచటం వల్ల కిలో బియ్యం తక్కువ వస్తోందని నిర్వహకురాలిని నిలదీశారు. దీంతో వారి మధ్య వాగ్వాదం జరిగింది. లక్ష్మీనరసమ్మపై చౌకధర దుకాణ నిర్వహకురాలు అనిత, ఆమె కుటుంబ సభ్యులు దాడి చేశారు.. బాధితురాలు పోలీసు స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు.

చెట్టు దిగని టమోటా.. రైతుకు దక్కని ధర

ధర్మవరం పట్టణం, న్యూస్‌టుడే: ఆరుగాలం శ్రమించిన అన్నదాతలకు మార్కెట్‌లో ధరలు లేక ఆందోళన చెందుతున్నారు. కోతకు వచ్చిన టమోటా కాయలను మార్కెట్‌కు తరలిస్తే నష్టాలు వస్తాయని చెట్టుపైనే వదిలివేశారు. అతివృష్టి, అనావృష్టితో ఏటా నష్టపోతున్నట్లు టమోటా రైతులు వాపోతున్నారు. ధర్మవరం నియోజకవర్గ వ్యాప్తంగా దాదాపు నాలుగు వేలు హెక్టార్లకు పైగా టమోటా సాగు చేశారు. ఎకరాకి సగటున రూ.30 వేలు పెట్టుబడి పెట్టి సాగు చేసిన పంటకు మార్కెట్‌లో నిలకడ లేని ధరల ప్రభావంతో పెట్టుబడి దక్కక నష్టపోతున్నారు. ప్రభుత్వం గిట్టుబాటు ధర కల్పించి ఆదుకోవాలని సాగు రైతులు కోరుతున్నారు.


పొలాల్లోనే పంట

ఎకరంలో టమోటా సాగుకు దాదాపు రూ.30 వేలు ఖర్చు చేస్తున్నారు. చెట్టు నిండా కాపు ఉంది. కష్టాలు తీరుతాయని అనుకున్న సమయానికి మార్కెట్‌లో ధరలు తగ్గుముఖం పట్టాయి. ప్రస్తుతం 15 కిలోల టమోటా బాక్స్ ధర రూ.15 నుంచి రూ.80 చొప్పున వ్యాపారులు కొనుగోలు చేస్తున్నారు. మార్కెట్‌కు కాయలను తొలగించడానికి ఒక్కో కూలీకి రూ.150, వాహనానికి అద్దె బాక్స్‌కు రూ.13, కాయలను విక్రయించినందుకు వ్యాపారికి వందకు రూ.10 కమిషన్, బాక్స్ దింపినందుకు హమాలీకి రూ. రెండు, బాక్స్ బాడిగ రూ. రెండు చెల్లించాలి. అనంతపురం



తోటలోనే టమోటాలు

మార్కెట్‌లో బాక్స్‌ను విక్రయించాలంటే అన్నదాతలు పెట్టుబడి సుమారు రూ.27, మదనపల్లి మార్కెట్‌లో ఖర్చు రూ.100, కోలార్ మార్కెట్‌లో రూ.50 ఖర్చు చేయాల్సి వస్తోంది. నిలకడ లేని ధరల ప్రభావంతో రైతుకు కూలీలు, అద్దెలు రూపేణ చెల్లించిన సొమ్ము దక్కక తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. కాయలు తొలగించకుండా పొలాల్లోనే వదిలి వేస్తున్నారు.



చెట్టు మీదనే మాగిన కాయలు

దళారీకే సరిపోతుంది



రెండు ఎకరాల్లో బిందు పద్ధతిన రూ.60 వేలు పెట్టుబడి పెట్టి టమోటా సాగు చేశాను. కాపుదశకు వచ్చే సరికే మార్కెట్‌ల్లో ధరలు తగ్గిపోయాయి. ప్రస్తుతం 15 కిలోల బాక్స్ ధర రూ.15 నుంచి రూ.80 పలుకుతోంది. ఈ లెక్కన కాయలను తొలగించడానికి కూలీలకు, వ్యాపారి కమిషన్, అద్దెలు రూపేణ సరిపోతుంది. చేతికందని పంటను తొలగించకుండా పొలంలోనే వదలివేశాం. ప్రభుత్వం గిట్టుబాటు ధరలు కల్పించాలి. **- రైతు వెంకటరాముడు, ఉప్పనేసినపల్లి, ధర్మవరం**

మేతకు ఇస్తున్నారు



టమోటాకు మార్కెట్‌లో గిట్టుబాటు ధర లేదు. దీంతో పొలాల్లో వదిలివేసిన టమోటా పంటను గొర్రెల మేతకు ఇస్తున్నారు. రైతుల పరిస్థితి దారుణంగా ఉంది. పంట బాగా పండిందని రైతు సంబరం పడే లోగా ధరలు తగ్గిపోతున్నాయి.

- బయన్న, గొర్రెల కాపారి, ఉప్పనేసినపల్లి, ధర్మవరం

చికిత్స పొందుతూ మహిళ మృతి

బత్తలపల్లి, న్యూస్‌టుడే: రోడ్డు ప్రమాదంలో గాయపడిన మహిళ లీలావతి(52) చికిత్స పొందుతూ మృతి చెందినట్లు ఎస్సై హారూన్‌బాషా తెలిపారు. గురువారం ఆయన పోలీస్‌స్టేషన్‌లో మాట్లాడుతూ గుత్తి మండలం తొండపాడుకు చెందిన అయ్యప్పస్వామి భక్తులు శబరిమలకు వెళ్తూ మండలంలోని కోడేకండ్ల వద్ద ఎదురుగా వచ్చిన కారు ఢీకొనడంతో తొమ్మిది మంది గాయపడిన విషయం తెలిసిందే. లీలావతి తీవ్ర గాయాలు కావడంతో 108 వాహనంలో అనంతపురం ఆసుపత్రికి తరలించారు. అక్కడ నుంచి మెరుగైన వైద్యం కోసం కర్నూలు తరలించగా గురువారం మృతి చెందినట్లు ఎస్సై పేర్కొన్నారు.

బీసీ సంఘం పట్టణ కార్యవర్గం ఎంపిక

ధర్మవరం పట్టణం,న్యూస్‌టుడే: పట్టణ బీసీ సంఘం నూతన కార్యవర్గాన్ని ఏకగ్రీవంగా ఎంపిక చేసినట్లు నియోజకవర్గ బీసీ సంక్షేమ సంఘం అధ్యక్షుడు బెస్తశివ పేర్కొన్నారు. గురువారం పట్టణ కమిటీని జిల్లా అధ్యక్షుడు రమేష్‌గౌడ్ ఆదేశాల మేరకు ఎంపిక చేశారు. పట్టణ బీసీ సంక్షేమ సంఘం అధ్యక్షుడిగా లోకేష్, ప్రధాన కార్యదర్శిగా ఏటూరి హరి, యువ అధ్యక్షుడు చింతామంజునాథ్, ప్రధాన కార్యదర్శిగా రాజును ఏకగ్రీవంగా ఎంపిక చేశారు. బీసీ సంక్షేమం కోసం కృషి చేస్తామని నూతన కమిటీ సభ్యులు వివరించారు. ఈ కార్యక్రమంలో ఆ సంఘ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.



రహదారిపై పేరుకుపోయిన చెత్తకుప్పలు

రహదారంతా చెత్తే..

ధర్మవరం, న్యూస్‌టుడే: పట్టణంలోని ప్రభుత్వ ఆసుపత్రి వెనుక రహదారిపై ఇలా చెత్త పేరుకుపోయింది. పేరుకుపోయిన చెత్తను కొద్దిరోజులుగా తొలగించకపోవడంతో రహదారంతా చెత్తమయంగా మారింది. దుర్వాసన వస్తుండటంతో రహదారిపై వెళ్లేవారు ముక్కు మూసుకు వెళుతున్నారు. సమీప ప్రాంతాల్లో నివాసమున్నవారు దుర్గంధం భరించలేక పోతున్నారు. చెత్తదిబ్బలను తొలగించే విధంగా మున్సిపల్ అధికారులు చర్యలు తీసుకోవాలని స్థానికులు కోరుతున్నారు.

ప్రజావ్యతిరేక విధానాలు అనుసరిస్తున్న ప్రభుత్వాలు

గోరంట్ల: భారత కమ్యూనిస్టు పార్టీ (సీపీఐ) ఆధ్వర్యంలో గోరంట్లలో ఈనెల 8వ తేదీ నిర్వహించే నియోజకవర్గ స్థాయి మహాసభలను జయప్రదం చేయాలని జిల్లా నాయకురాలు అమీనమ్మ కోరారు. మహాసభ ఏర్పాట్లపై మండల నాయకులతో చర్చించేందుకు గురువారం ఆమె గోరంట్లలో పర్యటించారు. ఈ సందర్భంగా విలేకరులతో మాట్లాడుతూ సీపీఐ ఆధ్వర్యంలో ప్రతి మూడేళ్లకు ఓ సారి మహాసభలు నిర్వహించడం ఆనవాయితీగా వస్తోందని ఈ క్రమంలో గోరంట్లలో ఈనెల ఎనిమిదో తేదీన సభ ఏర్పాటు చేసినట్లు తెలిపారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అనుసరిస్తున్న ప్రజావ్యతిరేక విధానాలను నిరసిస్తున్నట్లు తెలిపారు. జన్మభూమి కమిటీలు రద్దు చేయాలని ఎప్పటి నుంచో డిమాండ్ చేస్తున్నామని పేర్కొన్నారు. పెద్దలకు కట్టబెట్టడానికి పేదల నుంచి లాక్కొంటున్న భూములకు సక్రమంగా పరిహారం ఇవ్వలేదని ఆరోపించారు. కార్యక్రమంలో సీపీఐ పెనుకొండ డివిజన్ కార్యదర్శి శ్రీరాములు, మండల కార్యదర్శి ఆంజనేయులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న అమీనమ్మ

కూరగాయల ధరలు (నిన్నటివి)

ధర్మవరం: పచ్చిమిరప-రూ.25, టమోటా రూ.4, క్యారెట్ - రూ.80, కాకర -రూ.40, వంకాయలు - రూ.15, బీట్‌రూట్ - రూ.40, బంగాళాదుంపలు - రూ.15, చౌడేకాయలు - రూ.30, బీరకాయలు- రూ.30, ముల్లంగి - రూ.30, క్యాబేజి - రూ.30, బీన్స్-రూ.50, బెండ - రూ.20, ఉల్లిపాయలు - రూ.50

తెరపై ఈనాడు

లక్ష్మీనారాయణ- సప్తగిరి ఎల్‌ఎల్‌బీ, సిద్ధార్థ- 2 కంట్రీస్, వరలక్ష్మి - ఒక్క క్షణం, విజయలక్ష్మి- జ్యూమంజీ, లక్ష్మీచక్రవర్తి- రాజా ది గ్రేట్, రంగా సినీ సెంట్రల్- ఎంసీఏ, రాజా ది గ్రేట్, హలో, ప్రాజెక్ట్ జడ్

నిత్యావసర వస్తువుల ధరలు

కందిపప్పు-రూ.65, పెసరపప్పు-రూ.75, ఉద్దిబేడలు -రూ.70, శనగబేడలు - రూ.75, బియ్యం(మేలురకం) -రూ.50, రెండోరకం - రూ.40, బెల్లం -రూ.55, చక్కెర - రూ.40, ఎండుమిరప - రూ.80, గోధుమ పిండి - రూ.24, వేరుసెనగ-రూ.70

గ్యాస్ సమాచారం

శ్రీలక్ష్మి హెచ్‌పీ గ్యాస్ ఎంటర్‌ప్రైజెస్
ఫోన్ నెం.08559-222244
నమోదు తేదీ: 04.01.2018 సరఫరా తేదీ: 05.01.2018

అడుసు తొక్కనిదే.. అడుగు పడదు

చిన్నూరు(ధర్మవరం పట్టణం),న్యూస్‌టుడే: బుడి బుడి అడుగులతో చిన్నారులు బడిలోకి రాగానే పాచిపట్టిన బురద నీటిలో అడుగులు వేయాల్సిందే. ధర్మవరం పురపాలకశాఖ పరిధిలోని చిన్నూరు ప్రాథమిక పాఠశాలలో 38 మంది విద్యార్థులు ఉన్నారు. అంగన్‌వాడీ కేంద్రం కూడా అక్కడే నిర్వహిస్తున్నారు. ఈ కేంద్రంలో 15 మంది చిన్నారులు ఉన్నారు. వీరు రోజూ బురద నీటిలో నడిచి రావాలి. ఏ మాత్రం ఆదమరిచి నడిచినా కాలు జారి కింద పడుతున్నారు.



పాఠశాల ఆవరణలో పాచిపట్టిన బురద నీరు

మెరుగైన బోధన అందిస్తాం

ధర్మవరం పట్టణం, న్యూస్‌టుడే: నిష్ణాతులైన అధ్యాపకులచే మెరుగైన బోధన అందిస్తామని బాలిక జూనియర్ కళాశాల ప్రిన్సిపల్ లక్ష్మీకాంతరెడ్డి పేర్కొన్నారు. గురువారం స్థానిక సంజయ్‌నగర్ కాలనీలోని బీఎస్సార్ బాలిక, కొత్తపేట బాలిక పురపాలకోన్నత పాఠశాల పదో తరగతి బాలికలచే సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలలో పదో తరగతి విద్యాభ్యాసం చేస్తున్న విద్యార్థులు ప్రభుత్వ కళాశాలలో చేరాలని కోరారు. సర్కారు అన్ని వసతులు కల్పిస్తున్నట్లు వివరించారు. దాతల సాయంతో మధ్యాహ్న భోజన పథకాన్ని అమలు చేస్తున్నామని తెలిపారు. ఉత్తీర్ణత సాధించిన ప్రతి విద్యార్థి తప్పకుండా ప్రభుత్వ కళాశాలలో ప్రవేశం చేయాలని కోరారు. కార్యక్రమంలో కళాశాల అధ్యాపకులు, ఆ పాఠశాల ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు, తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ప్రిన్సిపల్ లక్ష్మీకాంతరెడ్డి

ధర్మవరం

నేడు జన్మభూమి జరిగే వార్డులివే..

ధర్మవరం: పట్టణంలో శుక్రవారం ఐదు వార్డుల్లో జన్మభూమి కార్యక్రమం నిర్వహించనున్నారు. 13వ వార్డు నేసేపేట, మున్సిపల్ పాఠశాల 16వ వార్డులో ఉర్దూ పాఠశాల, 17వ వార్డులో గాంధీనగర్ మున్సిపల్ పాఠశాల, 19వ వార్డులో ఇందిరానగర్ ట్యాంకు ఆవరణం, 20వ వార్డులో పీఆర్‌టీ మున్సిపల్ పాఠశాల ఆవరణంలో జన్మభూమి గ్రామసభలు నిర్వహించనున్నారు.

మానవతా దృక్పథంతో రక్తదానం చేద్దాం

కోనాపురంరోడ్డు (పెనుకొండ), న్యూస్‌టుడే: రోడ్డు ప్రమాదాల్లో గాయపడి, ఆపదలో ఉన్నవారికి రక్తదానం చేసి ఆదుకోవడానికి ప్రతి ఒక్కరూ ముందుండాలని పీఎస్ ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపల్ నాగలింగారెడ్డి పేర్కొన్నారు. గురువారం పెనుకొండలోని పరిటాల శ్రీరాములు ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో క్రెస్ట్ స్వచ్ఛంద సంస్థ ఆధ్వర్యంలో రక్తదానం- ఆవశ్యకత అంశంపై అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు.


పుస్తకాలు పంపిణీ చేస్తున్న డాక్టర్ వివేక్

విద్యాప్రగతికి సహకారం

ధర్మవరం, న్యూస్‌టుడే: విద్యార్థులు కంప్యూటర్ పరిజ్ఞానం కలిగి ఉంటేనే భవిష్యత్తులో రాణించగలరని రోటరీక్లబ్ అధ్యక్షుడు డాక్టర్ వివేక్ పేర్కొన్నారు. గురువారం పట్టణంలోని ప్రభుత్వ బాలికల జూనియర్ కళాశాల విద్యార్థినులకు దాత గోరకాటి పోతిరెడ్డి సహకారంతో కంప్యూటర్ ఫండమెంటల్స్ పుస్తకాలను అందజేశారు. కార్యక్రమంలో రోటరీక్లబ్ అసిస్టెంట్ గవర్నర్ రత్నశేఖర్‌రెడ్డి, కార్యదర్శి మంజునాథ్, ఉపాధ్యాయుడు రాజశేఖర్, సభ్యులు శివయ్య, నాగేంద్ర, కళాశాల వైస్ ప్రిన్సిపల్ శ్రీరాములు పాల్గొన్నారు.

తాగునీటి వసతి కల్పించాలి

బడనపల్లి(ధర్మవరం పట్టణం),న్యూస్‌టుడే: విద్యార్థులకు మధ్యాహ్న భోజన సమయంలో తాగడానికి మంచినీరు లేక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని ప్రధానోపాధ్యాయిని రేవతమ్మ పేర్కొన్నారు. గురువారం మండలంలోని బడన్నపల్లి మండల పరిషత్తు ప్రాథమికోన్నత పాఠశాలలో విద్యార్థుల తల్లిదండ్రుల సమావేశాన్ని ఏర్పాటు చేశారు. పాఠశాలకు కావాల్సిన మౌలిక వసతులపై చర్చించారు. పాఠశాల సమస్యలను ఉన్నతాధికారులకు నివేదిక అందిస్తామని వివరించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు బీకే ముత్యాలప్ప, హరినాథ్, నాగేశ్వరి, వసుంధర, రామాంజనేయులు, భాగ్యలక్ష్మీ, పాఠశాల ఛైర్మన్ కాంతమ్మ, సభ్యులు తదితరులు పాల్గొన్నారు.


మాట్లాడుతున్న ప్రధానోపాధ్యాయిని

అర్హులందరికీ సంక్షేమ పథకాలు


చంద్రన్న కానుకలను పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే

ధర్మవరం, న్యూస్‌టుడే: ప్రజాసంక్షేమం కోసం తెదేపా ప్రభుత్వం పని చేస్తోందని అర్హులైన వారందరికీ సంక్షేమ పథకాలు అందిస్తున్నామని ఎమ్మెల్యే గోనుగుంట్ల సూర్యనారాయణ అన్నారు. గురువారం ధర్మవరం పట్టణంలోని 11, 12, 14, 15, 18వ వార్డుల్లో జన్మభూమి సభలు నిర్వహించారు. 15వ వార్డు మున్సిపల్ పాఠశాల ఆవరణలో నిర్వహించిన జన్మభూమి కార్యక్రమానికి ముఖ్య అతిథిగా ఎమ్మెల్యే పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. ధర్మవరం పట్టణంలో ప్రతి ఒక్కరికి స్వంత ఇల్లు ఉండే విధంగా గృహాలను మంజూరు చేస్తామని పేర్కొన్నారు. 15వ వార్డులో స్వచ్ఛసర్వేక్షణ కార్యక్రమాన్ని ఎమ్మెల్యే ప్రారంభించారు. కార్యక్రమంలో మున్సిపల్‌ఛైర్మన్ బీరే గోపాలకృష్ణ, వైస్‌ఛైర్మన్ గవ్వలబాబు, నియోజకవర్గ ప్రత్యేకాధికారి వెంకటేశం, ఆర్డీవో బాలానాయక్, మున్సిపల్ కమిషనర్ రవి, తహసీల్దార్ మహబూబ్‌బాషా, కౌన్సిలర్లు నాజియా, అంబటి బద్రినాథ్, ఉడుముల రామచంద్ర, తదితరులు పాల్గొన్నారు.

ప్రతిష్ఠాత్మకంగా ముఖ్యమంత్రి పర్యటన

ధర్మవరం: ముఖ్యమంత్రి చంద్రబాబు ఈ నెల 11న ధర్మవరంలో నిర్వహించే జన్మభూమి ముగింపు సభ, జలహారతి కార్యక్రమాలతో పాటు పలు అభివృద్ధి పనులను ప్రారంభించనున్నారని ఎమ్మెల్యే గోనుగుంట్ల సూర్యనారాయణ పేర్కొన్నారు. గురువారం పట్టణంలోని లక్ష్మీచెన్నకేశవపురం వద్ద ఉన్న ఎమ్మెల్యే నివాసప్రాంగణంలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. ధర్మవరం పట్టణానికి 8,832 అపార్ట్‌మెంట్ గృహాలు మంజూరయ్యాయని రూ. 600 కోట్లతో నిర్మిస్తున్నామన్నారు. లబ్ధిదారులకు సీఎం మంజూరుపత్రాలను అందజేస్తారన్నారు. ముఖ్యమంత్రి సభకు నియోజకవర్గంలోని లక్ష మంది హాజరయ్యే విధంగా ఏర్పాట్లు చేస్తున్నామన్నారు. సమావేశంలో మార్కెట్‌యార్డు ఛైర్మన్ కమతం కాటమయ్య, తెదేపా పట్టణాధ్యక్షుడు చిప్పల మల్లికార్జున పాల్గొన్నారు.


మర్రిమాకులపల్లిలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే

తాడిమర్రి: మండలంలోని మర్రిమాకులపల్లి, ఎం.అగ్రహారంలో జన్మభూమి-మాఊరు కార్యక్రమం నిర్వహించారు. మర్రిమాకులపల్లిలో జరిగిన కార్యక్రమంలో పాల్గొన్న ఎమ్మెల్యే గోనుగుంట్ల సూర్యనారాయణ మాట్లాడుతూ అర్హులైన ప్రతి ఒక్కరికీ పింఛన్లు, రేషన్‌కార్డులు మంజూరు చేస్తామని తెలిపారు. కార్యక్రమంలో ఆయా శాఖల అధికారులు, తెదేపా నాయకులు, తదితరులు పాల్గొన్నారు.

నవ్యాంధ్ర సాకారానికి ముఖ్యమంత్రి కృషి

డి.చెర్లోపల్లి(బత్తలపల్లి): నవ్యాంధ్ర ప్రదేశ్ సాకారానికి చంద్రబాబునాయుడు శ్రమిస్తున్నారని ఎమ్మెల్యే గోనుగుంట్ల సూర్యనారాయణ అన్నారు. గురువారం మండలంలోని డి.చెర్లోపల్లి గ్రామంలో 5వ విడత జన్మభూమి-మాఊరు కార్యక్రమం నిర్వహించారు. గ్రామ సర్పంచి దరూరి చంద్రశేఖర్‌నాయుడు అధ్యక్షతన ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ నియోజకవర్గంలో ప్రతి గ్రామానికి కూడా రోడ్డు సౌకర్యం కల్పించామన్నారు. అనంతరం లబ్ధిదారులకు సంక్రాంతి కానుకలు పంపిణీ చేశారు. ప్రజలు వ్యక్తిగత మరుగుదొడ్లు నిర్మించుకుని వినియోగించాలని ఐసీడీఎస్ పీడీ వెంకటేశ్వర్లు సూచించారు. డి.చెర్లోపల్లి గ్రామంలో జరిగిన జన్మభూమి-మాఊరు కార్యక్రమంలో పాల్గొన్న ఆయన మాట్లాడారు. కార్యక్రమంలో అధికారులు, తెదేపా నాయకులు, తదితరులు పాల్గొన్నారు.

ముదిగుబ్బ: జన్మభూమి మాఊరు కార్యక్రమంలో భాగంగా ధర్మవరం శాసనసభ్యులు సూర్యనారాయణ మండలంలోని జొన్నలకొత్తపల్లి గ్రామంలో పర్యటించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రూ. 50 లక్షలు వెచ్చించి సీసీ రోడ్డు నిర్మాణం పూర్తి చేస్తే గ్రామంలో రహదారుల సమస్య ఉండదని పేర్కొన్నారు. కార్యక్రమంలో నియోజకవర్గ ప్రత్యేక అధికారి వెంకటేశం, రెవెన్యూ డివిజనల్ అధికారి బాలానాయక్, మండల అభివృద్ధి అధికారి మల్లికార్జున, తహసీల్దార్ మాధవరెడ్డి, మండల తెదేపా గ్రామీణ కన్వీనర్ దేవేందర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

అభివృద్ధే ప్రభుత్వ లక్ష్యం

దర్శనమల(ధర్మవరం పట్టణం),న్యూస్‌టుడే: ప్రజా సంక్షేమం కోసం నిత్యం శ్రమిస్తూ.. రాష్ట్రాన్ని ప్రగతి బాటలో ఉంచడానికి రాష్ట్ర ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు కృషి చేస్తున్నారని జడ్పీటీసీ సభ్యుడు రామాంజనేయులు పేర్కొన్నారు. గురువారం మండలంలోని దర్శనమల, వెంకటతిమ్మాపురం గ్రామాల్లో ఐదో విడత జన్మభూమి కార్యక్రమాన్ని ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా జడ్పీటీసీ మాట్లాడుతూ ప్రజా సమస్యలను పరిష్కరిస్తూ. ప్రగతి పనులు చేస్తున్నట్లు తెలిపారు. అనంతరం ప్రజలు విన్నవించిన సమస్యలను అధికారులు స్వీకరించారు. కార్యక్రమంలో ఎంపీపీ వేణుగోపాల్‌రెడ్డి, వైస్ ఎంపీపీ కవిత, తెదేపా మండల కన్వీనర్ శ్రీనివాసులు, ప్రత్యేకాధికారి విశ్వనాథ్, ఎంపీడీవో వెంకటరాముడు, తహసీల్దార్ మహబూబ్‌బాషా, ఏపీవో శ్రీరాములు, ఐసీడీఎస్ శ్రీదేవి, ఎంఈవో నూర్ అహ్మద్, ఏవో ఎల్లప్ప, వైద్యులు చెన్నారెడ్డి, పలు ప్రజా ప్రతినిధులు, అధికారులు తదితరులు పాల్గొన్నారు.

వ్యక్తిగత మరుగుదొడ్లు నిర్మించుకోవాలి


ధర్మవరం పట్టణం, న్యూస్‌టుడే: ప్రతి ఇంటా వ్యక్తిగత మరుగుదొడ్డి నిర్మాణం చేసుకోవాలని బాలుర జూనియర్ కళాశాల ప్రిన్సిపల్ ప్రభాకర్, ఆదర్శ పాఠశాల ప్రిన్సిపల్ సతీష్ పేర్కొన్నారు. గురువారం స్థానిక కళాశాల విద్యార్థులు ప్రదర్శనగా నినాదాలు చేస్తూ పొట్టి శ్రీరాములు కూడలిలో మానవహారం చేశారు. ఆదర్శ పాఠశాల విద్యార్థులు గుట్టకిందపల్లి కాలనీ నుంచి కొత్తపేట ఎన్టీఆర్ కూడలి వరకు ప్రదర్శన కొనసాగించారు. కార్యక్రమంలో ఆయా అధ్యాపకులు, ఉపాధ్యాయులు, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.


విద్యార్థుల చైతన్య ప్రదర్శన

10న మంత్రి లోకేష్ రాక

గాంధీకూడలి (పెనుకొండ), న్యూస్‌టుడే: ఈనెల పదో తేదీన జరిగే జన్మభూమి కార్యక్రమానికి మంత్రి లోకేష్ హాజరవుతున్నట్లు ఎమ్మెల్యే బీకే పార్థసారథి తెలిపారు. గురువారం పెనుకొండలోని ఆర్‌అండ్‌బి అతిథి గృహంలో జరిగిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ పెనుకొండలోని తాగునీటి పథకాన్ని, సీసీ రహదారులు, గోనిపేట మరువవంకపై నిర్మించిన వంతెనను మంత్రి ప్రారంభిస్తారని పేర్కొన్నారు. అనంతరం గోనిపేటలోని కాంగ్రెస్, వైకాపాలకు చెందిన పలువురు తెదేపాలోకి చేరారు. కార్యక్రమంలో తెదేపా మండల కన్వీనర్ శ్రీరాములు, నాయకులు లక్ష్మీనారాయణరెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

అమృత్ నిధులతో కొత్త అందాలు


కొత్తగా ఏర్పాటు చేసిన జారుడుబల్లలు

ధర్మవరం,న్యూస్‌టుడే: పట్టణంలోని శివానగర్ మున్సిపల్ ఉద్యానవనానికి కొత్త సొబగులు చేకూరాయి. రూపు కోల్పోయిన ఉద్యానవనాన్ని అమృత్ పథకం కింద మంజూరైన నిధులతో అభివృద్ధి చేస్తున్నారు. ఆధునికమైన జారుడుబల్లలు, ఊయలలు, ఆటవస్తువులు ఏర్పాటు చేస్తున్నారు. ఉద్యానవనంలో పిల్లలకు ఆడుకునేందుకు ఉపయోగపడే విధంగా సౌకర్యాలను కల్పిస్తున్నారు. పదేళ్ల కిందట ఏర్పాటు చేసిన శివానగర్ ఉద్యానవనం నిర్వహణను పట్టించుకోకపోవడంతో కళావిహీనంగా ఉండేది. అమృత్ నిధులతో సౌకర్యాలు కల్పిస్తుండటంతో పట్టణ ప్రజలకు సేదదీరేందుకు, సెలవుల్లో పిల్లలకు ఆడుకునేందుకు ఉద్యానవనం వినియోగంలోకి రానుంది.

స్వచ్ఛతతో అభివృద్ధి

గొట్లూరు(ధర్మవరం పట్టణం),న్యూస్‌టుడే: మన చుట్టూ ఉన్న పరిసరాలతో పాటు వ్యక్తిగత పరిశుభ్రత పాటించడానికి కలిసికట్టుగా పని చేస్తే తప్పకుండా పల్లెలు ప్రగతి సాధిస్తాయని సర్పంచి శివయ్య పేర్కొన్నారు. గురువారం మండలంలోని గొట్లూరు గ్రామ పంచాయతీలో గ్రామ సభ నిర్వహించారు. అనంతరం స్వచ్ఛ ఆంధ్రప్రదేశ్‌లో భాగంగా విద్యార్థులతో ప్రదర్శన నిర్వహించారు. ప్రతి ఇంటా వ్యక్తిగత మరుగుదొడ్లు నిర్మించుకోవాలని కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయులు, అంగన్‌వాడీ కార్యకర్తలు, తదితరులు పాల్గొన్నారు.


మాట్లాడుతున్న సర్పంచి శివయ్య

గుంతకల్లు

శిక్షణ తరగతులకు హాజరు కావాలి

గుత్తి: ఎమ్మార్పీఎస్ రాజకీయ శిక్షణ తరగతులను జయప్రదం చేయాలని గుంతకల్లు నియోజకవర్గ బాధ్యుడు అంజన్‌ప్రసాద్ కోరారు. శిక్షణా తరగతులను ఈనెల 6,7 తేదీల్లో నల్గొండలోని నాగార్జునసాగర్‌లో నిర్వహిస్తున్నట్లు చెప్పారు. గురువారం శిక్షణ తరగతుల గోడపత్రాలను విడుదల చేశారు. ఈసందర్భంగా మాట్లాడుతూ శిక్షణ తరగతుల వల్ల నాయకత్వ లక్షణాలు వస్తాయన్నారు.

13న వ్యాసరచన పోటీలు

గుత్తి, న్యూస్‌టుడే: గుత్తిలోని ఘనశ్యామ్ కంప్యూటర్స్ సంస్థ ఆధ్వర్యంలో ఈనెల 13న విద్యార్థులకు వ్యాసరచన పోటీలు నిర్వహిస్తున్నట్లు నిర్వాహకులు తెలిపారు. యువజన దినోత్సవాన్ని పురస్కరించుకుని యువతపై స్వామివివేకానందుడి జీవిత ప్రభావం అనే అంశంపై విద్యార్థులకు వ్యాసరచన పోటీలు నిర్వహిస్తున్నట్లు చెప్పారు. ఈ పోటీలు 12న రఘురామిరెడ్డి కాంప్లెక్స్‌లోని సంస్థ కార్యాలయంలో నిర్వహిస్తామన్నారు.

పొంచిఉన్న ప్రమాదం.. వీడని నిర్లక్ష్యం..

చేతికందే ఎత్తులో వేలాడుతున్న తీగలు ☛ తెలిసినా స్పందించని విద్యుత్తు యంత్రాంగం



జి.కొట్టాలలో ఇళ్లపైనే ప్రమాదకరంగా విద్యుత్తు తీగలు

గుంతకల్లు గ్రామీణం, న్యూస్‌టుడే : ఎవరికి ప్రమాదం జరిగితే మాకేంటి.. తాము బాగుంటే చాలు.. అన్నట్లుంది మండలంలోని విద్యుత్తుశాఖ పరిస్థితి. విద్యుత్తు తీగలు, స్తంభాలు, నియంత్రికలను ఎప్పటికప్పుడు పరిశీలించి ఏవైనా ప్రమాదకరంగా ఉంటే వాటిని ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లి మరమ్మతులు చేయాలి. లేదా పూర్తిగా శిథిలావస్థకు చేరి ఉంటే వాటిని తీసి వేసి నూతన స్తంభాలు ఏర్పాటు చేసి ప్రజల ఇబ్బందులు తొలగించాలి. అయితే విద్యుత్తు అధికారులు, సిబ్బంది నిర్లక్ష్యం వల్ల మండలం, పట్టణంలోని పలు ప్రాంతాల్లో విద్యుత్తు తీగలు చేతికి అందెంత ఎత్తులో ప్రమాదకరంగా ఉన్నాయి. వాటిని మార్చమని గ్రామస్థులు ఎన్నిసార్లు విన్నవించుకొన్నా విద్యుత్తు ఏఈకు, లైన్‌మ్యాన్లకు పట్టడం లేదని వాపోతున్నారు.

మండలంలోని మొలకలపెంట గ్రామంలోని బీసీకాలనీలో విద్యుత్తు స్తంభాలు సరిగ్గా లేక విద్యుత్తు తీగలు ఇళ్లకు ఆనుకొని రోడ్డుపై కిందకు వేలాడుతూ చేయి పైకి ఎత్తితే అందేలా ప్రమాదకరంగా ఉన్నాయి. ఆ దారిలో ఏవైనా ఎద్దులబండ్లు వెళ్లాలంటే ఇద్దరు వ్యక్తులు వాటి ముందు నిలబడి కర్రల సహాయంతో పైకి ఎత్తుకుంటూ పోతే వెనుక నుంచి ఎద్దులబండి పోవాల్సిన పరిస్థితి ఏర్పడింది. ఎప్పుడు ఏ ప్రమాదం జరుగుతుందో అని ప్రాణాలు గుప్పెట్లో పెట్టుకుని బతుకుతున్నారు. జి. కొట్టాల గ్రామంలోని ఎస్సీకాలనీలో, బీసీకాలనీలోను విద్యుత్తు తీగలు ఇళ్లపైనే చిన్న పిల్లలకు సైతం అందే ఎత్తులో ఇళ్లముందు కిందకు వేలాడుతూ ప్రమాదకరంగా ఉన్నాయి.



మొలకలపెంటలో ఇళ్లకు తగులుతున్న విద్యుత్తు తీగలు

వర్షం గాలి వచ్చినప్పుడు విద్యుత్తు తీగలు ఒకటికి ఒకటి తగులుకుని మెరుగులు వస్తున్నాయి. బీసీకాలనీలో కూడా ఇదే పరిస్థితి...

ఎన్. వెంకటాంపల్లి గ్రామంలో కొద్దిరోజుల కిందట తాగునీటి కోసం బోరు వేశారు. బోరు నుంచి గ్రామంలోకి సరఫరా ఇవ్వడానికి విద్యుత్తు సౌకర్యం కావాల్సి ఉంది. దాంతో గ్రామప్రజలు విద్యుత్తు కనెక్షన్ ఇవ్వాలని విద్యుత్తు అధికారులకు ఎన్నోసార్లు కోరడంతో గ్రామంలో కొద్దిరోజుల కిందట విద్యుత్తు స్తంభాలను అక్కడక్కడ అమర్చారు. కానీ, ఇంతవరకు వాటికి విద్యుత్తు తీగలను అమర్చి సరఫరా ఇవ్వలేదు. దీంతో గ్రామంలో నీటి సమస్య నెలకొంది. అధికారులకు ఎన్నిసార్లు విన్నపాలు పెట్టుకున్నా గాలికి వదిలేశారు.

పులగుట్టపల్లి గ్రామంలో బీసీ కాలనీలో కొన్నేళ్ల నుంచి స్తంభాలు లేకపోవడంతో అధికారులకు ఎన్నిసార్లు చెప్పినా పట్టించుకోకపోవడంతో గ్రామస్థులు కాలనీలో అక్కడక్కడ కర్రలను నాటుకుని వాటికి విద్యుత్తు తీగలు బిగించి వాటి సహాయంతో ఇళ్లకు విద్యుత్తు సరఫరా తీసుకున్నారు. ఆ కర్రలు చిన్నగాలి వాన వచ్చినా కిందకు పడే విధంగా ఉన్నాయి. పులగుట్టపల్లి చిన్నతండా, పెద్దతండా గ్రామాలలో ఇళ్లముందు కిందకు విద్యుత్తు నియంత్రికలు ప్రమాదకరంగా ఉన్నాయి. పట్టణంలోని దొనిముక్కలరోడ్డులోని ఇందిరమ్మ కాలనీ చివరలో విద్యుత్తు స్తంభాలు లేక కాలనీవాసులు కర్రలను నాటుకొన్నారు.

చేతికి అందేలా ఉన్నాయి



గ్రామంలోని బీసీ కాలనీలో విద్యుత్తు స్తంభాలు సరిగ్గా లేకపోవడం వల్ల విద్యుత్తు తీగలు ఇళ్లముందు, రహదారులలో కిందకు వేలాడుతున్నాయి. కాలనీలో ఎద్దులబండ్లు, ఆటోలు వెళ్లాలంటే విద్యుత్తు తీగలు తగులుతాయని కాలనీలోకి ఏవీ రావు. కాలనీ చివరిలో వాహనాలు, ఎద్దులబండ్లు పెట్టుకుని అక్కడ నుంచి బస్తాలు మోసుకోవాలి. తీగలను పైకి అమర్చాలని అధికారులకు ఎన్నిసార్లు చెప్పినా పట్టించుకోవడం లేదు.

- చంద్రప్ప, మొలకలపెంట

ప్రస్తుతం స్తంభాలు లేవు

కొన్ని గ్రామాల్లో విద్యుత్తు సమస్యలు ఉన్నట్లు మాదృష్టికి వచ్చింది. వాటిని త్వరలోనే పరిష్కరిస్తాం. ప్రస్తుతం విద్యుత్తు స్తంభాలు లేవు. ఇంతకుముందు విద్యుత్తు స్తంభాలు ఉన్నప్పుడు ఎవరూ సమస్యలు చెప్పలేదు. స్తంభాలు తక్కువగా ఉండటం వల్ల తీగలు కిందకు వేలాడుతున్నాయి. వాటిని బిగించటానికి లాగితే విద్యుత్తు స్తంభాలు విరిగే ప్రమాదం వుంది.

- శ్రీనివాసులు, గ్రామీణ ఏఈ

పాఠశాలకు బీరువా వితరణ

తిలక్‌నగర్ (గుంతకల్లు), న్యూస్‌టుడే : పట్టణానికి చెందిన సినిమా థియేటర్ యజమాని విజయభాస్కర్ కుమారుడు ప్రశీల్ వివాహ వార్షికోత్సవాన్ని పురస్కరించుకొని థియేటర్ యజమాని గురువారం పొట్టిశ్రీరాములు మున్సిపల్ పాఠశాలకు బీరువాను విరాళంగా అందించారు. సేవాభావంతో తాము బీరువాను అందజేశామని ఆయన చెప్పారు. దాన్ని ప్రధానోపాధ్యాయురాలు సుజాత, ఉపాధ్యాయులు కాశీనాథ్, పి.ఆర్.పి. రఘుకుమార్‌రావు స్వీకరించారు.

కళాశాల స్వర్ణోత్సవాన్ని నిర్వహించాలి

పాతగుంతకల్లు (గుంతకల్లు), న్యూస్‌టుడే : స్థానిక ఎస్.కె.పి. ప్రభుత్వ డిగ్రీ కళాశాలను ఏర్పాటు చేసి 50 సంవత్సరాలు పూర్తి అవుతున్న సందర్భంగా కళాశాల స్వర్ణోత్సవాన్ని నిర్వహించాలని భారత విద్యార్థి సమాఖ్య డివిజన్ కార్యదర్శి సి. రమేష్, అధ్యక్షుడు పరమేష్ అన్నారు. వారు గురువారం ప్రిన్సిపల్ డాక్టర్ జ్ఞానేశ్వర్‌కు వినతిపత్రాన్ని అందజేశారు. ఉత్సవాన్ని ఘనంగా నిర్వహించాలని, పూర్వ విద్యార్థులను ఆహ్వానించాలని వారు వినతిపత్రంలో కోరారు. కార్యక్రమంలో సమాఖ్య నాయకులు తిక్కస్వామి తదితరులు పాల్గొన్నారు.

ద్విచక్ర వాహనానికి నిప్పు

గుత్తి ఆర్.ఎస్ (గుత్తి), న్యూస్‌టుడే: గుత్తిఆర్.ఎస్.లోని మెయిన్ బజార్‌లో ఓవ్యాపారికి చెందిన ద్విచక్ర వాహనానికి గుర్తుతెలియని వ్యక్తులు నిప్పుపెట్టారు. మెయిన్‌బజార్‌లోని గోపాల్ అనే వ్యాపారి తన ఇంటి ముందు టీవీఎస్ ఎక్సెల్‌ను బుధవారం రాత్రి ఉంచాడు. రాత్రి పథకం ప్రకారం గుర్తుతెలియని వ్యక్తులు పెట్రోలు ట్యాంకును తెరిచి నిప్పుపెట్టారు. దీంతో వాహనం పూర్తిగా కాలిపోయింది. పక్కనే ఉన్న మరొకరి వాహనం పాక్షికంగా కాలిపోయింది. ఈ సంఘటనపై బాధితుడు గురువారం ఉదయం పోలీసులకు ఫిర్యాదు చేశాడు.

చౌకదుకాణంలో అక్రమాలను అరికట్టండి

హౌసింగ్‌బోర్డుకాలనీ (గుంతకల్లు), న్యూస్‌టుడే : గుంతకల్లు పట్టణం హౌసింగ్‌బోర్డు కాలనీలోని 57వ నెంబరు ప్రభుత్వ చౌకధాన్య డిపోలో అక్రమాలు జరగకుండా చర్యలు తీసుకోవాలని న్యూడెమొక్రసీ డివిజన్ కార్యదర్శి సురేష్, పట్టణ పేదల సంఘం కార్యదర్శి చిన్నా కోరారు. ఓ మహిళ పేరుతో ఉన్న స్టోరును తెదేపాకు చెందిన ఓ నాయకుడు తన అనుచరులకు అప్పగించి నిర్వహిస్తున్నారని పేర్కొన్నారు. స్టోరునుంచి నిత్యావసర వస్తువులను పేదలకు సక్రమంగా ఇవ్వకుండా అమ్ముకొంటున్నారని ఆరోపించారు. చర్యలు తీసుకోవాలని కోరారు.

5కె పరుగును విజయవంతం చేయండి

గుంతకల్లు, న్యూస్‌టుడే : ఈనెల 7న ఉదయం 7 గంటలకు రైల్వే క్రీడామైదానంలో జిల్లాస్థాయి 5కె పరుగు ప్రారంభం అవుతుందని జిల్లా కలెక్టరు తరఫున మున్సిపల్ కమిషనర్ సత్యనారాయణ తెలిపారు. కార్యక్రమంలో అధికారులు, ప్రభుత్వ సిబ్బంది, విద్యార్థులు, సేవా సంస్థల ప్రతినిధులు అన్నివర్గాల వారు హాజరుకావాలని ఆయన గురువారం తెలిపారు. కార్యక్రమంలో ప్రజాప్రతినిధులు, జిల్లా అధికారులు హాజరు అవుతున్నారని ఆయన పేర్కొన్నారు.

కర్షకుల బాగుకోసమే రైతు రథం



ట్రాక్టర్ నడుపుతున్న ఎమ్మెల్యే జితేంద్రగౌడ్

ఎన్.తిమ్మాపురం(గుంతకల్లు గ్రామీణం), న్యూస్‌టుడే : పగలు, రాత్రి కష్టపడి చెమటను చిందుస్తూ నిరంతరం శ్రమిస్తున్న రైతన్నలు బాగుండాలనే ప్రభుత్వం రైతు రథం పథకం కింద ట్రాక్టర్లను మంజూరు చేస్తున్నట్లు ఎమ్మెల్యే జితేంద్రగౌడ్ తెలిపారు. మండలంలోని ఎన్. తిమ్మాపురం గ్రామంలో రైతు రథం కింద మంజూరైన ట్రాక్టర్‌ను గ్రామానికి చెందిన భూలక్ష్మి అనే మహిళరైతుకు గురువారం ఎమ్మెల్యే పంపిణీ చేశాడు. మాట్లాడుతూ రూ.5.50లక్షలు విలువ చేసే ట్రాక్టర్‌కు రూ.1.50 లక్షల రాయితీ పోతుందని, నియోజకవర్గానికి 66 ట్రాక్టర్లు, గుంతకల్లు మండలానికి 19 మంజూరు అయినట్లు తెలిపారు. రైతులు వీటిని సద్వినియోగం చేసుకొని పంటలు బాగా పండించుకోవాలని, ట్రాక్టర్లను ఇతరులకు అమ్మకూడదని, ప్రభుత్వం అన్నదాతలను ఆదుకోవటంలో ముందుంటుందని వివరించారు. ఈ కార్యక్రమంలో వ్యవసాయధికారి రామకృష్ణ, జడ్పీటీసీ మాతృనాయక్, సింగిల్‌విండో అధ్యక్షుడు మల్లికార్జున, తెదేపా నాయకులు తదితరులు పాల్గొన్నారు.

ట్రాఫిక్ సమస్యకు చక్కని పరిష్కారం



రిసెప్షన్ కేంద్రాన్ని ప్రారంభిస్తున్న ఎస్పీ

గుంతకల్లు, న్యూస్‌టుడే : గుంతకల్లుతో పాటు జిల్లాలోని ముఖ్యమైన పట్టణాల్లో ఉన్న ట్రాఫిక్ సమస్యకు పరిష్కారం సిగ్నల్‌లైట్లు, సి.సి. కెమెరాలని అనంతపురం ఎస్పీ అశోక్‌కుమార్ అన్నారు. ఆయన గురువారం సాయంత్రం ఒకటో పట్టణ పోలీసు స్టేషన్‌ను తనిఖీచేశారు. స్టేషన్ ఆవరణలో నిర్మించిన రిసెప్షన్ కేంద్రం గదిని ప్రారంభించారు. అనంతరం జరిగిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. గుంతకల్లు, ధర్మవరం, తాడిపత్రి, హిందూపురం తదితర పట్టణాల్లో ట్రాఫిక్ పోలీసు స్టేషన్లను ఏర్పాటు చేయాలని పలువురు కోరుతున్నారని, ఈ విషయాన్ని తాము ప్రభుత్వం దృష్టికి తీసుకెళుతున్నామన్నారు. సి.సి. కెమెరాలను మరికొన్నింటిని పట్టణాల్లో ఏర్పాటు చేయాల్సిన అవసరం ఉందని తెలిపారు. కార్యక్రమంలో డి.ఎస్.పి. శ్రీధర్‌రావు, సి.ఐ.లు రాజా, గురునాథ్‌బాబు, ఎస్.ఐ.లు వెంకటప్రసాద్, చాంద్‌బాషా తదితరులు పాల్గొన్నారు. మున్సిపల్ అధ్యక్షురాలు అపర్ణ ఎస్పీని మర్యాదపూర్వకంగా కలిశారు.

గుంతకల్లు

పేదలను ఆదుకోవాలి

గుత్తి: పేదలను ఆదుకునేందుకు ప్రతి ఒక్కరూ ముందుకురావాలని లయన్స్‌క్లబ్ ప్రతినిధులు రవియాబేగం, రియాజ్, విరుపాక్షిరెడ్డి, ఎగ్బాల్ కోరారు. ఆపదలో ఉన్నవారిని ఆదుకోవాలన్నారు. మానవత్వంతో పేదలు, ఆపదలో ఉన్నవారిని ఆదుకోవాలని చెప్పారు. గురువారం గుత్తిలోని వ్యవసాయ మార్కెట్‌యార్డులో రైతులకు క్లబ్ తరఫున అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహించారు. అన్నదాన కార్యక్రమాన్ని ఈనెల 11వరకు నిర్వహిస్తామన్నారు.

చికిత్స పొందుతూ మహిళ మృతి

బత్తలపల్లి, న్యూస్‌టుడే: రోడ్డు ప్రమాదంలో గాయపడిన మహిళ లీలావతి(52) చికిత్స పొందుతూ మృతి చెందినట్లు ఎస్సై హారూన్‌బాషా తెలిపారు. గురువారం ఆయన మాట్లాడుతూ గుత్తి మండలం తొండపాడుకు చెందిన అయ్యప్పస్వామి భక్తులు శబరిమలకు వెళ్తూ మండలంలోని కోడేకండ్ల వద్ద ఎదురుగా వచ్చిన కారు ఢీకొనడంతో తొమ్మిది మంది గాయపడిన విషయం తెలిసిందే. లీలావతి తీవ్ర గాయాలు కావడంతో 108 వాహనంలో అనంతపురం ఆసుపత్రికి తరలించారు. అక్కడ నుంచి మెరుగైన వైద్యం కోసం కర్నూలు తరలించగా గురువారం మృతి చెందినట్లు ఎస్సై పేర్కొన్నారు.



సభలో ప్రసంగిస్తున్న ఎమ్మెల్యే


గర్భిణులకు సీమంతాలు చేస్తున్న ఎంపీడీవో


మానవహారంగా ఏర్పడి నినాదాలు చేస్తున్న విద్యార్థులు

తెరపై ఈనాడు

గుంతకల్లు గ్రామీణం, న్యూస్‌టుడే : వాసవి : ఎం.సి.ఏ(మిడిల్ క్లాస్ అబ్బాయ్), **కేపీఎస్ :** హలో, **చైతన్య :** 2 కంట్రీస్.

కూరగాయల ధరలు

టమోటా : రూ. 05, మిరప : 20, బీరకాయ : 30, ఉర్లగడ్డ : 30, క్యారెట్ : 40, ఉల్లిగడ్డ : 40, వంకాయ : 30, బెండకాయ : 30

అభివృద్ధి తెదేపాతోనే సాధ్యం

నక్కనదొడ్డి (గుంతకల్లు గ్రామీణం), న్యూస్‌టుడే : గత ప్రభుత్వాలలో ఎన్నడూ జరగని అభివృద్ధి తెదేపా ప్రభుత్వంతోనే సాధ్యం అయిందని ఎమ్మెల్యే జితేంద్రగౌడ్ పేర్కొన్నారు. మండలంలోని నక్కనదొడ్డి, ఎన్.తిమ్మాపురం, గుండాల గ్రామాలలో సర్పంచులు తులసీరామ్‌చౌదరి, సుగుణమ్మ అధ్యక్షతన గురువారం 5వ విడత జన్మభూమి మాఊరు కార్యక్రమం జరిగింది. ఈ కార్యక్రమంలో ఎంపీపీ రాయల రామయ్య, ఎంపీడీవో శంకర్, తహసీల్దారు హరిప్రసాద్, మండల ప్రత్యేక అధికారిని విజయలక్ష్మి, మార్కెట్‌యార్డు ఛైర్మన్ గుమ్మనూర్ వెంకటేశు, మాజీ సర్పంచి సంజప్ప, తెదేపా నాయకులు రామాంజనేయులు, మారుతి ప్రసాద్, తలారి మస్తానప్ప తదితరులు పాల్గొన్నారు.

తిలక్‌నగర్ (గుంతకల్లు): ప్రజలు అనారోగ్యానికి గురై ఆసుపత్రుల చుట్టూ తిరుగుతూ డబ్బును ఖర్చు పెట్టుకొనే అవసరం లేకుండా ఉండాలన్న ఉద్దేశంతోనే ప్రభుత్వం స్వచ్ఛాంధ్రప్రదేశ్ కార్యక్రమాన్ని అమలు చేస్తోందని ఎమ్మెల్యే జితేంద్రగౌడ్, మున్సిపల్ అధ్యక్షురాలు అపర్ణ అన్నారు. జన్మభూమి కార్యక్రమంలో భాగంగా తిలక్‌నగర్‌లో జరిగిన సభలో వారు ప్రసంగించారు. 17వ వార్డులో జరిగిన జన్మభూమి కార్యక్రమంలో పాల్గొనడానికి వచ్చిన ప్రజలను వైకాపాకు చెందిన కౌన్సిలర్ నగరత్న, ఈమె భర్త వాసు వెనుకకు పంపడానికి ప్రయత్నించారు. ఇందుకు అపర్ణ, శ్రీనాథ్ గౌడ్ అభ్యంతరం తెలిపారు. వైద్యసిబ్బంది వైద్య శిబిరాన్ని ఏర్పాటు చేశారు. ఎస్.ఎస్.జి.ఎస్. డిగ్రీ కళాశాల ఎన్.ఎస్.ఎస్. అధికారి కృష్ణయ్య ఆధ్వర్యంలో సాంస్కృతిక ప్రదర్శనలు జరిగాయి. కమిషనర్ సత్యనారాయణ, మున్సిపల్ ఇంజినీరు ఈశ్వరయ్య, ఉప తహసీల్దారు సుబ్బలక్ష్మి, సహాయ సిటీ ప్లానర్ శివనారాయణ, తెదేపా అధ్యక్షుడు ఆనంద్, మార్కెట్‌యార్డు, ఆసుపత్రి అభివృద్ధి సంఘం అధ్యక్షులు వెంకటేశులు, చంద్రశేఖర్ రావు, కౌన్సిలర్లు, తెదేపా నాయకులు పాల్గొన్నారు.

కసాపు రంగోడ్డు (గుంతకల్లు): గ్రామాల్లో, పట్టణాల్లో అందరూ సుఖంగా, సంతోషంగా జీవించాలంటే మన పొరుగున ఉన్నవారు కూడా సంతోషంగా జీవించే విధంగా చూసుకోవాల్సిన అవసరం ఉందని ఎస్.ఎస్.జి.ఎస్. ఎయిడెడ్ డిగ్రీ కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ రామకృష్ణ నాయుడు అన్నారు. కళాశాలలో గురువారం జన్మభూమి- మాఊరు కార్యక్రమంలో భాగంగా సదస్సు జరిగింది. విద్యార్థులకు వివిధ పోటీలను నిర్వహించి బహుమతులను అందజేశారు. కార్యక్రమంలో ఎన్.ఎస్.ఎస్. అధికారి కృష్ణయ్య, అధ్యాపకులు చంద్రప్ప, రాజేష్, సుల్తాన్‌బాషా తదితరులు పాల్గొన్నారు.

చెర్లోపల్లి(గుత్తి గ్రామీణం): మండలంలోని చెర్లోపల్లి, బ్రహ్మణపల్లి గ్రామాల్లో సర్పంచి మల్లికార్జున, కొండయ్య అధ్యక్షతన జన్మభూమి..మాఊరు ఐదో విడత కార్యక్రమాన్ని నిర్వహించారు. ఎంపీపీ వీరభద్రయ్య, మండల ప్రత్యేక అధికారి రామారావు, ఎంపీడీవో జలజాక్షి, తహసీల్దార్ విజయకుమారి, అధికారులు శశికళ, వేణుగోపాల్, నాయకులు శ్రీనివాసయాదవ్, తదితరులు పాల్గొన్నారు.

పి.కొండాపురం (పామిడి): ప్రజా సంక్షేమమే ప్రభుత్వ ధ్యేయమని నగర పంచాయతీ ఛైర్మన్ గౌసేపీరా పేర్కొన్నారు. గురువారం స్థానిక నగర పంచాయతీ పరిధిలోని పి.కొండాపురం 1, 2 వార్డులలో కమిషనరు నాసిర్‌హుసేన్ ఆధ్వర్యంలో జన్మభూమి..మాఊరు కార్యక్రమం జరిగింది. ఈ కార్యక్రమంలో పట్టణ కన్వీనర్ మోహనకృష్ణ, ప్రధాన కార్యదర్శి శ్రీరాములు, అన్ని వార్డుల కౌన్సిలర్లు, కోఆప్షన్ సభ్యులు, వైద్యులు రాధారాణి, సీహెచ్‌వో రామలక్ష్మమ్మ, వైద్య సిబ్బంది, మెప్మా సీవో చంద్రశేఖర్, మెప్మా మహిళలు, ఆయా వార్డుల ప్రజలు తదితరులు పాల్గొన్నారు.

ఎద్దులపల్లి (పామిడి): ప్రజా సమస్యలను పరిష్కారమే ధ్యేయంగా తమ ప్రభుత్వం ఐదో విడత జన్మభూమి..మాఊరు కార్యక్రమాన్ని చేపట్టిందని ఎంపీపీ సుమిత్రమ్మ, జడ్పీటీసీ జయలక్ష్మి ఉద్ఘాటించారు. గురువారం మండలంలోని ఎద్దులపల్లి, సొరకాయలపేట గ్రామాలలో ఎంపీడీవో రమేష్‌నాయక్, తహసీల్దార్ రమణారెడ్డిల ఆధ్వర్యంలో జన్మభూమి..మాఊరు కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా అధికారులు మాట్లాడుతూ సమస్యలను తమ దృష్టికి తెచ్చి పరిష్కరించుకోవాలని ఆయా గ్రామాల ప్రజలకు కోరారు. ప్రజాప్రతినిధులు మాట్లాడుతూ జన్మభూమి.. మాఊరు కార్యక్రమాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు. ప్రభుత్వం ప్రవేశపెడుతున్న ప్రజా సంక్షేమ పథకాలను క్షుణ్ణంగా తెలియజేశారు. అనంతరం కొత్త రేషన్‌కార్డులను లబ్ధిదారులకు అందజేశారు. ఈ కార్యక్రమంలో మండల కన్వీనర్ ముసలిరెడ్డి, అన్ని శాఖల అధికారులు, మండల ప్రత్యేకాధికారి వెంకటశివారెడ్డి, సర్పంచులు, ఎంపీటీసీలు, వెలుగు మహిళలు, అంగన్వాడీ కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

పామిడి: జన్మభూమి..మాఊరు కార్యక్రమంలో భాగంగా గురువారం స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాల విద్యార్థులు, అధ్యాపకులు ఆయన ఆధ్వర్యంలో వ్యక్తిగత మరుగుదొడ్ల వినియోగం, ఆరోగ్య పరిరక్షణ గురించి పుర వీధుల్లో ర్యాలీ నిర్వహించారు. ఎన్ఎస్ఎస్ పీవో జయరాంనాయక్, అధ్యాపకులు మల్లికార్జున, రామాంజనేయులు, ప్రతాప్, సురేష్, భాస్కర్ రెడ్డి, అక్కులన్న, సుబ్రమణ్యం, వెంకటరమణ, రాములు, రఫీ, విద్యార్థులు పాల్గొన్నారు.

వ్యక్తిగత మరుగుదొడ్లను నిర్మించుకోండి

గుత్తి,న్యూస్‌టుడే: గుత్తిపురపాలికలో ప్రజలు వ్యక్తిగత మరుగుదొడ్లను నిర్మించుకోవాలని కమిషనర్ ఇబ్రహీం కోరారు. ఒక్కో మరుగుదొడ్డి నిర్మాణంకు రూ. 15వేలు ఇస్తామన్నారు. మరుగుదొడ్లవాడటం వల్ల ఆరోగ్య ఖర్చులను తగ్గించుకోవచ్చునన్నారు. స్వచ్ఛభారత్ కార్యక్రమంలో భాగంగా ప్రభుత్వం మరుగుదొడ్లను మంజూరు చేస్తోందన్నారు. ప్రతి ఇంటికీ మరుగుదొడ్డి నిర్మించుకునేందుకు ప్రజలు ముందుకురావాలని కోరారు. ప్రభుత్వం ప్రజాసంక్షేమానికి పెద్దపీటవేస్తోందని పురపాలిక ఛైర్‌పర్సన్ తులశమ్మ అన్నారు. గురువారం గుత్తి,గుత్తిఆర్.ఎస్.లలోని మూడు కాలనీల్లో జన్మభూమి-మాఊరు కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈసందర్భంగా ఆమె మాట్లాడుతూ పేదల అభ్యున్నతికి ప్రభుత్వం అనేక పథకాలను అమలు చేస్తోందన్నారు. పథకాలను సద్వినియోగం చేసుకోవాలని చెప్పారు. పథకాలను అర్హులకే అందించేందుకు పాటుపడతామన్నారు. కార్యక్రమంలో ఉపతహసీల్దారు మునివేలు, డీఈఈ శేఖర్, ఏఈ శ్రీకాంత్, ప్రభుత్వ ఆసుపత్రి వైద్యుడు శ్రీనివాసబాబు, ఐసీడీఎస్ అధికారులు, మెప్మా అధికారులు,పట్టణ బ్యాంకు అధ్యక్షుడు అబ్దుల్‌జిలాన్ పాల్గొన్నారు.



మాట్లాడుతున్న కమిషనర్ ఇబ్రహీం

చైతన్యవంతులు కావాలి

తొండపాడు(గుత్తి గ్రామీణం), న్యూస్‌టుడే: మహిళలు చైతన్యవంతులుగా ఎదిగినప్పుడే అన్ని రంగాల్లో రాణించగలుగుతారని ప్రాథమిక పాఠశాల ప్రధానోపాధ్యాయుడు మధుబాబు పేర్కొన్నారు. మండలంలోని తొండపాడు గ్రామంలో మహిళ ఉపాధ్యాయ దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. సావిత్రిబాయి చిత్రపటానికి పూలమాల వేసి నివాళులు అర్పించారు. మహిళలకు విద్యా బుద్ధులు నేర్పించేందుకు సావిత్రపూలే ఎంతో కృషి చేశారన్నారు. ఉపాధ్యాయురాలైన పవనకుమారి, అరుణదేవి, శైలజకుమారిలను ఉపాధ్యాయులు సన్మానించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.


సావిత్రిబాయికి నివాళులు అర్పిస్తున్న ఉపాధ్యాయులు

శాంతి, న్యాయాన్ని నెలకొల్పడమే ధ్యేయం


కాలమానిని ఆవిష్కరిస్తున్న డి.ఎస్.పి.

విజయనగర్‌కాలనీ (గుంతకల్లు), న్యూస్‌టుడే : సమాజంలో అలజడులు, అశాంతి కారణంగా ఇతరులు ఇబ్బందులు పడకుండా తమవంతు కృషిచేస్తున్నామని మూవ్‌మెంట్ ఫర్ పీస్ అండ్ జస్టిస్ సంస్థ జిల్లా అధ్యక్షుడు డాక్టర్ నజీర్ హుసేన్ అన్నారు. సంస్థ ముద్రించిన కాలమానిలను గురువారం సాయంత్రం డి.ఎస్.పి. శ్రీధర్‌రావు, సభ్యులు ఆవిష్కరించారు. కొత్త కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు. అధ్యక్షులుగా అల్లాబకష్, ఉపాధ్యక్షుడు మక్దూమ్, ప్రధానకార్యదర్శి నవాజ్, సంయుక్త కార్యదర్శి జిలాని ఎంపిక అయ్యారు. కార్యక్రమంలో సంస్థ రాష్ట్ర ఉపాధ్యక్షుడు జమీల్, నంద్యాల శాఖ అధ్యక్షుడు మహమ్మద్ హుసేన్ పాల్గొన్నారు.

విద్యార్థి సేన ఆధ్వర్యంలో...

విద్యార్థులను విజ్ఞానవంతులుగా చేయడానికి, సేవా కార్యక్రమాలు చేసేందుకు విద్యార్థిసేన నాయకులు చేస్తున్న కృషి అమోఘమని పట్టణ సి.ఐ. రాజా అన్నారు. విద్యార్థిసేన ముద్రించిన కాలమానికలను ఆయన గురువారం విడుదల చేశారు. విద్యార్థి సేన జిల్లా అధ్యక్షుడు అబ్దుల్ బాసిద్ నాయకులు సత్తార్, అనిల్‌కుమార్, వీరేంద్ర, సుధాకర్, నరేష్, వంశీ, ఎస్.ఐ.లు చాంద్‌బాషా, శ్రీరాములు పాల్గొన్నారు.

సమస్యల పరిష్కారంలో ముందంజ

పామిడి: ఉపాధ్యాయ సమస్యల పరిష్కారంలో ఎస్టీయూ ముందంజలో ఉందని ఆ శాఖ మండల అధ్యక్షుడు నాగభూషణ పేర్కొన్నారు. గురువారం స్థానిక మండల విద్యాధికారి కార్యాలయ ఆవరణలో పార్టీ కాలమానిని ఆవిష్కరణ కార్యక్రమం జరిగింది. ఈ కార్యక్రమానికి ఎంఈవో జయరామ్‌నాయక్, తహసీల్దార్ రమణారెడ్డి, నగర పంచాయతీ ఛైర్మన్ గౌసేపీరా, ఎంపీపీ సుమిత్రమ్మ, జడ్పీటీసీ జయలక్ష్మి తదితరులు హాజరై ఆ శాఖ కాలమానిని ఆవిష్కరించారు. సీపీఎస్ రద్దుకు ఉపాధ్యాయ, ఉద్యోగవర్గాలు పెద్దఎత్తున ఉద్యమించాల్సిన అవసరం ఉందన్నారు. పాత పింఛన్ విధానాన్ని పునరుద్ధరించాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో ప్రధాన కార్యదర్శి దేవియల్, గౌరవాధ్యక్షులు కుళ్లాయప్ప, కోశాధికారి ఆదినారాయణ, ఉపాధ్యక్షులు రామాంజనేయులు, సహాయ కార్యదర్శులు జి.రామాంజనేయులు, గోవిందరెడ్డి, సభ్యులు ఆనందరెడ్డి, రామకృష్ణ, శంకరయ్య, మధు, వెంకటనారాయణ, విజయభాస్కర్, సురేష్‌బాబు, జిల్లా కౌన్సిలర్లు, తెదేపా నాయకులు పాల్గొన్నారు.


కాలమానిలను ఆవిష్కరిస్తున్న డి.ఎస్.పి.

5కే రన్‌ను జయప్రదం చేయండి

కదిరి, న్యూస్‌టుడే: జన్మభూమి మాఊరు కార్యక్రమంలో భాగంగా ఈనెల ఏడున నిర్వహించే 5కే రన్ కార్యక్రమంలో ప్రజలు పాల్గొని జయప్రదం చేయాలని కమిషనర్ ప్రమీల తెలిపారు. ఆదివారం ఉదయం ఆరు గంటలకు స్థానిక మున్సిపల్ కార్యాలయం నుంచి 5కే రన్ ప్రారంభం అవుతుందన్నారు. ప్రజలు పెద్దసంఖ్యలో పాల్గొని జయప్రదం చేయాలని ఆమె కోరారు.

చంద్రన్న బీమా పంపిణీ

తలుపుల, న్యూస్‌టుడే: చంద్రన్న బీమా తక్షణ సహాయం కింద బాధిత కుటుంబానికి రూ.5వేల నగదును పంపిణీ చేసినట్లు సర్పంచి ఫయాజ్, చంద్రన్న బీమా కార్యకర్త కళావతి తెలిపారు. తలుపుల పూలబజార్‌కు చెందిన నూర్జహన్ గురువారం అనారోగ్యంతో చనిపోయింది. ఆమె భర్త మహబూబ్‌పీరాకు తక్షణం సహాయం కింద రూ.5వేలను పంపిణీ చేశారు. మిగతా రూ.1.95లక్షలు బ్యాంకు ఖాతాలో జమ అవుతుందన్నారు.

జీవాల దాహం తీరే దారేది?



పక్కపక్కనే రెండు నీటితొట్టెలు

తలుపుల, న్యూస్‌టుడే: తలుపుల వారపు సంతలో గొర్రెలు, మేకలకు దాహార్తిని తీర్చడానికి నిర్మించిన తాగు నీటి తొట్టెలు మూడున్నా, ఒక్క తొట్టిలో కూడా తాగునీరు అందుబాటులో ఉండటంలేదు. సంతకు వచ్చే గొర్రెలు, మేకలు నీటికోసం నకనకలాడుతున్నాయని పలువురుకాపరులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. సంత చుట్టుపక్కల వంకలు, వాగులు, నీటి కుంటలు లేకపోవడంతో గొర్రెల దాహార్తికి తీరని కష్టాలు నెలకొన్నాయని పలు గ్రామాల ప్రజలు వాపోతున్నారు. ఈ సంతవల్ల పంచాయతీకి ప్రతి ఏటా రూ.వేలల్లో ఆదాయం వస్తున్నా.. అభివృద్ధికి ఏమాత్రం పట్టించుకున్న దాఖలాలు లేవు. ప్రతి శుక్రవారం సంత జరుగుతుంది. తలుపుల మండలం నుంచే కాకుండా నంబులపూలకుంట, కదిరి మండలాలకు చెందిన పశువుల కాపరులు సంతకు గొర్రెలు, మేకలను తీసుకొస్తుంటారు. వేలల్లో గొర్రెలు, మేకలు వస్తాయి. ఉదయం నుంచి మధ్యాహ్నం వరకే సంత జరిగినా, చాలా రద్దీగా ఉంటుంది. సంతలో మూడు నీటి తొట్టెలను గతంలో నిర్మించారు. కానీ అందులో ఒక తొట్టెను పూడ్చివేశారు. మరో తొట్టెకు నీటి కనెక్షన్ ఇవ్వలేదు. ఇంకో తొట్టెకు ఇచ్చిన కనెక్షన్ మరమ్మతులకు నోచుకుంది. సంత వల్ల పంచాయతీకి మంచి ఆదాయం ఉన్నా.. అధికారులు, ప్రజాప్రతినిధులు ఎవరూ పట్టించుకోవడం లేదని గ్రామస్థులు, వ్యాపారులు విమర్శిస్తున్నారు. సంబంధిత అధికారులు, ప్రజాప్రతినిధులు స్పందించి గొర్రెల దాహార్తిని తీర్చాలని కోరారు.

★ పరిశీలించి చర్యలు తీసుకొంటా: ఈశ్వరయ్య కార్యదర్శి, తలుపుల వారపు సంతలో తాగునీటి సమస్య ఉన్నట్లు నా దృష్టికి రాలేదు. సంతలో మూడు నీటి తొట్టెలు ఉన్నా, అందులో లార్వా వృద్ధి చెంది పశువులు అనారోగ్యం చెందుతున్నాయని వైద్యుల సూచనల మేరకు ఒక తొట్టెకు పూడ్చివేశాం. ఒక తొట్టెకు మాత్రమే నీటి కనెక్షన్ ఇచ్చాం. దానికున్న కొళాయిని తొలగించినట్లు నాకు తెలియదు. పరిశీలించి చర్యలు తీసుకొంటా.



తొట్టె ఉంది.. నీరే లేదు



తొలగించిన కొళాయి



ఎమ్మెల్యేకు విన్నవిస్తున్న విద్యార్థులు

పాఠశాలకు ప్రహరీ నిర్మించరూ

గాండ్లపెంట, న్యూస్‌టుడే: మండలపరిధిలోని కటారుపల్లిలో నిర్వహిస్తున్న జన్మభూమి కార్యక్రమంలో పాల్గొనడానికి విచ్చేసిన ఎమ్మెల్యే అత్తార్ చాంద్‌బాషాకు ప్రధానోపాధ్యాయిని సంపూర్ణ, విద్యార్థులు పాఠశాల ఆవరణలో నెలకొన్న సమస్యలను పరిష్కరించాలని విన్నవించుకున్నారు. విద్యార్థులు ఎమ్మెల్యేతో మాట్లాడుతూ పాఠశాలకు ముందుభాగంలో ప్రహరీ దెబ్బతినడంతో జీవాలు వస్తున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. మరుగుదొడ్లుకు నీటి సౌకర్యం లేక చాలా ఇబ్బందులు ఎదుర్కొంటున్నట్లు ఆయన దృష్టికి తీసుకొచ్చారు. తాగునీటి సౌకర్యం కల్పించాలని కోరారు. త్వరలోనే సమస్యలను పరిష్కరిస్తామని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయులు, పలువురు నాయకులు ఉన్నారు.

పవర్‌గ్రిడ్స్ పనులను ఆపేయాలి

తలుపుల, న్యూస్‌టుడే: ఎలాంటి సమాచారం ఇవ్వకుండా, నష్టపరిహారం చెల్లించకుండా చేస్తున్న పవర్‌గ్రిడ్స్ పనుల వల్ల తాము నష్టపోతున్నామని పలు గ్రామాలకు చెందిన రైతులు వాపోయారు. పవర్‌గ్రిడ్స్ పనులను నిలిపేయాలని తూపల్లి, నంగివాండ్లపల్లి తదితర గ్రామాల రైతులు గురువారం తహసీల్దారు శివయ్యకి వినతి పత్రం అందించారు. వారు మాట్లాడుతూ 440 కేవీ విద్యుత్తు లైన్ లాగడం వల్ల లైను కింద ఉన్న వ్యవసాయ బోరుబావులు పూర్తిగా దెబ్బతింటాయి. వాటితోపాటు పండ్లతోటలు, ఇతర పంటలు సాగుచేసుకోవడానికి వీల్లేకుండా పోతుందని ఆవేదన వ్యక్తం చేశారు. పవర్‌గ్రిడ్స్ లైన్ల నిర్మాణాల వల్ల నష్టపోతున్న రైతులకు ఇతర రాష్ట్రాల్లో భారీగా పరిహారం చెల్లిస్తుంటే ఇక్కడ మాత్రం గుత్తేదారులు, అధికారులు ఆ విషయాన్ని బయటకి రాకుండా రైతులకు ఎలాంటి నోటీసులు ఇవ్వకుండా పనులు చేస్తున్నారన్నారు. తక్షణం పనులను ఆపేయాలని తహసీల్దారును కోరారు.



క్యాలెండర్లను ఆవిష్కరిస్తున్న నాయకులు

ఎన్టీఆర్ క్యాలెండర్లు ఆవిష్కరణ

తలుపుల, న్యూస్‌టుడే: జూనియర్ ఎన్టీఆర్‌కు సంబంధించిన 2018 క్యాలెండర్లను ఆయన అభిమానులు, తెదేపా నేతలు గురువారం పార్టీ కార్యాలయంలో ఆవిష్కరించి సందడి చేశారు. తలుపుల ఆసుపత్రి అభివృద్ధి కమిటీ ఛైర్మన్ వీరబార్గవ్‌రెడ్డి మాట్లాడారు. తాతకు తగ్గ మనవుడిగా ప్రజల హృదయాల్లో సుస్థిర స్థానం సంపాదిస్తున్న జూనియర్ ఎన్టీఆర్ మరింత ఉన్నతస్థాయికి ఎదగాలని కోరుకున్నారు. కార్యక్రమంలో ఎన్టీఆర్ ఫ్యాన్స్ కదిరి అధ్యక్షుడు చైతన్య, తలుపుల అధ్యక్షుడు అజుంతుల్లా, తెదేపా నాయకులు ముబారక్, జయచంద్ర, మహేశ్వర, రాముడు, రమణ, రఘునాథ్‌రెడ్డి కార్యకర్తలు, అభిమానులు పాల్గొన్నారు.

సత్యసాయి ప్రాజెక్టు భద్రతా వారోత్సవాలు

కొత్తచెరువు, న్యూస్‌టుడే: కొత్తచెరువు మార్కెట్‌యార్డులోని సత్యసాయి పంపుహౌస్‌లో ధర్మవరం జోన్ ఇన్‌ఛార్జి దుర్గాప్రసాద్ అధ్యక్షతన ఏర్పాటు చేసిన భద్రతా వారోత్సవాల కార్యక్రమానికి డి.ఈ వెంకటరాజ్‌కుమార్, జిల్లా మేనేజరు మోహన్‌దాస్‌లు హాజరయ్యారు. ఈ సందర్భంగా సత్యసాయి ప్రాజెక్టు సిబ్బంది పాటించాల్సిన నిబంధనలు, భద్రతా సూచనల గురించి వివరించారు. విధుల్లో, సాధారణ దైనందిన కార్యకలాపాల్లో భద్రతా ప్రమాణాలు, నిబంధనలను బాధ్యతగా పాటించాలన్నారు. అనంతరం పంపుహౌస్‌లో మొక్కలను నాటారు. కార్యక్రమంలో సేఫ్టీ ఇంజినీర్ లక్ష్మణ్‌కుమార్, పరిపాలనా విభాగం ప్రతినిధులు శ్రీకాంత్, కొండయ్య, రంజిత్‌కుమార్, పర్యవేక్షకులు జయచంద్ర, రమేష్ తదితరులు పాల్గొన్నారు.



మొక్క నాటుతున్న సిబ్బంది

నేడు ఎన్టీఆర్ విగ్రహావిష్కరణ

కొండకమర్ల (ఓబుళదేవరచెరువు): కొండకమర్లలో శుక్రవారం ఎన్టీఆర్ విగ్రహ ఆవిష్కరణ జరగనున్నట్లు రాష్ట్ర మైనార్టీ కార్పొరేషన్ డైరెక్టర్ అల్లాబకాష్, ఎంపీపీ ఇస్మాయిల్ పేర్కొన్నారు. కార్యక్రమానికి చీఫ్ విప్ పల్లె రఘునాథరెడ్డి, ఎంపీ నిమ్మలకిష్టప్ప, జిల్లా పరిషత్తు ఛైర్మన్ పూలనాగరాజు హాజరవుతారని తెలిపారు. మండలంలోని తెదేపా నాయకులు, కార్యకర్తలు పాల్గొనాలని కోరారు.

ఏపీటీఎఫ్ కాలమానిని విడుదల

గాండ్లపెంట, న్యూస్‌టుడే: మండల వనరుల కేంద్రంలో గురువారం ఏపీటీఎఫ్ 2018 కాలమానిని, దైనందిని ఎంఈవో కృష్ణానాయక్ విడుదల చేశారు. ఈ సందర్భంగా ఏపీటీఎఫ్ నాయకులు మాట్లాడుతూ ఉపాధ్యాయుల సమస్యలపై ఏపీటీఎఫ్ పోరాడి సమస్యల పరిష్కారానికి కృషి చేస్తోందన్నారు. కార్యక్రమంలో కదిరి జోన్-2 కార్యదర్శి ఆదిబయన్న, మండల అధ్యక్షుడు ఇమాం ఖాసీం, జిల్లా కౌన్సిల్ సభ్యులు రమణారెడ్డి, మండల సభ్యులు రమేష్, అమరనాథ్, రామమోహన్, బాబావలి, రామసుబ్బయ్య, ముదార్‌షావలి, హనుమంత్‌రెడ్డి, శ్రీనునాయక్ తదితరులు పాల్గొన్నారు.



కాలమానిని విడుదల చేస్తున్న ఎంఈవో

సూపర్‌వైజరు పోస్టులను భర్తీ చేయాలి

కదిరి, న్యూస్‌టుడే: అనంతపురం రీజియన్‌లోని ఆర్టీసీ డిపోల్లో ఖాళీగా ఉన్న సూపర్‌వైజర్ పోస్టులను భర్తీచేయాలని ఎన్‌ఎంయూ రాష్ట్ర ఆర్గనైజింగ్ కార్యదర్శి హరిమోహన్ గురువారం స్టేట్ పర్సనల్ ఆఫీసర్ అశ్విన్‌కుమార్‌కు విన్నవించారు. పదోన్నతిపై అనంతపురంలో బాధ్యతలు చేపట్టిన ఆయన్ను హరిమోహన్ కలిసి అభినందనలు తెలిపారు. ఏపీఎస్ ఆర్టీసీలో అశ్విన్‌కుమార్ 1979లో కండక్టరు చేరి అంచెలంచలుగా ఎదిగి రాష్ట్ర పర్సనల్ అధికారి హోదాను చేపట్టడం హర్షణీయమన్నారు. రీజియన్‌లో పెండింగ్‌లోని గ్రేడ్-1 పదోన్నతులు, బదిలీల సమస్యలతో పాటు మడకశిర, రాయదుర్గం, పెనుకొండ, ధర్మవరం డిపోల్లో సూపర్‌వైజర్ పోస్టుల ఖాళీలను భర్తీచేయాలని విన్నవించారు. అంతేగాకుండా మరమ్మతులకు గురైన, కాలం చెల్లించిన కంప్యూటర్లను మార్చి కొత్తవి ఏర్పాటు చేయాలని విన్నవించారు. సమస్యలపై సానుకూలంగా స్పందించిన అశ్విన్‌కుమార్ సాధ్యమైనంత త్వరలో పరిష్కారానికి కృషి చేస్తామని తెలిపారు.

కదిరి

జూదరుల అరెస్టు

తనకల్లు, న్యూస్‌టుడే: కొక్కంటిక్రాస్‌లోని ఒక ఇంటిలో జూదమాడుతున్నట్లు సమాచారం రావడంతో దాడి చేసి ముగ్గురిని పట్టుకున్నట్లు ఎస్సై శ్రీనివాసులు తెలిపారు. వారి నుంచి రూ. 13,450 స్వాధీనం చేసుకున్నామని, నిందితులను శుక్రవారం కోర్టులో హాజరుపరచనున్నట్లు పేర్కొన్నారు.

కూరగాయల ధరలు నిన్నటివి (కిలో.రూ.ల్లో)

కదిరి పట్టణం, న్యూస్‌టుడే: టమోటా - 10, పచ్చిమిర్చి - 30, వంకాయ - 20, బెండ - 40, క్యారెట్ - 40, ఆలుగడ్డ - 20, బీట్‌రూట్ - 50, బీన్స్ - 20, ముల్లంగి - 30, బీరకాయ - 40, సీమవంకాయ - 40, క్యాప్సికమ్ - 60, క్యాబేజి - 30, కాకర - 40, కాలీఫ్లవర్ ఒక్కొటి - 30, మునగకాయలు - 180, గోరుచిక్కుడు - 40, చిక్కుడు - 50, యర్రగడ్డలు - 40, తెల్లగడ్డలు - 60.

సంక్షేమ పథకాలతోనే రాష్ట్రాభివృద్ధి



మాట్లాడుతున్న శాసనసభ్యుడు చాంద్‌బాషా

కదిరి, న్యూస్‌టుడే: ప్రభుత్వం అమలు చేసే సంక్షేమ పథకాలు పేదలకు చేరినప్పుడే రాష్ట్రం అభివృద్ధి దిశగా పయనిస్తుందని ఎమ్మెల్యే అత్తార్ చాంద్‌బాషా పేర్కొన్నారు. పట్టణంలో 6, 7, 8, 9, 10 వార్డుల్లో జన్మభూమి కార్యక్రమాన్ని నిర్వహించారు. బాలికల ఉన్నత పాఠశాలలో నిర్వహించిన జన్మభూమికి ఎమ్మెల్యే హాజరై మాట్లాడారు. అర్హులైన పేదలకు బియ్యంకార్డులు, చంద్రన్నబీమా పత్రాలు, చంద్రన్న సంకాంత్రి కానులను పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఛైర్‌పర్సన్ సురియాబాను, కమిషనర్ ప్రమీల, ఎస్సీ కార్పొరేషన్ డైరెక్టర్ దేవానంద్, డిప్యూటీ తహసీల్దారు కృష్ణమూర్తి, కౌన్సిలర్లు తదితరులు పాల్గొన్నారు. జన్మభూమి కార్యక్రమంలో భాగంగా పరిసరాల శుభ్రత, మరుగుదొడ్ల నిర్మాణాలపై గిరిజన సంక్షేమ గురుకుల పాఠశాల విద్యార్థులు ర్యాలీ నిర్వహించారు. నల్లగుట్టవీధిలోని గురుకుల పాఠశాల నుంచి పట్టణ ప్రధాన వీధుల్లో ప్రదర్శన చేశారు. కార్యక్రమంలో ప్రిన్సిపల్ విజయకుమార్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

నల్లచెరువు: మండలంలోని పంతులచెరువు పంచాయతీలో జన్మభూమి గ్రామసభను నిర్వహించారు. ఎమ్మెల్యే అత్తార్‌చాంద్‌బాషా మాట్లాడుతూ పేదలకు మంజూరైన బియ్యం కార్డులు, చంద్రన్న సంక్రాంతి కానుకలు, చంద్రబీమా బాండ్లను లబ్ధిదారులకు పంపిణీ చేశారు. పంతులచెరువు పాఠశాల నుంచి ర్యాలీ నిర్వహించారు. పంతులచెరువు, ఉబిచెర్ల, మద్దిమడుగు, ఎస్. మొలకలపల్లి గ్రామాలు కోటాక్ మహేంద్రబ్యాంకు పరిధికి వస్తాయి. ఈ గ్రామాల రైతులకు సంక్షేమ పథకాలు, అసైన్డ్‌భూములకు పంటరుణాలు ఇవ్వటం లేదని ప్రజలు ఎమ్మెల్యే దృష్టికి తీసుకొచ్చారు. తహసీల్దారు కళావతి, ఎంపీడీవో మగ్బూల్‌బాషా, స్పెషల్ ఆఫీసర్ సాజీదాబేగం, సర్పంచి పార్వతమ్మ, ఎస్సీకార్పొరేషన్ డైరెక్టర్ దేవానంద్, జడ్పీటీసీ సభ్యురాలు నాగరత్నమ్మ, ఎమ్పీటీసీ శివారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

గాండ్లపెంట: మండలంలోని కటారుపల్లిలో సర్పంచి లత అధ్యక్షతన, ప్రత్యేకాధికారి వన్నూరుస్వామి ఆధ్వర్యంలో జన్మభూమి కార్యక్రమం నిర్వహించారు. ఎమ్మెల్యే అత్తార్ చాంద్‌బాషా హాజరయ్యారు. జన్మభూమి కమిటీ సభ్యురాలు లక్ష్మీదేవి మాట్లాడుతూ సీసీలదే హవా కొనసాగుతోందని, గ్రామంలో 32 సంఘాలుండగా ఒక్క సంఘాన్నైనా పర్యవేక్షించారా అని వెలుగు ఏపీఎం పద్మావతమ్మను ప్రశ్నించారు. సంఘాల పనితీరు, వెలుగు సంఘాల ద్వారా నియమించిన

అధికారులపై ప్రజల ఆగ్రహం..

మల్లికొమ్మదిన్నె, (నంబులపూలకుంట): మండలంలోని మల్లికొమ్మదిన్నెలో జరిగిన జన్మభూమి గ్రామసభలో ప్రజలు అధికారులపై ఆగ్రహం వ్యక్తం చేశారు. గత జన్మభూమిలో రైతులకు పాసు పుస్తకాలు పంపిణీ చేస్తామని నేటికి ఇవ్వలేదని, సభ వద్దంటూ ఆందోళన చేశారు. అధికారులు సర్ది చెప్పారు. ప్రత్యేక అధికారి లక్ష్మీనరసయ్య అధ్యక్షతన ప్రభుత్వం అమలు చేస్తున్న పథకాలను, అభివృద్ధిని శాఖల వారీగా అధికారులు చదవి వినిపించారు. వంకమద్దిలో డిప్యూటీ తహసీల్దారు కృష్ణప్రసాద్ సభను నిర్వహించారు. సర్పంచి కుళ్లాయమ్మ, గర్భిణులకు సీమంతాలు చేశారు. కార్యక్రమంలో ఎంపీడీవో వెంకట్రామిరెడ్డి, పర్యవేక్షణ అధికారి రాజేంద్రప్ప, పంచాయతీ విస్తర్ణ అధికారి కమలాబాయి, సర్పంచి ఆదినారాయణరెడ్డి, వివిధ శాఖ అధికారులు, తెదేపా నాయకులు తదితరులు పాల్గొన్నారు.



మల్లికొమ్మదిన్నె: అధికారులతో వాగ్వాదానికి దిగిన ప్రజలు

బ్యాంకు మిత్రలను ఎందుకు తొలగించారంటూ ఆగ్రహం వ్యక్తం చేశారు. ప్రత్యేకాధికారి కలగజేసుకొని గ్రామ సీసీని పిలిపించాలని సూచించారు. అనంతరం అటవీశాఖ అధికారుల ఆధ్వర్యంలో మొక్కలు నాటారు. కార్యక్రమంలో ఎస్సీ సెల్ డైరెక్టర్ దేవానంద్, ఎంపీటీసీ గంగోజమ్మ, ఎంపీడీవో శ్రీరాములు, తహసీల్దార్ శ్రీనివాసులు, ఈఓఆర్డీ ఆనందయ్య, తదితరులు పాల్గొన్నారు.

తనకల్లు: మండల పరిధిలోని మల్లిరెడ్డిపల్లిలో జన్మభూమి కార్యక్రమం నిర్వహించారు. ప్రజల నుంచి 56 వినతులు వచ్చినట్లు నియోజకవర్గ బాధ్యుడు కందికుంట వెంకటప్రసాద్ తెలిపారు. కార్యక్రమంలో తహసీల్దారు లక్ష్మీనాయక్, ఎంపీపీ భూక్యాలక్ష్మి, సర్పంచి సరస్వతి, మహిళా అధ్యక్షురాలు తోటసరోజమ్మ, అన్నిశాఖల అధికారులు పాల్గొన్నారు. కోటపల్లిలో ప్రత్యేకాధికారి కొండలరావు, ఎంపీడీవో రమేష్‌బాబు ఆధ్వర్యంలో కార్యక్రమాన్ని నిర్వహించారు. వివిధ సమస్యలపై 68 మంది వినతులు అందించారు. అనంతరం గ్రామంలో నిర్మించిన మరుగుదొడ్లను ప్రారంభించారు. అన్నిశాఖల అధికారులు పాల్గొన్నారు. మరుగుదొడ్డి నిర్మించుకొని స్వచ్ఛభారత్‌లో అందరూ భాగస్వాములు కావాలని స్థానికప్రభుత్వ ఉన్నతపాఠశాల విద్యార్థులు ర్యాలీ నిర్వహించారు. బహిరంగ మల, మూత్ర విసర్జనవల్ల కలిగే నష్టాలను వివరిస్తూ ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయులు వేణుగోపాల్‌రెడ్డి, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

తలుపుల: వ్యక్తిగత మరుగుదొడ్ల నిర్మాణాలపై ప్రజల్లో అవగాహన కల్పించడానికి తలుపుల జూనియర్ కళాశాల అధ్యాపకులు, విద్యార్థులు ర్యాలీ నిర్వహించారు. ప్రధాన కూడలిలో మానవహారంగా ఏర్పడి అవగాహన కల్పించారు. అధ్యాపకులు రెడ్డిశేఖర్‌రెడ్డి, చంద్రశేఖర్ పాల్గొన్నారు.

పట్నం, (కదిరి పట్టణం): వ్యక్తిగత మరుగుదొడ్ల బిల్లులను సకాలంలో చెల్లించాలని పట్నం సర్పంచి మహేష్ అధికారులను కోరారు. పట్నం గ్రామంలో జన్మభూమి కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో రెవెన్యూ డివిజనల్ ప్రత్యేకాధికారి భరత్‌కుమార్, మండలాధ్యక్షురాలు లలితమ్మ, ఉపాధ్యక్షుడు రామ్మూర్తినాయక్, మండల ప్రత్యేకాధికారి ఆనంద్, తహసీల్దార్ పి. వి. రమణ, ఎంపీడీవో ఆదినారాయణ వివిధ శాఖల అధికారులు పాల్గొని ప్రభుత్వం అమలుచేస్తున్న సంక్షేమ పథకాలను వివరించారు.

రేషన్‌కార్డుల కోసం ఆందోళన

కుర్లి (తలుపుల): కుర్లి, గుండువారిపల్లి పంచాయతీల్లో జన్మభూమి గ్రామసభలను నిర్వహించారు. రేషన్‌కార్డులు వచ్చినా పంచాయతీలో దాదాపు 30మందికి కార్డులు ఇవ్వలేదని ఆగ్రహించిన కుర్లి గ్రామస్థులు జన్మభూమిని బహిష్కరించి ఆందోళన చేపట్టారు. గత జన్మభూమి గ్రామసభల్లోనూ అదిగో, ఇదిగో ఇస్తామంటూ కాలయాపన చేస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. రేషన్ కార్డులు ఇస్తేనే గ్రామసభ జరిగేలా సహకరిస్తామని భీష్మించారు. అధికారులు చేసేది లేక సంబంధిత అధికారుల దృష్టికి తీసుకెళ్లారు. రేషన్ కార్డుల జాబితాలో పేర్లు ఉన్న వారందరికీ సంక్రాంతి కానుకలు పంపిణీ చేయడంతో గ్రామస్థులు సంతోషించారు. కార్యక్రమంలో సర్పంచులు అరుణమ్మ, పుష్పావతి, అధికారులు ప్రత్యేక అధికారి మల్లేశ్వరరావు, తహసీల్దారు శివయ్య, ఎంపీడీవో పోలప్ప తదితరులు పాల్గొన్నారు.



కదిరి: మాట్లాడుతున్న పట్నం సర్పంచి



ప్రతిజ్ఞ చేస్తున్న కందికుంట, అధికారులు



ప్రదర్శన చేస్తున్న నాయకులు, అధికారులు

27న గిరిజన శంఖారావసభ

కదిరి పట్టణం, న్యూస్‌టుడే: గిరిజన హక్కుల పరిరక్షణకు ఈ నెల 27న అనంతపురంలో నిర్వహిస్తున్న గిరిజన శంఖారావసభను జయప్రదం చేయాలని గిరిజన విద్యార్థి సమాఖ్య జిల్లా ఉపాధ్యక్షుడు రామప్రసాద్‌నాయక్ కోరారు. శంఖారావసభకు భారీగా గిరిజనులు తరలివచ్చేలా గ్రామగ్రామానికి వెళ్లి ప్రచారం నిర్వహిస్తున్నట్లు ఆయన చెప్పారు. గురువారం కదిరిలో సమావేశమైన గిరిజన విద్యార్థిసంఘం నాయకులు శంఖారావసభ ఉద్దేశాన్ని వివరించారు. సమావేశంలో ఆంజనేయులునాయక్, సతీష్, వరప్రసాద్‌నాయక్, తదితరులు పాల్గొన్నారు.

ఉత్తమ సేవకు పురస్కారం

గాండ్లపెంట, న్యూస్‌టుడే: సావిత్రీబాయిపూలే జయంతి సందర్భంగా బుధవారం విద్యాశాఖ మంత్రితో పూలే అవార్డు, సత్కారం పొందిన మండల ఉపాధ్యాయులు రమణమ్మ, విజయలక్ష్మి, రూపకళ, దుర్గాలను గురువారం మండల విద్యాధికారి కృష్ణానాయక్, తాహిర్ అలీ అభినందనలు తెలిపారు. వారు మాట్లాడుతూ విద్యార్థులకు నాణ్యమైన విద్యను అందిస్తూ, విద్యార్థుల ఉన్నతికి పాటుపడుతూ పూలే అవార్డు అందుకోవడం ఆదర్శనీయమన్నారు. అలాగే ఉపాధ్యాయులను సత్కరించిన కందికుంట నారాయణమ్మ ట్రస్ట్ అధ్యక్షురాలు యశోదమ్మకు తాహిర్‌అలీ కృతజ్ఞతలు తెలిపారు.

చంద్రన్న కానుక పంపిణీ

పెడపల్లి, వెంకటగారిపల్లి (పుట్టపర్తి గ్రామీణం), న్యూస్‌టుడే: పెడపల్లి చౌక దుకాణంలో మండల ఉపాధ్యక్షుడు బొమ్మయ్య గురువారం చంద్రన్న సంక్రాంతి కానుకను పంపిణీ చేశారు. కులమతాలకు అతీతంగా పేదలైన అన్ని వర్గాల వారు పండగ జరుపుకోవాలని ప్రభుత్వం రంజాన్, క్రిస్మస్, సంక్రాంతి కానుకలను యేటా ఉచితంగా అందిస్తోందన్నారు. తెదేపా నాయకులు ఆంజనేయులు, కోఆప్షన్ సభ్యుడు అక్తర్‌బాషా పాల్గొన్నారు. వెంకటగారిపల్లిలో సర్పంచి, ఉపసర్పంచి చిన్నారాయణప్ప, ఉపేంద్రలు లబ్ధిదారులకు సంక్రాంతి కానుక సరకులను అందజేశారు.

అంధుల ఆరాధ్య దైవం బ్రెయిలీ

పుట్టపర్తి గ్రామీణం, న్యూస్‌టుడే: మండల వ్యాప్తంగా అంధుల లిపిని కనుగొన్న లూయిస్ బ్రెయిలీ జయంతి వేడుకలను అధికారులు, ఉపాధ్యాయులు, విద్యార్థులు ఘనంగా జరుపుకొన్నారు. జగరాజుపల్లి ఆదర్శ, కేజీబీవీ పాఠశాలల్లో విద్యార్థులతో కలిసి మండల స్థాయి అధికారులు బ్రెయిలీ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఎంపీడీవో సుభాన్, మండల విద్యాధికారి వెంకటరమణనాయక్ మాట్లాడుతూ బ్రెయిలీ అంధుల కోసం ప్రత్యేకంగా లిపిని కనుగొనడంతోనే వారి జీవితాల్లో వెలుగులు ప్రకాశిస్తున్నాయి. చదవడం, రాయడం, ఉన్నత ఉద్యోగాలు సాధించడానికి వెనుక బ్రెయిలీ కృషి ఎనలేనిదన్నారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు, పంచాయతీ కార్యదర్శులు రాజేశ్వర్, సౌజన్య, జయపాల్, గంగాధర్‌నాయక్ తదితరులు పాల్గొన్నారు.



నివాళులర్పిస్తున్న అధికారులు, ఉపాధ్యాయులు



పుస్తకాలు పంపిణీ చేస్తున్న ప్రధానోపాధ్యాయుడు

విద్యార్థులకు పుస్తకాల పంపిణీ

ధనియానిచెరువు (నంబులపూలకుంట): మండలంలోని ధనియాని చెరువు ఉన్నత పాఠశాలలోని పదోతరగతి విద్యార్థులకు గురువారం ప్రధానోపాధ్యాయుడు వెంకటచలం పఠన సామగ్రి పంపిణీ చేశారు. కందికుంట నారాయణమ్మ ట్రస్టు ద్వారా చదువుతున్న విద్యార్థి ఎస్. నూర్‌మహమ్మద్ సివిల్ ఇంజినీర్‌గా ఉద్యోగం సాధించారు. ఈ సందర్భంగా ట్రస్టు తరఫున పదో తరగతి విద్యార్థులకు పఠన సామగ్రి ఉచితంగా అందించారు. విద్యార్థులు పదిలో ఉత్తమ ఫలితాలు సాధించి తల్లిదండ్రులకు, పాఠశాలకు మంచి పేరు తీసుకురావాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు రమణయ్య, ఆజమ్‌బాషా పాల్గొన్నారు.

కళ్యాణదుర్గం

నిత్యావసర ధరలు

కళ్యాణదుర్గం, న్యూస్‌టుడే : కళ్యాణదుర్గం మార్కెట్‌లో గురువారం ధరలు ఇలా.. (కిలో/రూ.లలో) వెల్లుల్లి - 50, కందిపప్పు - 65, వట్టిమిరప - 90, వేరు సెనగపప్పు - 80, సెనగబేడలు - 70, గోధుమపిండి - 25, ఉప్మారవ్వ - 35, కొబ్బరి - 160, చక్కెర - 40, బెల్లం - 45, బియ్యం సోనా మసూరి - 40 (పాతవి), సోనామసూరి - 35 (కొత్తవి), రాగులు - 24,

కూరగాయల ధరలు

కళ్యాణదుర్గం, న్యూస్‌టుడే : టమోటా - 10, పచ్చిమిర్చి - 30, వంకాయలు - 30, లావుమిర్చి - 40, ఉల్లి- 40, బెండ - 30, బీర - 40, బీన్స్ - 50, గోబీపువ్వు - 30, క్యారెట్ - 60, బీట్‌రూట్- 40, ముల్లంగి - 40, క్యాబేజీ - 40, కాకర - 40

ప్రజా సంక్షేమానికి పెద్దపీట



మాట్లాడుతున్న ఎమ్మెల్యే ఉన్నం

కళ్యాణదుర్గం, న్యూస్‌టుడే : ప్రజా సంక్షేమానికి పెద్దపీట వేస్తూ అన్ని వర్గాలకు లబ్ధి చేకూరుస్తున్నట్లు ఎమ్మెల్యే ఉన్నం హనుమంతరాయచౌదరి అన్నారు. గురువారం పట్టణంలోని 10, 11 వార్డుల్లో జన్మభూమి - మా ఊరు కార్యక్రమం జరిగింది. కార్యక్రమానికి ఎమ్మెల్యే ఉన్నం, మున్సిపల్ ఛైర్ పర్సన్ బిక్కి రామలక్ష్మి హాజరయ్యారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ రాష్ట్రం ఆర్థిక ఇబ్బందుల్లో ఉన్నా రూ.కోట్లు ఖర్చు చేసి జన్మభూమి కార్యక్రమం నిర్వహిస్తున్నది పజా సమస్యలు పరిష్కరించడానికే అని అన్నారు. జన్మభూమి కార్యక్రమం జరుగుతుందంటే తమ సమస్యకు పరిష్కరం దొరికినట్లే అన్న భరోసా అందరిలో కలగాలన్నారు. మహిళా సంఘాలకు విరివిగా రుణాలు ఇస్తూ ఆర్థిక అభ్యున్నతికి కృషి చేస్తున్నామని తెలిపారు. రానున్న రోజుల్లో మరిన్ని సంక్షేమ కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు. అనంతరం చంద్రన్న సంక్రాంతి కానుక, పింఛను మంజూరు పత్రాన్ని అందజేశారు. కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ వెంకటేష్, మాజీ మున్సిపల్ ఛైర్మన్ వై.పి.రమేష్, వైస్ ఛైర్మన్ శ్రీనివాసరెడ్డి, కౌన్సిలర్లు నాగరాజు, అబ్దుల్ రహీం, ప్రియాంక, తెదేపా పట్టణ అధ్యక్షుడు మురళి, నాయకులు నారాయణ, గోవిందప్ప తదితరులు పాల్గొన్నారు.

అందరికీ సంక్షేమ ఫలాలు

కొండాపురం, దురదకుంట (కళ్యాణదుర్గం గ్రామీణం) : మండలంలోని కొండాపురం, దురదకుంట గ్రామాల్లో గురువారం జన్మభూమి - మాఊరు కార్యక్రమం జరిగింది. కొండాపురం గ్రామంలో తహసీల్దారు శ్రీనివాసులు, సర్పంచి అనిల్‌చౌదరి, జడ్పీటీసీ సభ్యుడు కొల్లాపురప్ప, నాయకులు మల్లికార్జున, దురదకుంటలో ఎంపీడీవో షెహన్షా, సర్పంచి మారెక్క, ఎంపీటీసీ సభ్యురాలు దొణతిమ్మ చౌదరి ఆధ్వర్యంలో జన్మభూమి సభలు జరిగాయి. ఈ సందర్భంగా మార్కెట్ యార్డు ఛైర్మన్ రామాంజనేయులు మాట్లాడుతూ ప్రభుత్వం సంక్షేమ పథకాలకు అర్హత ఉన్న ప్రతి ఒక్కరికి అందేలా చూస్తామన్నారు. కార్యక్రమంలో ఎంఈవో విజయకుమారి, ఈవోపీఆర్డీ ప్రభాకర్, వెలుగు ఏపీ రాజ్యలక్ష్మి, వైద్యుడు రంగనాథ్ వివిధ శాఖల అధికారులు, ప్రజా ప్రతినిధులు పాల్గొన్నారు.

కరిగానపల్లి (కుందుర్పి): అర్హులైన రైతులందరికీ పెట్టుబడి రాయితీ అందజేస్తామని ఎమ్మెల్యే ఉన్నం హనుమంతరాయచౌదరి పేర్కొన్నారు.

పెట్టుబడి రాయితీ అందని రైతులు ఆందోళన చెందాల్సిన అవసరం లేదని అన్నారు. కుందుర్పి మండలం కరిగానపల్లిలో గురువారం జన్మభూమి - మాఊరు గ్రామసభను సర్పంచి చిత్రలింగ అధ్యక్షతన నిర్వహించారు. ఈ సందర్భంగా పలువురు రైతులు తమకు పెట్టుబడి రాయితీ నేటికీ అందలేదని ఎమ్మెల్యే దృష్టికి తీసుకొచ్చారు. సాంకేతిక లోపంతో ఆలస్యమైందని అందరికీ అందజేస్తామని ఎమ్మెల్యే హామీ ఇచ్చారు. ఎమ్మెల్యే చంద్రన్న కానుకలను పంపిణీ చేశారు. సామూహిక సీమంతం కార్యక్రమంలో ఎమ్మెల్యే పాల్గొన్నారు. నోడల్ అధికారి బెనర్జీ, ప్రత్యేకాధికారి శ్రీనివాసులు, తహసీల్దారు రమేషన్, ఇన్‌ఛార్జి ఎంపీడీవో ఆరాధ్య, ఎంఈవో చెన్నరాయుడు, ఎంపీపీ దీనమ్మ, జడ్పీటీసీ సభ్యుడు మల్లికార్జున, మండల ఉపాధ్యక్షుడు రవి తదితరులు పాల్గొన్నారు.

రాళ్లనంతపురం (కంబదూరు) : మండలంలోని రాళ్లనంతపురంలో గురువారం స్థానిక సర్పంచి ఆదెప్ప అధ్యక్షతన జన్మభూమి - మా ఊరు గ్రామసభ నిర్వహించారు. గత జన్మభూమి కార్యక్రమంలో ఇచ్చిన మాట ప్రకారం పనులు పూర్తి చేయలేదని వైకాపా నాయకులు అధికారులను ప్రశ్నించారు. దీంతో జడ్పీటీసీ సభ్యుడు రామ్మోహన్‌చౌదరి జోక్యం చేసుకొని గ్రామంలో ఉన్న ఇబ్బందులు తెలిపిన మూడు కోరికలను పూర్తి చేశామని, ఇంకా ఏవైనా ఉంటే అర్జీ రూపంలో తమ దృష్టికి తీసుకురావాలన్నారు. సభ ముగిసిన తరువాత ఎమ్మెల్యే ఉన్నం హనుమంతరాయచౌదరి అక్కడికి చేరుకొని జరిగిన పరిస్థితిని అడిగి తెలుసుకున్నారు. కార్యక్రమంలో నోడల్ ఆఫీసర్ విజయ్‌శేఖర్, తహసీల్దారు రఫిక్ అహమ్మద్, ఎంపీడీవో శివారెడ్డి, ఎస్సై నరసింహుడు, ఎంపీపీ గోవింద చౌదరి, తెదేపా మండల కన్వీనర్ శివన్న, నాయకులు వెంకటేశులు, లక్ష్మీనరాయణ, తిప్పేస్వామి తదితరులు పాల్గొన్నారు.

సమస్యలపై నిలదీసిన ప్రజలు

చెర్లోపల్లి, కైరేవు (శెట్టూరు), న్యూస్‌టుడే : శెట్టూరు మండలంలోని చెర్లోపల్లి, కైరేవు గ్రామాల్లో సర్పంచులు మారుతమ్మ, జయమ్మల అధ్యక్షతన గురువారం జన్మభూమి మా ఊరు గ్రామ సభలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో ప్రధానంగా రెండు గ్రామాల్లో పంట నష్టపరిహారం, పింఛన్లు, ఇళ్లు, రుణమాఫీ, మరుగుదొడ్లు, బిల్లులు తదితర సమస్యలపై అధికారులను నిలదీశారు. చెర్లోపల్లికి వచ్చిన ఎమ్మెల్యే హనుమంతరాయచౌదరి, నాయకులు శివశంకర్ కల్పించుకుని పరిహారం విషయంలో కొన్ని సమస్యలున్న మాట వాస్తవమేనని, రానికివారికి తప్పకుండా అందేలా చూస్తామని, ఈ విషయంలో ఎవరూ ఆందోళన చెందవద్దని వ్యవసాయశాఖ అధికారుల తప్పిదాల వల్ల ఇబ్బందులు ఎదురయ్యాయని ఎమ్మెల్యే ప్రజలకు సర్దిచెప్పారు. ఈ సమస్యలపై ప్రజలు, నాయకుల మధ్య కొద్దిసేపు వాదోపవాదాలు జరిగాయి. సాయంత్రం నియోజకవర్గం జన్మభూమి ప్రత్యేక అధికారి వెంకటేశ్వరరావు మరుగుదొడ్ల నిర్మాణం ప్రాధాన్యత, అవసరం, ఉపయోగాలు గురించి ప్రజలకు వివరించారు. బిల్లులు కూడా నిర్మాణాలు పూర్తయిన వెంటనే చెల్లించాలని ప్రత్యేక అధికారి అధికారులకు సూచించారు. జడ్పీటీసీ సభ్యురాలు కవిత, తహసీల్దారు సుబ్రహ్మణ్యం చంద్రన్న సంక్రాంతి కానుకలను కార్డుదారులకు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ తిమ్మక్క, తెదేపా కన్వీనర్ తిప్పారెడ్డి, నాయకులు శివశంకర్, చిత్తప్ప, రంగప్ప, చెన్నారెడ్డి తదితరులు పాల్గొన్నారు.



కైరేవులో చెంబు శవయాత్ర నిర్వహిస్తున్న అధికారులు, నాయకులు

పిల్లలపల్లి గ్రామసభలో గందరగోళం

బ్రహ్మసముద్రం, న్యూస్‌టుడే : మండలంలోని పిల్లలపల్లి, ముప్పలకుంట గ్రామాల్లో గురువారం జన్మభూమి - మాఊరు గ్రామసభ నిర్వహించారు. ఎంపీపీ మంజుల, జడ్పీటీసీ సభ్యురాలు గంగమ్మ, మండల ఉపాధ్యక్షురాలు జ్యోతి, సర్పంచులు మహదేవప్ప, భాగ్యమ్మ తదితరులు హాజరై మాట్లాడారు. గొంచిరెడ్డిపల్లి ప్రాథమిక పాఠశాల విద్యార్థులు చేసిన నృత్యాలు అందరినీ ఆకట్టుకున్నాయి.

కార్యక్రమంలో మండల ప్రత్యేకాధిరి పక్కీరప్ప, తహసీల్దారు వెంకటశేషు, తెదేపా మండల కన్వీనర్ శ్రీరాములు, నాయకులు వెంకటేశులు, చిత్తప్ప, చంద్రశేకర్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు. పిల్లలపల్లిలోని ఎస్సీ కాలనీలో తాగునీటి సమస్య నెలకొందని అధికారులకు పలుమార్లు చెప్పినా ఏమాత్రం పట్టనట్లు వ్యవహరిస్తున్నారని కాలనీవాసులు గ్రామసభలో అధికారులపై ఆగ్రహం వ్యక్తం చేశారు. కొందరూ అర్హులకు పెట్టుబడి రాయితీ మంజూరు కాలేదని, పక్కాగృహాలు మంజూరు చేయాలని, పలు సమస్యలపై గ్రామస్థులు అధికారులతో వాగ్వాదం చేశారు. ప్రజా సమస్యలపై అధికారులు తీవ్ర నిర్లక్ష్యం వహిస్తున్నారంటూ అధికారుల తీరుపై మండిపడ్డారు. గంటపాటు గ్రామసభలో తీవ్ర గందరగోళం నెలకొంది. తెదేపా మండల కన్వీనర్ శ్రీరాములు, స్థానిక నాయకులు కలగజేసుకుని గ్రామస్థులకు సర్దిచెప్పడంతో వారు శాంతించారు.



ప్రతిజ్ఞ చేస్తున్న అధికారులు, నాయకులు

గ్యాస్ సమాచారం

ఏజెన్సీపేరు	కంపెనీ	ఫోన్	నమోదు	పంపిణీ
సాయిరాం	ఇండేన్	200511	3వ తేది వరకు-	నేడు

సినిమాలు

వెంకటేశ్వర : సిద్ధార్థ, **నూర్‌ముబారక్ :** ఎంసీఏ, **సౌభాగ్య :** హలో

నేడు మంత్రి కాలవ రాక

బొమ్మనహాళ్: మండలంలోని కల్‌హోళ గ్రామంలో శుక్రవారం జరిగే జన్మభూమి - మాఊరు గ్రామసభకు మంత్రి కాలవ శ్రీనివాసులు హాజరవుతున్నట్లు మండల తెదేపా కన్వీర్ బలరామిరెడ్డి తెలిపారు. మండలంలోని సర్పంచులు, ఎంపీటీసీ సభ్యులు, తెదేపా నాయకులు ఎంపీపీ, జడ్పీటీసీ సభ్యులు పాల్గొని వియవంతం చేయాలన్నారు.

కణేకల్లు: మండలంలోని గనిగెర గ్రామంలో శుక్రవారం ఉదయం 10 గంటలకు జరిగే జన్మభూమి - మాఊరు కార్యక్రమానికి మంత్రి కాలవ శ్రీనివాసులు, మాజీ ఎమ్మెల్సీ మెట్టు గోవిందరెడ్డి, జడ్పీ ఛైర్మన్ పూలనాగరాజు, విచ్చేయనున్నట్లు మండల కన్వీనర్ లాలెప్ప, తెదేపా నాయకుడు గోపాల్‌రెడ్డి తెలిపారు.



విద్యార్థుల ప్రదర్శన

ఎనుములదొడ్డిలో రచ్చబండ - పల్లెనిద్ర

ఎనుములదొడ్డి (కుందుర్పి), న్యూస్‌టుడే : కుందుర్పి మండలం ఎనుములదొడ్డిలో గురువారం రాత్రి వైకాపా నాయకులు రచ్చబండ - పల్లెనిద్ర కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా వైకాపా నియోజకవర్గ సమన్వయకర్త ఉషాశ్రీచరణ్ హాజరై మాట్లాడారు. పార్టీ బలోపేతానికి నాయకులు, కార్యకర్తలు కృషి చేయాలని పిలుపునిచ్చారు. పార్టీ అధినేత జగన్‌ను 2019లో ముఖ్యమంత్రిని చేయడానికి కార్యకర్తలు సైనికుల్లా పనిచేయాలన్నారు. ఈ కార్యక్రమంలో పార్టీ మండల కన్వీనరు సత్యనారాయణశాస్త్రి, నరేంద్రరెడ్డి, వెంకటేష్, శ్రీనివాసులు, భాస్కర్‌రెడ్డి, నరేంద్రరెడ్డి, ఎస్‌కే ఆంజనేయులు, అతావుల్లా, గవ్వప్ప, బొమ్మలింగ, భీజప్ప తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ఉషాశ్రీచరణ్

బహిరంగ మల విసర్జన నిర్మూలిద్దాం

కంబదూరు, న్యూస్‌టుడే : 'జన్మభూమి - మా ఊరు' కార్యక్రమంలో భాగంగా గురువారం కంబదూరులో జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల, ఉర్దూ పాఠశాల విద్యార్థులు ప్రదర్శన నిర్వహించారు. బహిరంగ మలవిసర్జనను నిర్మూలిద్దాం అంటూ నినాదాలు చేశారు. జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల నుంచి పుర వీధుల గుండా విద్యార్థులు ప్రదర్శన నిర్వహించారు. వ్యక్తిగత మరుగుదొండ్ల ప్రాధాన్యత, ఆవశ్యకత గురించి ప్రధానోపాధ్యాయుడు కృష్ణా నాయక్ వివరించారు. కార్యక్రమంలో జిల్లా పరషత్ ఉన్నత పాఠశాల, ఉర్దూ పాఠశాల ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.

కళ్యాణదుర్గం

సంక్రాంతి కానుకల పంపిణీ

ములకలేడు, కరిడిపల్లి (శెట్టూరు), న్యూస్‌టుడే : శెట్టూరు మండలంలోని ములకలేడు, కరిడిపల్లి గ్రామాల్లోని చౌక దుకాణాల్లో గురువారం చంద్రన్న సంక్రాంతి కానుకలను మండల ఉపాధ్యక్షుడు బొమ్మయ్య, సర్పంచి మధు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో తెదేపా నాయకులు తిప్పేస్వామి, డీలర్లు శ్రీనివాసులు, సుబ్బరాయుడు, కార్డుదారులు పాల్గొన్నారు.

22న ఆర్డీవో కార్యాలయ ముట్టడి

కళ్యాణదుర్గం గ్రామీణం, న్యూస్‌టుడే : ఈ నెల 22వ తేదీన ఆర్డీవో కార్యాలయం ముట్టడికి తరలి రావాలని ఎమ్మార్పీఎస్ డివిజన్ అధ్యక్షుడు తిమ్మరాజు పిలుపునిచ్చారు. గురువారం ఆర్‌అండ్‌బీ అతిథిగృహంలో ఎమ్మార్పీఎస్ నాయకులు విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మార్పీఎస్ డివిజన్ అధ్యక్షుడు తిమ్మరాజు మాట్లాడుతూ కళ్యాణదుర్గం, కుందుర్పి మండల కేంద్రాల్లో అంబేడ్కర్ భవనాలను నిర్మించేందుకు స్థలాన్ని వెంటనే చూపాలని, పార్లమెంట్ శీతాకాల సమావేశాల్లోనే ఎస్సీల వర్గీకరణ బిల్లు ప్రవేశ పెట్టాలని డిమాండ్ చేశారు. దళిత నిరుపేదలకు భూ పంపిణీ చేసి ఆదుకోవాలన్నారు. దళితులకు 100 యూనిట్ల వరకు ఉచిత విద్యుత్తు ఇవ్వాలని, దళితులకు ఇంటి పట్టాలు, పక్కా గృహాలు మంజూరు చేయాలని కోరారు. ఈ డిమాండ్లతో ఆర్డీవో కార్యాలయం ముట్టడి చేపడుతున్నామన్నారు. పెద్ద ఎత్తున దళితులు తరలిరావాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో తాలూకా అధ్యక్షుడు వన్నూరస్వామి, మహిళా అధ్యక్షురాలు అనంతమ్మ, నాయకులు ఓబుళపతి, తిప్పేస్వామి, నాగభూషణం, నరేంద్ర, దామోదర్ తదితరులు పాల్గొన్నారు.

ఉపకార వేతనాల మంజూరు

కుందుర్పి, న్యూస్‌టుడే : కుందుర్పి మండలంలోని 1,674 మంది విద్యార్థులకు 2016-17 సంవత్సరానికి ఉపకార వేతనాలు మంజూరైనట్లు ఐకేపీ ఏపీఎం గుణశ్యాం తెలిపారు. అభయహస్తం, ఆమ్‌ఆద్మీ, చంద్రబీమా పథకం కింద మంజూరైనట్లు తెలిపారు. ఒక్కొక్కరికి రూ.1200 వంతున మొత్తం రూ.22.88 లక్షలు మంజూరైందని తెలిపారు. ఈ నెల 11న విద్యార్థుల ఖాతాలకు జమ చేస్తామన్నారు. కుందుర్పి మండలంలోని వడ్డ రాయితీ కింద 709 సంఘాలకు రూ.83.79 లక్షలు మంజూరైనట్లు తెలిపారు. మంజూరు పత్రాలను ఆయా సంఘాలకు జన్మభూమి గ్రామసభల్లో పంపిణీ చేస్తున్నట్లు తెలిపారు.

పోరాటాలతో సమస్యల పరిష్కారం



మాట్లాడుతున్న వెంకటరమణ

శెట్టూరు, న్యూస్‌టుడే : దేశంలో దోపిడీలేని రాజ్యం, పాలకులు కావాలన్నదే భారత కమ్యూనిస్టు పార్టీ లక్ష్యమని ఆ పార్టీ రాష్ట్ర కంట్రోల్ కమిషన్ సభ్యుడు ఎం.వి.రమణ, కళ్యాణదుర్గం కార్యదర్శి సంజీవప్ప, నాయకుడు రుద్రప్ప పేర్కొన్నారు. గురువారం శెట్టూరులో మండల సీపీఐ మహాసభలను నిర్వహించారు. ఈ సందర్భంగా బస్టాండులో పార్టీ జెండాను ఆవిష్కరించిన అనంతరం గ్రామంలో ప్రదర్శన చేశారు. మండల సీపీఐ కారదర్యర్శి నరసింహులు అధ్యక్షతన జరిగిన సభలో నాయకులు రమణ, రుద్రప్ప, సీంజీవులు, లక్ష్మన్న మాట్లాడారు. శతాబ్దాలుగా పాలకులు అవలంబిస్తున్న ప్రజావ్యతిరేక విధానాలపై నిత్యం పోరాటం చేస్తూ బడుగు, బలహీనవర్గాల పక్షాన నిలబడి వారి బాగోగుల కోసం పనిచేస్తోందన్నారు. పోరాటాలతోనే సమస్యలు సరిష్కారమవుతాయన్నారు. కళ్యాణదర్గం నియోజవర్గంలో సీపీఐ నాయకులు భూస్వాములతో పోరాడి 40 వేల ఎకరాలను పేదలకు పంచిపెట్టిన ఘనత తమ పార్టీదేనని చెప్పారు. కేంద్రంలో భాజపా ధనవంతులకు కొమ్ముకాస్తోందని, జీఎస్టీ, నోట్ల రద్దు చేసి పెద్ద తప్పిదం చేసిందని మండిపడ్డారు. జీఎస్టీ పేరుతో సామాన్యులు దోపిడీకి గురవుతున్నారని వారు ఆవేదన వ్యక్తం చేశారు. ఎన్నికల సందర్భంలో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ప్రజలను నమ్మించి మోసిగించాయన్నారు. ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు రైతుల ప్రభుత్వమని చెప్పుకొంటూ రైతులను మోసగిస్తున్నారని ఆరోపించారు. నేటికీ పంటనష్ట పరిహారం, రుణమాఫీ ఇప్పటికీ అందని రైతులు కార్యాలయాల చుట్టూ కాళ్లరిగేలా తిరుగుతున్నారన్నారు. రైతులు రుణాల కోసం బ్యాంకులకు వెళితే దొంగలను చూస్తున్నట్లు చూస్తున్నారని, మొండిబకాయిల పేరుతో వేదిస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. అదే పారిశ్రామికవేత్తలు రూ.లక్షల కోట్లు ఎగ్గొట్టినా ఎవరూ పట్టించుకోవడం లేదని ఇది చాలా దారుణమన్నారు. ఈ కార్యక్రమంలో అనంతపురం, కళ్యాణదుర్గం, కుందుర్పి, బ్రహ్మసముద్రం సీపీఐ నాయకులు నారాయణస్వామి, గోపాల్, లక్ష్మణ్, మహదేవ, పంపాపతి, శ్రీనివాసులు, కార్యకర్తలు, పార్టీ మద్దతుదారు, సానుభూతిపరులు పాల్గొన్నారు.

నాగిరెడ్డిపల్లిలో తాగునీటి ఎద్దడి



మరమ్మతులకు నోచుకోని తాగునీటి మోటారు

బ్రహ్మసముద్రం, న్యూస్‌టుడే : మండలంలోని నాగిరెడ్డిపల్లి గ్రామంలోని భీమన్నగారి కుంట కాలనీలో తీవ్ర తాగునీటి ఎద్దడి నెలకొన్నట్లు గ్రామస్థులు తెలిపారు. గ్రామ సమీపంలోని భీమన్నగారి తోట కాలనీలో మూడు నెలల క్రితం పంచాయతీ తాగునీటి మోటారు మరమ్మతులకు గురైంది. అప్పటి నుంచి కాలనీలో తాగునీటి ఇబ్బందులు నెలకొన్నాయి. గుక్కెడు తాగునీటి కోసం నానా అవస్థలు పడుతున్నారు. కాలనీలో ఏర్పడిన తాగునీటి సమస్యను పంచాయతీ కార్యదర్శి, సర్పంచి, సంబంధిత అధికారుల దృష్టికి తీసుకెళ్లినా ఏమాత్రం పట్టించుకోవడం లేదని గ్రామస్థులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. అధికారులు కనీసం కాలనీ వైపు కన్నెత్తి చూసిన పాపాన పోలేదని వారు వాపోతున్నారు. అలాగే గ్రామంలోని కొత్తూరు కాలనీలో తాగునీటి సమస్య ఏర్పడింది. ఇప్పటికైనా ఉన్నతాధికారులు వెంటనే స్పందించి తాగునీటి సమస్య పరిష్కారానికి తగు చర్యలు గ్రామస్థులు కోరుతున్నారు.

బిల్లుల కోసం తిప్పుకొంటున్నారు

కణేకల్లు: వేతన బిల్లులు ఆమోదించకుండా స్థానిక ఖజానా అధికారులు నెల రోజులుగా కార్యాలయం చుట్టూ తిప్పుకొంటున్నారని స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాల కాంట్రాక్టు అధ్యాపకులు ఆందోళన వ్యక్తం చేశారు. మూడు నెలలుగా అందని వేతన బకాయిలు ప్రభుత్వం నెల రోజుల క్రితం మంజూరు చేసిందని అధ్యాపకులు తెలిపారు. బిల్లులు సమర్పించి నెల రోజులు కావస్తున్నా.. ఖజానా అధికారులు అదిగో.. ఇదిగో అంటూ తిప్పుకొంటూ రోజుకో కారణం చెబుతూ.. తిప్పుకొంటూ ఇబ్బందులకు గురి చేస్తున్నట్లు ఆరోపించారు.

ఆదమరిస్తే.. అంతే..!

పట్టణంలో ప్రమాదకర మలుపు



రోడ్డు మీద వెళ్తున్న ఆర్టీసీ బస్సు

కళ్యాణదుర్గం, న్యూస్‌టుడే : పట్టణంలో పెద్ద మురుగు కాలువ అది. కాలనీల్లోని మురుగునీళ్లన్నీ ఆ కాలువకే చేరుతాయి. ఆ కాలువ ఆర్టీసీ బస్టాండ్ నుంచి మారెంపల్లి మీదుగా అనంతపురం రోడ్డు సాయిబాబా ఆలయం సమీపంలో డిగ్రీ కళాశాల వద్ద ఉన్న కాలువకు కలుస్తుంది. సాయిబాబా ఆలయం వద్ద అనంతపురం ప్రధాన రహదారిలో రోడ్డు విస్తరణంలో భాగంగా సిమెంట్ రోడ్డు వేశారు. రోడ్డు బాగా ఎత్తు పెరిగింది. అయితే అక్కడే పెద్ద మలుపు కూడా ఉంది. ఆ రోడ్డు కిందే మురుగు కాలువ వెళ్తుంది. కాలువ వద్ద రోడ్డుకు ఇరువైపులా కనీసం రక్షణ గోడలు (మోరీలు) కూడా నిర్మించ లేదు. అక్కడ కాలువ ఉందని సూచిక కూడా ఏర్పాటు చేయలేదు. నిత్యం వందల సంఖ్యలో బస్సులు, కార్లు, ద్విచక్ర వాహనాలు వెళ్తుంటాయి, కళాశాలకు వచ్చే వాహనాలు రోడ్డు కింద ఉన్న కాలువను గుర్తించకుండా రావడంతో కాలువలో పడిన సంఘటనలు ఉన్నాయి. వాహన చోదకులు ఏమాత్రం ఆదమరిచిన మురుగు కాలువలో పడాల్సిందే.



కుందుర్పిలో అయ్యప్పస్వామి గ్రామోత్సవం

స్వామియే శరణం అయ్యప్ప

కుందుర్పి, న్యూస్‌టుడే : కుందుర్పిలో అయ్యప్పస్వామి గ్రామోత్సవం గురువారం రాత్రి కన్నుల పండువగా జరిగింది. ఆలయంలో స్వామికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ కార్యక్రమాన్ని తిలకించేందుకు అధిక సంఖ్యలో భక్తులు హాజరైనారు. అనంతరం రాత్రి 9 గంటలు ప్రాంతంలో స్వామి చిత్రపటాన్ని ట్రాక్టర్‌పై అందంగా అలంకరించి ప్రధాన వీధిలో ఊరేగించారు. బాలికలు జ్యోతులతో ఊరేగింపులో పాల్గొన్నారు. ఈ కార్యక్రమాన్ని తిలకించేందుకు భక్తులు హాజరైనారు. ఈ కార్యక్రమంలో పలువురు అయ్యప్పభక్తులు పాల్గొన్నారు.

మడకశిర

6న సాయి నిత్యాన్నదాన భవనం ప్రారంభం

మడకశిర గ్రామీణం, న్యూస్‌టుడే: పట్టణంలోని సాయిబాబా దేవాలయంలో నూతనంగా నిర్మించిన సాయి నిత్యాన్నదాన భవనం, వసతిగృహం, సముదాయ భవనాలను 6న ప్రారంభిస్తున్నట్లు ఆలయ కమిటీ సభ్యులు తెలిపారు. దేశంలోని పలు సాయి మందిరాలకు ఆర్థికసాయం అందించిన పారిశ్రామికవేత్త కేవీ రమణి పాల్గొంటారన్నారు. నూతనంగా నిర్మించిన భవనంలో ఉచితంగా కంటి పరీక్షలు నిర్వహించే కేంద్రాన్ని ప్రారంభిస్తారన్నారు.

నేడు కర్ణాటక కాంగ్రెస్ అధ్యక్షుడి పర్యటన

పావగడ, న్యూస్‌టుడే: కర్ణాటక కాంగ్రెస్ అధ్యక్షుడు పరమేశ్వర్ శుక్రవారం పావగడలో పర్యటిస్తారని మాజీ మంత్రి వెంకటరమణప్ప తెలిపారు. ఇంటింటా కాంగ్రెస్‌లో భాగంగా కార్యకర్తల సమావేశంలో ఆయన పాల్గొంటారన్నారు. పట్టణంతోపాటు తాలూకాకు తుంగభద్రా నుంచి తాగునీటిని అందించేందుకు ముఖ్యమంత్రి రూ.2.35 కోట్లు మంజూరుచేశారన్నారు.

అభివృద్ధికి సహకరించండి

బుళ్లసముద్రం(మడకశిర గ్రామీణం): ప్రజల సమస్యలను అధికారులు, ప్రజాప్రతినిధులు నేరుగా తెలుసుకుని పరిష్కరించేందుకు జన్మభూమి నిర్వహిస్తున్నట్లు ఎంపీపీ బొజ్జప్ప పేర్కొన్నారు. బుళ్లసముద్రం, ఛత్రం గ్రామాల్లో జరిగిన కార్యక్రమాల్లో వివిధ శాఖల ద్వారా అందిస్తున్న సంక్షేమ పథకాలపై అవగాహన కల్పించారు. రుణమాఫీ కాలేదని ప్రజాప్రతినిధులు, అధికారులను ఛత్రంలో పలువురు రైతులు ప్రశ్నించారు. ఎంపీపీ మాట్లాడుతూ అర్హులందరికీ పార్టీ, కుల, మతాలకు అతీతంగా రుణమాఫీ అందిస్తున్నారన్నారు. సర్పంచి జైపాల్ ఆధ్వర్యంలో నిర్వహించిన గ్రామీణ క్రీడా పోటీల్లో గెలుపొందిన వారికి బహుమతి ప్రదానం చేశారు. కార్యక్రమంలో ఇన్‌ఛార్జి తహసీల్దార్ ప్రసాద్, ప్రత్యేక అధికారి పెంచులయ్య, రెవెన్యూ సీనియర్ అసిస్టెంట్ శ్రీధర్, కో-ఆప్షన్ సభ్యుడు రాజగోపాల్, తెదేపా మండల అధ్యక్షుడు రామాంజనేయులు, నాయకులు, అధికారులు పాల్గొన్నారు.


బుళ్లసముద్రంలో విజేతలకు బహుమతి ప్రదానం

మోరుబాగల్(గుడిబండ): మడకశిర నియోజకవర్గాన్ని ఎమ్మెల్సీ గుండమల తిప్పేస్వామితో కలిసి అన్ని రంగాల్లో అభివృద్ధి చేస్తున్నామని ఎమ్మెల్యే ఈరన్న పేర్కొన్నారు. మోరుబాగల్, గుణేమోరుబాగల్ గ్రామాల్లో జరిగిన గ్రామసభల్లో ఆయన ప్రసంగించారు. రైల్వేలైను సర్వేకు నిధులు మంజూరయ్యాయని, చిలమత్తూరు నుంచి శిర వరకు జాతీయ రహదారి రానుందన్నారు. కాంగ్రెస్, వైకాపాలు అభివృద్ధికి సహకరించాలన్నారు. తప్పుడు ప్రచారాలు చేసి, సమస్యలు సృష్టించడానికి ప్రయత్నాస్తే ఊరుకోమని హెచ్చరించారు. అర్హులందరికీ పక్కాగృహాలు, పింఛన్లు అందిస్తామని జడ్పీటీసీ సభ్యుడు శ్రీనివాస్‌మూర్తి తెలిపారు. ఎంపీడీవో శివయ్య, తహసీల్దార్ మోహన్‌దాస్, సీడీపీఓ ఇందిరాదేవి, ఎంపీపీ సన్నీరప్ప, మండల కన్వీనర్ మద్దన్నకుంటప్ప, హౌసింగ్ ఏఈ రంగనాయకులు, ఏఈ పెంచలయ్య, సర్పంచి జయన్న, నాయకులు కిష్టప్ప, రాజేంద్ర, పురుషోత్తం, ఎంఈవో శ్రీధర్, ఏపీఎం లక్ష్మినారాయణ తదితరులు పాల్గొన్నారు.


మాట్లాడుతున్న ఎమ్మెల్యే ఈరన్న

గుడ్డగుర్కి(రొళ్ల): తెదేపా ప్రభుత్వంతోనే రాష్ట్రం అన్ని రంగాల్లో అభివృద్ధి చెందుతుందని జడ్పీటీసీ పాండురంగప్ప పేర్కొన్నారు. గుడ్డగుర్కిలో సర్పంచి వెంకటేష్ అధ్యక్షతన జరిగిన జన్మభూమిలో ఆయన మాట్లాడారు. పింఛన్లు, వన్నప్పపాళ్యం సమీపంలో రిజర్వాయర్ నిర్మించి నీటి నిల్వ చేయాలనే అంశాన్ని ఎమ్మెల్సీ ముఖ్యమంత్రి దృష్టికి తీసుకెళ్లారన్నారు. సామూహిక సీమంతంలో గర్భిణులకు మంగళద్రవ్యాలు అందించారు. ఎంపీపీ నాగరాజు, ఎంపీటీసీ పాండురంగప్ప, హెచ్‌డీఎస్ ఛైర్మన్ గురుమూర్తి, కో-ఆప్షన్ సభ్యుడు మంజునాథ్, ప్రత్యేక అధికారి మల్లికార్జున, ఎంపీడీఓ సరస్వతి, ఉపతహసీల్దార్ రాజు, ఏపీఎం సురేష్, ఈఓఆర్‌డీ చంద్రశేఖర్ తదితరులు పాల్గొన్నారు.


మంగళద్రవ్యాలు అందిస్తున్న ప్రజాప్రతినిధులు, అధికారులు

నరసంబూది(అగళి), న్యూస్‌టుడే: మడకశిర నియోజకవర్గంలోని అన్ని చెరువులకు జూన్‌లో హంద్రీనీవా ద్వారా కృష్ణా జలాలు వస్తాయని ఎమ్మెల్యే ఈరన్న పేర్కొన్నారు. నరసంబూదిలో ఆయన మాట్లాడుతూ కాంగ్రెస్ పాలనలో జలయజ్ఞాన్ని ధనయజ్ఞంగా మార్చి దోచుకున్నారని ఆరోపించారు. గ్రామంలో పాముకాటుతో మృతి చెందిన సిద్ధగంగమ్మ కుటుంబానికి చంద్రన్న బీమా ద్వారా మంజూరైన రూ.5 లక్షల బాండు పత్రాన్ని అందించారు. నాయకులు రామకృష్ణయాదవ్, బసవరాజు, శ్రీనివాస్, ప్రత్యేకాధికారి శ్రీనివాస్‌రెడ్డి, ఎంపీడీవో సోనిబాయి, ఎంఈవో గోపాల్, తహసీల్దార్ శివశంకర్, వైద్యాధికారి శివానంద, హౌసింగ్ ఏఈ రమేష్, ఎస్‌ఐ రాంబాబు, బీసీ సంక్షేమాధికారి రామ్మోహన్, ఏపీవో ఓబుళప్ప, నాయకులు రంగప్ప, గోవిందప్ప, సీతన్న, దాసప్ప పాల్గొన్నారు.


మొక్కనాటి నీరు పోస్తున్న ఎమ్మెల్యే ఈరన్న తదితరులు


మాట్లాడుతున్న ప్రత్యేక అధికారి సుబ్బరామయ్య

బసవనపల్లి(అమరాపురం): ప్రభుత్వం ప్రజల కోసం అనేక సంక్షేమ పథకాలు ప్రవేశపెట్టిందని, సద్వినియోగం చేసుకుని ఆర్థికంగా ఎదగాలని నియోజకవర్గ ప్రత్యేక అధికారి సెరికల్చర్ జేడీ సుబ్బరామయ్య తెలిపారు. మండల పరిధిలోని బసవనపల్లిలో జరిగిన జన్మభూమి కార్యక్రమంలో పాల్గొని మాట్లాడారు. సంక్షేమ పథకాలు ఎంతవరకు ప్రజలకు అందుతున్నాయి, ఎవరెవరికి అందడం లేదో తెలుసుకోవడానికే ఈ కార్యక్రమం చేపట్టినట్లు పేర్కొన్నారు. అనంతరం రాష్ట్ర తెదేపా బీసీ సెల్ కార్యదర్శి నరసింహామూర్తి మాట్లాడుతూ ప్రభుత్వం ఆర్థికంగా ఇబ్బందులు ఎదుర్కొంటున్నా రుణమాఫీ, మహిళా సంఘాలకు పసుపు కుంకుమ, రైతులకు పంట నష్టపరిహారం చేపట్టినా ప్రతిపక్షాలు రాద్ధాంతం చేస్తున్నాయని అనటంతో అక్కడే ఉన్న వైకాపా, కాంగ్రెస్ నాయకులు రుణమాఫీ, పెట్టుబడిరాయితీ ఎక్కువమందికి అందడం లేదని అధికారులను నిలదీశారు. కొద్ది సేపు వాగ్వాదం జరిగింది. అక్కడున్న పెద్దలు సర్ది చెప్పారు. కార్యక్రమంలో మండల ప్రత్యేక అధికారి రామేశ్వరరావు, ఎంపీడీఓ రామారావు, తహసీల్దార్ ఓబన్న, ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ మల్లికార్జున, సర్పంచి శివలింగమ్మ, స్థానిక నాయకులు మల్లికార్జున, చిన్నేగౌడ్, పరమేష్, రాజప్ప, ప్రభాకర్, భీమప్ప, రాజశేఖర్ తదితరులు పాల్గొన్నారు.


చంద్రన్న సంక్రాంతి కానుకలు అందిస్తున్న కమిషనర్, కౌన్సిలర్లు

మడకశిర: మున్సిపాలిటీ పరిధిలోని 5వార్డు చీపులేటిలో నిర్వహించిన కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ సంఘం శ్రీనివాసులు ప్రజలకు చంద్రన్న కానుకలు అందించారు. తాగునీటికి ఇబ్బంది లేకుండా, పారిశుద్ధ్య నిర్వహణకు అన్ని చర్యలు తీసుకుంటున్నామన్నారు. కార్యక్రమంలో మున్సిపల్ మాజీ అధ్యక్షులు ప్రకాష్, పార్టీ పట్టణ అధ్యక్షుడు మనోహర్, నాయకులు సుబ్బరాయప్ప, నాగేంద్రప్ప, నాగరాజు, వెంకటేశులు, కౌన్సిలర్లు, మెప్మాసభ్యులు, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు. ఈసందర్భంగా ప్రభుత్వం అందిస్తున్న చంద్రన్న కానుకలను ప్రజలకు అందించారు. పట్టణంలో ఎక్కడా ఇబ్బందులులేకుండా పారిశుద్ధ్యం, మురికికాలువలు, తాగునీటికి అన్ని చర్యలు తీసుకొంటామని కమిషనర్ తెలిపారు.

మరుగుదొడ్డి వినియోగించండి

మడకశిర, న్యూస్‌టుడే: మరుగుదొడ్డి తప్పనిసరిగా నిర్మించుకుని వినియోగించాలని విద్యార్థులు గురువారం పట్టణంలో ప్రదర్శన నిర్వహించారు. ప్రభుత్వ జూనియర్ కళాశాల ప్రిన్సిపల్ సత్యవరప్రసాద్ ఆధ్వర్యంలో ఎన్‌ఎస్‌ఎస్ విద్యార్థులు ప్రదర్శన చేపట్టారు. ప్రిన్సిపల్ మాట్లాడుతూ మరుగుదొడ్ల నిర్మాణానికి ప్రభుత్వం ఆర్థికసాయం అందిస్తోందన్నారు. బహిరంగ మల విసర్జనతో వ్యాధులు ప్రబలుతాయన్నారు. అనంతరం చెంబుకు శవయాత్ర నిర్వహించారు. కార్యక్రమంలో ఎన్‌ఎస్‌ఎస్ పీవో మంజునాథ్, అధ్యాపకులు, సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.

గుడిబండ: గుడిబండలో ప్రభుత్వ జూనియర్ కళాశాల అధ్యాపకులు, ఎన్‌ఎస్‌ఎస్ విద్యార్థులు మరుగుదొడ్ల నిర్మాణంపై అవగాహన కల్పించారు. ప్రిన్సిపల్ రంగనాయకులు, ఎన్‌ఎస్‌ఎస్ పీవో నరేష్ ఆధ్వర్యంలో విద్యార్థులు ప్రదర్శనగా వెళ్లి పరిసరాల శుభ్రతపై చైతన్యం కల్పించారు. బస్టాండ్ ఆవరణలో మానవహారం ఏర్పాటు చేశారు. అధ్యాపకులు శ్రీనివాసులు, రామదాస్‌నాయక్, సుధాకర్, శివశంకర్ తదితరులు పాల్గొన్నారు.

అమరాపురం: ప్రతి ఇంటికి మరుగుదొడ్డి నిర్మించుకుని వినియోగిస్తే రోగాలు దూరమవుతాయని ఆదర్శ పాఠశాల ఉపాధ్యాయులు, విద్యార్థులు ప్రదర్శన నిర్వహించారు. పాఠశాల నుంచి హలుకూరు వరకు ప్రదర్శనగా వెళ్లి మరుగుదొడ్ల వినియోగంతో కలిగే లాభాలు వివరించారు. ఆరోగ్యాన్ని కాపాడుకోవాలని నినాదాలు చేశారు. కార్యక్రమంలో ప్రిన్సిపల్ మంజునాథ్, వ్యాయామ ఉపాధ్యాయులు చంద్రశేఖర్, ఉపాధ్యాయినులు నిర్మల, లక్ష్మీదేవి తదితరులు పాల్గొన్నారు.


అమరాపురం బస్టాండ్‌లో మానవహారం, చెంబుకు శవయాత్ర


గుడిబండలో విద్యార్థుల చైతన్య ప్రదర్శన

రొళ్ల: బహిరంగ మల విసర్జనతో కలిగే అనర్థాలపై సాంఘిక సంక్షేమ బాలుర గురుకుల పాఠశాల ఉపాధ్యాయులు, విద్యార్థులు గ్రామంలో అవగాహన కల్పించారు. ప్రిన్సిపల్ సుజాత మాట్లాడుతూ తల్లిదండ్రులు వ్యక్తిగత మరుగుదొడ్లు నిర్మించుకునేలా విద్యార్థులు చైతన్య పరచాలన్నారు. కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయ బృంద, విద్యార్థులు పాల్గొన్నారు.

మడకశిర

నేడు అయ్యప్పస్వామి రథోత్సవం

రొళ్ల, న్యూస్‌టుడే: మండల పరిధిలోని బీజీహళ్లి అయ్యప్పస్వామి భక్త మండలి ఆధ్వర్యంలో స్వామివారి రథోత్సవాన్ని శుక్రవారం నిర్వహిస్తున్నట్లు గురుస్వామి రాజన్న తెలిపారు. ఉత్సవ మూర్తిని గ్రామవీధుల్లో ఊరేగిస్తామన్నారు. శివమొగ్గ కళాకారుల వీరగ్యాస నృత్యం, చండీమేళం, డప్పు వాయిద్యాలతో నృత్య ప్రదర్శన ఉంటుందన్నారు.

యువతకు కంప్యూటర్ శిక్షణ

మడకశిర, న్యూస్‌టుడే: స్వచ్ఛంద సంస్థ ఫోర్డ్, ఏపీ నైపుణ్యాభివృద్ధి సంస్థ ఆధ్వర్యంలో ఎస్సీ యువతకు ఉచిత కంప్యూటర్ శిక్షణను ఇస్తున్నట్లు ఫోర్డ్ అధ్యక్షుడు కె.బదిరీష్ తెలిపారు. ఇంటర్మీడియట్, డిగ్రీ చదువుకున్నవారు అర్హులన్నారు. శిక్షణ అనంతరం బెంగళూరు, దొడ్డబళ్లాపురం తదితర ప్రాంతాల్లో ఉపాధి కల్పిస్తామని సిబ్బంది మహలింగప్ప, కె.హనుమంతరాయప్ప వివరించారు.

జలం పెరిగింది...దాహార్తి తీరింది



ఇందిరమ్మ కాలనీలో తాగునీటి పథకం

అమరాపురం, న్యూస్‌టుడే: మండలంలో భూగర్భజలాలు పెరగటంతో తాగునీటి కష్టాలు తప్పాయి. గత వేసవిలో మండల వ్యాప్తంగా 46 గ్రామాల్లో 60కి పైగా బోర్లలో నీటిమట్టం తగ్గింది. కొత్తగా బోర్లు వేసినా అరకొర నీళ్లు వచ్చేవి. గత ఏడాది ఆఖరులో కురిసిన భారీ వర్షాలకు చెరువులు, కుంటల్లో నీరు చేరింది. తమ్మడేపల్లి పంచాయతీలో దేవగానపల్లిలో రెండు, నాగోనపల్లిలో ఒకటి, తమ్మడేపల్లిలో రెండుబోర్లు పూర్తిగా ఎండిపోయాయి. వాటిలో ప్రస్తుతం సమృద్ధిగా నీళ్లు వస్తున్నాయి. దేవగానపల్లి రోడ్డులో ఎండిన బోరుబావిలో రెండువారాల కిందట మోటారు అమర్చడంతో తాగునీరు సమృద్ధిగా వస్తోంది. హేమావతి పంచాయతీలో కొర్రెవు, వసహట్టి, నిద్రఘట్ట పంచాయతీలో యర్రగుంటపల్లి, హెచ్‌బీఎన్ కాలనీ, శివరం పంచాయతీల్లో ఎస్.రంగాపురం, కరేకల్లహట్టి గ్రామాల్లోనూ ఎండిపోయిన బోర్ల నుంచి సమృద్ధిగా నీళ్లు వస్తున్నాయి. ఈ ఏడాది తాగు, సాగునీటికి ఇబ్బంది ఉండదని రైతులు, ప్రజలు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

పంట కుంటలు తవ్వితే...

ప్రస్తుతం ఉన్న తాగునీటిని పొదుపుగా వాడాలని ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ మల్లికార్జున తెలిపారు. మండలంలో గత ఏడాది 800 పంట కుంటలు, 4 చెక్‌డ్యామ్‌లు నిర్మించారు. 40 రోజులపాటు నిత్యం వర్షాలు కురియడంతో భూగర్భజల మట్టం పెరిగింది. ఈ వేసవిలోనూ రైతుల పొలాల్లో 5 ఎకరాలకు ఒకటి చొప్పున పంట కుంటలు తవ్వితే నీటి ఇక్కట్లు తగ్గుతాయి. మండలంచుట్టూ మూడువైపులా కర్ణాటక సరిహద్దు ఉంది. అక్కడి ప్రభుత్వాలు చెక్‌డ్యామ్‌లు, నీటి కుంటలు నిర్మించడంతో చుక్కనీరు ఆంధ్ర సరిహద్దులోకి రావడం లేదు. ఇక్కడ కురిసే ప్రతి నీటిబొట్టు సద్వినియోగమయ్యేలా ఉపాధి అధికారులు విరివిగా పంట కుంటలు నిర్మించాల్సి ఉంది.



ఎండిపోయిన బోరు నుంచి సమృద్ధిగా వస్తున్న నీరు

తప్పిన ఇక్కట్లు



తమ్మడేపల్లి పంచాయతీలో గత వేసవిలో బోర్లు ఎండిపోవడంతో తాగునీటి కోసం వ్యవసాయ బోర్లవద్దకు వెళ్లాం. వర్షాలు బాగా కురవటంతో బోర్లలో నీటిమట్టం పెరిగింది. ఇందిరమ్మ కాలనీ కోసం వేసిన బోరు నుంచి దేవగానపల్లికి పైప్‌లైన్ ఏర్పాటు చేశారు. కాలనీకి మూడురోజులకోసారి నీటిని సరఫరా చేస్తున్నారు. ఆ గ్రామానికి వేసిన బోర్లలోనూ నీరు సమృద్ధిగా వస్తోంది. **- యామక్క, గౌడనకుంట**

బోరుకు మళ్లీ జీవం...



పొలాల్లో కురిసిన కొద్దిపాటి వర్షపునీరు పంట కుంటల్లోకి చేరి నేరుగా బోరులోకి ఇంకుతోంది. భూగర్భ జలాలు పెరుగుతున్నాయి. గత ఏడాది వేసవిలో మా బోరు పూర్తిగా ఎండిపోయింది. వర్షాలు కురియడంతో మళ్లీ నీళ్లు వస్తున్నాయి. తాగునీటి బోర్లలోనూ నీరు సమృద్ధిగా ఉంది.

- వీరలింగప్ప, గౌడనకుంట

వ్యక్తికి తీవ్ర గాయాలు

హొట్టెబెట్ట(రొళ్ల), న్యూస్‌టుడే: మండల పరిధిలోని హొట్టెబెట్ట సమీపంలో గురువారం జరిగిన రోడ్డు ప్రమాదంలో సుబ్బరాయప్ప అనే వ్యక్తి తీవ్రంగా గాయపడ్డాడు. మడకశిర మండలం లక్ష్మీపురం గ్రామానికి చెందిన సుబ్బరాయప్ప ద్విచక్రవాహనంలో హొట్టెబెట్ట నుంచి స్వగ్రామానికి వెళ్తుండగా మలుపు వద్ద గుంతలు గమనించక అదుపుతప్పి కిందపడ్డాడు. స్థానికులు గమనించి మడకశిర ఆసుపత్రికి తరలించారు.

హలో ఈనాడు

మడకశిర గ్రామీణం 7675919016

ఉదయం 11 నుంచి 12 గంటల వరకు





జమ్మానిపల్లిలో ప్రవహిస్తున్న మురుగు

మడకశిరగ్రామీణం, న్యూస్‌టుడే

❐ **సమస్య:** మండల పరిధిలోని జమ్మానిపల్లిలో కాలువలు ఏర్పాటు చేయకపోవడంతో మురుగు రోడ్డుపై ప్రవహిస్తోంది. పారిశుద్ధ్య పనులు చేపట్టకపోవడంతో నీరు నిల్వ ఉండి దోమలు బెడద అధికమైంది. ప్రజలు రోగాలబారిన పడుతున్నారు. వెంటనే కాలువలు డ్రైనేజీలు ఏర్పాటు చేయాలి.

- మురళి, జమ్మానిపల్లి

❁ **సమాధానం:** మండలంలోని జమ్మానిపల్లి గ్రామంలో కాలువల ఏర్పాటుకు అవసరమైన నిధుల మంజూరుకు ప్రతిపాదనలు పంపాం. సర్పంచితో మాట్లాడి పారిశుద్ధ్య పనులు చేపట్టేలా చూస్తాం.

- బొజ్జప్ప, ఎంపీపీ, మడకశిర

❐ **సమస్య:** రొళ్ల-రామనపల్లి ప్రధాన రహదారి నుంచి దొమ్మరహట్టి గ్రామానికి వెళ్లే మట్టిరోడ్డుకు ఇరువైపులా ముళ్లకంపలు పెరిగాయి. కొండప్రాంతం కావడంతో ఎలుగుబంట్లు చేరుతున్నాయి. ఆ మార్గంలో రాకపోకలు సాగించటానికి భయాందోళన చెందుతున్నాం. **- యర్రప్ప, దొమ్మరహట్టి**

❁ **సమాధానం:** దొమ్మరహట్టి గ్రామానికి వెళ్లే రోడ్డుకు ఇరువైపులా కంపచెట్లు పెరిగిన మాట వాస్తవమే. స్థానిక ఎంపీపీతో చర్చించి ఉపాధిహామీ ద్వారా వాటిని తొలగించడానికి చర్యలు తీసుకుంటాం.

- నాగరాజు, సర్పంచి, హులికుంట

❐ **సమస్య:** రొళ్ల బోయవీధిలోని కాలువల్లో చెత్తాచెదారం పేరుకుపోవడంతో మురుగు రోడ్డుపై ప్రవహిస్తోంది. రాకపోకలు సాగించటానికి ఇబ్బందిగా ఉంది.

- శివన్న, రొళ్ల

❁ **సమాధానం:** మండల కేంద్రంలోని అన్ని వార్డుల్లో పారిశుద్ధ్య పనులు చేపడుతున్నాము. బోయవీధిలో కాలువలను శుభ్రం చేసి మురుగు రోడ్డుపై ప్రవహించకుండా చర్యలు తీసుకుంటాం.

- ముంతాజ్, సర్పంచి, రొళ్ల

❐ **సమస్య:** పట్టణంలోని పాత కర్ణాటక బ్యాంకు వెనుకభాగంలోని ఎస్సీకాలనీలో మురుగు రోడ్డుపైకి చేరుతోంది. తాగునీటి పైపులైన్ కిందే మురుగు ప్రవహిస్తుండటంతో నీరు కలుషితమవుతోంది. కాలువలు నిర్మించాలి. **- హరి, ఎస్సీకాలనీ, మడకశిర**

❁ **సమాధానం:** పట్టణంలోని ఎస్సీకాలనీలో ఇప్పటికే పారిశుద్ధ్య పనులు చేపడతున్నాము. త్వరలో కాలువల నిర్మాణం చేపడతామని ఉన్నతాధికారులు చెబుతున్నారు. రోడ్డుపై మురుగు చేరకుండా చూస్తాం.

- శరణ్య, మున్సిపల్ ఛైర్‌పర్సన్, మడకశిర



ప్రదర్శన నిర్వహిస్తున్న ఉపాధ్యాయులు

స్వచ్ఛతే ఆరోగ్యానికి రక్ష

ఇరిగేపల్లి(అగళి), న్యూస్‌టుడే: పరిసరాల శుభ్రత పాటిస్తే రోగాలు దరి చేరవని తెదేపా నాయకుడు శ్రీనివాస్, ఉపాధ్యాయుడు మల్లప్ప పేర్కొన్నారు. మండలంలోని ఇరిగేపల్లి ఉన్నత పాఠశాలలో గురువారం విద్యార్థులు, ఉపాధ్యాయులు ప్రదర్శన నిర్వహించారు. విద్యార్థులు వ్యక్తిగత శుభ్రత పాటించాలన్నారు. వ్యక్తిగత మరుగుదొడ్లు నిర్మించుకునేలా గ్రామాల్లో అవగాహన పెంచాలన్నారు. ప్రధానోపాధ్యాయుడు రామ్మోహన్‌రెడ్డి, ఉపాధ్యాయుడు కాటప్ప, శ్రీనివాస్‌రెడ్డి, పీఈటీ మోహన్ తదితరులు పాల్గొన్నారు.

దైనందిని ఆవిష్కరణ

అమరాపురం, న్యూస్‌టుడే: అమరాపురం యూటీఎఫ్ నాయకులు గురువారం ఎమ్మార్సీ కార్యాలయంలో దైనందిని, కాలమానిని ఆవిష్కరించారు. ఉపాధ్యాయులకు ప్రభుత్వం అందించే అన్ని రకాల వివరాలు ఉన్నాయని సద్వినియోగం చేసుకోవాలని యూటీఎఫ్ మండల శాఖ అధ్యక్షుడు యంజేరప్ప, కార్యదర్శి గుమ్మన్న తెలిపారు. కార్యక్రమంలో నాగరాజు, హనుమంతరాయ, తిప్పేస్వామి, చంద్రశేఖర్, వాసుదేవ్, అనిల్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.



ఆవిష్కరిస్తున్న సంఘం ప్రతినిధులు

సంక్షేమ పథకాలపై అవగాహన

మడకశిర గ్రామీణం, న్యూస్‌టుడే: గ్రామీణ ప్రాంతాల్లోని ప్రజలకు ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలపై విద్యార్థులు అవగాహన కల్పించాలని ప్రిన్సిపల్ సుబ్బయ్య పేర్కొన్నారు. గురువారం మండల పరిధిలోని ఈచలడ్డి, రంగాపురం గ్రామాల్లో ఎస్‌వైటీఆర్ ప్రభుత్వ డిగ్రీ కళాశాల ఎన్‌ఎస్‌ఎస్ విభాగం ఆధ్వర్యంలో ప్రత్యేక శిబిరం ఏర్పాటు చేశారు. ప్రిన్సిపల్ మాట్లాడుతూ మరుగుదొడ్ల నిర్మాణ ప్రాధాన్యతను ప్రజలకు వివరించాలన్నారు. రంగాపురం నుంచి ఎగువ, దిగువ ఈచలడ్డి గ్రామాలకు వెళ్లే కాలినడకదారికి మరమ్మతులు చేపట్టాలన్నారు. కార్యక్రమంలో ఎన్‌ఎస్‌ఎస్ పీఓలు తిరుమలమ్మ, కృష్టప్ప, రంగనాయకులు, జేకేసీ నిర్వాహకులు శ్రీనివాసులు, సీనియర్ అసిస్టెంట్ గంగాధర్ తదితరులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న ప్రిన్సిపల్ సుబ్బయ్య

మారుమూల...శిథిల పాఠశాల



అర్ధంతరంగా ఆగిన నిర్మాణం

అగళి, న్యూస్‌టుడే: మండలంలో మారుమూలన కర్ణాటకకు అతి సమీపంలోని గాయత్రీకాలనీ గ్రామంలో పాఠశాల శిథిలావస్థకు చేరింది. ఇక్కడ వలసలు వచ్చినవారే 90శాతం మంది ఉన్నారు. పిల్లలకు విద్యను అందించేందుకు ప్రభుత్వం ప్రాథమిక పాఠశాల ఏర్పాటుచేసింది. 24 మంది విద్యార్థులున్నారు. ఏకోపాధ్యాయుడితో బోధన కొనసాగుతోంది. పాఠశాలలో మూడు గదులు శిథిలమయ్యాయి. రెండు భవనాలు అర్ధంతరంగా ఆగిపోయాయి. గతంలో ఎస్ఎస్ఏ ద్వారా నూతన భవనాన్ని మంజూరు చేసినా పూర్తికాలేదు. శిథిలావస్థకు చేరిన భవనంలోనే పాఠాలు బోధిస్తున్నారు. పాఠశాలకు వంట గది, తాగునీటి సౌకర్యం కూడా లేదు. పైకప్పు కూడా దెబ్బతింది. ఎప్పుడు ఏ ప్రమాదం జరుగుతుందోనని విద్యార్థుల తల్లిదండ్రులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

విద్యార్థులకు తప్పని కష్టాలు

సమీప వడ్రహట్టి గ్రామ విద్యార్థులు కూడా ఇక్కడికే వస్తున్నారు. సంబంధిత అధికారులు చొరవచూపి భవనాలు పూర్తిచేసి సదుపాయాలు కల్పించాలని గ్రామస్థులు కోరుతున్నారు. కర్ణాటకలోని అప్పిహళ్లి, వనగొండనహళ్ళి తదితర పాఠశాలలకు 14 మంది విద్యార్థులు వెళుతున్నారు.



శిథిలావస్థకు చేరిన పైకప్పు చువ్వలు

పెనుకొండ

ఎమ్మార్పీఎస్ నాయకుల ఆందోళన

రొద్దం, న్యూస్‌టుడే: తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం మందకృష్ణ మాదిగను అరెస్టు చేయడంపై పలువురు ఎమ్మార్పీఎస్ నాయకులు గురువారం రొద్దంలో ఆ రాష్ట్ర ముఖ్యమంత్రి కేసీఆర్ దిష్టిబొమ్మను దహనం చేశారు. గ్రామంలోని పావగడ - పెనుకొండ ప్రధాన రహదారి కూడలిలో రాయలసీమ కార్యదర్శి నాగరాజు ఆధ్వర్యంలో మండల అధ్యక్షుడు బైలాంజనేయులు, రాజు పలువురు నాయకులు నిరసన వ్యక్తం చేశారు.

ఆంజనేయస్వామికి భాజపా నాయకుల పూజలు

పెనుకొండ, న్యూస్‌టుడే: పెనుకొండలోని ఊరివాకిలి ఆంజనేయస్వామికి గురువారం భాజపా నాయకులు పూజలు చేశారు. రోడ్డు ప్రమాదంలో గాయపడిన పార్టీ అధ్యక్షుడు అంకాల్‌రెడ్డికి ఆరోగ్యాన్ని ప్రసాదించాలని వారు వేడుకున్నారు. కార్యక్రమంలో నాయకులు రామాంజనేయులు, రామకృష్ణ, సాయిప్రసాద్, హనుమంతు తదితరులు పాల్గొన్నారు.

ఆత్మవిశ్వాసంతో ముందుకెళ్లాలి



సుధాకర్‌రెడ్డికి సన్మానం

రొద్దం, న్యూస్‌టుడే: అంధులు ఆత్మవిశ్వాసంతో ముందుకెళ్లాలని ఫిజియోథెరపిస్ట్ నాగేశ్వర్‌రావు అన్నారు. పలువురు అంధులతో పాటు టింబక్టు కలెక్టివ్ సంస్థ ఆధ్వర్యంలో ఏర్పడిన అనంతశక్తి సొసైటీ కార్యాలయ ఆవరణలో ఆదర్శ ప్రతిభా వికలాంగుల సొసైటీ పొదుపు సంఘం సీఈవో వరలక్ష్మి ఆధ్వర్యంలో గురువారం లూయిస్ బ్రెయిలీ జయంతి వేడుకలను నిర్వహించారు. మండలంలోని పెద్దగువ్వలపల్లికి చెందిన అంధుడు సుధాకర్‌రెడ్డికి పావగడలో కొత్తగా పంచాయతీ కార్యదర్శిగా ఉద్యోగం వచ్చినందుకు ఆయనకు పలువురు అంధులు సన్మానించారు. కార్యక్రమంలో సొసైటీ కార్యకర్త ఆనంద్, పలువురు సమాఖ్య సభ్యులు పాల్గొన్నారు.



కాలమానిని ఆవిష్కరిస్తున్న డీఎస్పీ కరీముల్లాషరీఫ్, తదితరులు

జీవీఎస్ఎస్ కాలమానిని ఆవిష్కరణ

పాతచెక్‌పోస్టు (పెనుకొండ), న్యూస్‌టుడే: పెనుకొండలోని పోలీస్ సబ్‌డివిజన్ కార్యాలయంలో గురువారం గిరిజన విద్యార్థి సంక్షేమ సంఘం నూతన సంవత్సర కాలమానిని డీఎస్పీ కరీముల్లాషరీఫ్ ఆవిష్కరించారు. గిరిజన విద్యార్థుల సమస్యల పరిష్కారానికి కృషిచేసే జీవీఎస్ఎస్ నాయకులను ఆయన అభినందించారు. జీవీఎస్ఎస్ నాయకులు హరిలాల్‌నాయక్, హరినాయక్, రవినాయక్ తదితరులు పాల్గొన్నారు.

ఏపీటీఎఫ్ కాలమానిని ఆవిష్కరణ

గోరంట్ల, మండల ఏపీటీఎఫ్ శాఖ ఆధ్వర్యంలో 2018 కాలమానిని, దైనందినిని ఎంఈవో కలీముల్లా ఆధ్వర్యంలో గురువారం ఆవిష్కరించారు. ఎమ్మార్సీలో జరిగిన కార్యక్రమంలో ఎంఈవో మాట్లాడుతూ ఉపాధ్యాయులు విధులు సక్రమంగా నిర్వహించి విద్యాభివృద్ధికి పాటుపడాలని కోరారు. కార్యక్రమంలో ఏపీటీఎఫ్ నాయకులు సుధాకరరెడ్డి, ఆదినారాయణ, రామచంద్రప్ప, పెద్దసంఖ్యలో ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

అభివృద్ధే లక్ష్యం.. ఈ ఏడాది ఇదే మంత్రం

పెనుకొండ పట్టణం న్యూస్‌టుడే: 2018 సంవత్సరం అభివృద్ధే లక్ష్యంగా, ప్రణాళికాబద్ధంగా ముందుకు సాగుతామని పెనుకొండ ఎమ్మెల్యే బీకే పార్థసారథి, ఆర్డీవో రామమూర్తి, ఎంపీపీ యశోదమ్మ పేర్కొన్నారు. తగిన లక్ష్యాలను నిర్దేశించుకుని వాటి సాధిస్తామని తెలిపారు. అధికారులు, నాయకుల సమన్వయంతో పనులు చేపడతామని చెప్పారు. అర్హులకు సంక్షేమ పథకాలు అందిస్తామని పేర్కొన్నారు. రహదారి, నీటి సమస్యను పరిష్కరిస్తామని, రైతులకు పాసు పుస్తకాలు, అర్హులకు పింఛన్లు అందిస్తామని పేర్కొన్నారు.

గ్రామీణ ప్రాంతాలకు రహదారులు నిర్మిస్తాం



బీకే పార్థసారథి

- నియోజకవర్గంలోని అన్ని మారుమూల గ్రామాలకు రహదారులు నిర్మించి రవాణా సౌకర్యం కల్పించేందుకు కృషి చేస్తా. ఇప్పటికే పలుగ్రామాలకు కొత్తగా రోడ్లు నిర్మించాం. మిగిలిన గ్రామాలకు సైతం ఈ ఏడాది నిర్మించేలా చర్యలు తీసుకుంటున్నా.
- హంద్రీనీవా కాలువల ద్వారా నియోజవర్గంలోని చెరువులకు నీరందిస్తాం. తద్వారా గ్రామీణ ప్రాంతాల్లో సాగు విస్తీర్ణం పెరుగుతుంది. వరుస కరవుతో బాధపడుతున్న రైతులకు ఊరట లభిస్తుంది.
- రూ. 260కోట్లతో గొల్లపల్లి జలాశయం నుంచి నియోజకవర్గంలోని అన్ని గ్రామాలకు తాగునీరందిస్తాం. వేసవిలో తాగునీటి సమస్యలను అధిగమించాలనే లక్ష్యంతో ముందుకు సాగుతున్నాం.
- కియా పరిశ్రమ రాకతో ఈప్రాంతం పారిశ్రామికంగా అభివృద్ధిలోకి వచ్చింది. ఇదే సమయంలో నిరుద్యోగ యువతకు ఉద్యోగాలు కల్పించాలని నిర్దేశించుకొన్నాం. త్వరలోనే కియాలో ఉద్యోగ నియామకాలకు చర్యలు ప్రారంభం కానున్నాయి.

అర్హులందరికీ సంక్షేమ పథకాలు

- మండలంలో అర్హులైన వృద్ధులు, వితంతువులు, దివ్యాంగులు, చేనేత, కల్లుగీత కార్మికులకు ఎన్టీఆర్ భరోసా పింఛన్లు మంజూరు చేయిస్తాం.
- సొంతిల్లు లేని నిరుపేదలకు ఇళ్లు మంజూరు చేయిస్తాం. గ్రామాల్లో అంతర్గత రహదారులు, మురుగుకాలువల నిర్మాణానికి కృషి చేస్తాం.



యశోదమ్మ, ఎంపీపీ, పెనుకొండ

- కియా రాకతో పెనుకొండకు అంతర్జాతీయ స్థాయిలో గుర్తింపు వచ్చింది. పట్టణంలో రహదారులు, వీధిదీపాలు, మౌలిక వసతులు కల్పిస్తాం.
- పెనుకొండలో స్వచ్ఛభారత్ మిషన్‌లో చెత్తతో సంపద తయారీ కేంద్రం నిర్మించారు. ఇందుకు తగిన సామగ్రిని సమకూర్చి పెనుకొండను సుందరంగా తీర్చిదిద్దుతాం.

డివిజన్ మొత్తం ఓడీఎఫ్‌గా తీర్చిదిద్దుతాం



రామమూర్తి ఆర్డీవో

- పెనుకొండ డివిజన్ మొత్తం ఫిబ్రవరిలోగా బహిరంగ మలమూత్ర విసర్జన రహిత డివిజన్‌గా తీర్చిదిద్దాలనే లక్ష్యంతో చర్యలు చేపట్టాం. ఇందుకు నిరంతరం అధికారులతో పర్యవేక్షిస్తున్నాం.
- కియా మోటార్స్ పరిశ్రమ శంకుస్థాపన త్వరలో జరుగుతుంది. పరిశ్రమ స్థాపన కోసం భూములిచ్చి సహకరించిన రైతుల కుటుంబ సభ్యులకు ఉద్యోగాలు కల్పిస్తాం.
- డివిజన్‌ను పారిశ్రామికంగా అభివృద్ధి చేయాల్సి ఉంది. పారిశ్రామికవేత్తలు ముందుకు వస్తే అవసరమైన మౌలిక వసతులు కల్పించి పారిశ్రామిక అభివృద్ధికి కృషి చేస్తాం.
- రెవెన్యూ డివిజన్ పరిధిలోని రైతుల భూ సమస్యలు పరిష్కరించి వారు ఆనందంగా ఉండేలా చేయాలనే లక్ష్యంతో పని చేస్తున్నాం. పట్టాదారు పాసుపుస్తకాలు తదితర సమస్యలు పరిష్కరిస్తాం.

మరుగుదొడ్ల సద్వినియోగంతోనే స్వచ్ఛాంధ్ర సాకారం



సంక్రాంతి కానుకలను అందజేస్తున్న ప్రజాప్రతినిధులు, అధికారులు

కేతగానిచెరువు,నడింపల్లి (సోమందేపల్లి): కేంద్ర,రాష్ట్ర ప్రభుత్వాలు ప్రతిష్టాత్మకంగా చేపడుతున్న వ్యక్తిగత మరుగుదొడ్లను ప్రతి కుటుంబం సక్రమంగా నిర్మించుకొని సద్వినియోగం చేసుకోవడం ద్వారా స్వచ్ఛాంధ్రప్రదేశ్ లక్ష్యం సాకారమవుతుందని జడ్పీటీసీ సభ్యుడు వెంకటరమణ, ప్రత్యేకాధికారి కృష్ణానాయక్, ఎంపీడీవో నాగన్న, తహసీల్దార్ రామాంజనేయరెడ్డి పేర్కొన్నారు. గురువారం మండలంలోని కేతగానిచెరువు, నడింపల్లి గ్రామాల్లో జన్మభూమి-మాఊరు కార్యక్రమ గ్రామసభలు సర్పంచులు సంజయ్‌కుమార్,రామాంజనేయులు అధ్యక్షతన ఆయా అధికారులు నిర్వహించారు. చాలకూరు జడ్పీ విద్యార్థులు,ఉపాధ్యాయులు కేతగానిచెరువు గ్రామంలో స్వచ్ఛభారత్‌పై ప్రదర్శన చేపట్టారు. నడింపల్లిలో పాఠశాల,దేవాలయ ప్రాంతాల పరిశుభ్రతకు కృషి చేస్తున్న పురుషోత్తమరెడ్డిని సన్మానించారు. పలువురు రేషన్ కార్డుల లబ్ధిదారులకు సంక్రాంతి కానుక సరకులను, విద్యార్థులకు ఉపకార వేతనాల మంజూరు పత్రాలను అందజేశారు. కార్యక్రమంలో ఆయా శాఖల అధికారులు, జన్మభూమి కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

ప్రజావ్యతిరేక విధానాలు అనుసరిస్తున్న ప్రభుత్వాలు

గోరంట్ల: భారత కమ్యూనిస్టు పార్టీ (సీపీఐ) ఆధ్వర్యంలో గోరంట్లలో ఈనెల 8వ తేదీ నిర్వహించే నియోజకవర్గ స్థాయి మహాసభలను జయప్రదం చేయాలని జిల్లా నాయకురాలు అమీనమ్మ కోరారు. మహాసభ ఏర్పాట్లపై మండల నాయకులతో చర్చించేందుకు గురువారం ఆమె గోరంట్లలో పర్యటించారు. ఈ సందర్భంగా విలేకరులతో మాట్లాడుతూ సీపీఐ ఆధ్వర్యంలో ప్రతి మూడేళ్లకు ఓసారి మహాసభలు నిర్వహించడం ఆనవాయితీగా వస్తోందని ఈ క్రమంలో గోరంట్లలో ఈనెల ఎనిమిదో తేదీన సభ ఏర్పాటు చేసినట్లు తెలిపారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అనుసరిస్తున్న ప్రజావ్యతిరేక విధానాలను నిరసిస్తున్నట్లు తెలిపారు. జన్మభూమి కమిటీలు రద్దుచేయాలని ఎప్పటి నుంచో డిమాండ్ చేస్తున్నామని పేర్కొన్నారు. పెద్దలకు కట్టబెట్టడానికి పేదల నుంచి లాక్కొంటున్న భూములకు సక్రమంగా పరిహారం ఇవ్వలేదని ఆరోపించారు. కార్యక్రమంలో సీపీఐ పెనుకొండ డివిజన్ కార్యదర్శి శ్రీరాములు, మండల కార్యదర్శి ఆంజనేయులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న అమీనమ్మ



పోలీసులకు ఫిర్యాదు చేసేందుకు వచ్చిన బాధితులు

మహిళా పోలీసు వలంటీరుపై దాడి

మునిమడుగు(పెనుకొండ పట్టణం), న్యూస్‌టుడే: ప్రభుత్వ చౌకధర దుకాణంలో బియ్యం, ఇతర వస్తువుల తూకం సక్రమంగా చేసి ఇవ్వాలని కోరినందుకు మహిళా పోలీసు వలంటీరు లక్ష్మీనరసమ్మపై దుకాణ నిర్వాహకులు దాడి చేసిన ఘటన గురువారం జరిగింది. పెనుకొండ మండలం మునిమడుగులోని చౌకదుకాణం వద్దకు రేషన్ సరకులు తీసుకునేందుకు వెళ్లిన లక్ష్మీనరసమ్మ.. బియ్యం తూకంలో మోసాలకు పాల్పడుతున్నారని, ఎలక్ట్రానిక్ త్రాసుపై సంచి అదనంగా ఉంచటం వల్ల కిలో బియ్యం తక్కువ వస్తోందని నిర్వహకురాలిని నిలదీశారు. దీంతో వారి మధ్య మాటమాట పెరిగి వాగ్వాదం జరిగింది. లక్ష్మీనరసమ్మపై చౌకధర దుకాణ నిర్వహకురాలు అనిత, ఆమె కుటుంబ సభ్యులు దాడి చేశారు. ఆమె ముఖం, మెడపై స్వల్ప గాయాలయ్యాయి. బాధితురాలు పెనుకొండ ప్రభుత్వ వైద్యశాలలో చికిత్స పొంది.. కుటుంబ సభ్యులతో కలిసి పోలీసు స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు.

జూదరుల అరెస్టు

కొలిమిపల్లి(సోమందేపల్లి),న్యూస్‌టుడే: మండలంలోని కొలిమిపల్లి గ్రామం వద్ద జూదం ఆడుతున్న 10 మంది జూదరులను గురువారం సాయంత్రం ఎస్సై ప్రసాద్ ఆధ్వర్యంలో పోలీసులు అరెస్టు చేశారు. గ్రామ సమీపంలో జూదం ఆడుతున్నట్లు సమాచారం అందడంతో ఎస్సై ప్రసాద్, జమేదారు వెంకటరాముడు, సిబ్బందితో సాధారణ దుస్తుల్లో వెళ్లి దాడి చేశారు. 10మంది జూదరులను అదుపులోకి తీసుకొని వారి రూ. 43,040 స్వాధీనం చేసుకొన్నారు. శుక్రవారం నిందితులను పెనుకొండ కోర్టులో హాజరు పరచనున్నట్లు ఎస్సై పేర్కొన్నారు.

పెనుకొండ

విద్యార్థులకు దోమతెరల పంపిణీ

పెనుకొండ, న్యూస్‌టుడే: పెనుకొండలోని ఏపీ గిరిజన సంక్షేమ గురుకుల బాలికల పాఠశాల విద్యార్థులకు గురువారం వైద్యశాఖ ఆధ్వర్యంలో దోమతెరలను పంపిణీ చేశారు. ఏపీటీడబ్ల్యుఆర్ఎస్ ప్రిన్సిపల్ హరినాథరావు వీటిని అందజేశారు. కార్యక్రమంలో వైద్యసిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.

10న మంత్రి లోకేష్ రాక

గాంధీకూడలి (పెనుకొండ), న్యూస్‌టుడే: ఈనెల పదో తేదీన జరిగే జన్మభూమి కార్యక్రమానికి మంత్రి లోకేష్ హాజరవుతున్నట్లు ఎమ్మెల్యే బీకే పార్థసారధి తెలిపారు. గురువారం పెనుకొండలోని ఆర్‌అండ్‌బీ అతిథి గృహంలో జరిగిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ పెనుకొండలోని తాగునీటి పథకాన్ని, సీసీ రహదారులు, గోనిపేట మరువవంకపై నిర్మించిన వంతెనను మంత్రి ప్రారంభిస్తారని పేర్కొన్నారు. అనంతరం గోనిపేటలోని కాంగ్రెస్, వైకాపాలకు చెందిన పలువురు తెదేపాలోకి చేరారు. కార్యక్రమంలో తెదేపా మండల కన్వీనర్ శ్రీరాములు, నాయకులు లక్ష్మీనారాయణరెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

జన్మభూమికి ఎంపీపీ దూరం

రొద్దం, న్యూస్‌టుడే: జన్మభూమి -మాఊరు కార్యక్రమానికి ఎంపీపీ పద్మ గైర్హాజరవుతున్నారు. రెండో తేదీ నుంచి ఆమె పాల్గొనడం లేదు. ఎంపీడీవో జయచంద్రారెడ్డి అనారోగ్యం కారణంగా సెలవుపై వెళ్లారు. కొన్ని నెలలు పాటు ఈవోఆర్డీ నసీమ ఇన్‌ఛార్జి ఎంపీడీవోగా వ్యవహరించారు. ఎమ్మెల్యే బీకే పార్థసారధి ఆదేశాల మేరకు ఇటీవల రొద్దం ఎంపీడీవోగా యాదవేంద్రను నియమించారు. ఈ విషయంపై ఎమ్మెల్యే, ఎంపీపీ మధ్య మనస్పర్థలు ఏర్పడినట్లు సమాచారం. జన్మభూమి సభలకు గైర్హాజరవడంపై ఎంపీపీని వివరణ కోరగా వ్యక్తిగత పనులతో హాజరు కావడం లేదని చెప్పారు.

శుద్ధజల యంత్రం వితరణ

వెంకటగిరిపాళ్యం(పెనుకొండ పట్టణం)న్యూస్‌టుడే: మండలంలోని వెంకటగిరిపాళ్యం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలకు చెందిన ఇ.శ్రీనివాసులు జ్ఞాపకార్థం అతని మిత్రులు రూ.30వేలు విలువ చేసే శుద్ధజల యంత్రాన్ని వితరణ చేశారు. గ్రామానికి చెందిన ఇ.శ్రీనివాసులు ఐదేళ్ల కిందట గుండెపోటుతో మృతి చెందారు. అతని జ్ఞాపకార్థం మిత్రులు శుద్ధజల యంత్రం వితరణగా ఇచ్చారు. ప్రధానోపాధ్యాయుడు సుధాకర్, విశ్రాంత ఉపాధ్యాయుడు శ్రీనివాసులు, ఉపాధ్యాయులు గిరిప్రసాద్, మిత్రబృందం అమీర్, భాస్కర్, మారుతీ, ఈశ్వర్ పాల్గొన్నారు.

అనాథ పిల్లలను ఆదుకుందాం

గోరంట్ల, న్యూస్‌టుడే: జిల్లా వ్యాప్తంగా అనాథ పిల్లలను ఆదుకోవడానికి ఆర్డీటీ వారు ప్రవేశపెట్టిన స్పందించు - సాయమందించు కార్యక్రమంలో తామూసైతం భాగస్వాములవుతామని స్థానిక ఆంధ్రప్రగతి గ్రామీణ బ్యాంకు సిబ్బంది ముందుకొచ్చారు. ఈ మేరకు ప్రతినెలా డబ్బు ఇవ్వడానికి అంగీకార పత్రాలను మేనేజర్ రమేష్ ఆధ్వర్యంలో సంస్థ ఏటీఎల్ హనుమంతప్పకు గురువారం అందజేశారు. మేనేజర్, సిబ్బందిని ఏటీఎల్ కృతజ్ఞతలు తెలిపారు.

ప్రజా సంక్షేమమే ప్రభుత్వ ధ్యేయం



గర్భిణులకు పసుపు, కుంకుమ ఇస్తున్న ఎమ్మెల్యే

వెంకటరెడ్డిపల్లి (పెనుకొండ పట్టణం), న్యూస్‌టుడే: ప్రజా సంక్షేమమే ప్రభుత్వ ధ్యేయమని ఎమ్మెల్యే బి.కె.పార్థసారధి అన్నారు. పెనుకొండ మండలంలోని వెంకటరెడ్డిపల్లి, రాంపురం గ్రామాల్లో గురువారం జన్మభూమి-మాఊరు కార్యక్రమం నిర్వహించారు. వెంకటరెడ్డిపల్లిలో సర్పంచి పద్మావతి అధ్యక్షతన నిర్వహించిన కార్యక్రమంలో ఎమ్మెల్యే మాట్లాడుతూ గతేడాది జన్మభూమిలో గ్రామస్థులు తాగునీటి సమస్యపై విన్నవించగా.. రూ.5.20 కోట్లు వెచ్చించి రెండునెలల్లోనే గొల్లపల్లి జలాశయం నుంచి వెంకటరెడ్డిపల్లి సమీపంలోని సంపునకు నీళ్లిచ్చి పెనుకొండ, వెంకటరెడ్డిపల్లి, కోనాపురం పంచాయతీల్లో 40వేల మందికి తాగునీటిని అందిస్తున్నట్లు పేర్కొన్నారు. అనంతరం అంగన్‌వాడీ కేంద్రంలో నిర్వహించిన సామూహిక సీమంతం కార్యక్రమంలో పాల్గొన్నారు. ముగ్గుల పోటీల్లో పాల్గొన్న వారికి బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో ఉప తహసీల్దార్ ఈశ్వరయ్య, ఎంపీడీవో శివశంకరప్ప, అన్నిశాఖల మండలాధికారులు, జడ్పీటీసీ సభ్యుడు నారాయణస్వామి, ఎంపీటీసీ సభ్యులు, తెదేపా నాయకులు పాల్గొన్నారు.

తెదేపా హయాంలోనే అభివృద్ధి

కోగిర (రొద్దం): తెలుగు దేశం ప్రభుత్వ హయాంలోనే రహదారుల అభివృద్ధి జరిగిందని ఎమ్మెల్యే బీకే పార్థసారధి పేర్కొన్నారు. గురువారం మండలంలోని కోగిర గ్రామ పంచాయతీలో సర్పంచి నాగమణి అధ్యక్షత జరిగిన జన్మభూమి - మాఊరు కార్యక్రమానికి హాజరైన ఎమ్మెల్యే మాట్లాడుతూ పలు సంక్షేమ పథకాలు అమలు చేసి పేదదరికి చేర్చిన ఘనత ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడికే దక్కిందని పేర్కొన్నారు. రాష్ట్ర పరిశీలకుడు రవికుమార్, ఆర్డీవో రామమూర్తి, మండల అధికారులు స్వచ్ఛాంధ్రప్రదేశ్ కార్యక్రమంపై ప్రజలకు అవగాహన కల్పించారు. కార్యక్రమంలో జడ్పీటీసీ సభ్యుడు చిన్నప్పయ్య, మార్కెట్‌యార్డ్ ఛైర్మన్ వెంకటరామిరెడ్డి, సింగిల్‌విండో అధ్యక్షుడు ఆంజనేయులు, మాజీ జడ్పీటీసీ సభ్యుడు నరసింహులు, జిల్లా తెదేపా కార్యదర్శి నరహరి, మండల తెదేపా కన్వీనర్ చంద్రమౌళి బూచెర్ల, ఆర్‌లోచెర్ల సర్పంచులు నాగరాజు, హనుమంతరాయుడు, మాజీ ఎంపీపీ సూర్యనారాయణ, నాయకులు తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ఎమ్మెల్యే బీకే పార్థసారధి

సమస్యలు వినేందుకే వచ్చాం

గోరంట్ల: సమస్యలను ప్రజల సమక్షంలోనే విని వాటిని పరిష్కరించేందుకే వచ్చామని ఎంపీడీవో ఆజాద్ పేర్కొన్నారు. మండలంలోని గౌనివారిపల్లి, మలసముద్రం పంచాయతీల్లో గురువారం గ్రామసభలు నిర్వహించారు. గౌనివారిపల్లిలో సర్పంచి విజయలక్ష్మి అధ్యక్షతన ఎంపీడీవో బృందం, మలసముద్రంలో సర్పంచి మంగమ్మ అధ్యక్షతన మండల ప్రత్యేకాధికారి రత్నం, తహసీల్దార్ మసూద్‌వలీ ఆధ్వర్యంలో గ్రామసభలు ఏర్పాటుచేశారు. ఈ సందర్భంగా ప్రభుత్వ సంక్షేమపథకాలు గురించి ప్రజలకు వివరించారు. మలసముద్రం పంచాయతీ పూలచెట్లపల్లిలో ఖరీఫ్ ముందు మంజూరైన పెట్టుబడి రాయితీ అందలేదని వ్యవసాయ శాఖ సిబ్బందిపై రైతులు ఆగ్రహం వ్యక్తం చేశారు. హిందూపురం ఏరియా వ్యవసాయశాఖ సహాయ సంచాలకులు రవికుమార్ గౌనివారిపల్లి గ్రామసభలో పాల్గొన్నారు. కార్యక్రమంలో నాయకులు, అధికారులు పాల్గొన్నారు.



గోరంట్ల: ప్రతిజ్ఞ చేయిస్తున్న ఎంపీడీవో



ప్రదర్శనలో పాల్గొన్న జూనియర్ కళాశాల విద్యార్థులు

మరుగుదొడ్డి ఆవశ్యకతపై అవగాహన

అంబేద్కర్‌కూడలి(పెనుకొండ పట్టణం), న్యూస్‌టుడే: వ్యక్తిగత మరుగుదొడ్డి నిర్మాణం, ఆవశ్యకతపై పట్టణంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాల విద్యార్థులు గురువారం అవగాహన ప్రదర్శన నిర్వహించారు. ఐదో విడత జన్మభూమి-మాఊరులో భాగంగా వారు ఈ కార్యక్రమం చేపట్టారు. ఈ సందర్భంగా కళాశాల ఆవరణలో కంపచెట్లను తొలగించారు. మొక్కలకు నీరు పోశారు. కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపల్ శంకరయ్య, ఎన్ఎస్ఎస్ 1, 2 పీవోలు శివన్న, ఉమాశంకర్, అధ్యాపకులు గురుమూర్తి, శంకరప్ప, రవికుమార్ తదితరులు పాల్గొన్నారు. బొక్సంపల్లి (రొద్దం), న్యూస్‌టుడే: మండలంలోని బొక్సంపల్లి గ్రామ పంచాయతీలో తహసీల్దారు రామశేఖర్ ఆధ్వర్యంలో ఐదో విడత జన్మభూమి కార్యక్రమంలో భాగంగా గురువారం స్వచ్ఛాంధ్రప్రదేశ్‌పై అధికారులు, విద్యార్థులు కలిసి అవగాహన ప్రదర్శన నిర్వహించారు. మరుగుదొడ్డి నిర్మించుకోవాలని వారు ప్రదర్శన చేశారు.

గోరంట్ల: వందశాతం మరుగుదొడ్లను నిర్మించుకుని బహిరంగ మలవిసర్జన లేని మండలంగా తీర్చిదిద్దుదామని ప్రజల్లో అవగాహన కల్పిస్తూ గోరంట్లలోని అన్ని కళాశాలల అధ్యాపకులు, విద్యార్థులు గురువారం ప్రదర్శన నిర్వహించారు. ఎస్‌పీఎస్, శ్రీకృష్ణదేవరాయ జూనియర్ కళాశాలలు, ఏఎన్‌కే, ఎస్వీఎం డిగ్రీ కళాశాలల విద్యార్థులు ప్రదర్శన చేపట్టారు. ఆయా కళాశాలల ప్రిన్సిపాల్స్ శ్రీనాథ్, విజయలక్ష్మి, లక్ష్మీనారాయణ, భక్తవత్సలం, అధ్యాపక బృందాలు పాల్గొన్నాయి.

బడిఈడు పిల్లలను బడికి పంపాలి

పెనుకొండ పట్టణం, న్యూస్‌టుడే: బడిఈడు పిల్లలను తప్పని సరిగా బడికి పంపాలని పెనుకొండ ఎస్సై జనార్దన్ పేర్కొన్నారు. గురువారం బర్డ్స్ సంస్థ ఆధ్వర్యంలో స్థానిక ప్రభుత్వ బాలికల ఉన్నత పాఠశాలలో విద్యార్థులకు, తల్లిదండ్రులకు అవగాహన సమావేశం నిర్వహించారు. కార్యక్రమంలో బర్డ్స్ సంస్థ పెనుకొండ కమ్యూనిటీ మొబలైజర్ భైలప్ప మాట్లాడుతూ మండలంలోని అడదాకులపల్లి, నాగులూరు, మావటూరు, పెనుకొండ గ్రామాల్లోని దారిద్ర్యరేఖకు దిగువనుండి.. తమ పిల్లలను పాఠశాలకు పంపే స్తోమతలేని కుటుంబాలకు చెందిన 38 మంది విద్యార్థుల తల్లిదండ్రులకు ఒక్కొక్కరికి రూ.ఆరు వేలు చెల్లించినట్లు పేర్కొన్నారు. భవిష్యత్తులో ప్రభుత్వ పథకాలను ఉపయోగించుకొంటూ తమ పిల్లలకు ఉన్నత చదువులు చదివించేలా అవగాహన కల్పించినట్లు తెలిపారు. ఆర్డీటీ ఏటీఎల్ గిరిజ సంస్థ నుంచి అందించే సంక్షేమ పథకాలు, ఉపకారవేతనాల గురించి వివరించారు. కార్యక్రమంలో బర్డ్స్ సంస్థ డీపీసీ కుళ్లాయప్ప, డీఎల్సీ లావణ్య, కమ్యూనిటీ మొబలైజర్ అనిత, తిరుపాల్, మహేష్ తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ఎస్సై జనార్దన్

మానవతా దృక్పథంతో రక్తదానం చేద్దాం

కోనాపురంరోడ్డు (పెనుకొండ), న్యూస్‌టుడే: రోడ్డు ప్రమాదాల్లో గాయపడి, ఆపదలో ఉన్నవారికి రక్తదానం చేసి ఆదుకోవడానికి ప్రతి ఒక్కరూ ముందుండాలని పీఏస్ ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపల్ నాగలింగారెడ్డి పేర్కొన్నారు. గురువారం పెనుకొండలోని పరిటాల శ్రీరాములు ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో క్రెస్ట్ స్వచ్ఛంద సంస్థ ఆధ్వర్యంలో రక్తదానం- ఆవశ్యకత అంశంపై అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా కళాశాల ప్రిన్సిపల్ మాట్లాడుతూ మానవతాదృక్పథంతో రక్తదానం చేయడం అలవాటుగా మార్చుకోవాలని సూచించారు. ఈ సందర్భంగా పలువురు విద్యార్థులు రక్తదానం చేశారు. క్రెస్ట్ సంస్థకు చెందిన సిబ్బంది, పీఏస్ ప్రభుత్వ డిగ్రీ కళాశాల అధ్యాపకులు తదితరులు పాల్గొన్నారు.



అవగాహన కల్పిస్తున్న ప్రిన్సిపల్ నాగలింగారెడ్డి

మహిళలకు ముగ్గుల పోటీలు

గోరంట్ల, న్యూస్‌టుడే: మండలంలోని బూదిలి ఉన్నత పాఠశాల ఆవరణలో గురువారం విప్రో కంపెనీ ఆధ్వర్యంలో గురువారం మహిళలకు ముగ్గుల పోటీలు నిర్వహించారు. సంక్రాంతి పండగ నేపథ్యంలో పోటీలు నిర్వహించినట్లు కంపెనీ ప్రతినిధులు తెలిపారు. పాఠశాల ప్రధానోపాధ్యాయుడు జనార్దనరెడ్డి ఆధ్వర్యంలో జరిగిన పోటీల్లో న్యాయనిర్ణేతలుగా ఉపాధ్యాయులు మహాలక్ష్మి, అరుణకుమారి వ్యవహరించి విజేతలను ఎంపిక చేశారు. పోటీల్లో 55 మంది మహిళలు పాల్గొన్నారు. మొదటి బహుమతి గౌతమి, ద్వితీయ సుజాత, తృతీయ బహుమతి పద్మావతి అందుకున్నారు. పాల్గొన్న వారందరికీ ప్రోత్సాహకాలు అందజేశారు. కంపెనీ సిబ్బంది జహీర్, మహేష్, ఆదినారాయణ పాల్గొన్నారు.



బహుమతి అందజేస్తున్న పాఠశాల ప్రధానోపాధ్యాయుడు

పుట్టపర్తి

ఎన్టీఆర్ క్యాలెండర్లు ఆవిష్కరణ

తలుపుల, న్యూస్‌టుడే: జూనియర్ ఎన్టీఆర్‌కు సంబంధించిన 2018 క్యాలెండర్లను ఆయన అభిమానులు, తెదేపా నేతలు గురువారం పార్టీ కార్యాలయంలో ఆవిష్కరించి సందడి చేశారు. తలుపుల ఆసుపత్రి అభివృద్ధి కమిటీ ఛైర్మన్ వీరబార్గవ్‌రెడ్డి మాట్లాడారు. తాతకు తగ్గ మనవుడిగా ప్రజల హృదయాల్లో సుస్థిర స్థానం సంపాదిస్తున్న జూనియర్ ఎన్టీఆర్ మరింత ఉన్నత స్థాయికి ఎదగాలని కోరుకున్నారు. కార్యక్రమంలో ఎన్టీఆర్ ఫ్యాన్స్ కదిరి అధ్యక్షుడు చైతన్య, తలుపుల అధ్యక్షుడు అజుంతుల్లా, తెదేపా నాయకులు ముబారక్, జయచంద్ర, మహేశ్వర, రాముడు, రమణ, రఘునాథ్‌రెడ్డి కార్యకర్తలు, అభిమానులు పాల్గొన్నారు.

నేడు ఎన్టీఆర్ విగ్రహావిష్కరణ

కొండకమర్ల (ఓబుళదేవరచెరువు): కొండకమర్లలో శుక్రవారం ఎన్టీఆర్ విగ్రహ ఆవిష్కరణ జరగనున్నట్లు రాష్ట్ర మైనార్టీ కార్పొరేషన్ డైరెక్టర్ అల్లాబకాష్, ఎంపీపీ ఇస్మాయిల్ పేర్కొన్నారు. కార్యక్రమానికి చీఫ్ విప్ పల్లెరఘునాథరెడ్డి, ఎంపీ నిమ్మలకిష్టప్ప, జిల్లా పరిషత్తు ఛైర్మన్ పూలనాగరాజు హాజరవుతారని తెలిపారు. మండలంలోని తెదేపా నాయకులు, కార్యకర్తలు పాల్గొనాలని కోరారు.

ఆటకు చోటేది... భవితకు దారేది?

తరగతికే పరిమితమవుతున్న బాల్యం ✷ విద్యార్థుల్లో లోపిస్తున్న దేహదారుఢ్యం



పెడపల్లిలో ఆటస్థలం లేక విద్యార్థుల పాట్లు



పెడపల్లి: జిల్లా, రాష్ట్ర, జాతీయ స్థాయిల్లో పతకాలు సాధించిన విద్యార్థులు

పుట్టపర్తి గ్రామీణం, న్యూస్‌టుడే: క్రీడలు శారీరక, మానసిక ఆరోగ్యానికి ఎంతో దోహదపడతాయని అందరూ చెప్పేమాటే. అయితే క్రీడల అభివృద్ధికి అందుతున్న సహకారం అంతంత మాత్రమే. సరైన క్రీడా స్థలాలు లేక విద్యార్థులు తరగతి గదులకే పరిమితమవుతున్నారు. దీంతో దేహదారుఢ్యం, మానసిక వికాసం విద్యార్థుల్లో కరవవుతోందని పలువురు విద్యావేత్తలు పేర్కొంటున్నారు. విద్యార్థి దశలోనే క్రీడా ప్రతిభను వెలికి తీయడానికి వేదికలు కావాల్సిన క్రీడా మైదానాలు క్రమంగా కనుమరుగవుతుండటంతో పాఠశాలల్లో క్రీడాసక్తి ఉన్న విద్యార్థుల సంఖ్య కూడా క్రమేపీ తగ్గుముఖం పడుతోంది. నియోజకవర్గంలో ప్రభుత్వ, ప్రైవేటు ఉన్నత పాఠశాలలు 77 ఉండగా క్రీడా మైదానాలున్నవి పట్టుమని పది పాఠశాలలు కూడా లేకపోవడం గమనార్హం. విద్యార్థుల్లో ఆటల పట్ల ఆసక్తి ఉన్నా.. ఆడుకునేందుకు ఆట స్థలాలు కరవైన పరిస్థితులపై 'న్యూస్‌టుడే' ప్రత్యేక కథనం.

పుట్టపర్తి మండలంలో 10 వరకు ప్రభుత్వ పాఠశాలలు ఉన్నాయి. వీటిలో ఏ రెండు మూడు మినహా ఏ ఒక్క పాఠశాలకు క్రీడా మైదానాలు లేవు. ఇక ప్రైవేటు విద్యాలయాలకు వస్తే తరగతి గదులే ఇరుకు. ఇక క్రీడా మైదానాలు దేవుడెరుగు. మండలంలో పెడపల్లి, ఎనుములపల్లి, బీడుపల్లి, పుట్టపర్తి వీటిలో ఒక్కో పాఠశాలలో దాదాపు 250 నుంచి 500 మంది విద్యార్థులు విద్యనభ్యసిస్తున్నారు. వీరిలో 70 మందికి పైగా క్రీడాకారులు ఉన్నారు. నిబంధనల ప్రకారం ఒక్కో పాఠశాలకు 5 ఎకరాల ఆటస్థలం ఉండాలి. పాఠశాల భవనాలు మినహాయిస్తే ఆడుకోవడానికి కనీసం 50 సెంట్ల ఆట స్థలం కూడా లేదు. అయినా సరే విద్యార్థులు తమ కృషి, పట్టుదల, ప్రతిభ, ఉపాధ్యాయుల ప్రోత్సాహంతో మండల, జిల్లా, రాష్ట్ర స్థాయిల్లోనే గాక జాతీయ స్థాయిలో సైతం రాణిస్తుండటం విశేషం. ఈ పరిస్థితి నడిమామిడి, బీడుపల్లి, ఎనుములపల్లి, పుట్టపర్తిలోనే కాదు నియోజకవర్గవ్యాప్తంగా చాలా పాఠశాలల్లో ఇదే పరిస్థితే కొనసాగుతోంది. రెవెన్యూ, విద్యాధికారులు దృష్టిసారించి ఆయా పాఠశాలల సమీపంలో ఉన్న ప్రభుత్వ స్థలం తమకు ఉపయోగపడేలా చర్యలు తీసుకుంటే క్రీడా పరంగా మరింత రాణించవచ్చని ఉపాధ్యాయులు, విద్యార్థులు కోరుతున్నారు.

నియోజకవర్గంలో మొత్తం పాఠశాలలు:	409
ప్రభుత్వ పాఠశాలలు:	326
ఉన్నత పాఠశాలలు:	47
క్రీడా మైదానాలున్నవి:	10
ఉన్నత పాఠశాలల విద్యార్థులు:	14,540
ప్రైవేటు పాఠశాలలు:	83
ప్రైవేటు ఉన్నత పాఠశాలలు:	30
క్రీడా మైదానాలున్నవి:	05
విద్యార్థులు:	2,400

మైదానం కొరతతో అవస్థలు



మా పాఠశాలలో ఆటలపై ఆసక్తి ఉన్న విద్యార్థులకు, నేర్పుతో నేర్పించే ఉపాధ్యాయులకు కొరత లేదు. ఉన్నదల్లా ఆట స్థలం కొరతే. ఉన్న కొద్దిపాటి స్థలంలోనే అభ్యాసం చేసి నాతో పాటు పాఠశాలలో 40 మంది వరకు విద్యార్థులు రాష్ట్ర, 10 మంది జాతీయ స్థాయి పోటీలకు ఎంపికయ్యాం. ఆట స్థలం ఉంటే మరింతగా క్రీడా ప్రతిభను చాటవచ్చు. అధికారులు ఇప్పటికైనా స్పందించి ఆట స్థలం సమస్యను పరిష్కరించాలి. **- సుచిత్ర, పెడపల్లి, 9వ తరగతి**

ఇండోర్ గేమ్స్‌తో సరి



క్రీడా మైదానాలు లేక విద్యార్థులు షటిల్, చెస్ ఆటలతో సర్దుకు పోతున్నారు. మాకున్న కొద్దిపాటి ఆటస్థలంలో హాకీ ఆడాలంటే ఇబ్బంది పడుతున్నాం. ఉన్న మైదానం చదునుగా లేదు. మంచి క్రీడామైదానం, సౌకర్యాలు కల్పిస్తే ఎందరో క్రీడాకారులు వెలుగులోకి వస్తారు.

- హేమలత, బీడుపల్లి, 9వ తరగతి

ఉన్నచోట అవకాశం కల్పించాలి



ఆట స్థలాలు అందుబాటులో ఉంటే ఆయా ఉన్నత పాఠశాలలకు వాటిని సమకూర్చాలి. మా పాఠశాలలో రూ.2.50లక్షలతో కోర్టును చదును చేశారు. ప్రస్తుతం అది ఉపయోగపడుతోంది. గ్రిగ్స్, ఇతరత్రా క్రీడా పోటీలు నిర్వహించాలంటే మైదానాలు లేవు. దీంతో పిల్లలకు పూర్తి స్థాయిలో ఆటలను నేర్పలేక పోతున్నాం. స్థలాలను సమకూర్చి క్రీడలకు ప్రోత్సహించాలి. నియోజకవర్గానికి, మండలానికి ఒకటి క్రీడా మైదానాలు నిర్మిస్తామన్నారు. ఇంత వరకు కార్యరూపం దాల్చలేదు. **- సూర్యనారాయణ, పెడపల్లి పీడీ**

చంద్రన్న కానుక పంపిణీ

పెడపల్లి, వెంకటగారిపల్లి (పుట్టపర్తి గ్రామీణం), న్యూస్‌టుడే: పెడపల్లి చౌక దుకాణంలో మండల ఉపాధ్యక్షుడు బొమ్మయ్య గురువారం చంద్రన్న సంక్రాంతి కానుకను పంపిణీ చేశారు. కులమతాలకు అతీతంగా పేదలైన అన్ని వర్గాల వారు పండగ జరుపుకోవాలని ప్రభుత్వం రంజాన్, క్రిస్మస్, సంక్రాంతి కానుకలను యేటా ఉచితంగా అందిస్తోందన్నారు. తెదేపా నాయకులు ఆంజనేయులు, కోఆప్షన్ సభ్యుడు అక్తర్‌బాషా పాల్గొన్నారు. వెంకటగారిపల్లిలో సర్పంచి, ఉపసర్పంచి చిన్నారాయణప్ప, ఉపేంద్రలు లబ్ధిదారులకు సంక్రాంతి కానుక సరకులను అందజేశారు.

27న గిరిజన శంఖారావసభ

కదిరి పట్టణం, న్యూస్‌టుడే: గిరిజన హక్కుల పరిరక్షణకు ఈ నెల 27న అనంతపురంలో నిర్వహిస్తున్న గిరిజన శంఖారావసభను జయప్రదం చేయాలని గిరిజన విద్యార్థి సమాఖ్య జిల్లా ఉపాధ్యక్షుడు రామప్రసాద్‌నాయక్ కోరారు. శంఖారావసభకు భారీగా గిరిజనులు తరలివచ్చేలా గ్రామగ్రామానికి వెళ్లి ప్రచారం నిర్వహిస్తున్నట్లు ఆయన చెప్పారు. గురువారం కదిరిలో సమావేశమైన గిరిజన విద్యార్థిసంఘం నాయకులు శంఖారావసభ ఉద్దేశాన్ని వివరించారు. గిరిజనుల పట్ల ప్రభుత్వాల వైఖరి, ఎదుర్కొంటున్న సమస్యలను సభలో చర్చించి అనుసరించాల్సిన విధివిధానాలను తీర్మానం చేయనున్నట్లు తెలిపారు. సమావేశంలో ఆంజనేయులునాయక్, సతీష్, వరప్రసాద్ నాయక్, తదితరులు పాల్గొన్నారు.

కూరగాయల ధరలు నిన్నటివి (కిలో.రూ.ల్లో)

కొత్తచెరువు, న్యూస్‌టుడే: టమోటా - 5, పచ్చిమిరప - 30, వంకాయలు - 20, బెండ - 30, ఉల్లిపాయలు - 50, బంగాళా దుంపలు - 20, క్యాప్సికం - 60, ముల్లంగి - 20, బీరకాయలు - 30, కాకర - 40, క్యారెట్ - 60, బీన్స్ - 40, చిక్కుడు కాయలు - 40, క్యాబేజి - 20, అల్లం - 60, బీట్‌రూట్ - 40, కాలీఫ్లవర్ - 30, మునగకాయలు - 60, వెల్లుల్లి - 60.

నిత్యావసర వస్తువుల ధరలు నిన్నటివి (కిలో.రూ.ల్లో)

బియ్యం హంస - 25, సన్నరకం బియ్యం - 40నుంచి 60 వరకూ, కందిబేడలు - 65, శనగబేడలు - 75, పామాయిల్ - 70, చింతపండు - 200, పెసరబ్యాల్లు - 80, ఎండుమిరప - 90, గోధుమపిండి - 28, శనగపిండి - 90, చక్కెర - 40, బెల్లం - 50, రాగులు - 34, జొన్నలు - 20, ఉలవలు- 60, కొర్రలు- 40.

తెరపై ఈనాడు

కొత్తచెరువు, న్యూస్‌టుడే: సందీప్: **2 కంట్రీస్,** లక్ష్మి: **ఎంసీఏ**

మరుగుదొడ్ల నిర్మాణాలపై అవగాహన



మానవహారంలో మాట్లాడుతున్న అధ్యాపకులు

తలుపుల, న్యూస్‌టుడే: ఐదోవిడత జన్మభూమి కార్యక్రమంలో భాగంగా వ్యక్తిగత మరుగుదొడ్ల నిర్మాణాలపై ప్రజల్లో అవగాహన కల్పించడానికి తలుపుల జూనియర్ కళాశాల అధ్యాపకులు, విద్యార్థులు గురువారం తలుపుల వీధుల్లో ర్యాలీ నిర్వహించారు. ప్రధాన కూడలిలో మానవహారంగా ఏర్పడి ప్రసంగించారు. మరుగుదొడ్ల నిర్మాణాల వల్ల ఉన్న ఉపయోగాలను ప్రజలకు అర్థమయ్యేలా వివరించారు. ప్రతిఇంటికి తప్పనిసరిగా మరుగుదొడ్డి ఉండాలన్నదే ప్రభుత్వం లక్ష్యమన్నారు. వీటినే ప్రభుత్వం మహిళల ఆత్మగౌరవ నివాసగృహాలుగా కూడా పిలుస్తోందన్నారు. ఒక్కో మరుగుదొడ్డి నిర్మాణానికి ప్రభుత్వం రూ.15వేలు చెల్లిస్తుందన్నారు. ప్రతి వినియోగదారుడు మరుగుదొడ్లను తప్పనిసరిగా నిర్మించుకోవాలన్నారు. కార్యక్రమంలో అధ్యాపకులు రెడ్డిశేఖర్‌రెడ్డి, చంద్రశేఖర్, విశ్వనాథ్‌రెడ్డి, నారాయణస్వామి, సుబ్బరాయుడు, రవిశంకర్, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

సత్యసాయి ప్రాజెక్టు భద్రతా వారోత్సవాలు



మొక్క నాటుతున్న సిబ్బంది

కొత్తచెరువు, న్యూస్‌టుడే: కొత్తచెరువు మార్కెట్ యార్డులోని సత్యసాయి పంపుహౌస్‌లో ధర్మవరం జోన్ ఇన్‌ఛార్జి దుర్గాప్రసాద్ అధ్యక్షతన ఏర్పాటు చేసిన భద్రతా వారోత్సవాల కార్యక్రమానికి డి.ఈ వెంకటరాజ్‌కుమార్, జిల్లా మేనేజరు మోహన్‌దాస్‌లు హాజరయ్యారు. ఈ సందర్భంగా సత్యసాయి ప్రాజెక్టు సిబ్బంది పాటించాల్సిన నిబంధనలు, భద్రతా సూచనల గురించి వివరించారు. విధుల్లో, సాధారణ దైనందిన కార్యకలాపాల్లో భద్రతా ప్రమాణాలు, నిబంధనలను బాధ్యతగా పాటించాలన్నారు. అనంతరం పంపుహౌస్‌లో మొక్కలను నాటారు. కార్యక్రమంలో సేఫ్టీ ఇంజినీర్ లక్ష్మణ్‌కుమార్, పరిపాలనా విభాగం ప్రతినిధులు శ్రీకాంత్, కొండయ్య, రంజిత్‌కుమార్, పర్యవేక్షకులు జయచంద్ర, రమేష్ తదితరులు పాల్గొన్నారు.

పుట్టపర్తి

5కే రన్‌ను జయప్రదం చేయండి

కదిరి, న్యూస్‌టుడే: జన్మభూమి మాఊరు కార్యక్రమంలో భాగంగా ఈనెల ఏడున నిర్వహించే 5కే రన్ కార్యక్రమంలో ప్రజలు పాల్గొని జయప్రదం చేయాలని కమిషనర్ ప్రమీల తెలిపారు. ఆదివారం ఉదయం ఆరు గంటలకు స్థానిక మున్సిపల్ కార్యాలయం నుంచి 5కే రన్ ప్రారంభం అవుతుందన్నారు. ప్రజలు పెద్దసంఖ్యలో పాల్గొని జయప్రదం చేయాలని ఆమె కోరారు.

చంద్రన్న బీమా పంపిణీ

తలుపుల, న్యూస్‌టుడే: చంద్రన్న బీమా తక్షణ సహాయం కింద బాధిత కుటుంబానికి రూ.5వేల నగదును పంపిణీ చేసినట్లు సర్పంచి ఫయాజ్, చంద్రన్న బీమా కార్యకర్త కళావతి తెలిపారు. తలుపుల పూలబజార్‌కు చెందిన నూర్జహన్ గురువారం అనారోగ్యంతో చనిపోయింది. ఆమె భర్త మహబూబ్‌పీరాకు తక్షణం సహాయం కింద రూ.5వేలను పంపిణీ చేశారు. మిగతా రూ.1.95లక్షలు బ్యాంకు ఖాతాలో జమ అవుతుందన్నారు.

సమస్యల పరిష్కారానికే జన్మభూమి



అమడగూరు: సీమంతం కానుక ఇస్తున్న అధికారులు



రెడ్డిపల్లి: మాట్లాడుతున్న పల్లె

కొత్తచెరువు, న్యూస్‌టుడే: ప్రజల సమస్యల పరిష్కారానికే జన్మభూమి కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు ప్రభుత్వ చీఫ్ విప్ పల్లె రఘునాథ రెడ్డి పేర్కొన్నారు. మండలంలోని నాగిరెడ్డిపల్లి, ఇరగంపల్లి గ్రామ సర్పంచులు కృష్ణవేణి, సుబ్రహ్మణ్యం అధ్యక్షతన ఏర్పాటైన గ్రామసభలకు ఆయనతో పాటు ప్రత్యేకాధికారి ఓబులపతి, ఎంపీపీ వాణి, తహసీల్దారు వసంత కుమార్, ఎంపీడీవో రఘునాథగుప్తలు హాజరయ్యారు. గ్రామాల్లో మౌలిక వసతులు కల్పించాలని ప్రజలు కోరారు. ప్రభుత్వం అందిస్తున్న పలు అభివృద్ధి పథకాల గురించి ప్రజలకు వివరించారు.

రెడ్డిపల్లి (నల్లమాడ) : రెడ్డిపల్లి పంచాయతీలో నిర్వహించిన జన్మభూమి సభకు పల్లె రఘునాథ రెడ్డి హాజరై మాట్లాడారు. అటవీశాఖ ఆధ్వర్యంలో వనం-మనంలో భాగంగా మొక్కలను నాటారు. 1299 మంది విద్యార్థులకు రూ.3లక్షల 10వేల ఉపకారవేతనాలు అందించారు. రాష్ట్ర జన్మభూమి పరిశీలనాధికారి భరత్‌కుమార్ ఐఎఫ్‌ఎస్, తహసీల్దారు అబ్దుల్‌హమీద్ బాషా, ఎంపీడీఓ రాబర్ట్‌విల్సన్, వ్యవసాయ, వైద్య, అటవీ శాఖల బృందం, మండల కన్వీనర్ శంకర తదితరులు పాల్గొన్నారు.



పుట్టపర్తి: ప్రజాప్రతినిధులు, అధికారుల చైతన్య ప్రదర్శన

పుట్టపర్తి: పట్టణంలోని 5, 6వార్డుల్లో కౌన్సిలర్ నారాయణరెడ్డి అధ్యక్షతన జన్మభూమి కార్యక్రమం నిర్వహించారు. ప్రతిపక్ష సభ్యుల వార్డుల్లో వివక్ష కొనసాగుతుందని, పనులు సక్రమంగా జరగలేదని కౌన్సిలర్ నారాయణరెడ్డి ఆవేదన వ్యక్తం చేశారు. కార్యక్రమంలో ఛైర్మన్ బెస్తచలపతి, పుడాఛైర్మన్ సుధాకర్‌నాయుడు, వైస్‌ఛైర్మన్ రాము, ఏఈ మురళీధర్, జిల్లా తెదేపా ఉపాధ్యక్షుడు చెన్నకేశవులు, జిల్లా వాణిజ్య విభాగం అధ్యక్షుడు చింతాదామోదర్, పట్టణ కన్వీనర్ రామాంజనేయులు, కౌన్సిలర్లు తదితరులు పాల్గొన్నారు. ఎస్సీ బాలికల వసతి గృహం, పుట్టపర్తి ప్రాథమిక పాఠశాలల్లోని మరుగుదొడ్లు, వసతి గదులను కమిషనర్ కమిషనర్ విజయభాస్కర్‌రెడ్డి, వైద్యులు నాగరాజునాయక్ తదితరులు తనిఖీ చేశారు. మరుగుదొడ్లు, వసతి గదులను శుభ్రం ఉంచాలని సిబ్బందిని ఆదేశించారు.

డబురవారిపల్లి (ఓబుళదేవరచెరువు): డబురవారిపల్లి, మామిళ్ళకుంట్లపల్లి గ్రామాల్లో గ్రామసభలు నిర్వహించారు. మండలప్రత్యేకాధికారి శివప్రసాద్‌రాజు, ఎంపీడీవో నాగరాజు పలువురికి మంజూరైన చంద్రన్న బీమా క్లెయిమ్‌లు, చంద్రన్న సంకాంత్రి కానుకలను పంపిణీ చేశారు. ఎంపీపీ ఇస్మాయిల్, తహసీల్దారు ఎల్.రెడ్డి, వ్యవసాయశాఖ అధికారిణి భరణికృతి, జడ్పీటీసీ ఓబుళరెడ్డి, సర్పంచులు భాస్కర్ రెడ్డి, బిందుమాధవి తదితరులు పాల్గొన్నారు.

అధికారులను అడ్డుకున్న గ్రామస్థులు..

జగరాజుపల్లిలో జరిగే కార్యక్రమానికి వస్తున్న అధికారులను గ్రామస్థులు అడ్డుకున్నారు. నాలుగు విడతలుగా జన్మభూమిలో ఇచ్చిన హామీలు నెరవేర్చలేదని, గ్రామంలోకి రావొద్దని అభ్యంతరం తెలిపారు. ఏళ్ల తరబడి గ్రామానికి తారురోడ్డు, తాగునీటి వసతి కల్పించలేదన్నారు. ముళ్ల పొదలను రోడ్డుకు అడ్డంగా వేశారు. అధికారులు హామీ ఇవ్వడంతో గ్రామస్థులు శాంతించారు.

జౌకలకొత్తపల్లి (అమడగూరు): మండలంలోని జౌకలకొత్తపల్లి గ్రామ పంచాయతీలో సర్పంచి ప్రభావతమ్మ అధ్యక్షతన జన్మభూమి కార్యక్రమాన్ని నిర్వహించారు. మార్కెట్ యార్డ్ ఛైర్మన్ కిష్టమూర్తి, జడ్పీటీసీ సభ్యురాలు ఉమాదేవి, ఎంపీడీవో చంద్రారెడ్డి హాజరై మాట్లాడారు. నోడల్ అధికారి రామసుబ్బారెడ్డి, మండల అభివృద్ధి, రెవెన్యూ, తాగునీరు, ఉపాధి, శిశుసంక్షేమం, వెలుగు, వ్యవసాయం వివిధశాఖ అధికారులు తమశాఖల పరిధిలో జరిగిన అభివృద్ధిని వివరించారు. వీటితోపాటు వైద్య, పశువైద్య శాఖ సిబ్బంది గ్రామంలో వైద్య శిబిరాలను నిర్వహించారు. జడ్పీటీసీ సభ్యురాలు ఉమాదేవి, ఏవో కవితరాణి, ఎంపీడీవో చంద్రారెడ్డి, తహసీల్దార్ సుబ్బలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.



ప్రదర్శనగా వెళ్తున్న మంగళకర డిగ్రీ కళాశాల విద్యార్థులు

కప్పలబండ, జగరాజుపల్లి (పుట్టపర్తి గ్రామీణం): కప్పలబండ, జగరాజుపల్లి పంచాయతీల్లో ఎంపీడీవో సుభాన్ గ్రామసభలు నిర్వహించారు. జన్మభూమి కార్యక్రమ ప్రాధాన్యతను తెలుసుకోవడానికి మంగళకర డిగ్రీ కళాశాల విద్యార్థులు తరలివచ్చారు. జగరాజుపల్లిలో నిర్వహించిన కార్యక్రమంలో సంక్షేమ పథకాల అమలు, వాటివల్ల ప్రజలకు చేకూరుతున్న ప్రయోజనాలను అధికారులు వివరించడాన్ని వీక్షించారు. కేజీబీవీ, ఆదర్శ, జడ్పీ ఉన్నత పాఠశాల విద్యార్థులచే ఆటల పోటీలు నిర్వహించారు. కార్యక్రమంలో సర్పంచులు సల్లాపురప్ప, సుందరమ్మ, కన్వీనర్ విజయ్‌కుమార్, అధికారులు, ఆయా కళాశాలల, ఆదర్శ, కేజీబీవీల, ఎస్‌వోలు సత్యప్రకాష్, సౌజన్య, అధ్యాపక బృందం పాల్గొన్నారు.



అగ్రహారం: విద్యార్థితో మాట్లాడుతున్న ప్రత్యేక అధికారి, ఎంపీపీ

అగ్రహారం (బుక్కపట్నం): కృష్ణాపురంలో ఎంపీడీవో విజయలక్ష్మి ఆధ్వర్యంలో జన్మభూమి కార్యక్రమాన్ని ఏర్పాటు చేశారు. ప్రత్యేకాధికారి డీఎఫ్ఓ చంద్రశేఖర్, ఎంపీపీ చింతకాయల రవి హాజరయ్యారు. మరుగుదొడ్ల ఆవశ్యకతపై ర్యాలీ చేస్తున్న పాఠశాల విద్యార్థులు అక్కడికి చేరుకున్నారు. ప్రత్యేకాధికారి విద్యార్థులను పిలిపించి మాట్లాడారు. విద్యార్థులతోపాటు వారి తల్లిదండ్రులతో మరుగుదొడ్ల ఆవశ్యకతపై అవగాహన కల్పించారు. అగ్రహారం గ్రామాన్ని పుట్టపర్తి నియోజకవర్గ ప్రత్యేకాధికారి, డీఎఫ్ఓ చంద్రశేఖర్ దత్తత తీసుకుంటానని జన్మభూమి కార్యక్రమంలో ప్రకటించారు. గ్రామాన్ని అభివృద్ధి పథంలో నడిపించి నియోజకవర్గంలోనే మోడల్ గ్రామంగా తీర్చిదిద్దుతానని, ఇందుకు గ్రామస్థులు, ప్రతిఒక్కరూ సహకరించాలని కోరారు. ఎంపీటీసీ చెన్నమ్మ, ఏఓ నటరాజ్, ఐసీడీఎస్ సూపర్‌వైజర్ అనసూయమ్మ తదితరులు పాల్గొన్నారు.

పాఠశాలకు ప్రహరీ నిర్మించరూ

గాండ్లపెంట, న్యూస్‌టుడే: మండలపరిధిలోని కటారుపల్లిలో నిర్వహిస్తున్న జన్మభూమి కార్యక్రమంలో పాల్గొనడానికి విచ్చేసిన ఎమ్మెల్యే అత్తార్ చాంద్‌బాషాకు ప్రధానోపాధ్యాయిని సంపూర్ణ, విద్యార్థులు పాఠశాల ఆవరణలో నెలకొన్న సమస్యలను పరిష్కరించాలని విన్నవించుకున్నారు. విద్యార్థులు ఎమ్మెల్యేతో మాట్లాడుతూ పాఠశాలకు ముందుభాగంలో ప్రహరీ దెబ్బతినడంతో జీవాలు వస్తున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. మరుగుదొడ్లకు నీటి సౌకర్యం లేక చాలా ఇబ్బందులు ఎదుర్కొంటున్నట్లు ఆయన దృష్టికి తీసుకొచ్చారు. తాగునీటి సౌకర్యం కల్పించాలని కోరారు. త్వరలోనే సమస్యలను పరిష్కరిస్తామని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయులు, పలువురు నాయకులు ఉన్నారు.



ఎమ్మెల్యేకు విన్నవిస్తున్న విద్యార్థులు

పవర్‌గ్రిడ్స్ పనులను ఆపేయాలి

తలుపుల, న్యూస్‌టుడే: ఎలాంటి సమాచారం ఇవ్వకుండా, నష్టపరిహారం చెల్లించకుండా చేస్తున్న పవర్‌గ్రిడ్స్ పనుల వల్ల తాము నష్టపోతున్నామని పలు గ్రామాలకు చెందిన రైతులు వాపోయారు. పవర్‌గ్రిడ్స్ పనులను నిలిపేయాలని తూపల్లి, నంగివాండ్లపల్లి తదితర గ్రామాల రైతులు గురువారం తహసీల్దారు శివయ్యకి వినతి పత్రం అందించారు. వారు మాట్లాడుతూ 440 కేవీ విద్యుత్తు లైన్ లాగడం వల్ల లైను కింద ఉన్న వ్యవసాయ బోరుబావులు పూర్తిగా దెబ్బతింటాయి. వాటితోపాటు పండ్లతోటలు, ఇతర పంటలు సాగుచేసుకోవడానికి వీల్లేకుండా పోతుందని ఆవేదన వ్యక్తం చేశారు. పవర్‌గ్రిడ్స్ లైన్ల నిర్మాణాల వల్ల నష్టపోతున్న రైతులకు ఇతర రాష్ట్రాల్లో భారీగా పరిహారం చెల్లిస్తుంటే ఇక్కడ మాత్రం గుత్తేదారులు, అధికారులు ఆ విషయాన్ని బయటకి రాకుండా రైతులకు ఎలాంటి నోటీసులు ఇవ్వకుండా పనులు చేస్తున్నారన్నారు. తక్షణం పనులను ఆపేయాలని తహసీల్దారును కోరారు.

అంధుల ఆరాధ్య దైవం బ్రెయిలీ

పుట్టపర్తి గ్రామీణం, న్యూస్‌టుడే: మండల వ్యాప్తంగా అంధుల లిపిని కనుగొన్న లూయిస్ బ్రెయిలీ జయంతి వేడుకలను అధికారులు, ఉపాధ్యాయులు, విద్యార్థులు ఘనంగా జరుపుకొన్నారు. జగరాజుపల్లి ఆదర్శ, కేజీబీవీ పాఠశాలల్లో విద్యార్థులతో కలిసి మండల స్థాయి అధికారులు బ్రెయిలీ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఎంపీడీవో సుభాన్, మండల విద్యాధికారి వెంకటరమణనాయక్ మాట్లాడుతూ బ్రెయిలీ అంధుల కోసం ప్రత్యేకంగా లిపిని కనుగొనడంతోనే వారి జీవితాల్లో వెలుగులు ప్రకాశిస్తున్నాయి. చదవడం, రాయడం, ఉన్నత ఉద్యోగాలు సాధించడానికి వెనుక బ్రెయిలీ కృషి ఎనలేనిదన్నారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు, పంచాయతీ కార్యదర్శులు రాజేశ్వర్, సౌజన్య, జయపాల్, గంగాధర్‌నాయక్ తదితరులు పాల్గొన్నారు.



నివాళులర్పిస్తున్న అధికారులు, ఉపాధ్యాయులు

సూపర్‌వైజరు పోస్టులను భర్తీ చేయాలి

కదిరి, న్యూస్‌టుడే: అనంతపురం రీజియన్‌లోని ఆర్టీసీ డిపోల్లో ఖాళీగా ఉన్న సూపర్‌వైజర్ పోస్టులను భర్తీచేయాలని ఎన్‌ఎంయూ రాష్ట్ర ఆర్గనైజింగ్ కార్యదర్శి హరిమోహన్ గురువారం స్టేట్ పర్సనల్ ఆఫీసర్ అశ్విన్‌కుమార్‌కు విన్నవించారు. పదోన్నతిపై అనంతపురంలో బాధ్యతలు చేపట్టిన ఆయన్ను హరిమోహన్ కలిసి అభినందనలు తెలిపారు. ఏపీఎస్ ఆర్టీసీలో అశ్విన్‌కుమార్ 1979లో కండక్టరు చేరి అంచెలంచలుగా ఎదిగి రాష్ట్ర పర్సనల్ అధికారి హోదాను చేపట్టడం హర్షణీయమన్నారు. రీజియన్‌లో పెండింగ్‌లోని గ్రేడ్-1 పదోన్నతులు, బదిలీల సమస్యలతో పాటు మడకశిర, రాయదుర్గం, పెనుకొండ, ధర్మవరం డిపోల్లో సూపర్‌వైజర్ పోస్టుల ఖాళీలను భర్తీచేయాలని విన్నవించారు. సమస్యలపై సానుకూలంగా స్పందించిన అశ్విన్‌కుమార్ సాధ్యమైనంత త్వరలో పరిష్కారానికి కృషి చేస్తామని తెలిపారు.

ఉత్తమ సేవకు పురస్కారం

గాండ్లపెంట, న్యూస్‌టుడే: సావిత్రీబాయిపూలే జయంతి సందర్భంగా బుధవారం విద్యాశాఖ మంత్రితో పూలే అవార్డు, సత్కారం పొందిన మండల ఉపాధ్యాయులు రమణమ్మ, విజయలక్ష్మి, రూపకళ, దుర్గాలను గురువారం మండల విద్యాధికారి కృష్ణానాయక్, తాహిర్ అలీ అభినందనలు తెలిపారు. ఉపాధ్యాయులను సత్కరించిన కందికుంట నారాయణమ్మ ట్రస్ట్ అధ్యక్షురాలు యశోదమ్మకు తాహిర్‌అలీ కృతజ్ఞతలు తెలిపారు.

రాయదుర్గం

సంక్రాంతి కానుకల పంపిణీ

ములకలేడు, కరిడిపల్లి (శెట్టూరు), న్యూస్‌టుడే : శెట్టూరు మండలంలోని ములకలేడు, కరిడిపల్లి గ్రామాల్లోని చౌక దుకాణాల్లో గురువారం చంద్రన్న సంక్రాంతి కానుకలను మండల ఉపాధ్యక్షుడు బొమ్మయ్య, సర్పంచి మధు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో తెదేపా నాయకులు తిప్పేస్వామి, డీలర్లు శ్రీనివాసులు, సుబ్బరాయుడు, కార్డుదారులు పాల్గొన్నారు.

ఉపకార వేతనాల మంజూరు

కుందుర్పి: కుందుర్పి మండలంలోని 1,674 మంది విద్యార్థులకు 2016-17 సంవత్సరానికి ఉపకార వేతనాలు మంజూరైనట్లు ఐకేపీ ఏపీఎం గుణశ్యాం తెలిపారు. అభయహస్తం, ఆమ్‌ఆద్మీ, చంద్రబీమా పథకం కింద మంజూరైనట్లు తెలిపారు. ఒక్కొక్కరికి రూ.1200 వంతున మొత్తం రూ. 22.88 లక్షలు మంజూరైందని తెలిపారు. ఈ నెల 11న విద్యార్థుల ఖాతాలకు జమ చేస్తామన్నారు.

దుర్గం అభివృద్ధికి కృషి



మాట్లాడుతున్న మంత్రి కాలవ శ్రీనివాసులు

రాయదుర్గం పట్టణం, న్యూస్‌టుడే : రాయదుర్గం అభివృద్ధికి ఒక్కరూ కృషి చేయాలని మంత్రి కాలవ శ్రీనివాసులు అన్నారు. పట్టణంలోని 10వ వార్డులో కౌన్సిలర్ లావణ్య అధ్యక్షతన గురువారం జరిగిన ఐదో విడత జన్మభూమి మా ఊరు కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరై ప్రసంగించారు. పట్టణంలో ఎన్నికల్లో ప్రజలు రెండు ప్రధాన సమస్యలను తన దృష్టికి తీసుకొచ్చారని, వాటిని పరిష్కరించినట్లు చెప్పారు. రాయదుర్గంలో ఎక్కువ మంది గార్మెంట్స్ రంగంలో పని చేస్తున్నందున పగటి పూట నిత్యం విద్యుత్తు కోతలతో కూలీ కూడా గిట్టుబాటు కావడం లేదని ప్రజలు ఫిర్యాదు చేశారన్నారు. అయితే ప్రస్తుతం రాయదుర్గానికి కోతలు లేకుండా 24 గంటల విద్యుత్తు సరఫరాను అందిస్తున్నట్లు చెప్పారు. ఆసుపత్రిలో స్త్రీ వైద్యులను నియమించాలని ఎన్నికల్లో ప్రజలు కోరగా అధికారంలోకి వచ్చాక రూ.3.20 కోట్లతో అత్యాధునిక ఆసుపత్రిని నిర్మించి వైద్యులను నియమించి నాణ్యమైన వైద్య సేవలందిస్తున్నట్లు తెలిపారు. గతంలో సాధారణ రోగులు వివిధ పరీక్షలకు, గర్భిణుల నెలసరి పరీక్షలకు, ఎక్స్‌రే తదితర వాటికి బళ్లారి, అనంతపురం, కళ్యాణదుర్గం తదితర ప్రాంతాలకు నిత్యం ప్రజలు పరుగులు తీసేవారని, నేడు ప్రజలను అన్ని సేవలు ప్రభుత్వ వైద్యశాలలో అందేలా ప్రభుత్వం చర్యలు తీసుకుందని తెలిపారు. పట్టణంలోని పదో వార్డు విశాలంగా ఉండటంతో ఈ మూడున్నరేళ్లలో రూ.50 లక్షలతో అబివృద్ధి పనులు చేపట్టినట్లు వివరించారు. దీంతో పాటు రహదారి విస్తరణ, ప్రభుత్వ బాలికల జూనియర్ కళాశాల మంజూరు, గుమ్మఘట్టలో బీసీ బాలికల గురుకుల పాఠశాల, పాలిటెక్నిక్ కళాశాలలో బాలికల వసతిగృహం నిర్మాణానికి చర్యలు తీసుకుంటున్నట్లు చెప్పారు. కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్సీ గోవిందరెడ్డి, మున్సిపల్ వైస్ ఛైర్మన్ వెంకటేశులు, కౌన్సిలర్లు హనుమంతు, పురుషోత్తం, నాగరాజు, సంపత్‌కుమారి, భారతి, ప్రశాంతి, మున్సిపల్ కమిషనర్ కృష్ణ, డీటీ బాలకిషన్, విద్యుత్తు ఏడీఈ బలసింహారావు, వైద్యులు మన్సూర్‌ఆలీఖాన్, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

గోపులాపురం (కణేకల్లు) : మండలంలోని గోపులాపురం గ్రామంలో గురువారం సర్పంచి బసవరాజు అధ్యక్షతన జరిగిన జన్మభూమి - మా ఊరు కార్యక్రమంలో ఎంపీడీవో రెహానాబేగం, ఎంపీపీ ఫాతిమా పాల్గొని మాట్లాడారు. ప్రజల నుంచి వచ్చిన విజ్ఞప్తులను స్వీకరించారు. కార్యక్రమంలో తెదేపా నాయకులు ఆది, రమేష్, లక్ష్మీనారాయణ తదితరులు పాల్గొన్నారు.

పూలచెర్ల (కణేకల్లు) : పూలచెర్ల ఉన్నత పాఠశాల ఎస్సీ కాలనీలో బుధవారం

సర్పంచి రవి అధ్యక్షతన జరిగిన జన్మభూమి - మా ఊరు గ్రామ సభలో తహసీల్దారు వాణిశ్రీ మాట్లాడారు. పుల్లంపల్లిలో సీసీ రహదారులు, డ్రైనేజీ, పాఠశాలకు ప్రహరీ, నిర్మించాలని, అంగవైకల్యం కలవారికి పింఛను మంజూరులో ప్రాధాన్యత కల్పించాలని ఉప సర్పంచి వనిత అధికారులకు విన్నవించారు. ప్రజల నుంచి 194 వినతులు అందించారు.

బీఎన్‌హళ్లి (రాయదుర్గం గ్రామీణం) : మండలంలోని బీఎన్‌హళ్లిలో గురువారం ఉప సర్పంచి కుళ్లాయప్ప అధ్యక్షతన జరిగిన జన్మభూమి - మా ఊరు గ్రామ సభ నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంపీడీవో శ్రీనివాసులు మాట్లాడుతూ రాయదుర్గం మండలం వ్యక్తిగత మరుగుదొడ్ల నిర్మాణంలో జిల్లాలో 7వ స్థానంలో, రాయదుర్గం నియోజకవర్గంలో ప్రథమ స్థానంలో ఉందన్నారు. ప్రజలు అధికారుల సహకారంతో ఓడీఎఫ్‌గా ప్రకటిస్తామన్నారు. కార్యక్రమంలో ఎంపీటీసీ సభ్యుడు రామాంజనేయులు అన్ని శాఖల ప్రభుత్వ అధికారులు పాల్గొన్నారు.



చంద్రన్న కానుకలను అందిస్తున్న మంత్రి కాలవ శ్రీనివాసులు

టి.వీరాపురం (రాయదుర్గం గ్రామీణం) : టి.వీరాపురంలో గురువారం సర్పంచి సుంకన్న అధ్యక్షతన జన్మభూమి - మా ఊరు గ్రామసభ రాయదుర్గం తహసీల్దారు నాగరాజు ఆధ్వర్యంలో జరిగింది. వైద్య ఆరోగ్యశాఖ రీజనల్ డైరెక్టర్ మీనాకుమారీ, డీఎంహెచ్‌వో అనిల్‌కుమార్ పాల్గొని జన్మభూమిలో ఓపి, మహిళల ఆరోగ్య పరీక్షలు అడిగి తెలుసుకున్నారు.



హరేసముద్రంలో అధికారులను ప్రశ్నిస్తున్న ప్రజలు

మరుగుదొడ్ల నిర్మాణంపై నిలదీత

హరేసముద్రం (బొమ్మనహాళ్), న్యూస్‌టుడే : మండలంలోని హరేసముద్రం గ్రామంలో గురువారం జరిగిన జన్మభూమి - మాఊరు కార్యక్రమంలో అధికారులను మరుగుదొడ్ల నిర్మాణంపై ప్రజలు నిలదీశారు. మరుగుదొడ్ల నిర్మాణంలో అనధికారిక గుత్తేదారులు రంగ ప్రవేశం చేయుడం వల్ల లబ్ధిదారులకు అన్యాయం జరగుతోందని లబ్ధిదారులు ఆందోళన చేశారు. మరుగుదొడ్ల నిర్మాణానికి 100 ఇటుకలు, ఐదు రింగులు, రెండు రేకులు, రెండు బస్తాల సిమెంటు ఇచ్చి గుత్తేదారులు ఒప్పంద పత్రంపై సంతకం చేయించుకొంటే ఎలా అని గ్రామస్థులు అధికారులను నిలదీశారు. లబ్ధిదారుల ఖాతాకే బిల్లులు చెల్లించాలని వారు డిమాండ్ చేశారు. ఇప్పటి వరకు మెటీరియల్ ఇచ్చిన గుత్తేదారులకే బిల్లులు ఇస్తే తాము గుంతలు తవ్వుకొని నిర్మాణాలు ఎలా చేపట్టాలని ప్రశ్నించారు. ఈవిషయంపై తహసీల్దారు శివయ్య మాట్లాడుతూ లబ్ధిదారులే సొంతంగా మరుగుదొడ్లను నిర్మించుకొంటే వారి ఖాతాలకే బిల్లులు చెల్లించడానికి చర్యలు తీసుకొంటామని చెప్పడంతో ఆందోళన సద్దుమణిగింది. ఈ కార్యక్రమంలో సర్పంచి తిప్పేస్వామి, ఎంఈవో భీమప్ప, ఈవోఆర్డీ కొండయ్య, సీఎస్‌డీటీ బాలకృష్ణ, విద్యుత్తు ఏఈఈ అహమ్మద్ బేగ్, తదితరులు పాల్గొన్నారు.

దేవగిరి (బొమ్మనహాళ్) : మండలంలోని దేవగిరిలో గురువారం జన్మభూమి - మా ఊరు గ్రామసభ నిర్వహించారు. ప్రత్యేకాధికారి సనావుల్లా, ఎంపీడీవో గంగన్న ఎంపీటీసీ సభ్యురాలు భారతి, సర్పంచి భాగ్యమ్మ, ఉప తహసీల్దారు గురుప్రసాద్, సీడీపీవో పార్వతమ్మ, హౌసింగ్ ఏఈఈ వెంకటేశ్వర్లు, ఏఈవో వెంకటనారాయణ తదితరులు పాల్గొన్నారు.

ప్రతి ఇంటికీ మరుగుదొడ్డి ఉండాలి



ప్రతిజ్ఞ చేస్తున్న విద్యార్థులు

రాయదుర్గం, న్యూస్‌టుడే : ప్రతి ఇంటికీ తప్పకుండా మరుగుదొడ్డి నిర్మించుకోవాలని స్థానిక ప్రభుత్వ బాలికల జూనియర్ కళాశాల ప్రిన్సిపల్ చంద్రమౌళీశ్వర అన్నారు. పట్టణంలో వ్యక్తిగత మరుగుదొడ్లు నిర్మించాలని జూనియర్ కళాశాల విద్యార్థులు గురువారం కళాశాల నుంచి వినాయక సర్కిల్ వరకు ప్రదర్శన నిర్వహించారు. సర్కిల్‌లో విద్యార్థినులు మానవహారంగా ఏర్పడి ప్రతి ఇంటికీ మరుగుదొడ్డి నిర్మించుకునేలా ప్రజలకు అవగాహన కల్పిస్తామని ప్రతిజ్ఞ చేశారు. ఈ సందర్భంగా ప్రిన్సిపల్ మాట్లాడుతూ ఈ నెలలో జిల్లాను ఓడీఎఫ్‌గా ప్రకటిస్తున్నందున గ్రామాల్లో అవగాహన కల్పించాలని, విద్యార్థినులు భాగస్వామ్యం కావాలని సూచించారు. కార్యక్రమంలో పాఠశాల సిబ్బంది, విద్యార్థినులు పాల్గొన్నారు.

సీపీఎస్ రద్దు చేయండి

బొమ్మనహాళ్, న్యూస్‌టుడే : సీపీఎస్ విధానాన్ని రద్దు చేసి పాత పద్ధతిలోనే ఉద్యోగులకు (ఓపీఎస్) పింఛను సౌకర్యం కల్పించాలని ఉపాధ్యాయులు గురువారం జన్మభూమి అధికారులకు ఉపాధ్యాయులు ఆదినారయణ, లక్ష్మీపతి, సుధాకర్, మహేష్ బుధవారం అధికారులకు విన్నవించారు. 2004 జనవరి 2 తరువాత చేరిన ఉద్యోగులకు ఓపీఎస్‌ను రద్దు చేసి సీపీఎస్ విధానాన్ని చేపట్టడం వల్ల ఉద్యోగులు తీవ్రంగా ఇబ్బందులు పడుతున్నారన్నారు. ముఖ్యమంత్రి చంద్రబాబు తగు చర్యలు తీసుకొని వెంటనే సీపీఎస్ విధానాన్ని రద్దు చేసి ఉద్యోగులకు ఓపీఎస్ పింఛను విధానాన్ని పునరుద్ధరించాలని వారు కోరారు.

ఉప ఖజానా అధికారులు తిప్పుకొంటున్నారు

కణేకల్లు: వేతన బిల్లులు ఆమోదించకుండా స్థానిక ఖజానా అధికారులు నెల రోజులుగా కార్యాలయం చుట్టూ తిప్పుకొంటున్నారని స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాల కాంట్రాక్టు అధ్యాపకులు ఆందోళన వ్యక్తం చేశారు. మూడు నెలలుగా అందని వేతన బకాయిలు ప్రభుత్వం గత నెల రోజుల క్రితం మంజూరు చేసిందని అధ్యాపకులు నాగప్రసాద్, రవినాయక్, శైలజ, ఆంజనేయులు, ధనుంజయ, మధుసూదన్ తెలిపారు. గతంలో మాదిరి కాకుండా ఖజానాకు బిల్లులు సమర్పించి తీసుకొనేలా మార్పు చేసినట్లు తెలిపారు. బిల్లులు సమర్పించి నెల రోజులు కావస్తున్నా.. ఖజానా అధికారులు అదిగో.. ఇదిగో అంటూ తిప్పుకొంటూ రోజుకో కారణం చెబుతూ.. తిప్పుకొంటూ ఇబ్బందులకు గురి చేస్తున్నట్లు ఆరోపించారు. మూడు నెలలుగా వేతనాలందక కుటుంబ పోషణకు తీవ్ర ఇబ్బందులు పడుతున్నట్లు వారు ఆవేదన వ్యక్తం చేశారు. ఈ మేరకు ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేయనున్నట్లు తెలిపారు.

పరిసరాల శుభ్రతతోనే సంపూర్ణ ఆరోగ్యం

రాయదుర్గం గ్రామీణం, న్యూస్‌టుడే : గ్రామాల్లో ప్రజలు పరిసరాలు పరిశుభ్రంగా ఉంచుకొని సంపూర్ణ ఆరోగ్యం పొందాలని నినాదాలు చేస్తూ రాయదుర్గం ప్రభుత్వ డిగ్రీ కళాశాల విద్యార్థులు ప్రదర్శన నిర్వహించారు. మండలంలోని 74 ఉడేగోళం గ్రామంలో డిగ్రీ కళాశాల ప్రిన్సిపల్ కళావతి ఆధ్వర్యంలో విద్యార్థులు మానవహారం నిర్వహించారు. ఈ సందర్భంగా కళాశాలలో విద్యార్థులకు వక్తృత్వం, వ్యాసరచన, చిత్రలేఖనం, నాటికలు నిర్వహించారు. ఆయా వాటిల్లో విజేతలుగా నిలిచిన విద్యార్థులు భాస్కర్, జోహార్‌బాబు, నాగరాజు, శిరీష, విశాలాక్షి బహుమతులు సాధించారు.

కార్యక్రమంలో డిగ్రీ కళాశాల వైస్ ప్రిన్సిపల్ తిరుమలేష్, ఎన్ఎస్ఎస్ పీవోలు రామలింగప్ప, లక్ష్మీనారాయణ, అధ్యాపకులు స్వర్ణలత, జనార్దన్, గురుమూర్తి, వెంకటస్వామి, వెంకటేశులు, శివశంకర్‌నాయుడు, రవీంద్ర డిగ్రీ విద్యార్థులు పాల్గొన్నారు.



74 ఉడేగోళంలో విద్యార్థుల మానవహారం

గ్యాస్ సమాచారం

- **రాయదుర్గం శ్రీదేవి ఇండేన్ గ్యాస్ -** ఈ నెల 3వ తేదీన బుకింగ్ చేసిన వారికి శుక్రవారం సరఫరా చేస్తారు.
- **కణేకల్లు సుధీర్ సాయి ఇండేన్ గ్యాస్ ఏజెన్సీ -** ఈ నెల 2వ తేదీన బుకింగ్ చేసిన వారికి శుక్రవారం సరఫరా చేస్తారు.
- **రాయదుర్గం శ్రీబాలస్వామి హెచ్‌పీ గ్యాస్ -** ఈ నెల 2వ తేదీన బుకింగ్ చేసిన వారికి శుక్రవారం సరఫరా చేస్తారు.
- **గుమ్మఘట్ట కనక భారత్ గ్యాస్ -** ఈ నెల 2వ తేదీన బుకింగ్ చేసిన వినియోగదారులకు శుక్రవారం సరఫరా చేస్తారు.
- **డి.హీరేహాళ్ ఇండేన్ గ్యాస్ -** ఈ నెల 3వ తేదీన బుకింగ్ చేసిన వారికి శుక్రవారం సరఫరా చేస్తారు.

22న ఆర్డీవో కార్యాలయ ముట్టడి

కళ్యాణదుర్గం గ్రామీణం: ఈ నెల 22వ తేదీన ఆర్డీవో కార్యాలయం ముట్టడికి తరలి రావాలని ఎమ్మార్పీఎస్ డివిజన్ అధ్యక్షుడు తిమ్మరాజు పిలుపునిచ్చారు. గురువారం ఆర్‌అండ్‌బీ అతిథిగృహంలో ఎమ్మార్పీఎస్ నాయకులు విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మార్పీఎస్ డివిజన్ అధ్యక్షుడు తిమ్మరాజు మాట్లాడుతూ కళ్యాణదుర్గం, కుందుర్పి మండల కేంద్రాల్లో అంబేడ్కర్ భవనాలను నిర్మించేందుకు స్థలాన్ని వెంటనే చూపాలన్నారు.

రాయదుర్గం

నేడు ఉచిత 104 సంచార సేవలు

రాయదుర్గం పట్టణం, న్యూస్‌టుడే : డి.హీరేహాళ్ సిద్ధాపురం తండాలో శుక్రవారం ఉదయం 9 నుంచి 12.30 గంటల వరకు ఉచిత సంచార వైద్యసేవల శిబిరాన్ని ఏర్పాటు చేయనున్నారు. మధ్యాహ్నం 1.30 నుంచి 4 గంటల వరకు ఇదే మండలంలోని సిద్ధాపురంలో నిర్వహించనున్నారు. ఇన్‌ఛార్జి వైద్యుడిని విధులకు పంపనున్నట్లు 104 జిల్లా మేనేజర్ వర ప్రసాద్ తెలిపారు.

కూరగాయల ధరలు

రాయదుర్గం పట్టణం, న్యూస్‌టుడే : స్థానిక మార్కెట్‌లో గురువారం కూరగాయల ధరల వివరాలు (కిలో/రూ.లలో) వంకాయలు : 20, టమోటా : 5, బెండ : 30, కాకర : 30, బీర : 30, క్యాబేజీ : 30, చిక్కుడు : 30, క్యారెట్ : 80, అల్లం : 50, పచ్చిమిర్చి : 30, వెల్లుల్లి : 60, క్యాప్సికం : 80, ఉల్లి : 50.

పేరు కోసం ఆడుతున్నారు..!

- ✿ క్రీడా ప్రతిభకు పుట్టినిల్లు జుంజురాంపల్లి
- ✿ పతకాలు సాధిస్తున్న విద్యార్థులు



క్రీడాకారులతో ఉపాధ్యాయ బృందం



ఖోఖో ఆడుతున్న బాలికలు

జుంజురాంపల్లి (రాయదుర్గం గ్రామీణం), న్యూస్‌టుడే : మండలంలోని జుంజురాంపల్లి ప్రభుత్వ ఉన్నత పాఠశాల విద్యార్థులు చదువులతోపాటు క్రీడల్లోనూ విశేష ప్రతిభ కనబరుస్తున్నారు. డివిజన్, జిల్లా, రాష్ట్ర స్థాయి క్రీడాపోటీల్లో పాల్గొంటూ.. పతకాలు సాధిస్తూ అందరిచేత శెభాష్ అనిపించుకుంటున్నారు. విద్యార్థులకు క్రీడలంటే ఆసక్తిని గుర్తించి ఉపాధ్యాయులు ప్రోత్సహిస్తున్నారు. శిక్షణకు కావాల్సిన వసతులు సమకూరుస్తున్నారు. క్రీడా పోటీల్లో రాణించి పాఠశాలకు పేరు ప్రతిష్ఠలు తీసుకొచ్చేందుకు కఠోర సాధన చేస్తున్నారు. రోజూ సాయంత్రం పీఈటీ ఇస్తున్న శిక్షణను సద్వినియోగం చేసుకుంటున్నారు. ఇటీవల రాయదుర్గం ప్రభుత్వ ఉన్నత పాఠశాల క్రీడా మైదానంలో నిర్వహించిన ఐదో జోన్ సైనా నెహ్వాల్ గ్రిగ్స్ పోటీల్లో ఖోఖో, పరుగు పందెం, లాంగ్ జంప్, హైజంప్, షాట్‌పుట్ తదితర క్రీడాంశాల్లో తమ సత్తాచాటి 5 కప్‌లను సాధించారు. అలాగే ఇటీవల రాష్ట్ర స్థాయి ఖోఖో పోటీల్లోనూ ప్రతిభ చాటి పతకాలు అందుకొన్నారు. గ్రామీణ ప్రాంతాల్లో ఉన్న అరకొర క్రీడా సదుపాయాలను చక్కగా సద్వినియోగం చేసుకుంటూ వివిధ క్రీడాంశాల్లో విద్యార్థులు రాణిస్తుండటంపై వారిని అధికారులు, ఉపాధ్యాయులు, గ్రామస్థులు ప్రశంసిస్తున్నారు.



రాష్ట్ర స్థాయి ఖోఖోలో సాధించిన ప్రశంసా పత్రంతో చంద్ర, శిల్ప, భూమిక

బాలికల ప్రతిభ అమోఘం

జుంజురాంపల్లి పాఠశాల బాలికలు క్రీడల్లో అద్భుతమైన ప్రదర్శన చేస్తూ అందరినీ నివ్వెరపరుస్తున్నారు. అథ్లెటిక్స్ ఈవెంట్‌లలో పతకాలు సాధించి వ్యక్తిగత క్రీడా ప్రతిభ చాటుతున్నారు. విద్యార్థిని శిల్ప 100, 400 మీటర్ల పరుగులో ప్రథమ, లాంగ్ జంప్, హైజంప్‌లలో ప్రథమ స్థానంలో గెలుపొంది ఆల్‌రౌండర్‌గా నిలిచింది. సువర, మౌనిక అనే విద్యార్థినులు పరుగులో ద్వితీయ స్థానంలో నిలిచారు. మౌనిక షాట్‌పుట్‌లో కూడా ద్వితీయ స్థానంలో నిలిచింది. అదేవిధంగా ఖోఖో క్రీడలో బాలికలు నిపుణులు, నైపుణ్యత సాధించి ఇటీవల జరిగిన గ్రిగ్స్ పోటీల్లో సీనియర్స్, జూనియర్స్ విభాగాల్లో విన్నర్స్‌గా నిలిచారు. బాలురులు కూడా జూనియర్స్ విభాగంలో ఖోఖోలో విన్నర్స్‌గా నిలిచారు. నవంబరు 21వ తేదీన చిత్తూరులో జరిగిన రాష్ట్ర స్థాయి అండర్ -17 ఖోఖో పోటీల్లో శిల్ప, భూమిక పాల్గొని ప్రతిభ కనబరిచి పతకాలు సాధించారు. అండర్ - 14 విభాగంలోనూ విద్యార్థి చంద్ర జిల్లా జట్టు విజేతగా నిలవడంలో కీలక పాత్ర పోషించాడు. అదేవిధంగా జిల్లా స్థాయి పోటీల్లోనూ పతకాలు సాధించి విజేతలుగా నిలిచారు.



హైజంప్ సాధన

మరిన్ని విజయాలు సాధిస్తాం..

- శిల్ప, విద్యార్థిని



పాఠశాలలో హెచ్‌ఎం రాజశేఖర్‌రెడ్డి, ఇన్‌ఛార్జి హెచ్‌ఎం లక్ష్మీనరసింహుడు, పీఈటీ మల్లికార్జున ప్రోత్సాహంతోనే విద్యార్థులు క్రీడల్లో రాణిస్తున్నారు. పీఈటీ మంచి శిక్షణ ఇవ్వడంతోనే పతకాలు సాధిస్తున్నాము. భవిష్యత్తులో మరిన్ని విజయాలు సాధించి మా పాఠశాలకు పేరుప్రతిష్ఠలు తీసుకొస్తాం.

అందరి సహకారంతోనే..

- మల్లికార్జున, పీఈటీ



హెచ్‌ఎం, తోటి ఉపాధ్యాయులు ఇస్తున్న సహకారం వల్లే విద్యార్థులను మంచి క్రీడాకారులుగా తీర్చిదిద్దుతున్నాము. బాలబాలికలు క్రీడలపై ఆసక్తి కనపరుస్తున్నారు. శిక్షణలో క్రీడా మెలకువలు చెప్పిన వెంటనే అందిపుచ్చుకుంటున్నారు. వాటిని ఖోఖోలో ప్రదర్శిస్తూ ప్రత్యర్థి జట్టును సునాయసంగా ఓడించి ప్రతిభ చాటుతున్నారు.

పప్పుశనగ పంట కోత ప్రయోగం



పంటకోత ప్రయోగం నిర్వహిస్తున్న అధికారులు

బొమ్మనహాళ్, న్యూస్‌టుడే : మండలంలోని ఉంతకల్లు గ్రామంలో గురువారం గణాంక శాఖాధికారులు, వ్యవసాయ శాఖాధికారులు పప్పుశనగ పంట కోత ప్రయోగం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎన్‌ఎస్‌ఎస్‌వో హరి, ఏఎస్‌వో పర్వతప్ప, ఏఈవో వెంకటనారాయణ ఆధ్వర్యంలో దేవప్రకాష్‌రెడ్డి, ఎం.తిమ్మారెడ్డి అనే రైతు పొలాల్లో పప్పుశనగ పంటకోత ప్రయోగం నిర్వహించారు. ఎ.దేవప్రకాష్‌రెడ్డి అనే రైతు పొలంలో పంటకోత ప్రయోగం చేయగా 1.410 కిలోలు రాగా, తిమ్మారెడ్డి పొలంలో 1.350 కిలోల దిగుబడి వచ్చినట్లు తెలిపారు.

నేడు మంత్రి కాలవ రాక

బొమ్మనహాళ్: మండలంలోని కల్‌హోళ గ్రామంలో శుక్రవారం జరిగే జన్మభూమి - మాఊరు గ్రామసభకు మంత్రి కాలవ శ్రీనివాసులు హాజరవుతున్నట్లు మండల తెదేపా కన్వీర్ బలరామిరెడ్డి తెలిపారు. మండలంలోని సర్పంచులు, ఎంపీటీసీ సభ్యులు, తెదేపా నాయకులు ఎంపీపీ, జడ్పీటీసీ సభ్యులు పాల్గొని విజయవంతం చేయాలన్నారు.

కణేకల్లు: మండలంలోని గనిగెర గ్రామంలో శుక్రవారం ఉదయం 10 గంటలకు జరిగే జన్మభూమి - మాఊరు కార్యక్రమానికి మంత్రి కాలవ శ్రీనివాసులు, మాజీ ఎమ్మెల్సీ మెట్టు గోవిందరెడ్డి, జడ్పీ ఛైర్మన్ పూల నాగరాజు, విచ్చేయనున్నట్లు మండల కన్వీనర్ లాలెప్ప, తెదేపా నాయకుడు గోపాల్‌రెడ్డి తెలిపారు. అలాగే రూ. 7 లక్షలతో నిర్మించనున్న అంగన్‌వాడీ కేంద్ర భవనానికి భూమిపూజ చేయనున్నట్లు చెప్పారు.

క్రీడల్లో విద్యార్థులు రాణించాలి

బొమ్మనహాళ్, న్యూస్‌టుడే : గ్రామీణ ప్రాంతాల్లోని విద్యార్థులు చదువుతోపాటు క్రీడల్లో రాణించాలని ప్రత్యేకాధికారి సనావుల్లా, ఎంపీడీవో గంగన్న అన్నారు. మండలంలోని దేవగిరి గ్రామంలో గురువారం జరిగిన కబడ్డీ క్రీడా పోటీలను వారు ప్రారంభించి మాట్లాడారు. క్రీడలు మానసికోల్లాసానికి ఎంతో దోహద పడతాయన్నారు. విద్యార్థులు విద్యతోపాటు క్రీడల్లోనూ రాణించి రాష్ట్ర, జాతీయ స్థాయిలో పతకాలు సాధించాలన్నారు. అనంతరం క్రీడా పోటీల్లో గెలుపొందిన జట్టుకు బహుమతులను ప్రదానం చేశారు. ఈ కార్యక్రమంలో సర్పంచి భాగ్యమ్మ, అధికారులు పాల్గొన్నారు.



దేవగిరిలో కబడ్డీ పోటీలు నిర్వహిస్తున్న అధికారులు

ఆదర్శనీయులు.. సావిత్రిబాయిపూలే

మారెంపల్లి (గుమ్మఘట్ట), న్యూస్‌టుడే : దేశ తొలి ఉపాధ్యాయిని సావిత్రిబాయిపూలే ఆదర్శప్రాయురాలని ప్రధానోపాధ్యాయులు వేణుగోపాల్‌శెట్టి పేర్కొన్నారు. గురువారం మండలంలోని మారెంపల్లి ప్రాథమికోన్నత పాఠశాలలో సావిత్రిబాయిపూలే జయంతి సందర్భంగా వేడుకలు జరుపుకొన్నారు. ఈ సందర్భంగా ఆ పాఠశాలలో ఉపాధ్యాయులుగా పనిచేస్తున్న చంద్రకళ, సునీత, వరహాలు, విమల, లక్ష్మిలను అక్కడ పనిచేస్తున్న ఉపాధ్యాయులు, పాఠశాల కమిటీ ఛైర్మన్ శాలువాలతో, పూలహారాలతో సన్మానం చేశారు. ఈ సందర్భంగా ఉపాధ్యాయుడు శ్రీరాములు మాట్లాడుతూ జ్యోతిరావ్‌పూలే, ఆయన సతీమణి ప్రథమ ఉపాధ్యాయిని సావిత్రి బాయిపూలే అందించిన సేవలను కొనియాడారు. విద్యార్థులు, ఉపాధ్యాయులు వారిని ఆదర్శంగా తీసుకోవాలన్నారు. అనంతరం విద్యార్థులకు మిఠాయిలు పంచి పెట్టారు. కార్యక్రమంలో కుళ్లాయప్ప, పెద్దన్న, వన్నూర్‌స్వామి తదితరులు పాల్గొన్నారు.



ఉపాధ్యాయినులకు సన్మానం



మురడిలో విద్యార్థుల ప్రదర్శన

మహిళల ఆత్మగౌరవం కాపాడుకుందాం

మురడి (రాయదుర్గం గ్రామీణం), న్యూస్‌టుడే : డి.హీరేహాళ్ మండలం మురడి గ్రామంలో గురువారం ప్రభుత్వ ఉన్నత పాఠశాల హెచ్‌ఎం జగదీశ్వరమ్మ ఆధ్వర్యంలో స్వచ్ఛ ఆంధ్రప్రదేశ్‌పై ఉపాధ్యాయులు, విద్యార్థులు పుర వీధుల్లో ప్రదర్శన నిర్వహించారు. ప్రతి ఇంటికీ వ్యక్తిగత మరుగుదొడ్లు నిర్మించుకొని మహిళల ఆత్మగౌరవం కాపాడుకోవాలని ప్రజలకు అవగాహన కల్పించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు బసవరాజు, అంగన్‌వాడీ కార్యకర్తలు, ఏఎన్‌ఎం, విద్యార్థులు పాల్గొన్నారు.

రాప్తాడు

ఘనంగా ఆలయ వార్షికోత్సవం

అనంత సాంస్కృతికం: నగరంలోని నాలుగోరోడ్డు శ్రీరంగస్వామి నగర్‌లో ఉన్న నసనకోట ముత్యాలమ్మ ఆలయ వార్షికోత్సవం గురువారం ఘనంగా నిర్వహించారు. ఉదయం మూలమూర్తికి గంగజలాభిషేకం, పంచామృతాభిషేకం నిర్వహించి పట్టువస్త్రాలు, నిమ్మ, వేప, గాజులతో చేసిన మాలలతో అలంకరించారు. రుద్రాభిషేకం, మహిళల సామూహిక లలితాసహస్రనామ పారాయణం చేశారు. కర్ణాటక, చిత్తూరు, కడప, కర్నూలు జిల్లాల నుంచి వచ్చిన భక్తులతో ఆలయం కిటకిటలాడింది. స్ఫూర్తి స్వచ్ఛంద సంస్థ సభ్యులు, ఆలయ వ్యవస్థాపకులు అన్నదానం చేశారు.

రోగికి మందుల అందజేత

అనంతపురం(వైద్యం): అనంత ఆస్పత్రిలో నెల రోజులుగా వైద్యచికిత్స పొందుతున్న ఓ అనాథ రోగికి ఖరీదైన మందులు అందజేశారు. గురువారం ఆస్పత్రి సర్జికల్ వార్డులో కడుపు నొప్పితో చికిత్స పొందుతున్న డ్రైవర్ బాబుకు ఈ మందులు ఇచ్చారు. ధర్మవరానికి చెందిన బాబు కడుపునొప్పితో నెల రోజుల క్రితం ఆస్పత్రిలో చేరారు. శస్త్ర చికిత్స చేయాలంటే శరీరం సహకరించలేదు. అందులోనూ వ్యాధి నిరోధక శక్తి లేదు. దీంతో పలువురు దాతల సహకారంతో రూ.16 వేలు ఖరీదు చేసే మందులను అందించారు.

సమస్యలు దండి.. తీర్పు రేమండి

- న్యూస్‌టుడే, రాప్తాడు

వాట్సాప్ ఉందా.. స్పందించండి

మీరు ఎదుర్కొంటున్న సామాజిక సమస్యలపై స్పందించండి. యంత్రాంగం దృష్టికి తీసుకువెళ్లేందుకు 'ఈనాడు' వేదికగా నిలుస్తోంది. మీరు చేయాల్సిందల్లా సమస్యను ఫోటో తీసి, పరిస్థితిని క్లుప్తంగా వివరించి వాట్సాప్ ద్వారా మీ పేరుతో సహా పంపడమే.

కింది నంబరుకు పంపొచ్చు

రాప్తాడు: 80089 02801



చిన్మయనగర్ సమీపాన కాలనీలో నిల్వ ఉన్న మురుగు

సమస్య: మండలంలోని చిన్మయనగర్ సమీపాన ఉన్న కాలనీలో మురుగు నీరు నిల్వ ఉంది. నివాసాల నడుమ మురుగు కాలువ నిర్మించకపోవడంతో నీరు నిల్వ ఉండి దుర్వాసన వస్తోంది. కాల్వలు నిర్మించి సమస్యను పరిష్కరించాలి.

– నారాయణస్వామి, చిన్మయనగర్

సమాధానం: గ్రామాల్లో పారిశుద్ధ్య పనులు చేయించి ప్రజలకు సౌకర్యాలు కల్పిస్తున్నాం. వచ్చే వారంలో చిన్మయనగర్‌లో పర్యటించి మురుగు కాలువలు నిర్మించడానికి నిధులు మంజూరు చేయిస్తాం.

– శ్రీనివాసులు, ఎంపీడీవో రాప్తాడు

సమస్య: మండలంలోని అయ్యవారిపల్లి నుంచి బుక్కచెర్లకు వెళ్లే రహదారి గుంతలు పడింది. దీంతో ప్రయాణించడానికి ఇబ్బందులు పడుతున్నాం. రహదారికి మరమ్మతు చేయించితే ప్రజలకు ఉపయోగంగా ఉంటుంది. **– రామాంజినేయులు, అయ్యవారిపల్లి**

సమాధానం: గ్రామాల రహదారులను మరమ్మతులు చేయించడానికి నిధులు మంజూరు చేస్తున్నాం. జన్మభూమిలో గ్రామసభలు నిర్వహించి నిధులు మంజూరు వివరాలు తెలియజేసి పనులు చేయించి ప్రజలకు సౌకర్యం కల్పిస్తాం.

– గురుమూర్తి, ప్రత్యేకాధికారి రాప్తాడు



బుక్కచెర్ల సమీపాన దెబ్బతిన్న రహదారి



కొత్తపల్లి: మరమ్మతుకు నోచుకోని చేతిపంపు

సమస్య: మండలంలోని కొత్తపల్లి సమీపాన నిర్మించిన చేతిపంపు మరమ్మతు చేయలేదు. చేతిపంపులో నీరు సంవృద్ధిగా ఉన్నాయి. ఊరి చివర ఉన్న చేతిపంపుకు మరమ్మతులు చేయిస్తే పాడి పశువులకు, ప్రజల అవసరాలు తీర్చుకోవడానికి వీలుంటుంది. – కృష్ణమూర్తి, కొత్తపల్లి

సమాధానం: గ్రామాల్లోని చేతిపంపులకు మరమ్మతులు చేయించడానికి సిబ్బంది కొరత ఉంది. సిబ్బందిని నియమించి చేతిపంపులకు మరమ్మతులు చేయించి ప్రజల సమస్యను పరిష్కరిస్తాం. – విజయలక్ష్మి, ఈవోఆర్డీ రాప్తాడు

సమస్య: మండలంలోని బుక్కచెర్లలో నివాసాల నడుమ విద్యుత్తు సరఫరా కోసం నియంత్రికను ఉంచారు. నియంత్రిక చుట్టూ ఏపుగా ముళ్లపొదలు పెరిగి సరఫరాకు అంతరాయం ఏర్పడుతోంది. ముళ్లపొదలు తొలగించితే ప్రమాదం ఉండదు.

– నాగార్జున, బుక్కచెర్ల

సమాధానం: గ్రామాల్లో నిర్వహించే జన్మభూమి-మాఊరు కార్యక్రమంలో సిబ్బంది హాజరవుతున్నారు. గ్రామసభలు పూర్తయిన వెంటనే మరమ్మతు పనులు చేయించి సమస్య లేకుండా చేస్తాం.

– నారాయణస్వామి, విద్యుత్తు ఏఈ రాప్తాడు



బుక్కచెర్ల: నియంత్రిక చుట్టూ ముళ్లపొదలు



క్యాన్లు ఇస్తున్న ఫౌండేషన్ ప్రతినిధి

అంగన్‌వాడీ కేంద్రాలకు క్యాన్లు వితరణ

రామగిరి: ప్రభుత్వ పాఠశాలలు, అంగన్‌వాడీ కేంద్రాల్లో సదుపాయల కల్పనకు దాతలు ముందుకు రావడం అభినందనీయమని రామగిరి ఎంపీపీ పరంధామయాదవ్ అన్నారు. గురువారం రామగిరి అంగన్‌వాడీ కేంద్రంలో విశ్రాంత ఐఏఎస్ అధికారి కె.ఆర్ పరమహంస ఏర్పాటు చేసిన విశ్వనాథ ఫౌండేషన్ ద్వారా మండలంలోని 52 అంగన్‌వాడీ కేంద్రాలకు శుద్ధజల క్యాన్లు వితరణ చేశారు. ఎంపీపీ మాట్లాడుతూ అంగన్‌వాడీలకు వెలుగు కార్యక్రమంలో భాగంగా ఇప్పటికే విద్యుత్తు, నీటి సదుపాయం, మరుగుదొడ్లు కల్పిస్తున్నట్లు తెలిపారు. సర్పంచి శ్రీనివాసులు, ఫౌండేషన్ ప్రతినిధి రాఘవేంద్ర, సూపర్‌వైజరు లీలావతి పాల్గొన్నారు.

ఆరోగ్య సమాజంతోనే దేశ పురోభివృద్ధి



చెన్నేకొత్తపల్లిలో అవగాహన కల్పిస్తున్న యువత

చెన్నేకొత్తపల్లి, న్యూస్‌టుడే: ప్రతి ఒక్కరూ మరుగుదొడ్డిని తప్పక వినియోగించాలని జేఎన్‌టీయూ విద్యార్థులు సూచించారు. గురువారం 30 మంది విద్యార్థులు బృందంగా ఏర్పడి మండలకేంద్రంలోని ప్రతి ఇంటిని సందర్శిస్తూ మరుగుదొడ్డి అవశ్యకతపై ప్రజలకు అవగాహన కల్పించారు. వారు మాట్లాడుతూ మరుగుదొడ్డి వినియోగం వల్ల కలిగే ఫలితాలు, బహిరంగ ప్రదేశాల్లో మలమూత్ర విసర్జన వల్ల కలిగే అనర్థాలపై ప్రజలకు వివరించారు. వ్యక్తిగత మరుగుదొడ్ల నిర్మాణానికి కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ప్రత్యేక చర్యలు తీసుకొంటున్నాయని, అర్హులైన ప్రతి ఒక్కరూ నిర్మించుకొని వినియోగించాలన్నారు. కార్యక్రమంలో వీఆర్వో నజీర్, ఆర్‌డబ్ల్యూఎస్ గోవిందు, విద్యార్థులు పాల్గొన్నారు.

చెన్నేకొత్తపల్లి: స్వచ్ఛభారత్ కార్యక్రమంలో భాగంగా పరిసరాల పరిశుభ్రత, వ్యక్తిగత మరుగుదొడ్ల అవశ్యకతపై మండలకేంద్రానికి సమీపంలోని ఆదర్శ పాఠశాల నుంచి బస్టాండ్ కూడలి వరకు విద్యార్థులు, అధికారులు గురువారం చైతన్య ప్రదర్శన నిర్వహించారు. ఈ సందర్భంగా కార్యదర్శి వెంకటనాయుడు, వీఆర్వో నజీర్ మాట్లాడుతూ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు స్వచ్ఛభారత్ కోసం ప్రత్యేక కార్యక్రమాలను చేపట్టడం జరిగిందన్నారు. ఆరోగ్య సమాజంతోనే దేశ పురోభివృద్ధి సాధ్యమని, అందుకనుగుణంగా ప్రతి పౌరుడు చొరవ చూపాలన్నారు. మరుగుదొడ్లు నిర్మించుకొంటే లాభంలేదని వాటిని వినియోగిస్తేనే మేలు జరుగుతుందన్నారు. కార్యక్రమంలో ఉపాధ్యాయ బృందం, ఉపాధిహామీ క్షేత్ర సహాయకుడు శివ, వీఆర్ఏ ఓబులపతి తదితరులు పాల్గొన్నారు.

ఆత్మకూరు: మండల కేంద్రంలోని ప్రధాన కూడలిలో గురువారం విద్యార్థులు స్వచ్ఛభారత్ కార్యక్రమంపై మానవహారంగా ఏర్పడి కార్యక్రమం ఆవశ్యకత గురించి నినాదాలు చేశారు. ప్రభుత్వ జూనియర్ కళాశాల ప్రిన్సిపల్ వెంకటరమణనాయక్ మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ తమ ఇంటిని తామే పరిశుభ్రంగా ఉంచుకోవాలని అన్నారు. కేవలం గ్రామాల స్వచ్ఛతతోనే స్వచ్ఛభారత్ కల నెరవేరుతుంది తెలిపారు. అందుకు ప్రతి ఒక్కరూ విధిగా ఇంటి ముందు నాలుగు మొక్కలు, ఇంకుడు గుంతను నిర్మించుకోవాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో అధ్యాపకులు భాగ్యలక్ష్మి, ధనలక్ష్మి, పోతులయ్య, రవికుమార్, నరసింహులు తదితరులు పాల్గొన్నారు.



చెన్నేకొత్తపల్లిలో చైతన్య ప్రదర్శన



ఆత్మకూరులో మానవహారంగా విద్యార్థులు

పేరూరు(రామగిరి): బహిరంగ మలవిసర్జన అనారోగ్యకరమని, మరుగుదొడ్లు నిర్మించుకొని వినియోగించుకోవాలని గ్రామాల్లో విద్యార్థులచే అవగాహన ప్రదర్శనలు నిర్వహించారు. మండలకేంద్రంలో ఆదర్శ పాఠశాల, పోలేపల్లి ఉన్నత పాఠశాల, పేరూరులోని మహాత్మ జ్యోతిరావ్‌పూలే బాలుర పాఠశాల విద్యార్థులు ఆయా గ్రామాల్లో ప్లకార్డులు పట్టుకొని బహిరంగ మలవిసర్జనకు స్వస్తి పలకాలంటూ నినాదాలు చేశారు. కార్యక్రమంలో ఆదర్శ పాఠశాల ప్రిన్సిపల్ శివయ్య, సంగీతకుమారి, మరీంబాషా, విద్యార్థులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

రాప్తాడు

కేంద్రం తీరుపై నిరసన

రాంనగర్(అనంతపురం): రాజ్యాంగం పట్ల కేంద్ర ప్రభుత్వం అనుసరిస్తున్న వైఖరికి నిరసనగా రిజర్వేషన్ పరిరక్షణ సమితి ఆధ్వర్యంలో గురువారం అంబేడ్కర్ విగ్రహం ఎదురుగా కేంద్ర ప్రభుత్వ దిష్టిబొమ్మ దహనం చేశారు. ఈ సందర్భంగా సమితి అధ్యక్షుడు నాగరాజు మాట్లాడుతూ భాజపా ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత రాజ్యాంగం పట్ల కేంద్ర మంత్రులు, పార్లమెంటు సభ్యులు చేస్తున్న వ్యాఖ్యలు బాధాకరమన్నారు.

క్రికెట్ జట్టుకు పీవీకేకే విద్యార్థి ఎంపిక

రుద్రంపేట(అనంతపురం): పీవీకేకే ఇంజినీరింగ్ కళాశాలలో ఎంబీఏ రెండో సంవత్సరం చదువుతున్న హరీష్ జేఎన్టీయూ క్రికెట్ జట్టుకు ఎంపికైనట్లు ప్రిన్సిపల్ రమేష్‌బాబు తెలిపారు. ఈనెల 3 నుంచి 12 వరకు విశాఖపట్నం ఆంధ్రా యూనివర్సిటీలో జరుగుతున్న దక్షిణ భారత అంతర విశ్వవిద్యాలయ క్రికెట్ టోర్నీలో హరీష్ పాల్గొంటున్నట్లు తెలిపారు. గురువారం కళాశాల యాజమాన్యం విద్యార్థిని అభినందించింది.

స్వచ్ఛ కక్కలపల్లికి శ్రీకారం

కక్కలపల్లి(అనంతపురం): స్వచ్ఛ గ్రామంగా కక్కలపల్లిని తీర్చిదిద్దేందుకు చర్యలు చేపట్టారు. ఎస్కేయూ గణితశాస్త్రం విభాగం పరిశోధనా విద్యార్థులు గురువారం గ్రామంలో మరుగుదొడ్లు, పరిసరాల శుభ్రత, చంద్రన్న బీమా, పింఛన్ల పంపిణీ కార్యక్రమాలపై ఇంటింటా సర్వే చేపట్టారు. ముందుగా పంచాయతీ కార్యాలయం నుంచి ప్రారంభమైన ప్రదర్శనను జడ్పీటీసీ సభ్యుడు వేణుగోపాల్, అనంత మండలం తెదేపా ఇన్‌ఛార్జి పరిటాల మహేంద్ర, ఎస్కేయూ గణిత విభాగం అధిపతి శివప్రసాద్ ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం ప్రారంభించిన జన్మభూమి- మాఊరు కార్యక్రమంలో భాగంగా మరుగుదొడ్ల నిర్మాణాల ఆవశ్యకతపై విద్యార్థులు ప్రజలకు వివరిస్తారన్నారు. మరుగుదొడ్ల నిర్మాణంతోనే స్వచ్ఛత సాధ్యమన్నారు. ఈ కార్యక్రమంలో ఆచార్య శోభాలత, తెదేపా మండల కన్వీనర్ జయకృష్ణ, ఎంపీటీసీ సభ్యుడు నారాయణస్వామి, శంకర్ తదితరులు పాల్గొన్నారు.



మహిళా క్లబ్ ప్రతినిధులను సత్కరిస్తున్న అధికారులు

అదనపు పౌష్టికాహారంతో మేలు

అనంతపురం(శ్రీనివాస్‌నగర్), న్యూస్‌టుడే: అనంత నగర ఐసీడీఎస్ ప్రాజెక్టు పరిధిలోని అంగన్‌వాడీలకు అదనపు పౌష్టికాహారాన్ని మహిళా క్లబ్ ప్రతినిధులు అందజేశారు. గురువారం జీసస్‌నగర్‌లోని అంగన్‌వాడీ కేంద్రంలో ప్రత్యేక కార్యక్రమాన్ని నిర్వహించి పౌష్టికాహారాన్ని అందించారు. మహిళా క్లబ్ ఉపాధ్యక్షురాలు అరుంధతి రూ.5 వేలు, సభ్యురాలు భారతి రూ.వెయ్యి చొప్పున విరాళంతో 25 కిలోల రాగి పిండి, 25 కిలోల బెల్లం అందించారు. పీడీ వెంకటేశం ఆదేశాల ప్రకారం అదనపు పౌష్టికాహారాన్ని అందివ్వాలని దాతలను కోరాం. దీనికి స్పందించిన అరుంధతి తగిన సాయం చేశారని సీడీపీఓ కృష్ణకుమారి చెప్పారు. అనంతరం దాతలను సత్కరించారు. ఈ కార్యక్రమంలో కార్పొరేటర్లు సరిపూటి రమణ, కృష్ణకుమార్, తెదేపా రాష్ట్ర నేత బుగ్గయ్యచౌదరి, సూపర్‌వైజర్ కొండమ్మ తదితరులు పాల్గొన్నారు.



పంటను నూర్పిడి చేస్తున్న కూలీలు

రైతుల సహకారంతోనే సత్ఫలితాలు

గొందిరెడ్డిపల్లి(రాప్తాడు), న్యూస్‌టుడే: గ్రామాల్లోని రైతులు సాగు చేస్తున్న పంటల దిగుబడిని లెక్కించడానికి పల్లెపల్లెనా పంటకోత ప్రయోగాలు నిర్వహిస్తున్నాం. రైతులు సహకారం అందించాలని ఏఈవో భాగ్యశ్రీ, వ్యవసాయశాఖ సిబ్బంది కోరారు. వారు మాట్లాడుతూ ప్రభుత్వం హంద్రీనీవా, పీఏబీఆర్ కాల్వల ద్వారా నీరు సరఫరా చేయడంతో బోరుబావుల్లో నీరు నిండుగా ఉందన్నారు. ఉన్న నీటిని రైతులు సక్రమంగా ఉపయోగించి పంటలు సాగుచేసి అధిక దిగుబడిని తీసుకురావాలన్నారు. రైతులు సాగుచేసిన పంటలను లెక్కించి దిగుబడిని అంచనా వేయాలని అధికారులు ఆదేశించారని పేర్కొన్నారు. గొందిరెడ్డిపల్లి సమీపాన పొలాల్లో సాగు చేసిన వరి పంటను లెక్కించి వివరాలు రికార్డుల్లో నమోదు చేశారు. కార్యక్రమంలో రెవెన్యూ అధికారులు గ్రామ రైతులు పాల్గొన్నారు.



ఆత్మకూరు: మాట్లాడుతున్న కుళ్లాయప్ప



రామగిరి: మాట్లాడుతున్న పరంధామయాదవ్



రాప్తాడు: ప్రసంగిస్తున్న పీడీ

మరుగుదొడ్డితో మహిళకు ఆత్మగౌరవం

ఆత్మకూరు, న్యూస్‌టుడే: మండలంలోని ముట్టాల, గొరిదిండ్ల గ్రామాలలో గురువారం నిర్వహించిన జన్మభూమి కార్యక్రమానికి విశేష స్పందన లభించింది. స్వచ్ఛాంధ్రప్రదేశ్ లక్ష్యంగా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ముందుకు సాగుతున్నాయని జడ్పీటీసీ సభ్యుడు కుళ్లాయప్ప అన్నారు. ప్రజా ఆరోగ్యాన్ని దృష్టిలో ఉంచుకొని ప్రతి ఇంటా మరుగుదొడ్డి నిర్మించాలన్న ఆశయంతో ప్రభుత్వం ముందడుగు వేస్తోందన్నారు. స్వచ్ఛభారత్ మిషన్ కోసం వేలకోట్లు ఖర్చు చేస్తోందన్నారు. గొరిదిండ్ల గ్రామంలో గత కొద్ది నెలలుగా లోఓల్టేజీ సమస్యతో తీవ్ర ఇబ్బందులు పడుతున్నామని అధికారులు స్పందించాలని గ్రామస్థులు కోరారు. ఉచిత పశువైద్య శిబిరానికి చిక్కటి స్పందన లభించింది. కార్యక్రమంలో నాయకులు అనీల్, మారెక్క, సూరి, అధికారులు ఆదినారాయణ, తహసీల్దారు నారాయణ, బాషా, వైద్యులు రాజేష్ పాల్గొన్నారు.

బొమ్మేపర్తి, బుక్కచెర్ల(రాప్తాడు): మండలంలోని బుక్కచెర్ల, బొమ్మేపర్తి గ్రామాల్లో జన్మభూమి - మాఊరు కార్యక్రమాన్ని గురువారం నిర్వహించారు. ఐడబ్ల్యూఎంపీ పీడీ నాగభూషణం మాట్లాడుతూ గ్రామాల్లో ప్రజలకు పారిశుద్ధ్యంపై అవగాహన కల్పిస్తే ఫలితం ఉంటుందన్నారు. ప్రభుత్వం సంపూర్ణ పారిశుద్ధ్య గ్రామాలుగా తీర్చిదిద్దడానికి మంజూరు చేసిన నిధులు సకాలంలో వెచ్చించి పనులు చేయించాలన్నారు. గృహనిర్మాణ పనులు వేగవంతం చేసి అందుబాటులోకి తీసుకురావాలన్నారు. పనులు పూర్తి చేసి ప్రభుత్వ లక్ష్యాన్ని నెరవేర్చాలని పిలుపునిచ్చారు. అనంతరం సామూహిక సీమంతాలు చేశారు. కార్యక్రమంలో సర్పంచులు వెంక్రిస్వామి, మధుసూదన్‌రెడ్డి, ఎంపీటీసీ సభ్యురాలు నారాయణమ్మ, ఎంపీడీవో శ్రీనివాసులు, తహసీల్దారు నాగభూషణం, నాయకులు నారాయణస్వామి, లక్ష్మీనారాయణ పాల్గొన్నారు.



కనగానపల్లిలో పోషకాహార ప్రదర్శన

కనగానపల్లి(రామగిరి): వ్యక్తిగత మరుగుదొడ్లను నిర్మించుకొని బహిరంగ మలవిసర్జనకు స్వస్తిపలకాలని కనగానపల్లి ఎంపీపీ పద్మగీత అన్నారు. గురువారం మండలంలోని కొండపల్లిలో జన్మభూమి-మాఊరు కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో భాగంగా స్వచ్ఛాంధ్రప్రదేశ్‌గా ఉంచాలని విద్యార్థులు ప్రదర్శన నిర్వహించి అవగాహన కల్పించారు. పంచాయతీ పరిధిలో చేపట్టిన వ్యక్తిగత మరుగుదొడ్ల నిర్మాణాల వివరాలను ఎంపీడీవో కుళ్లాయిస్వామి వెల్లడించారు. కార్యక్రమంలో తహసీల్దారు కుమార్‌స్వామి, తెదేపా మండల కన్వీనరు అంజనప్ప పాల్గొన్నారు.

పోలేపల్లి(రామగిరి): జన్మభూమి-మాఊరు కార్యక్రమంలో భాగంగా గురువారం మరుగుదొడ్ల నిర్మాణాలపై ఎంపీపీ పరంధామయాదవ్ అధ్యక్షతన చర్చించారు. ఉపాధిహామీ నిధులు రూ.2.90 లక్షలతో గ్రామంలోని ఉన్నతపాఠశాలలోని క్రీడామైదానాన్ని చదును చేసే కార్యక్రమాన్ని ప్రారంభించారు. అనంతరం విద్యార్థులతో కలసి ప్రదర్శన చేశారు. ఎంపీపీ మాట్లాడుతూ రామగిరి మండలం ఓడీఎఫ్ మండలంగా అవతరించాలనే లక్ష్యంతో మరుగుదొడ్ల నిర్మాణాలు చేపట్టినట్లు తెలిపారు. పోలేపల్లి పంచాయతీలో 255 మరుగుదొడ్లు మంజూరయ్యాయని తెలిపారు. కార్యక్రమంలో ప్రతినిధులు సుబ్బరాయుడు, శ్రీనివాసులు, చంద్రప్ప, తిమ్మయ్య, తిమ్మనాయుడు, ప్రభాకర్, నారాయణ, నరసింహులు, ఆదినారాయణ, నాగరాజు, రవికుమార్, జనార్దన, రాజేష్, సుజాత, మరీంబాషా పాల్గొన్నారు.

న్యామద్దల (చెన్నేకొత్తపల్లి): ప్రతి ఇంటికి మరుగుదొడ్డి తప్పనిసరని ఎంపీపీ అమరేంద్ర, ధర్మవరం మార్కెట్ యార్డ్ ఉపాధ్యక్షుడు ఓబిలేసు, తెదేపా మండల సమన్వయకర్త నారయణచౌదరి పేర్కొన్నారు. మండలంలోని న్యామద్దల, ముష్ఠికోవెల గ్రామాల్లో గురువారం జన్మభూమి-మాఊరు కార్యక్రమం నిర్వహించారు. వారు మాట్లాడుతూ గత ప్రభుత్వ హయాంలో నాయకులు దోచుకోవడం, దాచుకోవడమే పంథాగా చేసుకొని, ప్రజా సంక్షేమాన్ని గాలికొదిలారని విమర్శించారు. తెదేపా అధికారం చేపట్టి ప్రజాసంక్షేమం కోసం ఎన్నో సంక్షేమ పథకాలను ప్రవేశపెట్టడమేగాక ఎలాంటి అక్రమాలకు తావులేకుండా అమలుచేస్తోందన్నారు. సమాజ శ్రేయస్సే లక్ష్యంగా ప్రతి ఇంటికి మరుగుదొడ్డిని నిర్మించడం జరుగుతోందన్నారు. చంద్రన్న సంక్రాంతి కానుకలు, విద్యార్థులకు ఉపకారవేతనాలు పంపిణీ చేశారు. వైద్యశిబిరాన్ని, ఐసీడీఎస్ వారు ఏర్పాటుచేసిన పౌష్టికాహార స్టాల్‌ను పరిశీలించి, సామూహిక సీమంతాలు జరిపించారు. కార్యక్రమంలో అధికారులు సతీష్, రామాంజనేయులు, ఆదినారయణ, నాగేంద్ర, హరిప్రసాద్, సర్పంచులు గోపాల్, బండారువందన, రామకృష్ణారెడ్డి, శ్రీరాములు, ఎంపీటీసీలు చంద్రాయుడు, నరసింహులు పాల్గొన్నారు.

సేవా కార్యక్రమాలు అభినందనీయం

మూడోరోడ్డు(అనంతపురం), న్యూస్‌టుడే: అంధుల ఆశాజ్యోతి లూయీ బ్రెయిలీ అని జాతీయ అంధుల సమాఖ్య రాష్ట్ర అధ్యక్షుడు పామయ్య తెలిపారు. నాలుగో రోడ్డులోని జాతీయ అంధుల సమాఖ్య(ఎన్ఎఫ్‌బీ) కార్యాలయంలో లూయీ బ్రెయిలీ జయంతి వేడుకలు నిర్వహించారు. ఈ సందర్భంగా పామయ్య మాట్లాడుతూ అంధుల సంక్షేమాన్ని దృష్టిలో ఉంచుకుని బ్రెయిలీ విశేషంగా కృషి చేశారన్నారు. కెనరా బ్యాంకు ఉద్యోగుల సంఘం రాష్ట్ర కార్యదర్శి అరుణ్‌బాబు మాట్లాడుతూ అంధుల కోసం జాతీయ సమాఖ్య చేస్తున్న కార్యక్రమాలను అభినందించారు. నేత్ర దానాన్ని ప్రోత్సహిస్తూ 50 మందితో నేత్రదానం చేయిస్తామన్నారు. అంధులకు వ్యాయామశాల ఏర్పాటుకు తన వంతు ఆర్థిక సహాయాన్ని అందజేస్తానన్నారు. సమాఖ్య జిల్లా అధ్యక్షులు విజయభాస్కర్ మాట్లాడుతూ 2018 నుంచి అంధుల ఆరోగ్యాలపై సమాఖ్య దృష్టి సారించిందన్నారు. వైద్య శిబిరాలు నిర్వహించి పరీక్షలు చేయిస్తామన్నారు. సమావేశంలో నాయకులు మధుసూదన్, వినయ్, ఉమామహేశ్వరరావు, రామకృష్ణ, రామాంజనేయులు, సి.రవి, లక్ష్మినారాయణ పాల్గొన్నారు



చెన్నేకొత్తపల్లిలో కుట్టుమిషన్ల పంపిణీ

అంధుల ఆశాజ్యోతి బ్రెయిలీ

చెన్నేకొత్తపల్లి, న్యూస్‌టుడే: చూపులేని వారికోసం ప్రత్యేకంగా లిపిని కనుకొన్న మహోన్నత వ్యక్తి లూయి బ్రెయిలీ అని చైతన్య ప్రతిభావికలాంగుల సొసైటీ అధ్యక్ష, ఉపాధ్యక్షులు శ్రీనివాసరెడ్డి, ఓబిరెడ్డి పేర్కొన్నారు. మండల కేంద్రంలోని సీఆర్‌సీ ప్రాంగణంలో లూయి బ్రెయిలీ జయంతి వేడుకలను గురువారం ఘనంగా నిర్వహించారు. సొసైటీల్లోని దివ్యాంగులు బ్రెయిలీ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. వారు మాట్లాడుతూ జీవిత చరమాంకంలో జరిగిన సంఘటన వల్ల చూపుకోల్పోయిన లూయి బ్రెయిలీ అంధుల కోసం ప్రత్యేకమైన లిపిని కనుగొని వారిపాలిట దేవుడు అయ్యారన్నారు. బ్రెయిలీద్వారా ఎంతోమంది అంధులు విద్య నేర్చుకొని ప్రభుత్వ, ప్రైవేట్ కార్యాలయాల్లో కొలువుల్లో కొనసాగుతున్నారన్నారు. అనంతరం సొసైటీ ఆధ్వర్యంలో కుట్టు శిక్షణ పూర్తి చేసుకొన్న నలుగురు దివ్యాంగులకు కుట్టుమిషన్లు పంపిణీ చేశారు. కార్యక్రమంలో సీఈవో నరసింహులు, సమన్వయకర్త రమేష్, సిబ్బంది పోతలయ్య, లక్ష్మీనారాయణ, పాలకవర్గ సభ్యులు పాల్గొన్నారు.

రామగిరి: మండలం కేంద్రంలోని మహిళా శక్తి సోసైటీ కార్యాలయంలో స్వర్ణగిరి ప్రతిభ వికలాంగుల సోసైటీ ఆధ్వర్యంలో గురువారం లూయిబ్రెయిలీ జయంతి వేడుకలను నిర్వహించారు. లూయి బ్రెయిలీ చిత్రపటానికి నివాళి అర్పించారు. ఈ సందర్భంగా పిల్లలు బ్రెయిలీపై పాటలు పాడి అలరించారు. అనంతరం ఏర్పాటు చేసిన సమావేశంలో స్వర్ణగిరి ప్రతిభ వికలాంగుల సోసైటీ సీఈవోలు శ్రీధర్, తులసి మాట్లాడుతూ అంధులు కోసం ప్రత్యేకంగా లిపిని కనుగొన్నాడని కొనియాడారు. కార్యక్రమంలో సోసైటీ సభ్యులు రామ్మోహన్, ముత్యాలమ్మ, నాగరాజు, తిప్పన్న, వహిద, చాంద్‌బీ తదితరులు పాల్గొన్నారు.

శింగనమల

అబాకస్ పోటీల్లో మెరుపులు

తాడిపత్రి పట్టణం, న్యూస్‌టుడే: స్థానిక అంబేద్కర్ నగర్‌లోని శ్రీసాయి అబాకస్ అకాడమీకి చెందిన చిన్నారులు జోనల్ అబాకస్ పోటీల్లో ప్రతిభ చాటారని నిర్వాహకులు గజ్జలరెడ్డి, సువర్ణ తెలిపారు. ఆదివారం అనంతపురంలో జరిగిన జోనల్ స్థాయి పోటీల్లో సతీష్‌కుమార్, భార్గవి ఛాంపియన్లుగా నిలిచారనీ.. మరో 35 మంది విద్యార్థులు ద్వితీయ స్థానాల్లో నిలిచి పతకాలు సాధించినట్లు చెప్పారు.

పేదవృద్ధులకు బాసట

తాడిపత్రి పట్టణం, న్యూస్‌టుడే: మండలంలోని రమేశ్‌రెడ్డి కాలనీలోని వృద్ధులకు గ్యార్మీ పండగ సందర్భంగా వైకాపా రాష్ట్ర కార్యదర్శి రమేశ్‌రెడ్డి గురువారం 200 మందికి చీరలను అందజేశారు. ఆయన మాట్లాడుతూ, పండగను ప్రతి వృద్ధురాలు సంతోషంగా చేసుకోవాలని చీరలను అందజేసినట్లు చెప్పారు. పలువురు వైకాపా నాయకులు పాల్గొన్నారు.

స్వచ్ఛత.. ఉత్త ముచ్చట



నిరుపయోగంగా బాలికల మరుగుదొడ్లు

♦ ఉన్నత పాఠశాలలో మరుగుదొడ్ల సమస్యలు

♦ ఇదీ స్వచ్ఛభారత్ తీరు

యల్లనూరు, న్యూస్‌టుడే: యల్లనూరు ఉన్నత పాఠశాలలో సమస్యలు రాజ్యమేలుతున్నాయి. ఇక్కడ 380మంది విద్యార్థులు చదువుతున్నారు. మరుగుదొడ్లు ఉన్నప్పటికీ నీటి కష్టాలు అధికమయ్యాయి. యూరినల్స్‌కు వెళ్లేందుకు వీలులేక విద్యార్థులతో పాటు ఉపాధ్యాయులు కూడా ఆరుబయటకు వెళ్లాల్సిన పరిస్థితి. మూత్రవిసర్జనకు, బహిర్భూమికి వెళ్లాలంటే ఇబ్బందులు తప్పటంలేదని ఉపాధ్యాయులు, ఉపాధ్యాయినులు ఆవేదన వ్యక్తంచేస్తున్నారు. పాఠశాలకు రావాలంటే ఉపాధ్యాయ బృందం బెంబేలెత్తుతున్నారు. రూ.లక్షలు వెచ్చించి నిర్మించిన మరుగుదొడ్లు నిరుపయోగంగా మారుతున్నాయి. నీటి వసతి కల్పిస్తే అన్నీ వినియోగంలోకి వస్తాయి. యల్లనూరు మండలంలో 3,150 మంది విద్యార్థులు చదువుతున్నారు. అన్ని పాఠశాలల్లోనూ ఇదే పరిస్థితి నెలకొంది.



వినియోగంలో లేని పురుషుల మరుగుదొడ్డి

సమస్యతీవ్రంగా ఉంది



మా పాఠశాలలో మరుగుదొడ్ల సమస్య తీవ్రంగా ఉంది. నిర్మించినా.. నిరుపయోగంగా ఉన్నాయి. నీటి సరిఫరా లేక ఉపయోగించడం లేదు. మేము మల, మూత్ర విసర్జనకు వెళ్లాలంటే చాలా ఇబ్బందులు పడుతున్నాం. పది మందికి చెప్పే ఉపాధ్యాయులకే ఈ సమస్య ఎదురవుతోంది. వెంటనే సౌకర్యాలు కల్పించాలి.

- యోగీశ్వరుడు, ఉపాధ్యాయుడు, యల్లనూరు

వెంటనే పరిష్కరించాలి



విద్యార్థులకు కేటాయించిన మరుగుదొడ్లలో నీటి సౌకర్యం ఏర్పాటు చేస్తే వాటిని వాడుకోవచ్చు. విద్యాశాఖ మౌలిక వసతులు కల్పిస్తే విద్యార్థులకు, ఉపాధ్యాయులకు సమస్య తీరుతుంది. పాఠశాలలోని మరుగుదొడ్లను ప్రస్తుతం వాడుకోలేదు. నీటి సమస్య తీవ్రంగా ఉంది. తక్షణమే సమస్యలు పరిష్కరించాలని కోరుతున్నా.

- గంగాధర, ఉపాధ్యాయుడు, యల్లనూరు

అధికారులకు నివేదికలు ఇచ్చాం



పాఠశాలలో నెలకొన్న సమస్యలపై ఉన్నతాధికారులకు నివేదికలను ఇచ్చాం. కొత్తగా మరుగుదొడ్డి నిర్మిస్తున్నారు. రూ.20వేలు డబ్బులు డ్రా చేసి ఇచ్చా. ఇంకా మిగిలిన నగదుతో సౌకర్యాల కల్పనకు కృషిచేస్తా. నీటి సమస్య తీవ్రంగా ఉంది. అవసరమైన నీరు బయట నుంచి తెచ్చుకుంటున్నాం.

- విజయలక్ష్మి, ప్రధానోపాధ్యాయిని, యల్లనూరు


వివాహిత ఆత్మహత్య



మృతి చెందిన లక్ష్మి

నార్పల గ్రామీణం, న్యూస్‌టుడే: నార్పల మేజర్ పంచాయతీ పరిధిలోని బేల్దారికాలనీకి చెందిన నారాయణస్వామి భార్య లక్ష్మి(19) ఉరేసుకుని మృతిచెందిన ఘటన గురువారం జరిగింది. పోలీసులు తెలిపిన వివరాల మేరకు.. బేల్దారికాలనీకి చెందిన చిన్నయ్య కుమారుడు నారాయణస్వామి చేనేత పనిచేసుకుంటూ కుటుంబాన్ని పోషించుకుంటున్నాడు. ఐదు నెలల కిందట తాడిపత్రికి చెందిన లక్ష్మితో నారాయణస్వామి వివాహం జరిగింది. నెల రోజులుగా ఆమె కడుపునొప్పితో బాధపడుతోంది. గురువారం ఇంట్లో ఎవరులేని సమయంలో ఉరేసుకుంది. కుటుంబ సభ్యులు గమనించి వెంటనే ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు. అప్పటికే మృతి చెందినట్లు వైద్యులు ధ్రువీకరించారు. లక్ష్మి తండ్రి కృష్ణయ్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని పోస్టుమార్టం నిమిత్తం మృతదేహాన్ని అనంతపురం ప్రభుత్వ వైద్యశాలకు తరలించినట్లు ఎస్సై శ్రీనివాసులు తెలిపారు.

సర్పం.. సంచారం



పాఠశాల ప్రహరీపై విషసర్పం

కడవకల్లు (పుట్లూరు), న్యూస్‌టుడే: మండలంలోని కడవకల్లు గ్రామంలోని హరిజనవాడ, ఉన్నత పాఠశాల పరిసరాల్లోని పాఠశాల ఆవరణలో విషసర్పాలు సంచరిస్తూ.. విద్యార్థులను, ఉపాధ్యాయులను ఆందోళనకు గురిచేస్తున్నాయి. హరిజనవాడలోని ప్రాథమిక పాఠశాలలో గురువారం ఓ విషసర్పం ప్రహరీపై తిరుగుతుండటంతో.. ఉపాధ్యాయులు, విద్యార్థులు భయభ్రాంతులకు గురయ్యారు. సుమారు ఐదు అడుగులు ఉన్న పామును చూడగానే అందరూ భయంతో హడలిపోయారు. ప్రహరీ చుట్టూ ఉన్న కంపచెట్లను, ముళ్లపొదలను తొలగించాలని ఉపాధ్యాయులు కోరుతున్నారు.

గొడవలకు దూరంగా ఉండాలి

తిమ్మంపల్లి(యల్లనూరు), న్యూస్‌టుడే: మండలంలో ఫ్యాక్షను కొనసాగిస్తే తమదైన శైలిలో కఠిన చర్యలు తీసుకుంటామని స్పెషల్ బ్రాంచి ఎస్సైలు రాగిరి రామయ్య, దిలీప్ పేర్కొన్నారు. గురువారం తిమ్మంపల్లి గ్రామంలో గ్రామీణ సీఐ సురేంద్రానాథ్‌రెడ్డి ఆధ్వర్యంలో నాకాబందీ నిర్వహించారు. అనుమానితుల ఇళ్లు, గడ్డివాములల్లో సోదాలు చేశారు. ఎలాంటి మారణాయుధాలు లభించలేదని ఎస్సై తెలిపారు. గ్రామంలోని రౌడీషీటర్లను పిలిపించి వారితో సమావేశమై ఫ్యాక్షను నిర్మూలనపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో యల్లనూరు, పుట్లూరు ఎస్సైలు గంగాధర, సురేష్‌బాబు, పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

గంగమ్మ హుండీ ఆదాయం లెక్కింపు

గంగాదేవిపల్లి(తాడిపత్రిగ్రామీణం): మండల పరిధిలోని గంగాదేవిపల్లి గ్రామ సమీపంలోని యర్రగుడి గంగమ్మ దేవాలయంలోని హుండీ ఆదాయాన్ని గురువారం లెక్కించినట్లు దేవాదాయశాఖ ఈఓ చంద్రమౌళి తెలిపారు. గంగమ్మ ఆలయానికి చెందిన నాలుగు నెలల హుండీని గ్రామ పెద్దల సమక్షంలో లెక్కించిగా.. రూ.46,418 ఆదాయం వచ్చిందని తెలిపారు. గతంలో కంటే ఇప్పుడు ఆదాయం తగ్గిందని గ్రామస్థులు పేర్కొన్నారు. ఈ ఆలయాన్ని మరింత అభివృద్ధి చేసి భక్తులకు కావాల్సిన సౌకర్యాలను త్వరలో కల్పిస్తామని ఈఓ పేర్కొన్నారు. కార్యక్రమంలో గంగాదేవిపల్లి సర్పంచి, ఆలయ అర్చకులు, గ్రామ పెద్దలు, తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా గ్యార్మీ పండగ

క్రిష్టిపాడు (పెద్దవడుగూరు): మండలంలోని క్రిష్టిపాడులో గురువారం ముస్లిం మతపెద్దలు గ్యార్మీ పండగ వేడుకలను ఘనంగా ఆచరించారు. గ్రామంలో ఉన్న మసీదు నుంచి పురవీధుల గుండా ముస్లిం మతపెద్దలు ఊరేగింపుగా వెళ్లి ప్రత్యేక ప్రార్థనలు చేశారు. నెల రోజుల పాటు గ్యార్మీ పండగ వేడుకలను భక్తిశ్రద్ధలతో నిర్వహిస్తారు. అలాగే పెద్దవడుగూరు, అప్పేచెర్ల తదితర గ్రామాల్లో కూడా గ్యార్మీ పండగ జరుపుకున్నారు.

ఆవేశం వదిలి ఆలోచించండి



కళాశాలలో ధ్యానం చేస్తున్న విద్యార్థులు

శింగనమల, న్యూస్‌టుడే: బంగారు భవిష్యత్తును క్షణికావేశంతో బుగ్గిపాలు చేసుకోకుండా ఆలోచించి తగిన నిర్ణయాలు తీసుకోవాలని మండల విద్యుత్తుశాఖ ఏఈ ప్రసాద్ పేర్కొన్నారు. స్థానిక ప్రభుత్వ కళాశాలలో గురువారం హార్ట్‌ఫుల్‌నెస్ ధ్యానం నిర్వహించారు. విద్యార్థులు, అధ్యాపకులు ధ్యానంలో పాల్గొన్నారు. ధ్యానం నిర్వాహకులు శ్రీరామ చంద్ర మాట్లాడుతూ.. విద్యార్థులు ధ్యానంతో శక్తిమంతమైన మేధావులుగా మారుతారన్నారు. కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపల్ సూర్యనారాయణ, ధ్యాన శిక్షకులు వివేకనంద స్వామి, మాధురిలత, గాయత్రి తదితరులు పాల్గొన్నారు.

స్వచ్ఛత పాటిస్తే సంపూర్ణ ఆరోగ్యం



శింగనమల: ఆకులేడు గ్రామంలో ర్యాలీ చేస్తున్న విద్యార్థులు

శింగనమల, న్యూస్‌టుడే: పరిశుభ్రతను పాటిస్తూ స్వచ్ఛత వైపు అడుగులు వేస్తే సంపూర్ణ ఆరోగ్యం లభిస్తుందని మండల విద్యాధికారి సాంబ శివారెడ్డి పేర్కొన్నారు. స్వచ్ఛభారత్‌లో భాగంగా గురువారం స్థానిక ఉన్నత పాఠశాల, ఆకులేడు, సలకంచెరువు, పెరవలి, తరిమెల, బండమీదపల్లి తదితర గ్రామాల ఉన్నత పాఠశాలల విద్యార్థులు ర్యాలీ నిర్వహించారు. గ్రామ పురవీధుల్లో ర్యాలీ చేశారు. కార్యక్రమంలో సాక్షర భారత్ ఏరియా అధికారి రామసుబ్బారెడ్డి, ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

శింగనమల, న్యూస్‌టుడే: వ్యక్తిగత మరుగుదొడ్డి నిర్మాణం చేసుకొని మహిళల ఆత్మగౌరవాన్ని కాపాడాలని ఎస్సై సుధాకర్, ఎంపీడీఓ జయరాం పేర్కొన్నారు. స్థానిక చిన్నకాలువ వీధిలో గురువారం ఇంటింటా తిరిగి మరుగుదొడ్ల నిర్మాణంపై అవగాహన కల్పించారు.

నాయనపల్లి(నార్పల గ్రామీణం), న్యూస్‌టుడే: స్వచ్ఛతపై సామాజిక చైతన్యం అవసరమని ప్రధానోపాధ్యాయుడు శ్రీరంగయ్య పేర్కొన్నారు. మండల పరిధిలోని నాయనపల్లిలో గురువారం స్వచ్ఛతపై అవగాహన ప్రదర్శన నిర్వహించారు. అనంతరం గ్రామంలో ప్రదర్శన నిర్వహించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు స్వప్నసుధ, శైలజ, నాగేశ్వరెడ్డి, సురేష్‌బాబు, వీఆర్‌వోలు రవి, రవికూమార్, వీఆర్‌ఏ వీరనారప్ప తదితరులు పాల్గొన్నారు.

యల్లనూరు, న్యూస్‌టుడే: యల్లనూరు ఉన్నత పాఠశాల విద్యార్థులు వీఆర్వో మన్మథరెడ్డి ఆధ్వర్యంలో ప్రదర్శన నిర్వహించారు. ఉన్నత పాఠశాల నుంచి తేరు వరకు ప్రదర్శన చేస్తూ అవగాహన కల్పించారు. కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయిని విజయలక్ష్మి, ఉపాధ్యాయుల ఆదెప్ప, గంగాధర, సూర్యనారాయణ, యోగీశ్వరుడు, శ్రీరంగయ్య, నాయుడు తదితరులు పాల్గొన్నారు.

ఎగువపల్లి(గార్లదిన్నె గ్రామీణం), న్యూస్‌టుడే: ప్రతి ఒక్కరూ పరిశుభ్రతను పాటించి స్వచ్ఛభారత్‌ను సాధిద్దామని సర్పంచి వడ్ల సుంకమ్మ పేర్కొన్నారు. మండల పరిధిలోని ఎగువపల్లి గ్రామంలో గురువారం స్వచ్ఛభారత్‌పై ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి శైలజ, గ్రామ ప్రజలు పాల్గొన్నారు.

గ్రామసభల్లో స్వల్ప మార్పు

యల్లనూరు: మండల వ్యాప్తంగా ఐదో విడత జన్మభూమి గ్రామసభల్లో స్వల్ప మార్పులు చేసినట్లు ఎంపీడీఓ విష్ణుప్రసాద్ పేర్కొన్నారు. 5న కల్లూరు, నిట్టూరు, 6న గొడ్డుమర్రి, చింతకాయమంద, 7న బొప్పేపల్లి, చిలమకూరు, 8న తిరుమలాపురం, పెద్దమల్లేపల్లి, పాతపల్లి, 9న వెన్నపూసపల్లి, మేడికుర్తి, 10న బుక్కాపురం, వేములపల్లి, కూచివారిపల్లి, 11న యల్లనూరు గ్రామాల్లో గ్రామసభలు ఉన్నట్లు తెలిపారు. సమస్యలు గ్రామసభ దృష్టికి తీసుకొచ్చి పరిష్కరించుకోవాలన్నారు.

శింగనమల

నాణ్యమైన ఆహారం తీసుకోవాలి

పుట్లూరు, న్యూస్‌టుడే: గర్భిణులు, బాలింతలు, చిన్నారులు నాణ్యమైన ఆహారం తీసుకుంటే.. రోగనిరోధక శక్తి పెరుగుతుందని క్లస్టరు సూపర్‌వైజరు పద్మ అన్నారు. మండలంలోని అరకటవేముల, కందికాపుల, ఎస్.కొండేపల్లి గ్రామాల్లో అంగన్వాడీ కేంద్రాల్లో గర్భిణులకు సామూహిక సీమంతాలు, చిన్నారులకు అన్నప్రాసన కార్యక్రమాలు నిర్వహించారు. తహసీల్దారు పుల్లన్న ఆధ్వర్యంలో చిన్నారులకు అన్నప్రాసన నిర్వహించారు.

పేదల సంక్షేమమే ధ్యేయం

జన్మభూమి గ్రామసభలో ఎమ్మెల్యే యామినీబాల



గార్లదిన్నె గ్రామీణం: సంక్రాంతి కానుకలు అందజేస్తున్న ఎమ్మెల్యే యామినీబాల

ఎంపీఆర్‌డ్యాం(గార్లదిన్నె గ్రామీణం), న్యూస్‌టుడే: పేదల సంక్షేమమే ధ్యేయంగా రాష్ట్రప్రభుత్వం పని చేస్తోందని స్థానిక ఎమ్మెల్యే యామినీబాల అన్నారు. మండల పరిధిలోని ఎంపీఆర్‌డ్యాం గ్రామంలో సర్పంచి సుధాకర్‌రెడ్డి ఆధ్వర్యంలో గురువారం జన్మభూమి- మా ఊరు గ్రామసభ నిర్వహించారు. ఆమె మాట్లాడుతూ.. రైతుల సమస్యల పరిష్కారానికి ప్రభుత్వం కృషిచేస్తోందని, గ్రామాల అభివృద్ధికి పెద్దపీట వేస్తోందన్నారు. ఆరోగ్యం విషయంలో ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలన్నారు. మహిళలకు రుణాలు, విద్యార్థులకు ఉపకార వేతనాలు, ముఖ్యమంత్రి సహాయ నిధి చెక్కులు, చంద్రన్న సంక్రాంతి కానుకలు, జాబ్‌కార్డులను లబ్ధిదారులకు పంపిణీ చేశారు. అనంతరం స్వచ్ఛభారత్ ర్యాలీ చేశారు. కార్యక్రమంలో ఎంపీడీఓ భాస్కర్‌రెడ్డి, ఎంపీపీ నాగరాజు, మాజీ ఎంపీపీ ముంటిమడుగు శ్రీనివాసరెడ్డి, జడ్పీటీసీ సభ్యురాలు విశాలాక్షి, కన్వీనర్ కోటంక జయరాం, నాయకులు రామచంద్రారెడ్డి, నరసింహారెడ్డి, ఇల్లూరు రామాంజి, వడ్ల రాము, గోరకాటి వెంకటేసు, బొగ్గుల వెంకటేష్, చల్లా నాగరాజు తదితరులు, వివిధ శాఖల అధికారులు, ప్రజలు పాల్గొన్నారు.

బుక్కరాయసముద్రం, న్యూస్‌టుడే: మండలంలోని చెన్నంపల్లి, బొమ్మలాటపల్లి గ్రామాల్లో నిర్వహించిన ఐదో విడత జన్మభూమి గ్రామ సభలు నిర్వహించారు. చెన్నంపల్లిలో 30 రోజుల్లో తానే స్వయంగా రూ.3.5 లక్షలతో తాగునీటి ప్లాంటు ఏర్పాటు చేయిస్తానని జడ్పీటీసీ సభ్యులు రామలింగారెడ్డి ప్రకటించారు. కార్యక్రమంలో తెదేపా నాయకులు కుళ్లాయిరెడ్డి, మల్లికార్జునరెడ్డి, అశోక్, రవీంద్ర, తహసీల్దారు రామకృష్ణయ్య ఏఓ చిన్నమ్మ ఇతర అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

ఆకులేడు(శింగనమల), న్యూస్‌టుడే: మండల పరిధిలోని ఆకులేడు, లోలూరు గ్రామాల్లో గురువారం జన్మభూమి-మాఊరు కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో తహసీల్దారు నాగేంద్ర, ఎంపీడీఓ జయరాం, మండల ప్రత్యేక అధికారి సూర్యనారాయణ, ఎంపీటీసీ సభ్యురాలు సునీత, వివిధ శాఖల అధికారులు, గ్రంథాలయ, మార్కెట్ డైరెక్టర్లు రవీంద్రనాథ్‌రెడ్డి, మాసూల చంద్రమోహన్, తెదేపా నాయకులు అనంత చౌదరి, రహంతుల్లా, నాగభూషణ, శీనా తదితరులు పాల్గొన్నారు.

పెనకచెర్ల(గార్లదిన్నె గ్రామీణం), న్యూస్‌టుడే: మండల పరిధిలోని యర్రగుంట్ల, ముకుందాపురం గ్రామాల చెరువుకు పీఏబీఆర్ నుంచి నీరు వదలాలని ముకుందాపురం సర్పంచి హనుమంతురెడ్డి, యర్రగుంట్ల ఎంపీటీసీ సభ్యుడు ఈశ్వరయ్య, రైతులు వెంకటరామిరెడ్డి,తదితరులు స్థానిక ఎమ్మెల్యే యామినీబాల దృష్టికి తీసుకొచ్చారు. మండల పరిధిలోని పెనకచెర్ల గ్రామంలో తహసీల్దార్ గోపాల్‌రెడ్డి అధ్యక్షతన గురువారం జరిగిన జన్మభూమి మాఊరు గ్రామసభకు ఎమ్మెల్యే హాజరయ్యారు. కార్యక్రమంలో తహసీల్దార్ గోపాల్‌రెడ్డి, ఎంపీపీ నాగరాజు, మాజీ ఎంపీపీ శ్రీనివాసరెడ్డి, జడ్పీటీసీ విశాలాక్షి, రామచంద్రారెడ్డి, నరసింహారెడ్డి, అధికారులు పాల్గొన్నారు.

కేశేపల్లి(నార్పల గ్రామీణం), న్యూస్‌టుడే: మండల పరిధిలోని కేశేపల్లి, నడిమిదొడ్డి గ్రామాల్లో గురువారం జన్మభూమి-మాఊరు కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో ఎంపీపీ ఆకుల అరుణ, జడ్పీటీసీ సభ్యురాలు ఆలం శిరీష, ఎంపీడీఓ సాల్మన్‌రాజు, వైద్యాధికారి అరవింద్‌కుమార్, ఏఓ వెంకట్‌కుమర్, ఏపీఓ విమల, పంచాయతీ ఇంజినీరు శ్రీధర్‌శర్మ, నాగరాజు తదితరులు పాల్గొన్నారు.

యల్లనూరు, న్యూస్‌టుడే: ప్రజా సంక్షేమమే ప్రభుత్వ ధ్యేయమని మండల ప్రత్యేకాధికారి రాధాకృష్ణ పేర్కొన్నారు. గురువారం జంగంపల్లి, మల్లాగుండ్ల గ్రామాలల్లో జన్మభూమి గ్రామసభలు జరిగాయి. జంగంపల్లిలో జరిగిన జన్మభూమి గ్రామసభకు ప్రత్యేక అధికారి హాజరయ్యారు. కార్యక్రమంలో తహసీల్దారు నాగరాజు, ఎంపీడీఓ విష్ణుప్రసాద్, ఎంఈఓ చంద్రశేఖర్, గృహనిర్మాణ ఏఈ రాజశేఖర్‌రెడ్డి, వ్యవసాయాధికారి ఆంజనేయులు, పర్యవేక్షకురాలు పల్లవి, వైద్యురాలు శ్రీవాణి, సీహెచ్‌ఓ పరమేశ్వరరెడ్డి తదితర శాఖల అధికారులు పాల్గొన్నారు.

అరకటవేముల(పుట్లూరు), న్యూస్‌టుడే: మండలంలోని అరకటవేముల, ఎస్.కొండేపల్లి, కందికాపుల గ్రామాల్లో గురువారం జన్మభూమి- మాఊరు కార్యక్రమం నిర్వహించారు. అరకటవేముల గ్రామంలో జరిగిన గ్రామసభలో తహసీల్దారు పుల్లన్న మాట్లాడారు. కార్యక్రమంలో సర్పంచి మంగమ్మ, ఎంపీటీసీ సభ్యురాలు యల్లమ్మ, ప్రత్యేకాధికారి శ్రీరాములు, వ్యవసాయాధికారి అన్వేష్‌కుమార్, ఈఓఆర్డీ మధుసూదన్‌రెడ్డి, గ్రామీణనీటి సరఫరా జేఈ శ్రీనివాస్‌కుమార్, విద్యాధికారిణి శ్రీదేవి, ఉప తహసీల్దారు సురేష్‌బాబు, సీఎస్‌డీటీ నాగేంద్రప్రసాద్, ఐసీడీఎస్ క్లస్టరు సూపర్‌వైజరు పద్మ, తదితరులు పాల్గొన్నారు.



యల్లనూరు: జంగంపల్లిలో మాట్లాడుతున్న సాంబశివుడు

చంద్రన్న సంక్రాంతి కానుకల పంపిణీ

యల్లనూరు, న్యూస్‌టుడే: మండల కేంద్రంలోని 9వ చౌకదుకాణంలో గురువారం కార్డుదారులకు ఉచితంగా చంద్రన్న సంక్రాంతి కానుకలను పంపిణీ చేసినట్లు యల్లనూరు వీఆర్వో మన్మథరెడ్డి పేర్కొన్నారు. ఆయన మాట్లాడుతూ.. మండల వ్యాప్తంగా ఒకటి రెండ్రోజుల్లో 33 చౌకదుకాణాల్లో చంద్రన్న కానుకలను అందిస్తారన్నారు.

పౌష్టికాహారంపై అవగాహన అవసరం

నార్పల గ్రామీణం, న్యూస్‌టుడే: నార్పల పంచాయతీ కార్యాలయంలో జన్మభూమి-మా ఊరు కార్యక్రమంలో భాగంగా గురువారం పౌష్టికాహారంపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. సర్పంచి ఆకుల నాగలలిత మాట్లాడుతూ పౌష్టికాహారం తీసుకోవడం వల్ల తల్లీబిడ్డ సంపూర్ణ ఆరోగ్యంగా ఉంటారన్నారు. అనంతరం బాలామృతం, అన్నమృతం పథకాలను ప్రజలకు వివరించారు. కార్యక్రమంలో వార్డు సభ్యురాలు రహీమ, నాగభూషణ, అంగన్వాడీ కార్యకర్తలు రేణుక, శ్రీదేవీ, భారతి, వరలక్ష్మి, వెంకటకృష్ణమ్మ, ఈశ్వరమ్మ తదితరులు పాల్గొన్నారు.



పుట్లూరు: అరకటవేముల గ్రామసభలో మాట్లాడుతున్న తహసీల్దారు పుల్లన్న



బుక్కరాయసముద్రం: చెన్నంపల్లిలో కార్డులు అందిస్తున్న జడ్పీటీసీ సభ్యుడు



నార్పల గ్రామీణం: సంక్షేమ పథకాల కరపత్రం అందజేస్తున్న జడ్పీటీసీ

విద్యార్థులకు దైవ చింతన అవసరం

వడియంపేట(బుక్కరాయసముద్రం), న్యూస్‌టుడే: విద్యార్థులకు చదువుతో పాటు దైవచింతనా అవసరమేనని కర్ణాటక పీఠాధిపతి నిర్మలానందస్వామి తెలిపారు. వడియంపేటలోని షిరిడీ సాయి ఇంజినీరింగ్ కళాశాలలో గురువారం నిర్వహించిన దైవచింతన ప్రత్యేక కార్యక్రమానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరై విద్యార్థులకు దైవ చింతనపై హితబోధ చేశారు. ఉదయాన్నే నిద్రలేచి 15 నిమిషాలు యోగా చేయడం వల్ల చక్కని ఆరోగ్యం సిద్ధిస్తుందన్నారు. కర్ణాటకలో మా ఆధ్వర్యంలో నిర్వహించే 450 విద్యాసంస్థల్లో విద్యార్థులకు దైవచింతనతో పాటు యోగా శిక్షణ గురించి బోధిస్తున్నామని తెలిపారు. కార్యక్రమంలో కళాశాల వైస్ ఛైర్మన్ గోపాల్‌రెడ్డి, ప్రిన్సిపల్ మోహన్‌రెడ్డి, ఇంజినీరింగ్ విద్యార్థులు పాల్గొన్నారు.



షిరిడీ సాయి కళాశాలలో మాట్లాడుతున్న నిర్మలానందస్వామి

రెడ్డిపల్లిలో ఎమ్మార్పీఎస్ నాయకుల దీక్ష

రెడ్డిపల్లి(బుక్కరాయసముద్రం), న్యూస్‌టుడే: ఎస్సీ వర్గీకరణ ఉద్యమనేత మందకృష్ణను తెలంగాణలో అక్రమంగా అరెస్టు చేసి 11 రోజులు జైలులో నిర్బంధించడం హేయమైన చర్య అని మండల ఎమ్మార్పీఎస్ నాయకులు అభిప్రాయ పడ్డారు. అక్రమ అరెస్టుకు నిరసనగా ఎమ్మార్పీఎస్ మండల అధ్యక్షుడు నాగలింగ, వెంకటేష్ ఆధ్వర్యంలో రెడ్డిపల్లి గ్రామ పంచాయతీ కార్యాలయం వద్ద ఒకరోజు దీక్ష నిర్వహించారు. మందకృష్ణను వెంటనే విడుదల చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో నాయకులు అశ్వర్థప్ప, పోతులయ్య, గిరెప్ప, కుళ్లాయప్ప తదితరులు పాల్గొన్నారు.

ఎస్‌ఆర్‌ఐటీలో సాంకేతిక పండగ

నీలారెడ్డిపల్లి(బుక్కరాయసముద్రం), న్యూస్‌టుడే: మండల పరిధిలోని ఎస్‌ఆర్‌ఐటీ ఇంజినీరింగ్ కళాశాలలో గురువారం జిల్లా స్థాయి సాంకేతిక పండగ(టెక్నికల్ ఫెస్టివల్) నిర్వహించారు. సాంకేతిక విద్యాశాఖ, ఏపీ ప్రభుత్వం ఉమ్మడిగా ఈ కార్యక్రమం నిర్వహించారు. జిల్లాలోని అనంతలక్ష్మి, వెంకటేశ్వర, చిరంజీవిరెడ్డి, పీవీకేకే, బిట్, తాడిపత్రి ఇంజినీరింగ్ కళాశాలలకు చెందిన 97 మంది విద్యార్థులు తాము రూపొందించిన వివిధ ఆవిష్కరణలు ప్రదర్శించారు. విద్యార్థులు ఆవిష్కరించిన పరిశోధనలు అతిథులను, తోటి విద్యార్థులను ఆకట్టుకున్నాయి. రోడ్డు ప్రమాదాల నివారణకు వంతెన నిర్మాణం, సోలార్ వంతెన, రింగ్‌రోడ్ నమూనా, ఎస్‌ఆర్‌ఐటీ కళాశాల నమూనాలు విద్యార్థులను ఎంతగానో ఆకట్టుకున్నాయి. జేఎన్‌టీయూ నుంచి వచ్చిన ఆచార్యులు హేమచంద్రారెడ్డి, రమణ, మమత, సూజాత, సురేష్‌బాబు, డైరెక్టర్ చెన్నారెడ్డి న్యాయ నిర్ణేతలుగా వ్యవహరించి 97 నమూనాలను నుంచి 10 ఉత్తమ నమూనాలను ఎంపిక చేశారు. కార్యక్రమంలో ప్రొఫెసర్ హేమచంద్రారెడ్డి, కళాశాల ప్రిన్సిపల్ సుబ్బారెడ్డి, సీఈఓ జగన్‌మోహన్‌రెడ్డి, రంజిత్‌రెడ్డి, విద్యార్థులు పాల్గొన్నారు.



ఆకట్టుకున్న సోలార్ వంతెన నిర్మాణ నమూనా

సేవాకేంద్రంతో ఖాతాదారులకు సౌలభ్యం

బుక్కరాయసముద్రం, న్యూస్‌టుడే: బీకేఎస్ మండలంలో ఖాతాదారుల సౌలభ్యం కోసమే ఎస్‌బీఐ సేవా కేంద్రాన్ని ఏర్పాటు చేసినట్లు ఎస్‌బీఐ చీఫ్ మేజర్ జాకబ్ తెలిపారు. గురువారం బీకేఎస్ తహసీల్దారు కార్యాలయం వద్ద ఏర్పాటు చేసిన నూతన సేవా కేంద్రాన్ని ఎస్‌బీఐ ఉద్యోగులతో కలిసి ప్రారంభించారు. ఖాతాదారులు ఉదయం 7 నుంచి రాత్రి 8 గంటల వరకు తమ ఖాతాలో డబ్బులు జమచేయడం, తీసుకోవడం లాంటి కార్యకలాపాలు నిర్వహించుకోవచ్చన్నారు. కార్యక్రమంలో ఎఫ్‌ఐసీ మేనేజర్ కుమార్, మల్లికార్జునరెడ్డి, సహాయ మేనేజర్లు వెంకటేష్, శశిధర్‌రెడ్డి, రుస్తుంఖాన్ తదితరులు, సేవా కేంద్రం నిర్వాహకులు దీనేష్, నారాయణస్వామి, నాగేశ్వరరావు, వన్నూరప్ప తదితరులు పాల్గొన్నారు.



సేవా కేంద్రాన్ని ప్రారంభించిన చీఫ్ మేనేజర్ జాకబ్ తదితరులు

తాడిపత్రి

అంగన్‌వాడీలకు అదనపు పౌష్టికాహారం

అనంతపురం(శ్రీనివాస్‌నగర్), న్యూస్‌టుడే: అనంత నగర ఐసీడీఎస్ ప్రాజెక్టు పరిధిలోని అంగన్‌వాడీలకు అదనపు పౌష్టికాహారాన్ని మహిళా క్లబ్ ప్రతినిధులు అందజేశారు. గురువారం జీసస్‌నగర్‌లోని అంగన్‌వాడీ కేంద్రంలో ప్రత్యేక కార్యక్రమాన్ని నిర్వహించి పౌష్టికాహారాన్ని అందించారు. మహిళా క్లబ్ ఉపాధ్యక్షురాలు అరుంధతి రూ.5 వేలు, సభ్యురాలు భారతి రూ.వెయ్యి చొప్పున విరాళంతో 25 కిలోల రాగి పిండి, 25 కిలోల బెల్లం అందించారు. పీడీ వెంకటేశం ఆదేశాల ప్రకారం అదనపు పౌష్టికాహారాన్ని అందివ్వాలని దాతలను కోరాం. దీనికి స్పందించిన అరుంధతి తగిన సాయం చేశారని సీడీపీఓ కృష్ణకుమారి చెప్పారు. అనంతరం దాతలను సత్కరించారు.

తెరపై ఈనాడు

విజయలక్ష్మి: 2 కంట్రీస్, వరలక్ష్మి: ఇఈ, జయలక్ష్మి: ఒక్క క్షణం, శ్రీలక్ష్మీనారాయణ: ఎంసీఏ, సాయితేజ: హలో, దాదా: ఆక్సిజన్, బీహెచ్ మహల్: ప్రాజెక్ట్

కూరగాయల ధరలు(నిన్నటివి)

టమోటా- 4, పచ్చిమిర్చి- 20, ఉల్లిగడ్డ- 50, బంగాళ దుంప- 20, క్యారెట్- 60, బీట్‌రూట్- 40, క్యాబేజి- 20, గోబీపువ్వు- 30, బీరకాయ- 40, ముల్లంగి- 20, వంకాయలు- 20, గోరుచిక్కుడు- 30, బెండకాయలు- 40, కాకరకాయలు- 40, క్యాప్సికం- 40, మొటిక్కాయలు- 30, బీన్స్- 40.

నిత్యావసర వస్తువుల ధరలు

బియ్యం- 40, గోధుమపిండి- 24, కందిబేడలు- 70, చక్కెర- 42, బెల్లం- 60, పామాయిల్- 60, వేరుసెనగ నూనె- 80, ఉప్మారవ్వ- 40, కొబ్బెర- 100, ఒట్టిమిరపకాయలు- 60, తెల్లగడ్డలు- 60, చింతపండు- 200, పెసరపప్పు- 80.

కాలనీ కబుర్లు

యల్లనూరు రోడ్డు: పట్టణంలోని విజయలక్ష్మి సినిమా హాలు ఎదుట భూగర్భ మురుగునీటి కాలువ కోసం మున్సిపల్ అధికారులు సీసీ రోడ్డును పగలగొట్టారు. రోడ్డు మధ్యలో పెద్దఎత్తున గుంత ఏర్పడింది. అక్కడ సీసీ రోడ్డు వేయకుండా మట్టి వేశారు. వాహనాలు వెళ్లినప్పుడు దుమ్ము వస్తోంది. గుంతపడటంతో వాహనదారులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. రాత్రి సమయాల్లో ద్విచక్రవాహనదారులు అదుపు తప్పి ప్రమాదాలకు గురవుతున్నారు. పురపాలక అధికారులు గుంతను పూడ్చి సమస్యను పరిష్కరించాలని వారు కోరారు.

అంబేడ్కర్ కూడలి: స్థానిక అంబేడ్కర్ కూడలిలో నిత్యం ట్రాఫిక్ సమస్య తలెత్తుతోంది. కూడలిలో బుగ్గ నుంచి, కడప నుంచి వాహనాల రాకపోకలతో నిత్యం రద్దీగా ఉంటుంది. కూడలిలో సబ్ కంట్రోల్ రూము ఉన్నా.. నిరుపయోగంగా మారడం, ట్రాఫిక్‌ను నియంత్రంచేందుకు పోలీసు సిబ్బంది లేకపోవడంతో సమస్య తప్పటంలేదు. ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. పోలీసు ఉన్నతాధికారులు సిబ్బందిని నియమించి సమస్య పరిష్కరించాలని ప్రజలు కోరుతున్నారు.

అంబేడ్కర్ నగర్: పట్టణంలోని అంబేడ్కర్‌నగర్‌లో కమ్యూనిటీ వద్ద వీధి దీపాలు వెలగడం లేదు. వరసగా మూడు దీపాలు వెలగకపోవడంతో రాత్రిపూట వీధి అంతా చీకటిగా ఉందని స్థానికులు తెలిపారు. రాత్రి సమయాల్లో వీధిలోకి రావాలంటే భయంగా ఉందని వారు తెలిపారు. మున్సిపల్ అధికారులు స్పందించి వెంటనే వీధి దీపాలను ఏర్పాటు చేయాలని వారు తెలిపారు.

- న్యూస్‌టుడే, తాడిపత్రి పట్టణం

ఘనంగా గ్యార్మీ పండగ

క్రిష్టిపాడు (పెద్దవడుగూరు), న్యూస్‌టుడే: మండలంలోని క్రిష్టిపాడులో గురువారం ముస్లిం మతపెద్దలు గ్యార్మీ పండగ వేడుకలను ఘనంగా ఆచరించారు. గ్రామంలో ఉన్న మసీదు నుంచి పురవీధుల గుండా ముస్లిం మతపెద్దలు ఊరేగింపుగా వెళ్లి ప్రత్యేక ప్రార్థనలు చేశారు. నెల రోజులపాటు గ్యార్మీ పండగ వేడుకలను భక్తిశ్రద్ధలతో నిర్వహిస్తారు.

అసాంఘిక కార్యకలాపాలపై ప్రత్యేక దృష్టి

తాడిపత్రి గ్రామీణం, న్యూస్‌టుడే: అసాంఘిక శక్తులు, అసాంఘిక కార్యకలాపాలపై ప్రత్యేక దృష్టి సారిస్తామని ఓఎస్డీ ఐశ్వర్య రస్తోగి పేర్కొన్నారు. స్థానిక పట్టణ పోలీసు స్టేషన్‌లో గురువారం పట్టణ సీఐలు, ఎస్సైలతో ఆయన ప్రత్యేక సమావేశాన్ని ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జిల్లాలోని పోలీస్ సబ్ డివిజన్‌లలో తాడిపత్రి కొంత సమస్యాత్మకమైన డివిజన్‌గా తమ దృష్టిలో ఉందనీ.. అందువల్ల ఇక్కడ కొన్ని రోజులు ఉండి రాజకీయ పరిస్థితుల మీద, అసాంఘిక కార్యకలాపాలపైనా ప్రత్యేక దృష్టి ఉంచుతామని అన్నారు. అలాగే ఇక్కడ ఉన్న ఫ్యాక్షనిజం, మట్కా, పేకాట, రోడ్డు ప్రమాదాలు వంటి వాటిపై మరిన్ని చర్యలు తీసుకుంటామని అన్నారు. గతంలో కంటే కూడా ప్రస్తుతం మట్కా, పేకాట వంటి జూదాలపై తమ అధికారులు చాలా కఠినంగా వ్యవహరిస్తున్నారని ఆయన అన్నారు. తాడిపత్రిలో కొన్ని రోజులు ఉండి సమస్యాత్మక అంశాలన్నింటినీ పరిశీలించి తగిన చర్యలు చేపడతామనీ.. విధుల పట్ల తమ సిబ్బందిలో మరింత ఆత్మస్థైర్యం నింపుతామని ఓఎస్డీ అన్నారు. ఈ సమావేశంలో ఆయనతో పాటు గ్రామీణ సీఐ సురేంద్రనాథ్ రెడ్డి, పట్టణ సీఐ బాస్కర్ రెడ్డి, ఎస్సైలు శ్రీధర్, రాఘవరెడ్డి తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ఓఎస్డీ



చూపిన ప్రతిభ చిన్నారులు

అబాకస్ పోటీల్లో మెరుపులు

తాడిపత్రి పట్టణం, న్యూస్‌టుడే: స్థానిక అంబేడ్కర్ నగర్‌లోని శ్రీసాయి అబాకస్ అకాడమీకి చెందిన చిన్నారులు జోనల్ అబాకస్ పోటీల్లో ప్రతిభ చాటారని నిర్వాహకులు గజ్జలరెడ్డి, సువర్ణ తెలిపారు. ఆదివారం అనంతపురంలో జరిగిన జోనల్ స్థాయి పోటీల్లో సతీష్‌కుమార్, భార్గవి ఛాంపియన్లుగా నిలిచారనీ.. మరో 35 మంది విద్యార్థులు ద్వితీయ స్థానాల్లో నిలిచి పతకాలు సాధించినట్లు చెప్పారు. ప్రతిభావంతులను అకాడమీ యాజమాన్యం అభినందించింది.



వినతి పత్రం అందజేస్తున్న సీపీఎస్ ఉద్యోగులు



సీపీఐ నాయకుల వినతి



చీరలు అందిస్తున్న రమేశ్‌రెడ్డి

సీపీఎస్ విధానం రద్దు చేయాలని వినతి

తాడిపత్రి పట్టణం, న్యూస్‌టుడే: ప్రభుత్వం నూతనంగా సీపీఎస్ విధానాన్ని రద్దు చేయాలని ఎన్జీఓల సంఘం నియోజకవర్గ కార్యదర్శి మల్లేష్ పేర్కొన్నారు. గురువారం స్థానిక పోరాట కాలనీలో జరిగిన జన్మభూమి-మా ఊరు కార్యక్రమంలో కమిటీ సభ్యులకు వినతి పత్రం అందజేశారు. ఆయన మాట్లాడుతూ.. కొత్త పింఛను విధానం వల్ల ఉద్యోగులకు భద్రత లేకుండా పోతోందని ఆయన ఆవేదన వ్యక్తంచేశారు.

పాత పింఛను విధానం ప్రవేశపెట్టి సీపీఎస్ ఉద్యోగులను ఆదుకోవాలని ఆయన కోరారు. కార్యక్రమంలో ఆయనతో పాటు పలువురు ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

తాడిపత్రి పట్టణం: జన్మభూమి కార్యక్రమం పేరుతో అధికారులు వస్తున్నారు.. కానీ సమస్యలు మాత్రం పరిష్కరించలేదని సీపీఐ నాయకులు పేర్కొన్నారు. ఎన్నికల ముందు చంద్రబాబు ఇచ్చిన హామీలను నెరవేర్చాలని జన్మభూమి సమావేశంలో వినతిపత్రం అందించారు. ఎన్టీఆర్ సుజలస్రవంతి నీటి సరఫరా పథకం ప్రవేశపెట్టారే కానీ దాని వల్ల ప్రయోజనం లేదన్నారు. అర్హత ఉన్న వారికి పింఛను ఇవ్వకుండా నాయకులు చెప్పిన వారికి మాత్రమే ఇస్తున్నారని వారు ఆరోపించారు. కార్యక్రమంలో సీపీఐ నియోజకవర్గ కార్యదర్శి రంగయ్య, పట్టణ కార్యదర్శి చిరంజీవి, రమణ, నాగేంద్ర, రామాంజనేయులు తదితరులు పాల్గొన్నారు.

పేదవృద్ధులకు బాసట

తాడిపత్రి పట్టణం, న్యూస్‌టుడే: మండలంలోని రమేశ్ రెడ్డి కాలనీలోని వృద్ధులకు గ్యార్మీ పండగ సందర్భంగా వైకాపా రాష్ట్ర కార్యదర్శి రమేశ్‌రెడ్డి గురువారం 200 మందికి చీరలను అందజేశారు. ఆయన మాట్లాడుతూ, పండగను ప్రతి వృద్ధురాలు సంతోషంగా చేసుకోవాలని చీరలను అందజేసినట్లు చెప్పారు. పలువురు వైకాపా నాయకులు పాల్గొన్నారు.

బ్రెయిలీ జయంతి

అనంతపురం (అరవిందనగర్): నేషనల్ ఫెడరేషన్ ఫర్ బ్లైండ్ సంఘం కార్యాలయంలో గురువారం బ్రెయిలీ జయంతిని నిర్వహించారు. అంధులు చదువుకోడానికి ప్రత్యేక లిపిని రూపొందించిన బ్రెయిలీ మహోన్నతుడని ఆ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు పంపన్న, విజయభాస్కర్, ఉమామహేశ్వర్, కెనరా బ్యాంకు ఎంప్లాయీస్ యూనియన్ నాయకుడు అరుణ్‌బాబు కొనియాడారు.

ధ్యానం అలవాటుగా మారాలి

తాడిపత్రి గ్రామీణం, న్యూస్‌టుడే: ప్రతి ఒక్కరూ ధ్యానం చేయడాన్ని దినచర్యలో ఒక భాగంగా చేసుకోవాలని గ్లోబల్ గైడ్ కమలేష్ పటేల్ విద్యార్థులకు సూచించారు. మండల పరిధిలోని తాడిపత్రి ఇంజినీరింగ్ కళాశాలలో శ్రీ రామచంద్ర మిషన్ వారు మూడు రోజుల యోగా శిక్షణ తరగతులు నిర్వహించారు. వారు మాట్లాడుతూ.. నేటి జీవన విధానంలో ధ్యానం చాలా ప్రధానమైందన్నారు. ధ్యానం వల్ల మనసు చాలా వరకూ స్థిమితంగా ఉంటుందన్నారు. అనంతరం యోగా చేసే పద్ధతులపై విద్యార్థులకు శిక్షణ ఇచ్చారు. కార్యక్రమంలో కళాశాల కరస్పాండెంట్ అశోక్‌రెడ్డి, అకడమిక్ డైరెక్టర్ నాగరాజు, ప్రధానాచార్యుడు శేశప్ప, ఉప ప్రధానాచార్యుడు బానుప్రసాద్, అధ్యాపక బృందం, విద్యార్థులు, తదితరులు పాల్గొన్నారు.



ధ్యానం చేస్తున్న విద్యార్థులు

గంగమ్మ హుండీ ఆదాయం లెక్కింపు

గంగాదేవిపల్లి(తాడిపత్రి(గ్రామీణం), న్యూస్‌టుడే: మండల పరిధిలోని గంగాదేవిపల్లి గ్రామ సమీపంలోని యర్రగుడి గంగమ్మ దేవాలయంలోని హుండీ ఆదాయాన్ని గురువారం లెక్కించినట్లు దేవాదాయ శాఖ ఈఓ చంద్రమౌళి తెలిపారు. గంగమ్మ ఆలయానికి చెందిన నాలుగు నెలల హుండీని గ్రామ పెద్దల సమక్షంలో లెక్కించగా.. రూ.46,418 ఆదాయం వచ్చిందని తెలిపారు. గతంలో కంటే ఇప్పుడు ఆదాయం తగ్గిందని గ్రామస్థులు పేర్కొన్నారు. ఈ ఆలయాన్ని మరింత అభివృద్ధి చేసి భక్తులకు కావాల్సిన సౌకర్యాలను త్వరలో కల్పిస్తామని ఈఓ పేర్కొన్నారు. కార్యక్రమంలో గంగాదేవిపల్లి సర్పంచి, ఆలయ అర్చకులు, గ్రామ పెద్దలు, తదితరులు పాల్గొన్నారు.



హుండీ ఆదాయం లెక్కిస్తున్న గ్రామపెద్దలు, అధికారులు

తాడిపత్రి

సేవాకేంద్రంతో ఖాతాదారులకు సౌలభ్యం

బుక్కరాయసముద్రం: బీకేఎస్ మండలంలో ఖాతాదారుల సౌలభ్యం కోసమే ఎస్‌బీఐ సేవా కేంద్రాన్ని ఏర్పాటు చేసినట్లు ఎస్‌బీఐ చీఫ్ మేనేజర్ జాకబ్ తెలిపారు. గురువారం బీకేఎస్ తహసీల్దారు కార్యాలయం వద్ద ఏర్పాటు చేసిన నూతన సేవా కేంద్రాన్ని ఎస్‌బీఐ ఉద్యోగులతో కలిసి ప్రారంభించారు. ఖాతాదారులు ఉదయం 7 నుంచి రాత్రి 8 గంటల వరకు కార్యకలాపాలు నిర్వహించుకోవచ్చున్నారు.

వివాహిత ఆత్మహత్య

నార్పల గ్రామీణం: బేల్దారికాలనీకి చెందిన నారాయణస్వామి భార్య లక్ష్మి(19) ఉరేసుకుని మృతిచెందిన ఘటన గురువారం జరిగింది. ఐదు నెలల కిందట తాడిపత్రికి చెందిన లక్ష్మితో నారాయణస్వామి వివాహం జరిగింది. నెల రోజులుగా ఆమె కడుపునొప్పితో బాధపడుతోంది. గురువారం ఇంట్లో ఎవరులేని సమయంలో ఉరేసుకుంది. కుటుంబ సభ్యులు గమనించి వెంటనే ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు. అప్పటికే మృతి చెందినట్లు వైద్యులు ధ్రువీకరించారు.

ప్రజా సంక్షేమమే ప్రభుత్వ ధ్యేయం

ఎమ్మెల్యే జేసీ ప్రభాకర్‌రెడ్డి



పెద్దవడుగూరు: గుత్తిఅనంతపురంలో పత్రాలు అందజేస్తున్న ఎంపీపీ తదితరులు

పెద్దవడుగూరు: మండలంలోని గుత్తిఅనంతపురం, రావులుడికి, ముప్పాలగుత్తి గ్రామాల్లో గురువారం జన్మభూమి గ్రామసభలను సర్పంచులు పద్మావతి, విష్ణువర్ధన్‌రెడ్డి, వెంకటరెడ్డి అధ్యక్షతన నిర్వహించారు. చంద్రన్న సంక్రాంతి కానుకలను, చంద్రన్నబీమా బాండ్లను ఎంపీపీ దేవమ్మ పంపిణీ చేశారు. ఉప తహసీల్దారు సౌజన్యలక్ష్మి అన్నప్రాసన ప్రారంభించారు. వైద్యులు శ్రీధర్‌రెడ్డి, వెంకటరమణయ్య, ప్రసూనలు ఆరోగ్యశిబిరం నిర్వహించారు. కార్యక్రమంలో తహసీల్దార్ విష్ణువర్ధన్‌రెడ్డి, ఏఓ రూఫస్‌రోనాల్డ్, ఎంపీడీఓ వెంకటాచలపతి, ఈఓఆర్డీ అలివేలమ్మ, ఎంఈఓ రాముడు, పలుశాఖల అధికారులు పాల్గొన్నారు.

పెద్దపప్పూరు: మరుగుదొడ్లను వాడుదాం.. బహిరంగ మలవిసర్జనను అరికడదామనే నినాదాలతో స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాల ఎన్‌ఎస్‌ఎస్ విద్యార్థులు గురువారం ర్యాలీ నిర్వహించారు. ఎన్‌ఎస్‌ఎస్ కో ఆర్డినేటర్ చాంద్‌బాషా మాట్లాడారు. చిన్నపప్పూరులోని సాయిరాం పాఠశాలలో విద్యార్థులు మొక్కలు నాటారు. కార్యక్రమంలో కరస్పాండెంట్ మదన్‌మోహన్‌రెడ్డి, ఉపాధ్యాయులు బాలరాజు, నగేష్ తదితరులు పాల్గొన్నారు.



పెద్దపప్పూరు: ర్యాలీ నిర్వహిస్తున్న ఎన్‌ఎస్‌ఎస్ విద్యార్థులు



సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే జేసీ ప్రభాకర్‌రెడ్డి

యాడికి, న్యూస్‌టుడే: ప్రజా సంక్షేమమే తెదేపా ప్రభుత్వ ధ్యేయమని ఎమ్మెల్యే జేసీ ప్రభాకర్‌రెడ్డి పేర్కొన్నారు. స్థానిక తహసీల్దార్ కార్యాలయ ఆవరణలో ఎంపీపీ రంగయ్య అధ్యక్షతన నిర్వహించిన జన్మభూమి- మా ఊరు గ్రామసభలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడారు. పార్టీలకతీతంగా అర్హులందరికీ సంక్షేమ పథకాలు అందించాలనే ఉద్దేశంతోనే విడతల వారీగా అందిస్తున్నామని ఆయన పేర్కొన్నారు. ప్రతి ఒక్కరూ ప్రభుత్వమేమి చేస్తోందనే ప్రశ్నిస్తున్నారు తప్ప తమ గ్రామానికి తామేమి చేస్తున్నారనే విషయాన్ని విస్మరిస్తున్నారని ఆయన పేర్కొన్నారు. ప్రభుత్వం ఎంత ప్రోత్సహిస్తున్నా మరుగుదొడ్ల నిర్మాణంలో ప్రజలు ఆసక్తి చూపకపోవడం బాధాకరమని ఆయన అన్నారు. పెద్ద ఎత్తున నిర్వహించనున్న పెద్దమ్మ జాతరను దృష్టిలో పెట్టుకొని గ్రామంలో దాదాపు రూ.30 కోట్లు ఖర్చు కానుందని, రద్దీ దృష్ట్యా వాహనాలను నియంత్రించడంలో పోలీసులు ప్రత్యేక శ్రద్ధ చూపాలని ఆయన సూచించారు. ఆర్థిక పరిస్థితి సక్రమంగా లేక ప్రస్తుతం పింఛన్లు పంపిణీ చేయడానికే ప్రభుత్వం ఆపసోపాలు పడుతోందని.. మరో ఆయన తాను అధికారంలోకి వస్తే 45 ఏళ్లకే పింఛన్లు మంజూరు చేస్తానని చెబుతున్నాడని, ఆయనకో దండమని జగన్‌ను ఉద్దేశించి ఎమ్మెల్యే జేసీ పేర్కొన్నారు. నియోజకవర్గం మొత్తం మీద కేవలం 5,009 మందికి మాత్రమే రుణమాఫీ కాలేదని, 76 శాతం మందికి రూ. 50 వేలు రుణమున్న వారికి ఒకేసారి రుణమాఫీ అయ్యిందని ఎమ్మెల్యే పేర్కొన్నారు. అనంతరం రైతులకు రైతు రథం పథకం కింద 17 ట్రాక్టర్లను ఎమ్మెల్యే చేతుల మీదుగా పంపిణీ చేశారు. కార్యక్రమంలో నియోజకవర్గ ప్రత్యేకాధికారి రోశన్న, మండల ప్రత్యేకాధికారి పవన్‌కుమార్, ఏపీడీ లావణ్యకుమారి, గ్రా.నీ.స. డీఈ ఫయాజ్ మోహిద్దీన్, ఏఈ ప్రవీణ్‌కుమార్, తహసీల్దార్ బ్రహ్మయ్య, ఎంపీడీఓ యోగానందరెడ్డి, విద్యాధికారి కాశప్ప, వైద్యులు నాగేంద్ర, ఏఈ మహేశ్వరరావు, ఏఓ లీనావసుంధర, ఏపీఎం హేమలత, నాయకులు బాలా రమేష్‌బాబు, యాడికి బాబు, రుద్రమనాయుడు, మౌలాలి, అనిల్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.



తాడిపత్రి గ్రామీణం: సామూహిక సీమంతాలు

భోగసముద్రం(తాడిపత్రి గ్రామీణం): ప్రజల శ్రేయస్సే ధ్యేయంగా ప్రభుత్వం పథకాలను ప్రవేశపెట్టి సమర్థంగా నిర్వహిస్తోందని తహసీల్దారు యల్లమ్మ పేర్కొన్నారు. మండల పరిధిలోని భోగసముద్రం, బ్రాహ్మణపల్లి, వెలమకూరు గ్రామాల్లో ఐదో విడత జన్మభూమి-మా ఊరు కార్యక్రమం నిర్వహించారు. భోగసముద్రం గ్రామంలో 137, బ్రాహ్మణపల్లి గ్రామంలో 71, వెలమకూరు గ్రామంలో మూడు వినతులు వచ్చినట్లుగా సూపరింటెండెంట్ వెంకటాచలపతి పేర్కొన్నారు. కార్యక్రమంలో గ్రామీణ ఆరై నారాయణస్వామి, ఉద్యానశాక అధికారిణి ఫజులున్నీషా బేగం, ఏపీఎం వీరాస్వామి, అన్ని శాఖల మండల స్థాయి అధికారులంతా పాల్గొన్నారు.



తాడిపత్రి పట్టణంలో చంద్రన్న కానుకలు అందిస్తున్న పురపాలక ఛైర్‌పర్సన్ వెంకటలక్ష్మి

తాడిపత్రి పట్టణం: రాష్ట్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన జన్మభూమి- మా ఊరు పథకం పేద ప్రజలకు వరమని పురపాలక ఛైర్‌పర్సన్ వెంకటలక్ష్మి పేర్కొన్నారు. పట్టణంలో 9, 11, 13, 15 వార్డుల్లో జన్మభూమి-మా ఊరు కార్యక్రమం నిర్వహించారు. అనంతరం మున్సిపల్ బాలికల ఉన్నత పాఠశాల విద్యార్థినులు చెంబు చచ్చింది- ఆత్మ గౌరవం పెరిగింది అనే నినాదాలు చేసుకుంటూ పారిశుద్ధ్య పర్యవేక్షుడు నరసింహారెడ్డి తెలిపారు. కార్యక్రమాల్లో మున్సిపల్ అధికారులు యాల్లారెడ్డి, రాంబాబు, చాంద్‌బాషా, రాచయ్య, రెవెన్యూ అధికారి రాజశేఖర్, కౌన్సిలరు ప్రభాకర్ తదితరులు పాల్గొన్నారు.

ప్రజా సమస్యల పరిష్కారానికి కృషి

తాడిపత్రి పట్టణం, న్యూస్‌టుడే: ప్రజల సమస్యలు పరిష్కరించేందుకు వారికి అండగా ఉంటూ.. కృషిచేస్తానని తెదేపా నాయకుడు(సస్పెన్షన్ కౌన్సిలర్) జయంద్రారెడ్డి పేర్కొన్నారు. గురువారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ.. తాడిపత్రిలో రాజకీయ నాయకులతో ఇబ్బంది పడుతున్న ప్రజలకు తోడుగా నిలుస్తామని ఆయన అన్నారు. సంవత్సరాల తరబడి తెదేపా అభివృద్ధి కోసం కృషి చేశానని, ఈ విషయం పార్టీ అధినేతకు తెలుసని ఆయన అన్నారు. తాడిపత్రిలో గ్రానేట్ పరిశ్రమలు మూతపడేందుకు కారణం ఎమ్మెల్యే జేసీ ప్రభాకర్‌రెడ్డి అని ఆయన అన్నారు. దీనివల్ల పరిశ్రమలపై ఆధారపడిన దాదాపు 45వేల మంది రోడ్డున పడ్డారని ఆయన వివరించారు. తాడిపత్రిలో షాపింగ్ కాంప్లెక్స్, చిన్న వ్యాపారుల నుంచి అధిక ధరలు వసూలు చేసి దోచుకుంటున్నారని ఆయన ఆరోపించారు. తాడిపత్రి నియోజకవర్గంలో సీనియర్ తెలుగుదేశం నాయకులకు ప్రాధాన్యత కల్పించలేదన్నారు. కౌన్సిలర్‌గా రాజీనామా చేసేందుకు సిద్ధంగా ఉన్నానని వార్డులో ఎప్పుడు ఎన్నికలు పెట్టినా గెలుస్తానని ఆయన ధీమా వ్యక్తం చేశారు.

రెడ్డిపల్లిలో ఎమ్మార్పీఎస్ నాయకుల దీక్ష

రెడ్డిపల్లి(బుక్కరాయసముద్రం), న్యూస్‌టుడే: ఎస్సీ వర్గీకరణ ఉద్యమనేత మందకృష్ణను తెలంగాణలో అక్రమంగా అరెస్టు చేసి 11 రోజులు జైలులో నిర్బంధించడం హేయమైన చర్య అని మండల ఎమ్మార్పీఎస్ నాయకులు అభిప్రాయ పడ్డారు. అక్రమ అరెస్టుకు నిరసనగా ఎమ్మార్పీఎస్ మండల అధ్యక్షుడు నాగలింగ, వెంకటేష్ ఆధ్వర్యంలో రెడ్డిపల్లి గ్రామ పంచాయతీ కార్యాలయం వద్ద ఒకరోజు దీక్ష నిర్వహించారు. మందకృష్ణను వెంటనే విడుదల చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో నాయకులు అశ్వర్థప్ప, పోతులయ్య, గిరెప్ప, కుళ్లాయప్ప తదితరులు పాల్గొన్నారు.



ఆకట్టుకున్న సోలార్ వంతెన నిర్మాణ నమూనా

ఎస్ఆర్ఐటీలో సాంకేతిక పండగ

నీలారెడ్డిపల్లి(బుక్కరాయసముద్రం), న్యూస్‌టుడే: మండల పరిధిలోని ఎస్ఆర్ఐటీ ఇంజినీరింగ్ కళాశాలలో గురువారం జిల్లా స్థాయి సాంకేతిక పండగ(టెక్నికల్ పెస్టివల్) నిర్వహించారు. సాంకేతిక విద్యాశాఖ, ఏపీ ప్రభుత్వం ఉమ్మడిగా ఈ కార్యక్రమం నిర్వహించారు. జిల్లాలోని అనంతలక్ష్మి, వెంకటేశ్వర, చిరంజీవిరెడ్డి, పీవీకేకే, బిట్, తాడిపత్రి ఇంజినీరింగ్ కళాశాలలకు చెందిన 97 మంది విద్యార్థులు తాము రూపొందించిన వివిధ ఆవిష్కరణలు ప్రదర్శించారు. విద్యార్థులు ఆవిష్కరించిన పరిశోధనలు అతిథులను, తోటి విద్యార్థులను ఆకట్టుకున్నాయి. రోడ్డు ప్రమాదాల నివారణకు వంతెన నిర్మాణం, సోలార్ వంతెన, రింగ్‌రోడ్ నమూనా, ఎస్ఆర్ఐటీ కళాశాల నమూనాలు విద్యార్థులను ఎంతగానో ఆకట్టుకున్నాయి.

అంతటా చైతన్యంతోనే స్వచ్ఛత

యాడికి, న్యూస్‌టుడే: మరుగుదొడ్ల నిర్మాణాల ఆవశ్యకతను వివరిస్తూ గురువారం అధికారులు చేపట్టిన వినూత్న చైతన్య ప్రదర్శన అందరినీ విశేషంగా ఆకట్టుకుంది. స్థానిక ఉన్నత పాఠశాల విద్యార్థులతో కలిసి పాఠశాల నుంచి బస్టాండు వరకు ఈ ప్రదర్శన కొనసాగింది. చెంబు చచ్చింది. . ఆత్మగౌరవం బతికింది అనే ప్లకార్డులతో విద్యార్థులు అంత్యక్రియలు నిర్వహించే తరహాలో శవయాత్రలా ప్రదర్శనగా సాగారు. పల్లె పల్లెకు ఇంటింటికి అధికారులు కాళ్లకు చక్రాలు కట్టుకొనితిరిగి అవగాహన కల్పిస్తున్నా మరుగుదొడ్ల నిర్మాణం వేగవంతం కాకపోవడంతో అధికారులు చొరవ తీసుకొని ఈ తరహాలో ముందడుగు వేశారు. ప్రత్యేకాధికారులు రోశన్న, పవన్‌కుమార్, ఎంపీడీవో యోగానందరెడ్డి, తహసీల్దార్ బ్రహ్మయ్య, ఈవో నరసింహారెడ్డి, మహాలక్ష్మి, ఎంఈవో కాశప్ప, ఆర్ఐ వాసుదేవరావు తదితరులు పాల్గొన్నారు.



యాడికిలో వినూత్న ప్రదర్శన


ఉరవకొండ

శిక్షణ తరగతులకు హాజరు కావాలి

గుత్తి, న్యూస్‌టుడే: ఎమ్మార్పీఎస్ రాజకీయ శిక్షణా తరగుతులను జయప్రదం చేయాలని గుంతకల్లు నియోజకవర్గం బాధ్యుడు అంజన్‌ప్రసాద్ కోరారు. శిక్షణా తరగతులను ఈనెల 6,7 తేదీల్లో నల్గొండలోని నాగార్జున సాగర్‌లో నిర్వహిస్తున్నట్లు చెప్పారు. గురువారం శిక్షణా తరగతుల గోడపత్రాలను విడుదల చేశారు. ఈసందర్భంగా మాట్లాడుతూ శిక్షణా తరగతుల వల్ల నాయకత్వ లక్షణాలు వస్తాయన్నారు.

వైభవంగా ధ్వజావిష్కరణ

ఉరవకొండ, న్యూస్‌టుడే: శివ నామ స్మరణ నడుమ భక్తిశ్రద్ధలతో ధ్వజావిష్కరణ కార్యక్రమం గురువారం వైభవంగా జరిగింది. ఉరవకొండలోని మల్లేశ్వరస్వామి ఆలయంలో గురువారం నుంచి శివ దీక్షాపరుల మండల దీక్ష ప్రారంభమైంది. ఈ సందర్భంగా ఆలయంలో స్వామికి అభిషేకం, పంచామృతాభిషేకం చేశారు. మండలంలోని వివిధ గ్రామాల నుంచి వచ్చిన భక్తులు దీక్ష తీసుకొన్నారు. అనంతరం దీక్షాపరులు ధ్వజాన్ని ఆవిష్కరించారు. దీక్షాపరులకు రోజూ అన్నదాన కార్యక్రమం ఉంటుందని నిర్వాహకులు తెలిపారు. ధ్వజావిష్కరణను తిలకించడానికి పెద్దఎత్తున భక్తులు తరలివచ్చారు.



మల్లేశ్వరస్వామి ఆలయంలో ధ్వజావిష్కరణ చేస్తున్న భక్తులు

వచ్చింది కానుక.. ఊరంతా సంబరమిక

◆ మూడు మండలాల్లో 55 వేల మందికి లబ్ధి ◆ చౌకధాన్య దుకాణాలకు చేరిన సంక్రాంతి సరకులు



ప్రభుత్వం అందించే చంద్రన్న కానుక సరకులు

ఉరవకొండ పట్టణం, న్యూస్‌టుడే: పండగ పూట రేషన్‌కార్డుదారుల్లో సంతోషం. సంక్రాంతి సమీపిస్తున్నవేళ ప్రభుత్వం అందిస్తున్న చేయూత వారిలో ఆనందాన్ని నింపుతోంది. ప్రతి కుటుంబం ఉన్నంతలో సంక్రాంతిని సంబరంగా చేసుకోవాలన్న ఉద్దేశంతో ప్రభుత్వం మూడేళ్లుగా చంద్రన్న సంక్రాంతి కానుకను అందిస్తోంది. ఇందులో భాగంగా ఈ ఏడాది కూడా ప్రతి కార్డుదారుడి కుటుంబానికి చేరేలా సమర్థ చర్యలు చేపట్టింది. ఇందుకు సంబంధించి పదిహేను రోజుల నుంచి కసరత్తును ముమ్మరం చేసింది. కానుకల్లోని ఆరు వస్తువులను గ్రామాల్లోని చౌకధాన్య డిపోలకు చేర్చి వాటి పంపిణీకి శ్రీకారం చుట్టింది. ఉరవకొండ పౌరసరఫరాల గోదాం పరిధిలోని మూడు మండలాల్లో 148 చౌక ధాన్య డిపోల పరిధిలో 55794 కుటుంబాలకు రేషన్‌కార్డులు ఉన్నాయి. వాటిలో విడపనకల్లు మండలంలో 23151 కుటుంబాలు, వజ్రకరూరు మండలంలో 16205, విడపనకల్లు మండలంలో 16438 కుటుంబాలకు కార్డులు ఉన్నాయి. వీరందరికీ ప్రభుత్వం అందిస్తున్న చంద్రన్న సంక్రాంతి కానుకలు అందించడానికి ఏర్పాట్లు చేశారు. ఒక్కో కుటుంబానికి ఆరు వస్తువులను అందించడానికి సరిపడా నిత్యావసరాలను గ్రామాల్లోని చౌకధాన్య డిపోలకు అధికారులు చేర్చారు. వాటిలో బెల్లం, వంట నూనె, కంది బేడలు, శనగబేడలు, గోధుమపిండి, నెయ్యి ఉన్నాయి. గోధుమపిండి ఒక కిలో, నెయ్యి 100 గ్రాములు, మిగతా వస్తువులు అరకిలో చొప్పున అందిస్తున్నారు. వీటి విలువ రూ.225. ఉచితంగా అందించడానికి ప్రభుత్వం చర్యలు చేపట్టింది. ఈ మూడు మండలాల్లో ఒక్కోటి 278 క్వింటాళ్లు, గోధుమపిండి 557.94 క్వింటాళ్లు, నెయ్యి 55.79 క్వింటాళ్లను మంజూరు చేశారు. ఇప్పటికే దాదాపుగా అన్ని చౌకధాన్య డిపోలకు నిత్యావసరాలను సరఫరా చేశారు. నెల నెల అందించే బియ్యంతో పాటు సంక్రాంతి కానుకను ఇప్పటికే పంపిణీ ప్రారంభించారు. అధికారులు దృష్టి సారించి...

పేదలు సంతోషంగా పండగను జరుపుకోవాలన్న ఉద్దేశంతో ప్రభుత్వం ఉచితంగా అందిస్తున్న చంద్రన్న సంక్రాంతి కానుకల పంపిణీపై అధికారులు ప్రత్యేక దృష్టిని సారించాల్సి ఉంది. వాటిని బయోమెట్రిక్ విధానంలోనే అందించాల్సి ఉండటంతో సకాలంలో చౌకధాన్య డిపోలు పనిచేసేలా వారు చొరవచూపాలి. కొన్ని దుకాణాల్లో గడువు దగ్గర పడినా సాధారణ నిత్యావసరాలే కార్డుదారులకు అందని పరిస్థితి ఉంది. అయితే ఇవి పండగకు సంబంధించిన వస్తువులు కావడంతో వాటిని సకాలంలో లబ్ధిదారులకు అందిస్తేనే కాస్త ప్రయోజనకరంగా ఉంటుంది. ఆ దిశగా అధికారులు దుకాణాలు సక్రమంగా పని చేసేలా చర్యలు చేపట్టి, ప్రతి కుటుంబానికి వాటిని అందించాలని కార్డుదారులు కోరుతున్నారు.



ఉరవకొండ చౌకధాన్య డిపో నెం-56లో సరకుల పంపిణీ

సంతోషంగా ఉంది



ప్రభుత్వం కార్డుదారులకు చంద్రన్న సంక్రాంతి కానుకలు అందించడం సంతోషంగా ఉంది. ప్రతి ఏడాది వాటిని పేదలకు అందివ్వడం ఆనందాన్ని నింపుతోంది. పండగ పూట వాటిని ఉచితంగా ఇవ్వడంతో పేద కుటుంబాలకు ఆసరా కలుగుతోంది. వాటిని ఉపయోగించుకుని పండగను సంతోషంగా జరుపుకోవడానికి అవకాశం కల్పిస్తోంది. ఈ సహాయం మాకు ఉపయుక్తంగా ఉంది.

- రామాంజినమ్మ, ఉరవకొండ

అన్ని దుకాణాలకు సరఫరా చేశాం



గోదాం పరిధిలోని మూడు మండలాల్లోని కార్డుదారులకు మంజూరైన చంద్రన్న సంక్రాంతి ఉచిత కానుకను సరఫరా చేశాం. వాటిలో అన్ని వస్తువులు నాణ్యతగా ఉన్నాయి. గోదాముకు సరఫరా అయిన వస్తువుల్లో ఏవైనా చిరిగిపోయి ఉన్నా, నాణ్యత లేకపోయినా వెనక్కి పంపి మంచి వాటిని తెప్పించాం. నాణ్యత విషయంలో లబ్ధిదారులకు ఎలాంటి ఇబ్బంది లేకుండా చర్యలు చేపట్టాం.

- రాజేంద్రప్రసాద్, పౌరసరఫరాల గోదాం ఇన్‌ఛార్జి

నాణ్యమైన భోజనం అందించండి



వంటలను పరిశీలిస్తున్న అధికారులు

తగ్గుపర్తి (బెళుగుప్ప), న్యూస్‌టుడే: విద్యార్థులకు నాణ్యమైన భోజనం అందించాలని సర్వశిక్ష అభియాన్ జిల్లా సమీకరణ అధికారి ఆనంద్‌బాబు మధ్యాహ్న భోజన నిర్వాహకులకు సూచించారు. గురువారం మండలంలో తగ్గుపర్తి గ్రామంలో మండల పరిషత్ ప్రాథమిక పాఠశాలను తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పాఠశాలల్లో విద్యార్థులకు మౌలిక వసతులు కల్పించేందుకు చర్యలు చేపడుతున్నట్లు తెలిపారు. అలాగే గ్రామంలో ఉన్న ఉన్నత పాఠశాలకు వంటగది, సరకులను నిల్వ చేయడానికి గదులు మంజూరు అయినట్లు చెప్పారు. విద్యార్థుల ఆరోగ్యాలను దృష్టిలో ఉంచుకొని పాఠశాల ఆవరణను పరిశుభ్రంగా ఉంచుకోవాలని ఉపాధ్యాయులకు సూచించారు. ఈ కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయుడు మురళి ప్రసాద్, ఎస్ఎస్ఏ అధికారి క్రిష్ణప్ప తదితరులు పాల్గొన్నారు.

తాగునీటి సమస్యను పరిష్కరించాలి

పాల్తూరు (విడపనకల్లు), న్యూస్‌టుడే: మండలంలోని పాల్తూరు గ్రామంలో ఎస్సీ కాలనీలో తాగునీటి సమస్యతో కాలనీవాసులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. తాగునీటి కోసం రూ. లక్షలు ఖర్చుపెడతామని అధికారులు పదేపదే చెబుతుంటారు. కానీ, ఆ కాలనీలో జీవనధార కింద నిర్మించిన మంచినీటి పథకం లీకేజీల కారణంగా వృథాగా మారింది. ఇప్పటికీ కాలనీలో తాగునీటి సమస్యతో ప్రజలు తీవ్ర అవస్థలు పడుతున్నారు. అధికారులు కాలనీలోకి తొంగి చూసింది లేదని ప్రజలు వాపోతున్నారు. అందువల్ల ఇప్పటికైనా అధికారులు స్పందించి తాగునీటి సమస్యను శాశ్వత పరిష్కారానికి చర్యలు తీసుకోవాలని కాలనీవాసులు కోరుతున్నారు.

ఇళ్ల స్థలాల కోసం నిరీక్షణ

కమలపాడు (వజ్రకరూరు): మండల పరిధిలోని కమలపాడు గ్రామంలో పేదలకు గూడు కోసం నివేశన స్థలాలు ఇచ్చేందుకు భూమిని కొనుగోలు చేసినా రెవెన్యూ అధికారులు మాత్రం పేదలకు పంపిణీ చేయలేదు. దీంతో పేదల స్థలాల్లో ముళ్లపొదలు ఏపుగా పెరుగుతూ చిట్టడవిని తలపిస్తోంది. పేదలు అధికారుల చుట్టూ తిరిగినా పంపిణీ గురించి పట్టించుకోవడం లేదు. కళ్లెదుటే స్థలాలున్నా కేటాయింపులు జరగక అవస్థలు పడుతున్నామని పేదలు వాపోతున్నారు. అద్దె ఇళ్లు లభించక ఇబ్బందులు పడుతున్నామని, స్థలాలిస్తే గూడును నిర్మించుకుంటామని కోరుతున్నారు.



సేకరించిన స్థలంలో పెరిగిన ముళ్లపొదలు

పరిసరాల శుభ్రతతో మెరుగైన జీవనం



బాలుర కళాశాలలో శ్రమదానం

ఉరవకొండ పట్టణం, న్యూస్‌టుడే: వ్యక్తిగత, పరిసరాల శుభ్రతను పాటిస్తే మెరుగైన జీవనం సాగించవచ్చని, ప్రతి కుటుంబం మరుగుదొడ్లను నిర్మించుకోవాల్సిన అవసరం ఉందని పట్టణంలోని ప్రభుత్వ బాలుర, బాలికల జూనియర్ కళాశాలల ప్రిన్సిపాళ్లు చంద్రమోహన్, జ్ఞానేశ్వర్ పేర్కొన్నారు. గురువారం కళాశాలల ఆధ్వర్యంలో వేర్వేరుగా జన్మభూమిని పురస్కరించుకొని పట్టణంలో స్వచ్ఛభారత్ కార్యక్రమాన్ని చేపట్టారు. బాలుర కళాశాల విద్యార్థులు ప్రాంగణంలో శ్రమదానం చేశారు. అక్కడి పరిసరాలను శుభ్రం చేశారు. అనంతరం కళాశాల నుంచి గడియార స్తంభం వరకు ప్రదర్శన చేపట్టారు. స్వచ్ఛాంధ్ర ప్రదేశ్ సాధనకు సహకరించాలని కోరారు. కార్యక్రమంలో ఆయా కళాశాలల అధ్యాపకులు పాల్గొన్నారు.

కూడేరు: ప్రతి ఇంటా మరుగుదొడ్డిని నిర్మించుకోవాలని ఉపాధ్యాయులు విద్యార్థులతో ప్రధాన రహదారిపై మానవహారాన్ని చేయించారు. అనంతరం గ్రామ వీధుల్లో ర్యాలీని నిర్వహించారు. స్వచ్ఛభారత్‌లో భాగంగా ప్రతిఒక్కరూ కూడా మరుగుదొడ్డిని నిర్మించుకోవాలంటూ విద్యార్థులు నినదించారు. కార్యక్రమంలో పంచాయతీ అధికారి రామకృష్ణ, ప్రధాన ఉపాధ్యాయుడు శ్రీనివాసులు, విద్యార్థులు పాల్గొన్నారు.



కూడేరులో విద్యార్థుల మానవహారం

13న వ్యాసరచన పోటీలు

గుత్తి, న్యూస్‌టుడే: గుత్తిలోని గనశ్యామ్ కంప్యూటర్స్ సంస్థ ఆధ్వర్యంలో ఈనెల 13న విద్యార్థులకు వ్యాసరచన పోటీలు నిర్వహిస్తున్నట్లు నిర్వాహకులు తెలిపారు. యువజన దినోత్సవాన్ని పురస్కరించుకుని యువతపై స్వామివివేకానందుడి జీవిత ప్రభావం అనే అంశంపై విద్యార్థులకు వ్యాసరచన పోటీలు నిర్వహిస్తున్నట్లు చెప్పారు. ఈ పోటీలు 12న రఘురామిరెడ్డి కాంప్లెక్స్‌లోని సంస్థ కార్యాలయంలో నిర్వహిస్తామన్నారు.

ఉరవకొండ

5కె పరుగును విజయవంతం చేయండి

గుంతకల్లు, న్యూస్‌టుడే : ఈనెల 7న ఉదయం 7 గంటలకు రైల్వే క్రీడామైదానంలో జిల్లాస్థాయి 5కె పరుగు ప్రారంభం అవుతుందని జిల్లా కలెక్టరు తరపున మున్సిపల్ కమిషనర్ సత్యనారాయణ తెలిపారు. కార్యక్రమంలో అధికారులు, ప్రభుత్వ సిబ్బంది, విద్యార్థులు, సేవా సంస్థల ప్రతినిధులు అన్నివర్గాల వారు హాజరుకావాలని ఆయన గురువారం తెలిపారు. కార్యక్రమంలో ప్రజాప్రతినిధులు, జిల్లా అధికారులు హాజరు అవుతున్నారని ఆయన పేర్కొన్నారు.

సమస్యల పరిష్కార వేదిక జన్మభూమి



రాకెట్ల గ్రామంలో ప్రదర్శన నిర్వహిస్తున్న అధికారులు

రాకెట్ల (ఉరవకొండ), న్యూస్‌టుడే: సమస్యల పరిష్కార వేదిక జన్మభూమి గ్రామసభలని, సభల్లో సమస్యలు తెలిపి పరిష్కరించుకోవాలని వక్తలు అన్నారు. ఉరవకొండ మండలం రాకెట్ల, మోపిడి గ్రామాలలో గురువారం జన్మభూమి-మాఊరు కార్యక్రమం జరిగింది. రాకెట్ల గ్రామంలో సర్పంచి పెన్నప్ప అధ్యక్షతన సభ జరిగింది. సభలో గ్రామంలో నెలకొన్న సమస్యలను ప్రజలు వివరించారు. హంద్రీనీవా పథకం ద్వారా గ్రామంలోని చెరువులకు నీటిని విడుదల చేయాలని రైతులు విన్నవించారు. అర్హులైన వారందరికీ పక్కాగృహాలు మంజూరు చేయాలని కోరారు. విపక్ష సభ్యురాలైనందున వివక్షత చూపుతున్నారని ఎంపీటీసీ సభ్యురాలు సాలమ్మ గృహ నిర్మాణ శాఖ అధికారులపై ఆగ్రహం వ్యక్తం చేశారు. దీంతో సమావేశంలో కొంత ఉద్రిక్తత ఏర్పడింది. మరోసారి ఇలా జరగకుండా చర్యలు తీసుకొంటామని అధికారులు హామీ ఇవ్వడంతో సజావుగా జరిగింది. సభ ప్రారంభానికి ముందు స్వచ్ఛభారత్ కార్యక్రమంపై అవగాహన కల్పించడానికి గ్రామంలో మండల ప్రత్యేక అధికారి హిమశైల, తహసీల్దార్ అనిల్ కుమార్ ఆధ్వర్యంలో అధికారులు, విద్యార్థులు గ్రామంలో ప్రదర్శన నిర్వహించారు. బహిరంగ మలమూత్ర విసర్జన వీడాలంటు చెంబులకు పాడెకట్టి గ్రామంలో ఊరేగించారు. ప్రతిఒక్కరు వ్యక్తిగత మరుగుదొడ్లు నిర్మించుకోవాలని ఎంపీపీ సుంకురత్నమ్మ తెలిపారు. మోపిడి గ్రామంలో స్వచ్ఛభారత్ కార్యక్రమంలో బాగంగా అధికారులు, ప్రజాప్రతినిధులు ప్రధానవీధిని శుభ్రపరిచారు. ఎంపీడీవో శివకుమార్, డిప్యూటీ తహసీల్దార్ నాగరాజు, మండల విద్యాశాఖ అధికారి ఈశ్వరయ్య మండల తెదెపా కన్వీనరు విజయభాస్కర్, జన్మభూమి కమిటీ సభ్యులు గోవిందు, ఎర్రిస్వామి ఎంపీటీసీ సభ్యురాలు భారతి తదితరులు పాల్గొన్నారు.

చంద్రన్న కానుకల పంపిణీ

అరవకూరు(కూడేరు): మండల పరిధిలోని అరవకూరు గ్రామంలో సంక్రాంతి చంద్రన్న కానుకలను నాయకులు లబ్ధిదారులకు అందజేశారు. సందర్భంగా నాయకులు మాట్లాడుతూ ప్రభుత్వం ప్రజల సంక్షేమమే కోరుకుంటుందని, ప్రజలకు తెదేపా అందుబాటులో ఉంటుందని అన్నారు. కార్యక్రమంలో నాయకులు పుట్టా నరేష్, చెన్నయ్య, శ్రీనివాసులు, మాజీ సర్పంచి నారాయణమ్మ, సంజమ్మ, డీలర్ శ్రీరాములు, క్రిష్టప్ప, వెంకటేశులు, లోకా గ్రామస్థులు పాల్గొన్నారు.



విడపనకల్లు: కొత్తకోటలో మాట్లాడుతున్న ఎంపీపీ ప్రతాప్

వి.కొత్తకోట(విడపనకల్లు): ప్రజా సమస్యలను పరిష్కారించడానికే సీఎం చంద్రబాబునాయుడు జన్మభూమి కార్యక్రమాన్ని తీసుకొని వచ్చారని ఎంపీపీ ప్రతాప్‌నాయుడు తెలిపారు. గురువారం మాళాపురం, వి. కొత్తకోట గ్రామాలలో జన్మభూమి కార్యక్రమం జరిగింది. ఎంపీపీ, మండల ప్రత్యేక అధికారి, అధికారులు, విద్యార్థులతో కలసి మరుగుదొడ్లను నిర్మించుకోవాలని పురవీధుల్లో ప్రదర్శన నిర్వహించారు. మాళాపురంలో ట్రాన్స్‌కో, ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈలు ప్రజా కార్యక్రమానికి హాజరు కాకపోవడంతో ఎంపీపీ తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. ఏఈలు రాకుండా సిబ్బంది వస్తే సమస్యలు ఎలా పరిష్కారిమవుతాయని కలెక్టర్‌కు ఫిర్యాదు చేస్తామని ఎంపీపీ అసహనం వ్యక్తం చేశారు. వ్యవసాయ కనెక్షన్ కోసం డీడీ కట్టి ఒకటిన్నర ఏడాది కావస్తున్నా నియంత్రిక మంజూరు కాలేదని రైతు దేవేంద్ర అధికారులతో వాపోయారు. కొత్తరేషన్‌కార్డులను పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో మండల ప్రత్యేక అధికారి బేతళ, తహసీల్దార్ శంకరయ్య, ఎంపీడీవో షకీలాబేగం, ఎంఈవో చలపతి, తెదేపా కన్వీనర్ మారయ్య, జడ్పీటీసీ తిప్పయ్య, సర్పంచులు ఖాదర్‌బాష, హేమవతి తదితరులు పాల్గొన్నారు.

అలరించిన సాంస్కృతిక కార్యక్రమాలు

మాళాపురం(విడపనకల్లు): మాళాపురం, వి. కొత్తకోట గ్రామాలలో జన్మభూమిలో కేజీబీవీ, ప్రాథమికోన్నత పాఠశాల విద్యార్థినులు ప్రదర్శించిన సాంస్కృతిక కార్యక్రమాలు అధికారులను, ప్రజలను ఆకట్టుకున్నాయి. తెలుగుజాతి, తెలుగు భాష తియ్యదనం గురించి పాటలతో డ్యాన్స్‌లతో ఉత్సాహపరిచాయి.



కూడేరు: ఎద్దులబండిపై ఎమ్మెల్సీ పయ్యావుల కేశవ్

ముద్దలాపురం(కూడేరు): ప్రజల అభివృద్ధికి ప్రభుత్వ సంక్షేమ పథకాలలో భాగంగా సీఎం చంద్రన్న హయాంలో మహిళా సంఘాలకు పావలా కూడా వడ్డీ లేకుండా రుణాలు అందించిన ఘనత ఆయనకే దక్కుతుందని మండలి చీఫ్ విప్ ఎమ్మెల్సీ పయ్యావుల కేశవ్ పేర్కొన్నారు . మండల పరిధిలోని ముద్దలాపురం, జల్లిపల్లి గ్రామాల్లో జన్మభూమి మా ఊరు కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. ముందుగా ఆయనకు పూల మాలలతో స్వాగతం పలికారు. ఎద్దుల బండిపై సభవరకు వెళ్లారు. అనంతరం సమావేశంలో ఆయన మట్లాడుతూ చంద్రన్న బీమా, గ్రామంలోని నీటి సమస్య, చెరువులకు నీటిని విడుదల చేయాలని సంకల్పంతోనే ఉన్నామని అధికారులతోనే రైతులకు చెప్పించారు. చెరువులకు నీటిని విడుదల చేసిన తర్వాతనే మీ వద్దకు ఓట్లను అడగడానికి వస్తానని హామీ ఇచ్చారు. సంక్రాంతి కానుకలు, రుణమాఫీ బాండ్లను, రైథు రథం, రైతులకు అందజేశారు. ఆరోగ్య భద్రత, విద్యుత్, పరిసరాల పరిశుభ్రతపై అధికారులు వివరించారు. కార్యక్రమంలో ఆర్డీవో మలోల, ప్రత్యేక అధికారి కోదండరామ్, తహసీల్దార్ వసంతలత, ఎంపీడీవో లక్ష్మీనాకాయణ, మాజీ ఎంపీపీ బ్రహ్మయ్య, సర్పంచి నాగరాజు, చంద్రకుమార్, జిల్లా నాయకులు కుసాల నాగరాజు, కూచే నాగరాజు, కురుగుంట మలోబులు, ప్రధాన కార్యదర్శి శివయ్య, ఇప్పేరు శివ, మండల నాయకులు మురళి, భాస్కర్‌గౌడ్, అంకె ఎర్రిస్వామి, శీధర్‌నాయుడు, తదితర నాయకులు పాల్గొన్నారు.

అర్హులందరికీ పింఛన్లు

తగ్గుపర్తి(బెళుగుప్ప): అన్నివర్గాల సంక్షేమమే ధ్యేయంగా తెలుగుదేశం ప్రభుత్వం పనిచేస్తుందని జిల్లా పరిషత్ ఉపాధ్యక్షురాలు మాదినేని సుభాషిణమ్మ పేర్కొన్నారు. మండలంలో తగ్గుపర్తి గ్రామంలో గురువారం గ్రామ సర్పంచి వెంకటలక్ష్మి అధ్యక్షతన జరిగిన ఐదో విడత జన్మభూమి కార్యక్రమంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ అర్హులైన వారందరికీ పింఛన్లు మంజూరు చేయడం జరుగుతుందని తెలిపారు. మండల అధికారులు అందరూ గ్రామానికి విచ్చేశారు. గ్రామంలో సమస్యలు ఉంటే దరఖాస్తుల ద్వారా అధికారులకు తెలియజేయాలని గ్రామస్థులకు సూచించారు. మండల అధ్యక్షురాలు తిరుపతమ్మ, ఉమామహేశ్వరనాయుడు, ప్రసాద్,రాజన్న,తిప్పయ్య, రాధాకృష్ణ,తదితరులు పాల్గొన్నారు.

ఎర్రగుడి (బెళుగుప్ప): ప్రభుత్వ పథకాలను ప్రతిఒక్కరు సద్వినియోగం చేసుకోవాలని మండల తెదేపా నాయకుడు ఉమామహేశ్వరనాయుడు పేర్కొన్నారు. గురువారం మండలంలో ఎర్రగుడి గ్రామంలో గ్రామ సర్పంచి అనిత అధ్యక్షతన జరిగిన జన్మభూమి మా ఊరు కార్యక్రమంలో మాట్లాడుతూ ప్రభుత్వం అనేక సంక్షేమ పథకాలను అందిస్తుందని వీటిని అందరు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. గ్రామస్థులు మాట్లాడుతూ ఉపాధి హామి పనులకు సంబంధించి ఆరు వారాల బిల్లులు అందలేదని అధికారుల దృష్టికి తెచ్చారు. ఆధార్ అనుసందానం చేసుకోకపోవడం వలనే బిల్లులు మంజూరు అయిన వారి ఖతాల్లోకి సొమ్ము జమ కాలేదని అధికారులుతెలిపారు. ఈ కార్యక్రమంలో తహసీల్దారు వెంకటాచలపతి, ప్రతాప్, వెలుగు,వ్యవసాయ శాఖల అధికారులు తదితరులు పాల్గొన్నారు.



బెళుగుప్ప: మాట్లాడుతున్న ఉమామహేశ్వర నాయుడు



రహదారి వైపు వాలిన విద్యుత్తు స్తంభం

కూలే వరకు స్పందించరా..?

ఉరవకొండ పట్టణం, న్యూస్‌టుడే: పట్టణంలో గుంతకల్లు రహదారిని ఆనుకొని వెళ్తున్న విద్యుత్తు లైన్లో ఎక్సైజ్ పోలీస్‌స్టేషన్ ఎదురుగా ఓ స్తంభం ప్రధాన రహదారి వైపు వాలి ఉంది. దాని చుట్టూ ఎలాంటి రక్షణ తీగలు లేవు. కొన్ని నెలలుగా స్తంభం అలాగే ఉంది. అది ఒకవైపు వాలడం అధికం అవుతోంది. ప్రధాన రహదారి పక్కనే ఇలాంటి ప్రమాదకర పరిస్థితి ఉన్నా విద్యుత్తు అధికారులు స్పందించడం లేదు. అక్కడ స్తంభాన్ని చూసిన వారంతా అది కూలుతుందేమోనన్న ఆందోళనను వ్యక్తం చేస్తుంటారు. ఇప్పటికైనా విద్యుత్తు అధికారులు స్పందించి, స్తంభాన్ని సరిచేయించాలని స్థానికులు కోరుతున్నారు.

గృహ లబ్ధిదారుల ఎంపికపై వాగ్వాదం

కమలపాడు(వజ్రకరూరు), న్యూస్‌టుడే: ఎన్టీఆర్ గృహనిర్మాణ పథకం కింద లబ్ధిదారుల ఎంపిక ఎలా చేస్తారని గ్రామసభలో చర్చించి జన్మభూమి కమిటీ సభ్యుల అమోదంతో చేస్తారా లేక ఏలా చేస్తారో తెలపాలని వైకాపా సర్పంచి యోగానంద పట్టుబట్టగా తెదేపా నాయకులు పెద్దన్న, లాలునాయక్ జోక్యం చేసుకోవడంతో సభ వాడీవేడిగా సాగింది. మండల పరిధిలోని కమలపాడులో గురువారం సర్పంచి యోగానందా అధ్యక్షతన జన్మభూమి గ్రామసభ జరిగింది. తహసీల్దార్ ఆదిలింగయ్య, ఈవోఆర్డీ మద్దిలేటి, ఏవో మధుకర్, ఇతర అధికారులు పాల్గొన్నారు. గృహనిర్మాణ్నాన్ని సంబంధించి సిబ్బంది అశోక్ మాట్లాడుతుండగా సర్పంచి కలుగజేసుకున్నారు. లబ్ధిదారుల ఎంపిక గురించి అడగ్గా తెదేపా నాయకులు జోక్యం చేసుకుంటూ ఎంపిక గురించి అడగకూడదని కొత్తగా వచ్చిన సిబ్బందిపై పెత్తనం వద్దని, ఎంపిక సక్రమంగా జరుగుతుందని తెలిపారు. అంగన్‌వాడీ కేంద్రాల భవనాల నిర్మాణాలకు నిధులొస్తే స్థలం కేటాయిస్తామని సర్పంచి చెప్పారు. అధికారులు శాఖల వారీగా వివరాలను వెల్లడించారు. చిన్నహోతూరులో సర్పంచి వెంకటలక్ష్మి అధ్యక్షతన సభ జరిగింది. ఎంపీడీవో అజయ్‌భాస్కర్, ఇతర అధికారులు పాల్గొన్నారు. సంక్రాంతి కానుకలను అందించారు.



వైకాపా సర్పంచితో వాదిస్తున్న తెదేపా నాయకులు

లోపించిన పారిశుద్ధ్యం

దుద్దేకుంట(బెళుగుప్ప): మండల పరిధిలోని దుద్దేకుంట గ్రామంలో వృథానీటిని వీదుల్లోకి వదలడంతో నడవడానికి చాలా ఇబ్బందులు పడుతున్నామని గ్రామస్థులు వాపోయారు. గ్రామంలో కొల్లాపురమ్మ అవ్వ కట్టకు వెళ్లే దారిలో స్థానికులు ఇంటి అవసరాల అనంతరం వృథానీటిని వదలడంతో కట్ట దగ్గర అపరిశుభ్రత నెలకొని దోమలు వ్యాప్తి చెందుతున్నాయి. అసలే చిన్న వీధి కావడంతో రాత్రి సమయంలో పూజలు చేసేందుకు వెళ్లిన మహిళలు మురుగు నీటిల్లోకి అడుగులు వేసి జారి పడిన సందర్భాలు ఉన్నాయి. పంచాయతీ అధికారులు స్పందించి స్థానికులకు శుభ్రతపై అవగాహన కల్పించి వీధుల్లోకి వృథానీటిని వదలకుండా చూడాలని గ్రామస్థులు కోరారు.



కొల్లాపురమ్మ కట్ట దగ్గర నెలకొన్న అపరిశుభ్రత